సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+4+16 వెల: ₹ 5.00
సంపుటి: 10
సంచిక: 138
మంగళవారం 8-8-2017
SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'



రూ.2.49 లక్షల కోట్ల రుణాల రద్దు

ఇది ఐదేళ్లలో పీఎస్‌యూ బ్యాంకులు చేసిన పని

– బిజినెస్‌లో



సోమవారం రాత్రి విశాఖ రాఘవేంద్ర స్వామి వారి దేవాలయం వద్ద చంద్రగ్రహణం

దేశ వ్యాప్తంగా ఘనంగా రక్షా బంధన్

1. సోమవారం రాఖీ పండుగ సందర్భంగా ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాఖీ కడుతున్న పాఠశాల విద్యార్థులు
2. ఉండవల్లిలోని సీఎం నివాసం వద్ద చంద్రబాబుకు రాఖీ కడుతున్న మాజీ మంత్రి పీతల సుజాత, మంత్రి సునీత
3. హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్ నివాసంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు రాఖీ కడుతున్న సోదరి షర్మిల







• నంద్యాల వేదికగా టీడీపీ విష ప్రచారం

బెడిసిన వ్యూహం

వైఎస్సార్ సీపీ అభ్యర్థి శిల్పా నామినేషన్ చెల్లదంటూ అధికార పార్టీ నానా యాగీ

- కుంటి సాకులతో నామినేషన్ తిరస్కరించాలని ఫిర్యాదులు
- అనుకూల మీడియాలో విపరీత ప్రచారం
- జగన్ సభ మైలేజీని మళ్లించేందుకు నాలుగు రోజులుగా చీప్ ట్రిక్స్
- ఓటమి భయంతో మైండ్ గేమ్‌కు తెర లేపిన వైనం
- అంతా సక్రమమేనన్న రిటర్నింగ్ అధికారి
- శిల్పా నామినేషన్‌కు గ్రీన్ సిగ్నల్
- ఇదంతా ఓటమి భయంతోనేనని స్థానికుల చర్చ



సాక్షి ప్రతినిధి, కర్నూలు :

నంద్యాల ఉప ఎన్నికలో విజయం సాధించడం అసాధ్యమనే అభిప్రాయానికి వచ్చిన అధికార టీడీపీ నేతలు తాజాగా మైండ్ గేమ్‌కు తెర లేపారు. కుంటి సాకులు చూపి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి నామినేషన్‌ను తిరస్కరించాలని నానా యాగీ చేశారు. ఆ విషయానికి అనుకూల మీడియా ద్వారా విపరీతంగా ప్రచారం కల్పించి స్థానిక ప్రజలను తికమక పెట్టేందుకు శాయశక్తులా యత్నించారు. ఎట్టకేలకు శిల్పా నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆమోదించడంతో ఉలిక్కి పడుతూ.. తేలు కుట్టిన దొంగల్లా ఉండిపోయారు. తిరిగి పాత ఆరోపణలే వల్లె వేస్తూ చేజారిపోతున్న ఓటు బ్యాంకును నిలుపుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. మొత్తానికి సోమవారం కర్నూలు జిల్లా నంద్యాల్లో టీడీపీ నేతలు సాగించిన హైడ్రామా బెడిసికొట్టింది. నాలుగు రోజుల క్రితం

మిగతా 6వ పేజీలో ▶

టీడీపీ నేతలు ఇలా చేశారు..

జగన్ సభ మైలేజీ నుంచి దృష్టి మళ్లించేందుకు మూడు రోజులుగా చేస్తున్న ప్రచారాన్ని నాలుగో రోజు టీడీపీ మరింత ఉధృతం చేసింది. సోమవారం మధ్యాహ్నం హడావుడిగా రిజిస్ట్రార్ నుంచి అధికార పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి పేరు మీద ఒక లెటర్ తెప్పించారు. శిల్పామోహన్ రెడ్డి అఫిడవిట్లపై సంతకం చేసిన తులసిరెడ్డి నోటరీ కాదని ధ్రువీకరిస్తూ జిల్లా రిజిస్ట్రార్ లేఖ ఇచ్చారని రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ఇదే లెటర్‌ను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి, శిల్పా మోహన్‌రెడ్డి నామినేషన్ తిరస్కరణకు గురయ్యిందంటూ పెద్ద ఎత్తున ప్రచారానికి దిగారు.

నోటరీ చట్టం ప్రకారం వాస్తవం ఇదీ..

రాష్ట్రంలో 2013 తర్వాత ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ఉత్తర్వులు ఇచ్చి ఏ నోటరీ కాలాన్ని పొడిగించలేదు. దీంతో కొద్ది మంది న్యాయవాదులు హైకోర్టును ఆశ్రయించి తమ నోటరీ కాలాన్ని పొడిగించుకున్నారు. మరికొందరు నోటరీని పొడిగించాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. నోటరీ చట్టం ప్రకారం తమ నోటరీ కాల పరిమితి ముగిసినప్పటికీ రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకుంటే సదరు న్యాయవాది నోటరీ అమల్లో ఉన్నట్టేనని చెబుతోంది. ఈ ప్రకారం తులసిరెడ్డి నోటరీగా కొనసాగుతున్నట్లేనని స్పష్టమవుతోంది.

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు..

నోటరీ అయిన న్యాయవాది సంతకం చేయనంత మాత్రాన నామినేషన్‌ను తిరస్కరించే అవకాశం లేదని ఎన్నికల సంఘం నిబంధనలు చెబుతున్నాయి. నియమావళిలోని సెక్షన్ 6.10 ప్రకారం.. సదరు వ్యక్తి పోటీకి అనర్హుడైతేనో, అఫిడవిట్‌ను సదరు అభ్యర్థి నింపకపోతేనో, నామినేషన్ పేపరుపై అభ్యర్థి సంతకం చేయకపోతేనో, పేర్కొన్న డిపాజిట్ చెల్లించకపోతేనో వంటి కారణాలతో నామినేషన్‌ను తిరస్కరించే అధికారం రిటర్నింగ్ అధికారికి ఉంటుంది.

బిగ్‌బాస్.. అదిరిపోయే ప్లాన్!

ప్రభుత్వ శాశ్వత భవనాల సముదాయం నిర్మాణ పనుల టెండర్లలో గోల్‌మాల్

- రూ.9,000 కోట్ల అంచనా వ్యయాన్ని పెంచుకునే వెసులుబాటు
- కోటరీలోని కాంట్రాక్టు సంస్థలకే పనులు దక్కేలా వ్యూహం
- కావాల్సిన సంస్థల అర్హతలే టెండర్ నిబంధనలు
- అక్రమాలకు నిబంధనలు అడ్డురాకుండా చూసేందుకు పీఎంసీలు
- ఎంపిక చేసిన సంస్థలే పీఎంసీలుగా ఎంపికయ్యేలా షరతులు
- బిగ్‌బాస్‌కు జాక్‌పాట్‌గా మారిన శాశ్వత భవనాల పనులు

సాక్షి, అమరావతి:

రాష్ట్ర రాజధాని అమరావతిలో తాత్కాలిక సచివాలయం, శాసనసభ, శాసన మండలి నిర్మాణ పనులను కావాల్సిన వారికి కట్టబెట్టి భారీగా కమీషన్లు జేబులో వేసుకున్న బిగ్‌బాస్ ఇప్పుడు ప్రభుత్వ శాశ్వత భవనాల సముదాయం నిర్మాణ పనులపై కన్నేశారు. తన కోటరీలోని కాంట్రాక్టు సంస్థలకు ఉన్న అర్హతలనే టెండర్ నిబంధనలుగా మార్చేశారు. అంతేకాదు పనుల అంచనా వ్యయాన్ని పెంచు కునే వెసులుబాటును కూడా కల్పించారు. బిగ్‌బాస్ ప్లాన్ ప్రకారం.. కోటరీలోని సంస్థలకు తప్ప ఇతరులకు పనులు దక్కే అవకాశం లేదన్న మాట. రూ.9,000 కోట్లతో చేపట్టే శాశ్వత భవనాల సముదాయం పనులను కోటరీలోని కాంట్రాక్టర్లకే అప్పగించి, అంచనా వ్యయాన్ని విపరీతంగా పెంచేసి, ఆ మేరకు కమీషన్లు కొల్లగొట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. తమ అక్రమాలకు ప్రభుత్వ నియమ నిబంధనలు అడ్డురాకుండా చూసేందుకు ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీలను(పీఎంసీ) నియమించుకుంటున్నారు. తాము ఎంపిక చేసిన సంస్థలే పీఎంసీలుగా ఎంపిక య్యేలా టెండర్ నిబంధనలు రూపొందించారు.

అంచనా వ్యయంలో మార్పులు చేర్పులు

ప్రభుత్వ శాశ్వత భవనాల సముదాయం నిర్మాణ పనులు చేసేందుకు ఆసక్తి ఉన్న కాంట్రాక్టర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ జులై 29వ తేదీన రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సీఆర్‌డీఏ) టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఫోస్టర్స్ పార్ట్‌నర్స్ సంస్థ రూపొందించిన

మిగతా 2వ పేజీలో ▶



ఇదండీ సంగతి



సోమవారం నెల్లూరులో ఆత్మీయ అభినందన పౌర సన్మాన సభలో శ్వేత కపోతాన్ని ఎగురవేస్తున్న వెంకయ్యనాయుడు



రాష్ట్రాభివృద్ధిని మరువను..

బీజేపీని వీడేటప్పుడు ఎంతో బాధపడ్డాను: వెంకయ్య నాయుడు

- అమ్మను పోగొట్టుకున్నంత బాధ కలిగింది
- నెల్లూరులో వెంకయ్యకు ఆత్మీయ అభినందన పౌర సన్మానం

నెల్లూరు(సెంట్రల్): ఉపరాష్ట్రపతి పదవికి తనను అభ్యర్థిగా ప్రకటించిన తరువాత బీజేపీకి రాజీనామా చేయడానికి మనసు అంగీకరించలేదని ముప్పవరపు వెంకయ్యనాయుడు చెప్పారు. పార్టీ తనకు ఎన్నో అవకాశాలు కల్పించిందని, దాంతో అంచెలంచెలుగా ఎదిగానని పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్య నాయుడికి సోమవారం నెల్లూరులో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన పౌర సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీకి రాజీనామా చేయాల్సిన సమయంలో తానెంతో బాధపడ్డానని అన్నారు. అమ్మలాంటి పార్టీని వీడుతున్నప్పుడు అమ్మను పోగొట్టుకున్నంత

మిగతా 6వ పేజీలో ▶

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

- వర్షాభావంతో చేతికందని పంట
- రెండు బోర్లు వేసినా ఫలితం శూన్యం
- దిక్కుతోచక పురుగు మందు తాగిన వైనం



ప్రతాప్‌రెడ్డి (ఫైల్)

పెండ్లిమర్రి: అప్పుల భారం ఓ యువ రైతు ఉసురు తీసింది. వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి మండలం కారపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన మిట్టా ప్రతాప్ రెడ్డి (36) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రతాప్‌రెడ్డికి మూడెకరాల పొలం ఉంది. వర్షాభావం వల్ల కొన్నేళ్లుగా

మిగతా 2వ పేజీలో ▶

3 నెలల్లో 28 సాగునీటి ప్రాజెక్టులు!

పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

2018 నాటికి గ్రావిటీ ద్వారా పోలవరం నీరు

2019 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి

వచ్చే ఏడాదికి పునరావాస పనులు పూర్తికి ఆదేశం

15న పురుషోత్తపట్నంలో రెండు మోటార్లు ప్రారంభం

సాక్షి ప్రతినిధి, ఏలూరు/రాజమహేంద్రవరం/అమరావతి:

వచ్చే మూడు నెలల్లో రాష్ట్రంలో 28 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. సోమవారం ఆయన పోలవరం ప్రాజెక్టును పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం జలవనరుల శాఖలో కొత్తగా ఉద్యోగాలలోకి తీసుకున్న 518 మంది అసిస్టెంట్ ఇంజినీర్లకు నియామక పత్రాలు ప్రాజెక్టు వద్ద ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రాజెక్టు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. 2018 నాటికి గ్రావిటీపై నీరు ఇస్తామని, 2019 నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పారు. ఈ ప్రాజెక్టు భూసేకరణ, పునరావాసం కోసం రూ. 32 వేల కోట్లు ఖర్చు అవుతుందని, పవర్ ప్రాజెక్టు మినహాయించి ప్రాజెక్టు ఖర్చు రూ. 16 వేల కోట్లు, మొత్తం రూ. 50 వేల కోట్లు ఖర్చు అవుతాయన్నారు. పట్టిసీమ నుంచి 29 టీఎంసీల నీటిని తీసుకువెళ్లడం ద్వారా 14 లక్షల ఎకరాల్లో పంటను సాగు చేయగలిగామని చెప్పారు. అంతకు ముందు జరిగిన సమీక్షలో 2018 మే నాటికి పునరావాసం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పునరావాసం ఇచ్చిన వారి ఆధార్, రేషన్ కార్డులు అనుసంధానం చేయాలన్నారు. ఇంకా గిరిజనుల కోసం 12 కాలనీలు, గిరిజనేతరుల కోసం ఒక కాలనీ నిర్మించాల్సి ఉందని వీటిని వచ్చే ఏడాది మే నాటికి

మిగతా 7వ పేజీలో ▶

పురుషోత్తపట్నంలో రైతుల గృహ నిర్బంధం

- సీఎం పర్యటన సందర్భంగా నిర్బంధించిన పోలీసులు
- భూములిచ్చిన రైతులు ఆందోళన చేస్తారనే ముందస్తు చర్యలు
- రాత్రి వరకు గృహ నిర్బంధంలో వైఎస్సార్‌సీపీ నేత జక్కంపూడి

7లో

బెజవాడలో సామాన్యుడి బతుకు భారం

చుక్కలనంటుతున్న ఇంటి అద్దెలు

- పాఠశాలల్లో ఫీజుల మోత
- కూరగాయలతో సహా అన్నీ తలకుమించిన భారమే
- ఆటో, క్యాబ్ ఛార్జీల బాదుడు
- అప్పుల పాలవుతున్న బడుగు జీవులు
- అస్తవ్యస్థ ట్రాఫిక్‌తో నరకప్రాయంగా ప్రయాణం

5లో



కాంగ్రెస్‌లో 'గుజరాత్' టెన్షన్!

నేడు రాజ్యసభ ఎన్నికలు

- అహ్మద్ పటేల్ గెలుపుపై ఉత్కంఠ
- చివరిక్షణంలో కాంగ్రెస్‌కు షాకిచ్చిన ఎన్సీపీ.. బీజేపీకి జై
- విజయానికి ఒక్క ఓటు దూరంలో పటేల్..

20 వస్తువులపై తగ్గనున్న జీఎస్టీ రేటు!

- సెప్టెంబరు 9న తుది నిర్ణయం తీసుకోనున్న మండలి

- వివరాలు 12లో



గవర్నర్ నరసింహన్‌కు రాఖీ కడుతున్న ముస్లిం మహిళలు

రాజ్‌భవన్‌లో ఘనంగా రక్షా బంధన్

సాక్షి, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల ప్రజలకు గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఇరు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో, ఆరోగ్యంగా, సౌభాగ్యంగా ఉండాలని కోరుకున్నారు. రాజ్‌భవన్‌లోని దర్బార్‌హాల్‌లో సోమవారం రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాలల చిన్నారులతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, బ్రహ్మకుమారీలు ఈ కార్యక్రమంలో పాల్గొని గవర్నర్ దంపతులకు రాఖీలు కట్టారు.

@ysjagan

అన్నాచెల్లెలి అనుబంధానికి ప్రతీక

వైఎస్ జగన్‌కు రాఖీ కట్టిన షర్మిల

సాక్షి, హైదరాబాద్: అన్నాచెల్లెలి అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ. ఆత్మీయతానుబంధాలను చాటే ఈ విశిష్టమైన పర్వదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన సోదరి షర్మిల సోమవారం రాఖీ కట్టారు. షర్మిల తనకు ఆత్మీయంగా రాఖీ కడుతున్న ఫొటోను ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ట్విట్టర్ పేజీలో పోస్టు చేశారు. అక్క, చెల్లెమ్మలందరూ ఇప్పుడు, ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలని ఆయనీ సందర్భంగా ఆకాంక్షించారు. అంతకుముందు రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలుగు రాష్ట్రాల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల ప్రేమానుబంధాల్ని, పరస్పర అనురాగాన్ని చాటే రాఖీ పౌర్ణమి ఒక విశిష్టమైన పండుగని ఆయన తన సందేశంలో పేర్కొన్నారు. ఈ పర్వదినం ప్రజల్లో సోదరభావాన్ని, ఐక్యతను చాటాలని ఆకాంక్షించారు.

Tweets | Tweets & replies | Media

YS Jagan Mohan Reddy @ysjagan · 11h
May all sisters be happy this day and always #RakshaBandhan

బిగ్‌బాస్.. అదిరిపోయే ప్లాన్!

▶ మొదటి పేజీ తరువాయి

డిజైన్(ఆకృతులు) ఆధారంగా 1,02,89,003 చదరపు అడుగుల్లో శాసనసభ, శాసన మండలి, రాజ్‌భవన్, హైకోర్టు, సచివాలయం, ముఖ్యమంత్రి నివాసంతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల నివాసాల సముదాయం నిర్మాణానికి దాదాపు రూ.9,000 కోట్లతో తయారు చేసిన అంచనాలను కాంట్రాక్టర్లకు అందించి, వారి సూచనల మేరకు మార్పులు చేర్పులు చేస్తారు. ఆ తర్వాత ప్రభుత్వ శాశ్వత భవనాల సముదాయం నిర్మాణానికి పిలిచే టెండర్లలో ఆ కాంట్రాక్టర్లకు మాత్రమే పాల్గొనే అర్హత ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది.

కోటరీ సంస్థల అర్హతలే టెండర్ నిబంధనలు

ఒక ప్రాజెక్టు అంతర్గత అంచనా విలువను నిర్ణయించి.. ఈపీసీ లేదా ఎల్ఎస్ ఓపెన్ పద్ధతిలో టెండర్లు పిలవడం సాధారణం. కానీ, ప్రభుత్వ భవనాల సముదాయ పనుల టెండర్లలో బిగ్‌బాస్ సరికొత్త విధానానికి తెరతీశారు. ఇందులో భాగంగా చేపట్టే వివిధ నిర్మాణాల పనులు చేసేందుకు ఆసక్తి ఉన్న కాంట్రాక్టర్లు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం కోరింది. కానీ, దరఖాస్తు చేసుకోవడానికి నిబంధనలు విధించింది. గత పదేళ్లుగా సివిల్ ఇంజనీరింగ్ నిర్మాణ వ్యాపారం చేస్తూ.. 2012-13 నుంచి 2016-17 వరకూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగాల్లో ఒకే ఏడాదిలో రూ.400 కోట్ల విలువైన ఇదే రకమైన మూడు ప్రాజెక్టులు గానీ, రూ.600 కోట్ల విలువైన రెండు ప్రాజెక్టులు గానీ, రూ.800 కోట్ల విలువైన ఒక ప్రాజెక్టు గానీ పూర్తి చేసిన కాంట్రాక్టర్లు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని షరతు విధించింది. 2012-13 నుంచి 2016-17 వరకూ 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో డిజైన్లు రూపొందించి, భవనాల నిర్మాణం చేసి ఉండాలని మరో నిబంధన పెట్టింది. గత పదేళ్లలో ఏటా రూ.300 కోట్ల మేర లాభాలు గడించి ఉండాలని, బ్యాంకుల్లో రూ.300 కోట్ల నగదు నిల్వలు ఉన్న కాంట్రాక్టర్లకే దరఖాస్తు చేసుకునే అర్హత ఉంటుందని ఇంకో షరతు విధించింది. అవన్నీ గమనిస్తే బిగ్‌బాస్ కోటరీలోని కాంట్రాక్టర్లకే ఈ అర్హతలు ఉన్నట్లు స్పష్టమవుతోంది.

ఒక్కో పీఎంసీకి రూ.50 కోట్లు

శాశ్వత భవనాల సముదాయం పనుల టెండర్లకు సమాంతరంగా 34,78,903 చదరపు అడుగుల్లో సచివాలయం, శాఖాధిపతుల(హెచ్ఓడీ) కార్యాలయాల నిర్మాణ పనులు, రాజ్‌భవన్, ముఖ్యమంత్రి నివాసం, స్పీకర్, మండలి చైర్మన్, మంత్రులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులు, అధికారుల నివాస భవనాల సముదాయాల నిర్మాణ పనుల పర్యవేక్షణకు వేర్వేరుగా ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ(పీఎంసీ)ల ఎంపికకూ రెండు టెండర్లు పిలిచారు. తాము ఎంపిక చేసిన సంస్థలే పీఎంసీలుగా ఎంపికయ్యేలా టెండర్ నిబంధనలు రూపొందించారు. ప్రభుత్వ భవనాల సముదాయ పనుల అంచనాల దగ్గర నుంచి టెండర్ల ప్రక్రియ మొదలు.. పనులు పూర్తయి ప్రభుత్వానికి అప్పగించే వరకూ అన్నింటా పీఎంసీలదే ప్రధాన భూమిక. ఒక్కో పీఎంసీకి కన్సల్టెన్సీ ఫీజు కింద రూ.50 కోట్లు చొప్పున చెల్లిస్తారు. ప్రభుత్వ శాశ్వత భవనాల సముదాయం పనులతోపాటు రెండు ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీలకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 21వ తేదీ తుది గడువు. ఈ నెల 28న టెండర్లు ఖరారు చేస్తారు. కాంట్రాక్టర్లు, పీఎంసీలు తన కోటరీకి చెందిన వారేలా ఉండేలా బిగ్‌బాస్ బిగ్‌ప్లాన్ వేశారని స్పష్టమవుతోంది.

అంచనాకు అందని వ్యయం

తాత్కాలిక సచివాలయం, శాసనసభ, శాసన మండలి నిర్మాణ వ్యయాన్ని రూ.358 కోట్ల నుంచి రూ.1,030 కోట్లకు పెంచేసి, ఖర్చు చేసినా వాటి నిర్మాణం ఇంకా అసంపూర్తిగానే మిగిలిపోయిందంటే బిగ్‌బాస్‌కు కాంట్రాక్టు సంస్థల నుంచి ఏ స్థాయిలో ముడుపులు ముట్టాయో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ శాశ్వత భవనాల సముదాయాల నిర్మాణాన్ని 2018 డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. రూ.9,000 కోట్లతో ప్రారంభమయ్యే ఈ ప్రాజెక్టు వ్యయం చివరకు ఎన్ని రూ.వేల కోట్లకు చేరుతుందో సీఆర్‌డీఏ అధికారులే చెప్పలేకపోతున్నారు.

ప్రైవేటు కన్సల్టెంట్‌కు అంత పెద్ద ప్రాజెక్టా?

మెడ్‌టెక్‌జోన్ పార్క్‌లో అవినీతిపై ఐఏఎస్ అధికారుల విస్మయం

సాక్షి, అమరావతి: ఉత్తరాదికి చెందిన ఓ ప్రైవేటు కన్సల్టెంట్ చేతికి వందల కోట్ల విలువైన ప్రాజెక్టును ఎలా కట్టబెడతారని పలువురు ఐఏఎస్ అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 6వ తేదీన సాక్షి దినపత్రికలో 'మెడ్‌టెక్ పార్కులో అవినీతి చెట్లు' శీర్షికన వచ్చిన వార్తపై పలువురు ఐఏఎస్‌ల మధ్య చర్చ జరిగింది. మెడ్‌టెక్‌జోన్‌కు జితేందర్‌కుమార్ శర్మను సీఈవోగా నియమించడం సర్కారు చేసిన పెద్ద తప్పిదమని, అంతేగాకుండా సీఈవోగా బాధ్యతలు స్వీకరించిన శర్మ చేసే పనులకు ఎవరు బాధ్యత వహిస్తారని ఐఏఎస్‌లు అభిప్రాయపడ్డారు. కేబినెట్ అనుమతులు లేకుండా రూ. వందల కోట్ల అంచనాలు పెంచారంటే ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ప్రాజెక్టులు ఉంటే ఎలా ఉంటుందో ప్రభుత్వం గుర్తించాలన్నారు. మెడ్‌టెక్ జోన్‌లో అక్రమాలు బహిర్గతమవడంతో వెంటనే వెబ్‌సైట్‌లో అంచనాలు మార్చేశారు. అంతేగా కుండా విశాఖలోని మెడ్‌టెక్ కార్యాలయంలోని రికార్డు ల్లోనూ అంచనాలు మార్చేందుకు యత్నించినట్టు తెలిసింది. పలువురు డైరెక్టర్లకు కూడా ఫోన్లు చేసి బెదిరించినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఈ అక్రమాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నివేదిక కోరినట్టు తెలిసింది.

రాష్ట్రంలో అరాచక ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొత్స ధ్వజం
- ముద్రగడను కలిసిన బొత్స సత్యనారాయణ



కిర్లంపూడిలో ముద్రగడను కలిసిన బొత్స సత్యనారాయణ. చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కాపు నేతలు

కిర్లంపూడి: రాష్ట్రంలో ప్రజాస్వామ్య సర్కారు లేదని, అరాచక ప్రభుత్వం నడుస్తోందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. సీఎం చంద్రబాబు చట్టాన్ని, రాజ్యాంగాన్ని చేతుల్లోకి తీసుకుని ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారని దుయ్య బట్టారు. మాజీ ఎంపీ, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంను సోమవారం తూర్పు గోదావరి జిల్లా కిర్లంపూడిలోని తన స్వగృహంలో బొత్స కలుసుకుని సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బొత్స విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాపు రిజర్వేషన్లపై మీరిచ్చిన హామీని తప్ప ముద్రగడ ఏమైనా అదనంగా అడుగుతున్నారా అని చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉందన్నారు. ''దురదృష్టకరమైన విషయం ఏమిటంటే, దారిలో నాలుగు పోలీసు చెక్‌పోస్టులు పెట్టారు. ముద్రగడను కలవడానికి వస్తుంటే ఎక్కడికి వెళ్తున్నారు.. ఎవరిని కలవడానికి వెళ్తున్నారని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ముద్రగడ ఏమైనా సంఘ విద్రోహక శక్తా?'' అంటూ బొత్స నిప్పులు చెరిగారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, పార్టీ నేతలు చలమలశెట్టి సునీల్, ముత్యాల సతీశ్ పాల్గొన్నారు.

ముద్రగడ పాదయాత్రను మళ్లీ అడ్డుకున్న పోలీసులు

కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం యథావిధిగా జేఏసీ నాయకులు, కాపు నేతలతో కలసి సోమవారం కిర్లంపూడిలోని తన స్వగృహం నుంచి పాదయాత్రకు బయల్దేరగా గేటు వద్దే పెద్దాపురం డీఎస్పీ, రంపచోడవం ఏఎస్పీలతో పాటు పలువురు పోలీసులు అడ్డుకున్నారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం పాదయాత్రకు అనుమతి లేదని పోలీసులు ముద్రగడకు చెప్పారు. దీనిపై ముద్రగడ స్పందిస్తూ.. జాతీయ రహదారుల పక్కన మద్యం దుకాణాలు ఉండకూడదని సుప్రీం కోర్టు మార్గదర్శకాలు ఇచ్చింది కదా, వాటిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎందుకు ఆచరించలేదని ప్రశ్నించారు. చంద్రబాబు ఏమైనా రాజ్యాంగానికి అతీతుడా అని పోలీసులను నిలదీశారు. తమను ఎంత కాలం బంధిస్తారని ప్రశ్నించారు. పాదయాత్రను అడ్డుకునే కంటే తనను జైల్లో వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాపు జేఏసీ నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, ఆకుల రామకృష్ణ, ఆరేటి ప్రకాశ్, గౌతు స్వామి, తుమ్మలపల్లి రమేష్, చంటిబాబు, పలువురు కాపు నాయకులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

▶ మొదటి పేజీ తరువాయి

పంట దిగుబడి సక్రమంగా రాలేదు. అరకొరగా చేతికందిన పంటకు గిట్టుబాటు ధర లేక మరికొన్నేళ్లు సతమతమయ్యాడు. ఏడాది క్రితం ఒక బోరు, ఆరు నెలల క్రితం మరో బోరు వేసినా ప్రయోజనం లేకపోయింది. పంటల సాగుతో పాటు రెండు బోర్లు వేసేందుకు చేసిన అప్పులు అధికమయ్యాయి. కడప డీసీసీ బ్యాంకులో రూ.3 లక్షలు, ప్రైవేటుగా రూ.12 లక్షలు అప్పులున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డీసీసీ బ్యాంకులో తీసుకున్న అప్పునకు రుణమాఫీ వర్తించ లేదు. ప్రస్తుతం మల్లెపూలు సాగు చేస్తూ.. వరి నాటేందుకు నారు పోశాడు. ఈ నేపథ్యంలో రుణ దాతల నుంచి ఒత్తిడి తీవ్రతరమైంది. అప్పు ఎలా తీర్చాలో దిక్కుతోచక సోమవారం పొలానికి వెళ్లి పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కడప రిమ్స్‌కు తరలించిన కొద్ది సేపటికే మృతి చెందాడు. మృతునికి భార్య జయమ్మ, కుమారులు రాజారెడ్డి, వీర ప్రతాప్‌రెడ్డిలు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

సుప్రీం ఉత్తర్వులతో వయోపరిమితి పెంపు అమలు

సాక్షి, అమరావతి: సుప్రీం కోర్టు ఉత్తర్వులతో ఏపీ రెసిడెన్సియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ, ఇంటర్మీడియెట్ బోర్డు, విద్యా, మౌలిక సదుపాయాల కల్పన సంస్థల్లో పనిచేసి వయోపరిమితి పెంపు అనంతరం 58 ఏళ్లకు రిటైరైన వారికి 60 ఏళ్ల నిబంధనను వర్తింపచేస్తూ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఆదిత్య నాథ్ దాస్ సోమవారం జీవో నం.62 విడుదల చేశారు. పదో షెడ్యూల్‌లో ఉన్న సంస్థలు, మరి కొన్ని విభాగాల్లో విధులు నిర్వహించేవారికికూడా పదవీ విరమణ వయోపరిమితిని 60 ఏళ్లకు పెంచాలని సుప్రీం కోర్టు ఇటీవల ఉత్తర్వులిచ్చింది. 58 ఏళ్లకు పదవీ విరమణ చేసినందున ఇప్పటివరకు డిస్కంటిన్యూ అయిన కాలాన్ని రెగ్యులరైజ్ చేయనున్నారు. ఈ కాలాన్ని లీవుగా పరిగణిస్తారు. లీవులు లేని పక్షంలో ఈవోఎల్‌గా పరిగణించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

11, 12 తేదీల్లో రెండో విడత కౌన్సెలింగ్

విజయవాడ (హెల్త్ యూనివర్సిటీ): రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లోని యాజమాన్య బి-కేటగిరీ, సి-కేటగిరీ(ఎన్ఆర్ఐ) సీట్లలో అడ్మిషన్లకు ఈనెల 11, 12 తేదీల్లో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు తెలిపారు. ఈమేరకు యూనివర్సిటీ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 11న మొదటి నుంచి 2 వేల మెరిట్ ఆర్డర్ వరకు, 12న 2001 నుంచి చివరి మెరిట్ ఆర్డర్ వరకు అభ్యర్థులు హాజరుకావాలని పేర్కొన్నారు. సి-కేటగిరీ ఎన్ఆర్ఐ సీట్లలో చేరాలనుకునే అభ్యర్థులు ఎన్ఆర్ఐ డిక్లరేషన్ పత్రాలతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

గ్రూప్ 3 పరీక్షకు 91 శాతం హాజరు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 1,055 పంచాయతీ కార్యదర్శుల పోస్టుల భర్తీ కోసం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) నిర్వహించిన గ్రూప్ 3 మెయిన్స్ ఆన్‌లైన్ ఆధారిత పరీక్షకు 91 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. రెండు పేపర్లుగా ఈ నెల 6,7 తేదీల్లో ఈ పరీక్ష నిర్వహించారు. 6న శ్రీకాకుళం, విశాఖపట్నం, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, వైఎస్సార్, అనంతపురం జిల్లాల్లోని పోస్టులకు, 7న విజయనగరం, తూర్పు గోదావరి, నెల్లూరు, కర్నూలు జిల్లాల్లోని పోస్టులకు పరీక్ష నిర్వహించారు. మొత్తం 52,750 మంది ఈ పరీక్షలకు అర్హత సాధించారు. పేపర్-1కు 47,878 (90.76%) మంది, పేపర్-2కు 47,904 (90.81%) మంది హాజరయ్యారని ఏపీపీఎస్సీ కార్యదర్శి వైవీఎస్టీ సాయి తెలిపారు. ప్రశ్న పత్రాలు, 'కీ'లు, రెస్పాన్స్ షీట్లు 8 నుంచి కమిషన్ వెబ్‌సైట్లో పొందుపర్చనున్నట్లు చెప్పారు.

చిన్నారులకు ఆర్టీసీ టిక్కెట్లపై 50% రాయితీ

సాక్షి, అమరావతి: సీనియర్ సిటిజన్లకు ఏసీతో సహా అన్ని బస్సు టిక్కెట్లపై రాయితీ ప్రకటించిన ఆర్టీసీ చిన్నారులకు కూడా రాయితీ ఇవ్వనున్నట్టు తెలిపింది. ఈ మేరకు ఆర్టీసీ ఈడీ జయరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐదేళ్లలోపు చిన్నారులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని, అలాగే 12 ఏళ్లలోపు పిల్లలకు ఏసీ బస్సు సర్వీసుల్లో 25 శాతం, సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ సహా అన్ని బస్సుల్లో అయితే 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. కాగా, ఈ రాయితీ పొందాలంటే వయస్సు ధ్రువీకరణ పత్రం చూపించాల్సి ఉంటుందని జయరావు స్పష్టం చేశారు.

ఏపీశాక్స్ ఉద్యోగులకు ఈపీఎఫ్ వర్తింపు

సాక్షి, అమరావతి

ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణా మండలి (ఏపీశాక్స్)లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) వర్తింప చేస్తూ కేంద్ర ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ ఉత్తర్వులిచ్చారు. గత 15 సంవత్సరాలుగా ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో 2 వేల మంది ఉద్యోగులు తమకు ఈపీఎఫ్ అమలు చేయాలని తీవ్రంగా పోరాటం చేశారు. తాజాగా ఉద్యోగుల సంఘం కేంద్రపీఎఫ్ కమిషనర్‌కు లేఖ రాశారు. దీనికి సంబంధించి ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసు ఇచ్చారు. ఆయా ఉద్యోగులకు ఎందుకు పీఎఫ్ వర్తింపచేయలేదో సమాధానమివ్వాలని నోటీసులో పేర్కొన్నారు. ఇంతకాలం వారికి బేసిక్ వేతనం వర్తింప చేయకపోవడంతో పీఎఫ్ వర్తింప చేయలేదు. తాజా ఉత్తర్వుల్లో రూ.15 వేల లోపు వేతనం ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులందరికీ ఈపీఎఫ్ అమలు చేయాలని పేర్కొన్నారు. దీనిపై ఏపీశాక్స్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సుధార్తి వేను మాట్లాడుతూ... తమ పోరాటానికి స్పందించి కేంద్ర కమిషనర్ ఆదేశాలు ఇవ్వడం సంతోషంగా ఉందని అన్నారు.

విమాన ప్రయాణికుల నరకయాతన

- చెన్నై విమానాశ్రయం నుంచి బయలుదేరిన చెన్నై-రియాద్ విమానం
- కేరళ సమీపంలో తీవ్రమైన సుడిగాలుల కారణంగా మళ్లీ చెన్నై చేరిక
- ఈలోగా పైలెట్ల డ్యూటీలు దిగిపోవడంతో ప్రయాణికులకు కష్టాలు

సాక్షి ప్రతినిధి, చెన్నై: చెన్నై-రియాద్ విమానంలోని 292 మంది ప్రయాణికులు ఏకంగా 16 గంటలపాటు నరకయాతనపడ్డారు. కేరళ రాష్ట్రం కొచ్చి మీదుగా రియాద్ వెళ్లే సౌదీ అరేబియన్ ఎయిర్‌లైన్స్ 292 మంది ప్రయాణికులతో ఆదివారం ఉదయం చెన్నై విమానాశ్రయం నుంచి బయలుదేరింది. కేరళ రాష్ట్రం కొచ్చికి చేరువవుతున్న సమయంలో తీవ్రమైన సుడిగాలులు వీచడంతో ఆదివారం సాయంత్రం చెన్నైకి తిరిగి వచ్చేసింది. ప్రయాణికులను విమానంలోనే ఉంచారు. వాతావరణం అనుకూలంగా ఉంది.. బయలుదేరవచ్చని రాత్రి 8 గంటల సమయంలో కొచ్చి నుంచి చెన్నై కంట్రోలు రూంకు ఫోన్ వచ్చింది. అయితే విమాన పైలెట్, కోపైలెట్ తమ డ్యూటీ అయిపోయిందని వెళ్లిపో యారు. 'విమానానికి పైలెట్లను ఏర్పాటు చేస్తున్నాం, రాత్రి 11 గంటలకు బయలుదేరుతున్నాం' అని ఎయిర్ హోస్టెస్‌లు ప్రకటించారు. అయితే రాత్రి 11 గంటలకు విమానం బయలుదేరలేదు. 'మరో విమానం రప్పిస్తున్నాం' అని సిబ్బంది మరోసారి ప్రకటించారు. ఇలాంటి ప్రకటనలతోనే అర్ధరాత్రి ఒంటి గంట కావడంతో ఆగ్రహించిన ప్రయాణికులు ఆందోళనకు దిగారు. విమానం నుంచి దించివేస్తే తామే ప్రత్యామ్నాయ మార్గాల వెతుక్కుంటామని కోరారు. పౌరసత్వం, కస్టమ్స్



చెకింగ్ కొచ్చీలోనే జరగాల్సి ఉందనీ, చెన్నైలో ఆ వసతి లేదు కాబట్టి విమానం నుంచి దిగేందుకు వీలులేదని ఎయిర్ హోస్టెస్ నిరాకరించారు. దీంతో ప్రయాణికులు గంటల తరబడి విమానంలో ఆకలితో అలమటి స్తున్నామని కేకలు వేయడంతో విమాన సిబ్బంది హడావుడిగా ఆహార పొట్లాలు పంపిణీచేశారు. సోమవారం తెల్లవారు జామున 40 మంది స్పెషల్ క్లాస్ ప్రయాణికులను విమానం నుంచి దింపి గట్టి బందోబస్తుతో చెన్నైలోని ఓ హోటల్‌కు చేర్చారు. మిగతా ప్రయాణికులు ఆహారం తీసుకుని విమానంలోనే గడిపారు. సోమవారం ఉదయం 8.30 గంటలకు సౌదీ అరేబియన్ ఎయిర్‌లైన్స్ విమానం చెన్నైకి చేరు కోగా అందు లోని ప్రత్యామ్నాయ పైలెట్లు విధుల్లో చేరగా ఉదయం 10 గంటలకు ఈ విమానం కొచ్చీకి బయలుదేరింది. సౌదీ అరేబియన్ ఎయిర్ లైన్స్ నిర్వాహణ లోపం 292 మంది ప్రయాణికుల పాలిట శాపంగా మారడంతో 16 గంటలపాటూ బందీలుగా నానాయాతన అనుభవించారు.

అవినీతికన్నా మతతత్వంతోనే ముప్పు

- 'ది హిందూ' చైర్మన్ ఎన్.రామ్
- ఎన్నికల అవినీతిని ఈసీ కూడా నిరోధించలేకపోతోంది
- 'వై స్కామ్స్ ఆర్ హియర్ టు స్టే' పుస్తకావిష్కరణ
- పాలన పూర్తిగా అవినీతిరహితమని అనలేం: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: మారణహోమాలకు దారితీసే మతతత్వ వాదం, దేశాన్ని అమ్మేసే పెట్టుబడిదారి విధానాలే అవినీతి కన్నా అత్యంత ప్రమాదకరమని ది హిందూ దినపత్రిక చైర్మన్ ఎన్.రామ్ అభిప్రాయపడ్డారు. ''అవినీతి నిరోధానికి దేశంలో సమర్థ చట్టాలున్నా అవి అమలు కావడం లేదు. అవినీతి నిర్మూలనకు లోక్‌పాల్ చట్టం తెచ్చినా ఇప్పటికీ లోక్‌పాల్‌నే నియమించలేదు. ఎన్నికల్లో అవినీతిని కేంద్ర ఎన్నికల సంఘం పూర్తిగా నిరోధించలేకపోతోంది'' అన్నారు. ఆయన రాసిన 'వై స్కామ్స్ ఆర్ హియర్ టు స్టే' పుస్తకావిష్కరణ సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ పెద్ద నోట్ల రద్దుతో కేంద్ర ప్రభుత్వానికే రాజకీయ లబ్ధి చేకూరింది తప్పితే అవినీతి, ఉగ్రవాదం, దొంగ నోట్ల నిర్మూలన వంటి అసలైన లక్ష్యాలు నెరవేరలేదన్నారు. ఆర్బీఐకి చేరిన రద్దైన నోట్ల లెక్కలను కూడా కేంద్రం ఇప్పటికీ బయట పెట్టలేదని చెప్పారు. పెద్ద నోట్లను రద్దు చేసినా ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో భారీగా డబ్బు వెదజల్లి ఓటర్లను ప్రలోభ పెట్టారని, కొన్ని నియోజకవర్గాల్లో ఒక్కో ఓటరుకు రూ.6 వేల దాకా ఇచ్చారని విమర్శించారు.

గుప్త విరాళాలతో మరింత అవినీతి

పార్టీలకు బాండ్ల రూపంలో గుప్త విరాళాలిచ్చేందుకు వీలు కల్పిస్తూ కేంద్రం తెచ్చిన చట్ట సవరణతో రాజకీయ అవినీతి మరింత పెరుగుతుందని రామ్ జోస్యం చెప్పారు. పార్టీలకు కార్పొరేట్ ఫండింగ్‌ను నిషేధించనంత వరకూ కుంభకోణాలు జరుగుతూనే ఉంటాయన్నారు. రాజకీయ నాయకులు, ప్రభుత్వోద్యోగులు, న్యాయ వ్యవస్థ, పత్రికా వ్యవస్థల వంటివేవీ అవినీతికి అతీతం కాదన్నారు. ''రాజీపడే, పట్టుదల లేని పాత్రికేయంతో అవినీతిపై యుద్ధం చేయలేం. దశాబ్ద కాలంగా మీడియా ప్రమాణాలు పడిపోయాయి. పత్రికలకు ప్రత్యామ్నాయంగా సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చినా రాజకీయ ప్రత్యర్థులను ద్వేషించడం వంటి ధోరణులు పెరుగుతున్నాయి'' అన్నారు. 2009 ఎన్నికల సమయంలో పెయిడ్ న్యూస్ కుంభకోణం బయటపడిందని గుర్తు చేశారు.

మీడియా బాధితులమని చెప్పుకోబోం

పూర్తిగా అవినీతి రహిత పాలన అందిస్తున్నామని తాము చెప్పుకోవడం సాధ్యం కాదని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు. దేశంలో ఏ రాష్ట్రమూ అలా చెప్పుకోలేదని ఆయనన్నారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో అవినీతి నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. స్వతంత్రం వచ్చి 70 ఏళ్లవుతున్నా గ్రామీణ ప్రజలకు తాగునీరు, రోడ్లు, విద్యుత్ వంటి కనీస సదుపాయాలు అందటం లేదంటే పాలకుల అవినీతి వల్లేనని విమర్శించారు. అయితే ప్రస్తుతం పరిస్థితుల్లో మార్పు వచ్చిందన్నారు. మీడియాలో తమపై ఎలాంటి విమర్శలొచ్చినా ఎదుర్కొని పట్టుదలతో పనిచేస్తామే తప్ప తమను మీడియా బాధితులుగా చెప్పుకోబోమన్నారు.



శ్రీవారి ఆలయం వద్ద జస్టిస్ అరుణ్ మిశ్రా తదితరులు

శ్రీవారి సేవలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి

సాక్షి, తిరుమల: సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ మిశ్రా సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలసి ఆయన ఆలయానికి విచ్చేశారు. ముందుగా వారు ధ్వజస్తంభానికి మొక్కుకున్నారు. తర్వాత శ్రీవారిని, వకుళమాతను దర్శించుకుని, హుండీలో కానుకలు సమర్పించారు. రంగనాయక మండపంలో జస్టిస్ అరుణ్ మిశ్రాకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా, రిసెప్షన్ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్ లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

రేపటి నుంచి శ్రీనివాస కల్యాణాలు

తిరుపతి అర్బన్: టీటీడీ శ్రీనివాస కల్యాణం ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం నుంచి సోమవారం వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో శ్రీనివాస కల్యాణాలు నిర్వహించనున్నట్టు టీటీడీ అధికారులు తెలిపారు. అన్ని ప్రాంతాల్లో సాయంత్రం 6 గంటలకు కల్యాణాలు ప్రారంభమవుతాయన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో: 11న చిత్తూరు జిల్లా సోమల మండలం ఇరికి పెంట గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో, 14న మదనపల్లి రూరల్ మండలం చిప్పిలి గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు.

తెలంగాణాలో: 9న మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో, 10న ఇదే జిల్లా యోగిపేట మార్కెట్ యార్డు ప్రాంగణంలో, 11న ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం గోర్ల ఒడ్డు గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో, 12న కొత్తగూడెం జిల్లా టేకులపల్లెలోని రామాలయం ఆవరణంలో, 13న ఇదే జిల్లా మణుగూరు మండలం సమితి సింగారం గ్రామంలోని జూనియర్ కాలేజీ మైదానంలో, 14న ఇదే జిల్లా చెర్ల మండల కేంద్రంలోని గ్రంథాలయం మైదానంలో శ్రీనివాస కల్యాణాలు నిర్వహిస్తామన్నారు.

కర్ణాటకలో: 12న బెంగళూరు నగరంలోని హెచ్ఎస్సార్ లే ఔట్‌లో, 13న బెంగళూరు కడబాగ్రే ప్రాంతంలో శ్రీనివాస కల్యాణాలు జరుగుతాయన్నారు.

ఫిరాయింపుదారులతో రాజీనామా చేయించరా?

- సీఎం చంద్రబాబుకు వైఎస్సార్‌సీపీ శాసనసభాపక్ష ఉప నేత పెద్దిరెడ్డి ప్రశ్న
- మా పార్టీలోకి వచ్చిన వారితో జగన్ రాజీనామా చేయిస్తున్నారు
- ప్రతిపక్షంలో ఉండి మేము ప్రజాస్వామ్య విలువలు కాపాడుతున్నాం
- మీరు మాత్రం ప్రజాస్వామ్య విలువలు మంటగలుపుతున్నారు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

నంద్యాల

తమ పార్టీ నుంచి టీడీపీలోకి ఫిరాయించిన 21 మంది ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు ఎందుకు రాజీనామా చేయించట్లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్ష ఉప నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. సోమవారం ఆయన కర్నూలు జిల్లా నంద్యాల పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ నైతిక విలువలకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాస్వామ్య విలువలను అనుసరించి.. టీడీపీ నుంచి వచ్చేవారిని ఆ పార్టీ ద్వారా లభించిన పదవులకు రాజీనామా చేసిన తర్వాతనే వైఎస్సార్‌సీపీలోకి చేర్చుకుంటున్నారని తెలిపారు. అధికారంలో ఉన్న చంద్రబాబు మాత్రం రాజీనామాలు చేయించకుండానే వారిని పార్టీలోకి చేర్చుకోవడమేగాక.. మంత్రి పదవులూ ఇస్తూ ప్రజాస్వామ్య విలువల్ని మంట కలుపుతున్నారని దుయ్యబట్టారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించే దమ్ము సీఎంకు లేదన్నారు. ఒకవేళ రాజీనామా చేయిస్తే ఎన్నికల్లో గెలవలేమనే భయం చంద్రబాబును వెంటాడుతోందన్నారు. తెలంగాణలో టీడీపీ ఎమ్మెల్యేలు పార్టీ మారితే.. సంతల్లో పశువుల్లా కొనుగోలు చేశారని చంద్రబాబు నాడు కేసీఆర్‌పై ధ్వజమెత్తారని, ఇప్పుడు అదే చంద్రబాబు ఏపీలో 21 మంది ఎమ్మెల్యేలను ఏ జంతువుల్లా కొన్నట్లని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబుకు ఏమాత్రం నైతిక విలువలున్నా ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఓటమి భయంతోనే రాజీనామా చేయించట్లేదని బహిరంగంగా చెప్పాలన్నారు. వైఎస్ జగన్ ఏదో ఒకమాట అన్నారని టీడీపీ నేతలు కోడిగుడ్డుపై ఈకలు పీకే కార్యక్రమాలు చేపడుతున్నారని ఆయన విమర్శించారు. గతంలో ఎస్వీ మోహన్‌రెడ్డి, ఇప్పుడు శిల్పా చక్రపాణిరెడ్డితో వారి ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేయించాకనే తమ పార్టీలోకి చేర్చుకున్నామని గుర్తు చేశారు. ఈ విషయాల్ని మరుగుపరిచేందుకు టీడీపీ నాయకులు.. జగన్‌పై ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టోలో 600 హామీలిచ్చి అధికారంలోకొచ్చిన చంద్రబాబు.. వాటిని అమలు చేయలేక, తిరిగి ఎన్నికలకు వెళ్లే ధైర్యం లేక భయపడుతున్నారని రామచంద్రారెడ్డి ఎద్దేవా చేశారు. నంద్యాలలో ఇచ్చిన హామీలన్నీ అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ నెరవేరుస్తారన్నారు. జగన్ మాట ఇస్తే తప్పే నాయకుడు కాదన్నారు. నంద్యాల ఉప ఎన్నికలో ఎన్ని ఇబ్బందులు పెట్టినా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలిచి తీరుతారన్నారు.

ప్రైవేటు స్కూల్ బస్సు బోల్తా

10 మంది విద్యార్థులకు తీవ్రగాయాలు



బోల్తాపడిన పాఠశాల బస్సు

కాశీబుగ్గ(పలాస): ప్రైవేటు స్కూల్ బస్సు బోల్తాపడిన ఘటనలో పది మంది విద్యార్థులు గాయపడ్డ సంఘటన శ్రీకాకుళం జిల్లా పలాస మండలంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని మదర్‌థెరిసా పాఠశాలకు చెందిన బస్సు పలాస పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో అదుపుతప్పి జాతీయ రహదారి పక్కకు దూసుకుపోయి బోల్తాపడింది. ఈ సమయంలో బస్సులో 11 మంది పిల్లలు ఉండగా.. వీరిలో పది మందికి తీవ్రగాయాలయ్యాయి. మితిమీరిన వేగంతో వచ్చిన బస్సు స్టీరింగ్ లాక్ పడటంతో డ్రైవర్ బస్సును అదుపు చేయలేకపోయాడు. దీంతో బస్సు రోడ్డుపక్కన ఉన్న చెట్ల మధ్యలో నుంచి దూసుకుపోయి బోల్తా పడింది. ప్రమాదం జరిగిన ప్రాంతం బురదమయంగా ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. పక్కనే పొలంలో పనిచేస్తున్న రైతులు ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులను రక్షించారు. జాతీయ, 108 అంబులెన్స్‌ల్లో పలాస ప్రభుత్వ ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించారు. ఈ బస్సులో రోజూ 33 మంది పిల్లలు పాఠశాలకు వస్తుంటారు. సోమవారం రాఖీపౌర్ణమి కావడంతో బస్సులో 11 మందే ఉన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల్ని ఆదుకోవడంలో సర్కారు విఫలం

అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ముప్పాళ్ల ధ్వజం



సాక్షి, అమరావతి: అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్లక్ష్య తీరును నిరసిస్తూ ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 15 వరకూ చైతన్య యాత్ర నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అగ్రిగోల్డ్ బాధితుల నుంచి సేకరించిన 20 వేల వినతిపత్రాలను సోమవారం సీఐడీ ఏడీజీ సీహెచ్ ద్వారకా తిరుమలరావుకు ఆయన అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. అగ్రిగోల్డ్ సమస్యను పరిష్కరిస్తామని, ఆత్మహత్య చేసుకున్న బాధితుల కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని.. కానీ నెలలు గడుస్తున్నా ఆ దిశగా ముందడుగు పడలేదన్నారు. వేలం జరగకుండా అగ్రిగోల్డ్ యాజమాన్యం అడ్డుపడుతోందని, అవ్వా సీతారామారావును తక్షణమే అరెస్టు చేయాలని సీఐడీ ఏడీజీని కోరినట్టు చెప్పారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు పాల్గొన్నారు.

మహిళా ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే చెవిరెడ్డి రాఖీ కానుక

పార్టీలకు అతీతంగా మహిళలకు నూతన వస్త్రాల బహూకరణ



మహిళా ప్రజా ప్రతినిధులకు చీరలను కానుకగా అందిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి

తిరుపతి రూరల్: చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రాఖీ పండుగ సందర్భంగా తన నియోజకవర్గంలోని మహిళా ప్రజాప్రతినిధులకు నూతన వస్త్రాలు బహూకరించారు. పార్టీలకతీతంగా ఆరు మండలాల్లోని ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు ఆయన చీర, పసుపు, కుంకుమ, స్వీట్లు అందించారు. అంతకు ముందు పలువురు మహిళా ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే చెవి రెడ్డికి రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించారు. తన నియోజకవర్గంలోని అక్క, చెల్లెళ్లు అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి ఆకాంక్షించారు.

రూ.1.91 కోట్ల విలువైన పాత నోట్లు స్వాధీనం

విశాఖలో ముగ్గురి అరెస్టు

అల్లిపురం (విశాఖ దక్షిణం): రద్దయిన పాతనోట్లు కలిగివున్న ముగ్గురు వ్యక్తులను విశాఖ టాస్క్‌ఫోర్సు పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.1.91 కోట్ల విలువైన పాత రూ.500, రూ.1000 నోట్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నగర జాయింట్ పోలీస్ కమిషనర్ దాడి నాగేంద్రకుమార్ వివరాలు వెల్లడించారు. బర్మా క్యాంప్‌కు చెందిన మెడికల్ షాపు యజమాని గెడ్డం కల్యాణ్ కుమార్, గుడ్ల వెంకటరమణ, మాదవధారకు చెందిన కండిబోటి వెంకటరమణ నోట్ల రద్దు సమయంలో 20 శాతం కమీషన్ పద్ధతిలో పాతనోట్లను మార్చేవారు. పాతనోట్ల మార్పిడికి ఆర్బీఐ ఇచ్చిన గడువు పూర్తవడంతో వీరి వద్ద రూ.1.91 కోట్ల విలువైన పాతనోట్లు మిగిలిపోయాయి. వీటిని అక్కయపాలెంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో దాచారు. టాస్క్‌పోర్స్ ఏసీపీ చిట్టిబాబు, సిబ్బంది దాడిచేసి నిందితుల నుంచి ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. సమావేశంలో నగర క్రైం డీసీపీ షెమూషి బాజ్‌పాయ్, ఫోర్త్ టౌన్ సీఐ ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్ల 'ఏకీకృతానికి' మేం వ్యతిరేకం

మున్సిపల్ టీచర్ల ఫెడరేషన్

సాక్షి, అమరావతి: ఏకీకృత సర్వీసు నిబంధనల్లోకి మున్సిపల్ టీచర్లను కలపాలనే ప్రతిపాదనకు తాము వ్యతిరేకమని మున్సిపల్ టీచర్ల ఫెడరేషన్ (ఎంటీఎఫ్) సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ విషయంపై ఫ్యాప్టో, జాక్టోలోని జడ్పీ సంఘాలు ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నాయని ఫెడరేషన్ అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రవి సిద్ధార్థ విమర్శించారు. ఇప్పటికే మున్సిపల్ టీచర్లు అనేక విధాలుగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ టీచర్ల ఏకీకృతానికి నిరసనగా మంగళవారం, బుధవారం (8, 9వ తేదీల్లో) భోజన విరామ సమయంలో 'క్విట్ యూనిఫైడ్ సర్వీసు రూల్సు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఏపీఎస్ఎఫ్‌టీడీసీ చైర్మన్‌గా అంబికా కృష్ణ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫిల్మ్, టీవీ, థియేటర్ల అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీఎస్ఎఫ్‌టీడీసీ) చైర్మన్‌గా పీవీవీపీ కృష్ణారావు (అంబికాకృష్ణ)ను నియమిస్తూ ప్రభుత్వ ఎక్స్ అఫీషియో కార్యదర్శి (ఐ అండ్ పీఆర్) వెంకటేశ్వర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రైతుల సంక్షేమం పట్టని చంద్రబాబు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజం

అనంతపురం అర్బన్: కరువుతో రైతులు అల్లాడుతుంటే సీఎం చంద్రబాబు ఏమాత్రం పట్టించుకోవడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. ఆయనకు నంద్యాల ఉపఎన్నిక తప్పితే మరేమీ కనిపించడం లేదన్నారు. సోమవారం ఆయన అనంతపురంలో జిల్లా కార్యదర్శి డి.జగదీష్‌తో కలసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తోందని, ఈ ఏడాది మరింత దుర్భర పరిస్థితులు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 26 శాతం పంటలు మాత్రమే సాగయ్యాయని తెలిపారు. తుంగభద్రకు నీరు వచ్చే పరిస్థితి కనిపించడం లేదని.. ఈ ఏడాది తాగునీటికి కూడా అవస్థలు తప్పేలా లేవన్నారు. రాష్ట్రంలో గిరిజనులు, దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. గరగపర్రు, దొండపాడు, దేవరపల్లి ఘటనలపై ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ నెల 16న పది వామపక్ష పార్టీల నాయకులు దేవరపల్లి, దొండపాడులో పర్యటించి దళితుల్లో ఆత్మస్థైర్యం నింపనున్నట్లు చెప్పారు. త్వరలోనే కరువు పర్యటన నిర్వహించి ముఖ్యమంత్రికి కనువిప్పు కలిగిస్తామన్నారు.

సికింద్రాబాద్- కాకినాడ మధ్య ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్– కాకినాడ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో ఎం.ఉమాశంకర్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్– కాకినాడ(07075/07076) ప్రత్యేక రైలు ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5.55కి సికింద్రాబాద్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.50కి కాకినాడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 12వ తేదీ సాయంత్రం 7.40కి కాకినాడ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.40కి సికింద్రాబాద్ చేరుకుంటుంది. అలాగే హైదరాబాద్– తిరుపతి(07145/07146) ప్రత్యేక రైలు ఈ నెల 14న రాత్రి 7 గంటలకు నాంపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.10కి తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 15న రాత్రి 7.55కి తిరుపతి నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10గంటలకు నాంపల్లి చేరుకుంటుంది.

సాక్షి
మంగళవారం, ఆగస్టు, 8

పొదుపులకు చేటుకాలం

దేశంలోని అతి పెద్ద బ్యాంకైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హఠాత్తుగా సేవింగ్స్ ఖాతాలపై వడ్డీ రేటులో 50 బేసిస్ పాయింట్ల కోత వేసి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. కోటి రూపాయలకంటే తక్కువ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్లపై వడ్డీ రేటును 4 శాతం నుంచి 3.5 శాతానికి తగ్గించింది. 42 కోట్ల ఖాతాదార్ల పునాదిగల అతి పెద్ద బ్యాంకైన ఎస్‌బీఐని ఇతర వాణిజ్య బ్యాంకులు దిక్సూచిగా పరిగణించడం పరిపాటి. కాబట్టి పలు ఇతర వాణిజ్య బ్యాంకులు కూడా ఇదే బాట పట్టవచ్చని భావిస్తున్నారు. ఎస్‌బీఐ ఖాతాదార్లలో కోటికి పైగా ఉన్న సేవింగ్స్ డిపాజిటర్లు ఎక్కువగా పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, దినసరి కూలీలు వంటి చిన్న పొదుపరులే. వారందరికీ ఇది మింగుడు పడని చేదు వార్తే. ఈ ఖాతాల్లోని రూ. 9 లక్షల కోట్ల డిపాజిట్ల వల్ల ఎస్‌బీఐ నికర వడ్డీ లబ్ధి (ఎన్ఐఎమ్) గణనీయంగా పెరుగుతుంది. పెద్ద నోట్ల రద్దు వల్ల భారీ ఎత్తున డిపాజిట్లు పెరిగాయి కాబట్టి, ద్రవ్యోల్బణం తగ్గి, నిజ వడ్డీ రేటు ఎక్కువగా ఉన్నది కాబట్టి ఈ నిర్ణయాన్ని తీసుకున్నామని ఎస్‌బీఐ తన చర్యను సమర్థించుకుంది. 2011లో సేవింగ్స్ ఖాతాల వడ్డీ రేటుపై నియంత్రణను ఎత్తివేసినప్పటి నుంచి సూత్ర రీత్యా ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు ఆ స్వేచ్ఛ లభించిన మాట నిజమే. కానీ, వాణిజ్య బ్యాంకుల మధ్య పోటీ వల్ల చిన్న పొదుపుదార్లకు ఎక్కువ వడ్డీ రేట్లు లభించే అవకాశాన్ని కల్పించాలనే ఆ స్వేచ్ఛను కల్పించించారు. ద్రవ్యోల్బణం తగ్గడం వల్ల నిజ వడ్డీ రేట్లు పెరిగితే అది చిన్న పొదుపరులకు మేలు చేయాలనే లక్ష్యానికి తోడ్పడేదే తప్ప, అవాంఛనీయమైనది కాదు. కానీ ఎస్‌బీఐ నిర్ణయం, నియంత్రణ ఎత్తివేత అసలు లక్ష్యానికే విరుద్ధమైనది, చిన్న పొదుపరుల ప్రయోజనాలను దెబ్బతీసేది. అది దీర్ఘ కాలంలో మొత్తం పొదుపును తగ్గించి ఆర్థిక వ్యవస్థపైన, పొదుపులను బ్యాంకింగ్ రంగానికి దూరంగా మరల్చి బ్యాంకులపైన ప్రతికూల ప్రభావాన్ని నెరపుతుంది. సేవింగ్స్ వడ్డీ రేటు తగ్గింపు వల్ల ఆ ఖాతాల్లో నిరుపయోగంగా ఉన్న నిధులను ఖాతాదార్లు మ్యూచ్యువల్ ఫండ్స్‌వంటి లాభదాయక ద్రవ్య సాధనాల రూపంలోకి మళ్లిస్తారని, అది వారికి, ఆర్థిక వృద్ధికి మేలు చేస్తుందని మరో సమర్థన కూడా వినవస్తోంది. విద్యావంతులలో సైతం ద్రవ్య మార్కెట్ అక్షరాస్యత అంతంత మాత్రంగా ఉన్న మన దేశంలో, ఈ చిన్న పొదుపుల క్యాపిటలైజేషన్ పగటి కలే. నష్టభయంలేని జాతీయ పొదుపు పత్రాలు, కిసాన్ వికాస్ పత్ర, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, ఫిక్సెడ్ డిపాజిట్ల వంటి ప్రత్యామ్నాయాలపై వడ్డీ రేట్లను ఇప్పటికే తగ్గించారు. కాబట్టి చిన్న మదుపరులు ఈ కోతకు తలూపడం తప్ప గత్యంతరం ఉండకపోవచ్చు. పైగా ప్రస్తుతం ద్రవ్యోల్బణం ఊహించిన దానికన్నా తక్కువగా ఉన్నా, 2018 నాటికి 4 శాతం పైకి చేరుతుందని ఆర్‌బీఐ స్వయంగా చెబుతోంది. కాగా, ద్రవ్యోల్బణం తిరిగి రెక్కలు చాచక తప్పదని కొందరు ఆర్థిక నిపుణులు చేస్తున్న హెచ్చరికనూ తోసి పారేయలేం. అదే జరిగితే 3.5 శాతం వడ్డీ సైతం మటు మాయమై పోతుంది.

అల్ప వడ్డీ రేట్లు ఆర్థిక వృద్ధికి సోపానాలనేదే యూపీఏ నుంచి నేటి ఎన్‌డీఏ వరకు ఆర్థిక మంత్రులందరి మాట. ఆగస్టు 2న ఆర్‌బీఐ, రెపో రేటును 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. మరింత వడ్డీ కోతను ఆశిస్తూ ఆర్థిక మంత్రి జైట్లీ తాజాగా 'ద్రవ్యోల్బణం చాలా కాలంగా అదుపులో ఉంది. ఇప్పట్లో చమురు ధరలు తిరిగి ఆకాశాన్ని చేరే అవకాశం లేదు. కాబట్టి ఏ ఆర్థిక మంత్రి అయినా వడ్డీ రేట్లు కోతను ఆశిస్తాడు' అన్నారు. వడ్డీ రేట్లను నియంత్రించే ద్రవ్య విధాన కమిటీ (ఎమ్ఎన్‌సీ) సోమవారం సమావేశంలో ఆ కోత తప్పిపోయిందిగానీ, అక్టోబర్లో తప్పదని వినవస్తోంది. అందువల్లనే వడ్డీ రేట్లు మరింత తగ్గే అకాశం ఉన్నదనే సహేతుకమైన ఆందోళన చిన్న మదుపర్లను బెంబేలెత్తిస్తోంది. తక్కువ వడ్డీరేట్లు పొదుపరులు, పెన్షనర్లపై అదనపు పన్ను విధింపులా పనిచేసి, వారి అదాయాలకు కత్తెర వేస్తాయి. మరోలా చెప్పాలంటే పెద్ద వయస్కుల ఆదాయాలను తగ్గించడం ద్వారా సాపేక్షికంగా యువ పౌరులకు తక్కువ వడ్డీలకు రుణాలను అందజేస్తాయి. అయినా, వస్తు వినియోగం, డిమాండు పెరిగి ఉత్పత్తికి, వృద్ధికి ప్రోత్సాహం లభిస్తుందని మన విధానకర్తల సిద్ధాంతం. రెండు చేదు వాస్తవాలు దీన్ని ఆచరణకు కొరగానిదని తేల్చాయి. నేటి ప్రపంచ మాంద్య పరిస్థితుల్లో మన ఆర్థిక వ్యవస్థలో వడ్డీ రేట్ల తగ్గింపు ప్రభావం ఉత్పాదక మదుపులను గణనీయంగా పెంచడానికి బదులు నిల్వ ఉన్న సరుకుల గుట్టలను వదిలించుకోడానికే చాలా వరకు పరిమితం అవుతోంది. రెండవది, కొత్త మదుపులు ఉద్యోగాలు లేని వృద్ధికి మాత్రమే దోహదం చేస్తున్నది. అయినా తక్కువ వడ్డీ రేట్ల సిద్ధాంతాన్నే నమ్ముకుని ఆర్‌బీఐ 2015 నుంచి ఇంతవరకు మొత్తం 175 శాతం బేసిస్ పాయింట్ల మేర వడ్డీ రేటును తగ్గించింది. ఈ తగ్గింపు గణనీయమైనదే. కానీ పారిశ్రామిక వృద్ధి చెప్పుకోదగినంతగా పుంజుకోకపోగా, జీడీపీలో వస్తుతయారీ రంగం వాటా 16 శాతం వద్ద ఈడిగిల పడి ఉంది. కార్పొరేట్ బ్యాంకు రుణాల్లో పెరుగుదల ఆశించినంతగా లేదంటే.. అందుకు కారణం వడ్డీ రేట్లు ఎక్కువగా ఉండటం కాదు, వస్తు డిమాండు తక్కువగా ఉండటమే. ఉపాధి కల్పన, కొనుగోలు శక్తి పెంపుదల వంటి దీర్ఘకాలిక పరిష్కారాలు తప్ప, వడ్డీ రేట్ల చిట్కా పనిచేయదని... 2008 ఆర్థిక మాంద్యం తదుపరి కాలపు అమెరికా తదితర అభివృద్ధిచెందిన దేశాల అనుభవం రుజువు చేసింది. అల్ప వడ్డీ రేట్లతో చిన్న పొదుపరులను, పెన్షనర్లను ఆర్థిక వృద్ధి కోసం త్యాగాలు చేయమనడం సమంజసమే అనుకున్నా, ఈ సిద్ధాంతం ఆచరణలో బెడిసి కొట్టక తప్పదు. అల్ప వడ్డీ రేట్లు పెట్టుబడి మదుపులపై చూపే ప్రభావం సంగతి ఎలా ఉన్నా, తక్కువ వడ్డీకి రుణాలిచ్చి, రుణ ఆధారిత వినియోగంతో స్తోమతకు మించిన జీవనశైలిని అనుభవించేలా చేస్తాయి. దీంతో నేటి యువత రుణ భారంతో కుంగడానికి ఎంతో కాలం పట్టదు. ఎలాగో నెట్టుకు వచ్చినా, వయోభారంతో పాటూ రుణ భారాన్ని మోస్తూ వృద్ధాప్యంలోకి ప్రవేశించాల్సి వస్తుంది. ఎలాంటి సామాజిక సంక్షేమ రక్షణ లేని మన దేశంలో ఇది ఎలాంటి దుస్థితో చెప్పనవసరం లేదు. అయినా వడ్డీ రేట్ల తగ్గింపు మంత్రం పఠిస్తూనే ఉందామా?



ద్రవ్య విధానం దీర్ఘకాలిక వృద్ధికి పెద్దగా దోహదపడదు. డిమాండు కొరవడి మాంద్యం నెలకొన్న కాలంలో పరిస్థితిని చక్కబరచడానికి అది కొంత తోడ్పడుతుంది.

– బెన్ బెర్నాంకె
అమెరికన్ ఆర్థిక శాస్త్రవేత్త

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, తిథి బ.పాడ్యమి రా.11.39 వరకు, తదుపరి విదియ నక్షత్రం ధనిష్ఠ తె.5.13 వరకు (తెల్లవారితే బుధవారం), వర్జ్యం ఉ.8.10 నుంచి 9.51 వరకు, దుర్ముహూర్తం ఉ.8.17 నుంచి 9.07 వరకు, తదుపరి రా.10.58 నుంచి 11.43 వరకు, అమృతఘడియలు సా.6.15 నుంచి 7.55 వరకు.


సూర్యోదయం : 5.44
సూర్యాస్తమయం : 6.28
రాహుకాలం : ప 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

నమాజ్ వేళలు



ఫజర్ : 4.41
జొహర్ : 12.22
అసర్ : 4.49
మగ్రీబ్ : 6.46
ఇషా : 8.03

హేతువే ఆయన ఆయుధం!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

భారతదేశంలో విజ్ఞాన శాస్త్ర పరిశోధనా సంస్థ ఏర్పాట్లు, దాని నిర్వహణ ఎంత లోపభూయిష్టంగా ఉన్నాయో 'స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో సైన్స్ గాథ' ('ది శాగా ఆఫ్ ఇండియన్ సైన్స్ సిన్స్ ఇండిపెండెన్స్') అన్న గ్రంథంలో భార్గవ చర్చించారు. కృత్రిమ జన్యు కణాల ద్వారా మార్పిడి చేసి ఉత్పత్తి చేసిన పంటలవల్ల ప్రజా బాహుళ్యం ఆరోగ్యానికి ఎంత హానికరమో కూడా భార్గవ అనేక సదస్సులలో, రైతుల సభలలో హెచ్చరించిన సంగతి మరచిపోరాదు.


''హిందువులను దెబ్బ తీసిన మూఢ విశ్వాసాలలో జ్యోతిష్యం ఒకటి. జ్యోతిష్యానికి పునాదులు ఇండియాలో పడలేదు. హిందువులకు జ్యోతిష్యాన్ని గ్రీకులు అంటగట్టగా, ప్రతిఫలంగా హిందువుల తమ విజ్ఞాన శాస్త్రం ఖగోళ శాస్త్రాన్ని గ్రీకులకు అప్పగించి కూర్చున్నారు. ఇది అపోహల మీద ఆధారపడిన అశాస్త్రీయ పరిజ్ఞానం''

– స్వామి వివేకానంద

''ఒక కళగా మాత్రమే జ్యోతిష్యాన్ని నేను పరిగణిస్తాను. ఆ మేరకు దాని పట్ల ద్వేషం లేదు. కానీ జ్యోతిష్యాన్ని ఒక విజ్ఞాన శాస్త్రంగా ముద్ర వేయించుకో చూస్తే దాన్ని నిలువెల్లా నిరాకరిస్తా!''

– డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం

రెండో మాట



జీవకణ, పరమాణు జీవశాస్త్రాల అధ్యయన సంస్థ (సీసీఎంబీ, హైదరాబాద్) వ్యవస్థాపక సంచాలకులాయన. పదమూడేళ్ల పాటు పరిశోధనలకు అంకితమయ్యారు. రసాయనిక శాస్త్రవేత్తగా, కణ భౌతికశాస్త్రవేత్తగా సేవలందిం చారు. కేంద్రీయ శాస్త్ర ప్రయోగాలలో పారిశ్రామిక వినియోగానికి ఉపకరించే పరిశోధనా కేంద్రాలలో పనిచేసినవారు. ఆయన– పద్మభూషణ్, డాక్టర్ పుష్పమిత్ర భార్గవ (ఫిబ్రవరి 22, 1928–ఆగస్టు 1, 2017). అంతే కాదు, తనువెల్లా సామాజిక స్ఫూర్తిని ప్రజ్వలింప చేసుకుని హేతువాద ఉద్యమాలకు ఇంతకాలం ఊతకర్రగా నిలిచిన వారాయన. ప్రజా బాహుళ్యంలో సదా చైతన్యదీపాలు వెలిగించిన వ్యక్తి కూడా.

శాస్త్ర, చైతన్యాల సమ్మేళనం

డాక్టర్ భార్గవ, ఆయన సామాజిక చైతన్యం గురించి ఒక్క ఉదంతంతో చెప్పవచ్చు. విజ్ఞాన శాస్త్ర విభాగాలలో వైదిక జ్యోతిష్యాన్ని కూడా భాగం చేయాలని కొద్ది సంవత్సరాల క్రితం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిర్ణయించినప్పుడు ఆ ఉదంతం జరిగింది. వైదిక జ్యోతిష్యాన్ని విశ్వవిద్యాలయాలలో ప్రవేశపెట్టాలన్న ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తూ డాక్టర్ భార్గవ వెంటనే ఒక ప్రకటన విడుదల చేశారు. ఇలాంటి ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరింప చేయాలనీ, శరవేగాన విస్తరిస్తున్న వైజ్ఞానిక ప్రగతికీ, భారతీయ విద్యా వ్యవస్థలో శాస్త్రీయ ధోరణులకు అడ్డుకట్ట వేసే ప్రయత్నాలను ఆపాలనీ డాక్టర్ భార్గవ విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, యూజీసీ చర్య రాజ్యాంగ విరుద్ధమనీ, శాస్త్రీయ దృష్టిని ఎదగనివ్వకుండా నిరోధించే ధోరణి అని పేర్కొంటూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో రిట్ పిటిషన్ కూడా దాఖలు చేశారు. పైన ఉదహరించినట్టు వివేకానంద, అబ్దుల్ కలాంలు జ్యోతిష్యం గురించి వెలిబుచ్చిన అభిప్రాయాలకూ, ఒక శాస్త్రవేత్తగా భార్గవ వాంగ్మూలానికీ ఎంత సాన్నిహిత్యం ఉన్నదో గమనించవచ్చు.

హేతువాద ప్రస్థానం

ప్రాచీన ప్రపంచంలోని మహా శాస్త్రవేత్తలు యూక్లిడ్, ఆర్కిమెడిస్, హిప్పార్కస్, క్లాడిస్, టోలమీలతో పాటు, మన దేశానికి చెందిన ఆర్యభట్టు (శూన్య రాశి– జీరోను కనిపెట్టిన మహనీయుడు), భాస్కర, లల్లాచార్యులు వంటి వారంతా సామాజిక దృష్టి, హేతువాదం ఆధారంగానే శాస్త్ర ప్రగతికి దోహదం చేశారు. మధ్య యుగాల నాటి అరబ్ శాస్త్రవేత్తలు అల్ ఖవారిజ్మీ, ఇబెన్ సీనా, అల్ బిరూనీ వంటి మానవ ప్రగతిశీల మార్గాన్ని సునిశితం చేయడానికి దోహదపడ్డారు. ఆధునిక యుగపు తొలి తరం మహాశాస్త్రవేత్తలలో లియోనార్డో డావిన్సీ, నికలస్ కోపర్నికస్, ఆంద్రియస్ వెసాలియస్ (శరీర ధర్మశాస్త్ర పితామహులలో ఒకరు), కాథలిక్ చర్చి మూఢ విశ్వాసాలతో సంఘర్షించి, పాలక వర్గ దౌర్జన్యాలను ఎదిరించి నిలదొక్కుకున్న గెలీలియో ప్రభృతులు ప్రజానీకం ముందు కొత్త ఉషస్సులను ఆవిష్కరించారు. డార్విన్ పరిణామవాదం మూఢమతులకు చెమటలు పట్టించింది. ఇలా ఎందరో! అలాంటి కోవకు చెందిన వారే మన భార్గవ కూడా. జీవకణాల స్వరూప స్వభావాలను నిగ్గు తేల్చడంతో పాటు వంశ పారంపర్య లక్షణాలను జల్లెడ పట్టే పరిశోధనలలో కూడా దిట్ట అనిపించుకున్నారాయన. ఆయన సాగించిన విస్తృత పరిశోధనలలో కేన్సర్ వ్యాధి మీద పరిశోధన కూడా భాగమే. పరిశోధన కృషికి స్వస్తి పలికిన తరువాత సామాజిక సమస్యల మీద డాక్టర్ భార్గవ తన దృష్టిని కేంద్రీకరించారు. 'నవీన విశ్వవిద్యాలయాలలో పురాణ కవిత్వాలు' చాలించమని శ్రీశ్రీ బోధించినట్టే, జ్యోతిష్యాన్ని ప్రవేశపెట్టి యువత కళ్లను మూఢ విశ్వాసాలతో పొడవవద్దని హితవు పలికినవారు డాక్టర్ భార్గవ. విద్యావేత్తగా, పరిశోధకునిగా తాను సాధించిన అనుభవాన్ని ఆ వ్యాజ్యంలో న్యాయవాదులకు సలహాలు అందించడానికి ఉపయోగించుకున్నారు. సమాజంలో మౌఢ్యం బీజాలు ఉన్నంత వరకు కూడా వైజ్ఞానిక దృష్టిని అలవరుచుకోవడానికీ, మానవుడి పుట్టుపూర్వోత్తరాలను తెలుసుకోవడానికీ, ఆ క్రమంలో జరిగిన సామాజిక పరిణామం మీద అవగాహనకు రావడానికీ దానికి సాధ్యం కాదని భావించిన దార్శనికులలో ఒకరు భార్గవ.

ఇలాంటి భావన ఎంత వాస్తవికమో క్రీస్తుపూర్వం 300 నాడే గ్రీక్ శాస్త్రవేత్త యూక్లిడ్ వివరించాడు. అది ఆయన మాటల్లోనే: 'ప్రపంచంలో తారసిల్లే ఘటనలన్నింటి పూర్వాపరాలను కనిపెట్టడం, అర్థం చేసుకోవడం ఎలా? దేవుళ్లకు మొరపెట్టుకోవడంతోనూ, పదే పదే ప్రార్థనలు చేయడం వల్లనూ ప్రకృతి పరిణామాల తబిశీళ్లు అర్థం కావు– హేతువాద దృష్టితోనూ, కార్యకారణ సంబంధం గుట్టుమట్టులు తెలుసుకోవడం ద్వారానూ మాత్రమే ప్రకృతి, మానవ పరిణామ క్రమాలను అర్థం చేసుకోగలుగుతాం. అందుకు చేయ వలసిన పని– సమస్యను తర్కించాలి. గుడ్డి నమ్మకంతో ప్రచారం అసలే చేయకూడదు. తర్కం కోసం నిలబడినందుకే ప్రాచీన భారతదేశంలో చార్వాకులు, లోకాయతులు, సాంఖ్యులు, కపిల కణాది వర్గాలను నాస్తికులుగా ముద్రవేశారు.

పద్మభూషణ్ బిరుదును త్యజించారు

భారతదేశంలో విజ్ఞాన శాస్త్ర పరిశోధనా సంస్థ ఏర్పాట్లు, దాని నిర్వహణ ఎంత లోపభూయిష్టంగా ఉన్నాయో 'స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో సైన్స్ గాథ' ('ది శాగా ఆఫ్ ఇండియన్ సైన్స్ సిన్స్ ఇండిపెండెన్స్') అన్న గ్రంథంలో భార్గవ చర్చించారు. కృత్రిమ జన్యు కణాల ద్వారా మార్పిడి చేసి ఉత్పత్తి చేసిన పంటలవల్ల ప్రజా బాహుళ్యం ఆరోగ్యానికి ఎంత హానికరమో కూడా భార్గవ అనేక సదస్సులలో, రైతుల సభలలో హెచ్చరించిన సంగతి మరచిపోరాదు. అంతేగాదు, సంతానం లేని సంసారాలకు పిల్లల్నికని ఇచ్చే తల్లుల ఆరోగ్య పరిస్థితుల గురించి కూడా ఆయన శ్రద్ధవహించి 'రిప్రొడక్టివ్ టెక్నాలజీ రెగ్యులేషన్‌'కు కేంద్రం చట్టం చేయడానికి భార్గవ కారకుడు (2013లో). చివరికి 'అద్దెగర్భాల' విషయంలో 'సరోగసీ (నియంత్రణ) బిల్లు' ముసాయిదాను కేంద్రంచే ఆమోదింప చేసిన ఘనత కూడా భార్గవదే. ప్రజలకు రాజ్యాంగం హామీపడిన భావప్రకటనా స్వేచ్ఛకు, సమావేశ స్వాతంత్ర్యానికి, సమాచార హక్కుకూ వివిధ రూపాల్లో బాహాటంగానూ, నర్మగర్భంగానూ కత్తెర వేసే ప్రజా వ్యతిరేక సంస్కృతికి దారులు వేస్తూ పోవడానికి పాలకులు అలవాటు పడుతున్నారు. చివరికి వివిధ కుల, మత, వర్గ సంస్కృతులతో విలసిల్లే భారత భూమిని చీలుబాటలు పట్టించే విధంగా కొందరు మూఢ మతులు– ప్రజల ఆహారపు అలవాట్లపైన, ప్రాచీన, ఆధునిక వస్త్రధారణపైన, మతాంతర, కులాంతర వివాహాలపైన– ఇంతకు ముందెన్నడూ లేని స్థాయిలో దాడులు జరుగుతున్నాయి. వీటన్నింటినీ గమనించారు డాక్టర్ భార్గవ. హేతువాద నాయకులనీ, అన్య మతస్తులనీ మాటు వేసి హత్య చేసినందుకు తీవ్ర నిరసనను వ్యక్తం చేస్తూ దేశంలోని అనేకమంది రచయితలు, కవులు, కళాకారులు, శాస్త్రవేత్తలతోపాటు తన 'పద్మభూషణ్' వగైరా కేంద్ర బిరుద బీరాలను అవతల పారేసి వచ్చినవారు డాక్టర్ భార్గవ. జ్యోతిష్యాన్ని పాఠ్యాంశంగా పెట్టాలన్న యోచన మౌఢ్యంతో కూడినదనీ, శాస్త్రీయ దృష్టిని చంపివేస్తుందనీ భార్గవ హైకోర్టుకు విన్నవించారు. దీనిపైన నాటి రాష్ట్ర హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అల్లాడి కుప్పుస్వామి, ''ప్రభుత్వ నిధులతో నడుస్తున్న విద్యా సంస్థల్లో మతపరమైన బోధ నిషిద్ధమని, తద్వారా రాజ్యాంగంలోని 28(1)వ అధికరణను యూజీసీ ఉల్లంఘించిందనీ, చివరికి యూజీసీ చట్టంలోని 12వ సెక్షన్ (బి)కే విరుద్ధమనీ' పేర్కొంటూ భార్గవకు తోడుగా నిలిచారు. చివరికి ప్రజలలో అన్ని స్థాయిల్లోనూ శాస్త్రీయ దృక్పథాన్ని, భావజాలాన్ని పెంచాలన్న 51(ఎ)వ రాజ్యాంగ అధికరణను కూడా నేడు పాలకవర్గాలు సర్వత్రా ఉల్లంఘిస్తున్నాయని గమనించాలి. మనం ఏ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నామని భావిస్తున్నామో, ప్రేమిస్తున్నామో లేదా భ్రమపడుతున్నామో ఆ ప్రజాస్వామ్య వ్యవస్థ సహితం నేటి పాలనా రథచక్రాల కింద కూడా పడి ప్రాణవాయువు కోసం ఎదురుతెన్నులు చూస్తోందా? ఈ సందర్భంగా 'మానవుడు తన భవిష్యత్తుకు తానే నిర్మాతగానీ మరొకరు కార'ని బోధించిన స్వామి వివేకానంద ('మాన్ ఈజ్‌ది మేకర్ ఆఫ్ హిజ్ డెస్టినీ') జ్యోతిష్యం గురించి చెప్పిన ఒక ఆసక్తికరమైన కథ గుర్తు చేసుకోవాలి.

వెనకటికో రాజున్నాడు. అతని దగ్గరికి ఓనాడు ఓ జ్యోతిష్కుడొచ్చి, 'మీరు ఆరునెలల్లోనే చచ్చిపోతారు అని. రాజు భీతిల్లిపోయాడు. కానీ మంత్రి తెలివైనవాడు. అయ్యా! ఈ జ్యోతిష్కులు బుద్ధిలేనివాళ్లు అని అన్నాడు. అయినా రాజు నమ్మలేదు. ఇంతకూ మీ జ్యోతిష్యం నిజమేనా? అని ప్రశ్నించాడు మంత్రి. తప్పుండదానికే వీల్లేదన్నాడు జ్యోతిష్కుడు. 'ఇంతకూ మీరెప్పుడు చచ్చిపోతారో చెప్పగలరా?'అని అడిగాడు మంత్రి మళ్లీ. దానికి జ్యోతిష్కుడు నేను పన్నెండేళ్లలో పరలోకానికి చేరుకుంటాను అన్నాడు. వెంటనే మంత్రి కత్తిదూసి జ్యోతిష్కుడి తలను నరికేసి రాజుగారితో అన్నాడు: 'రాజా! చూశారా.. వీడొట్టి అబద్ధాలకోరు, పన్నెండేళ్లు కాదు, ఈ క్షణంలోనే చచ్చాడు!'వివేకానందుడి పాఠం మన వివేకానికి ఇప్పటికీ, ఎప్పటికీ అగ్నిపరీక్షే!!

abkprasad2006@yahoo.co.in

అజాత శత్రువు ఆగ్రహిస్తే...

భారతంలో ధర్మరాజుకు కలిగిన ధర్మాగ్రహమే నంద్యాల సభలో ప్రతిపక్షనేతకు వచ్చి ఉంటుంది. వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలను డబ్బుల వాసన చూపించి తన గుంజకు కట్టేసుకున్న బాబు అల్ప వ్యక్తిత్వాన్ని చూసి జగన్‌కు ఆగ్రహం కలిగి ఉంటుంది.



సామాన్య కిరణ్

వైఎస్. రాజశేఖరరెడ్డి మరణానంతర కాలంలో ఒక నెల్లూరు నాయకుడు ''జగన్‌ని ఉరివేయాలి'' అని అన్నాడు ఒక సందర్భంలో. నెల్లూరు వాసిని కనుక వైఎస్సార్ తన హయాంలో అతనికి ఎంత మంచి భవిష్యత్తు ఇచ్చారో చూసిన దానిని కనుక, ఆయన చేసిన ఆ వ్యాఖ్య నన్ను దిగ్భ్రమకు గురి చేసింది. మనుషుల మీద, మానవత్వం మీద నాకప్పుడు చాలా ప్రశ్నలు పుట్టుకొచ్చాయి. ఇప్పుడు కూడా ఆ మాట గుర్తుకు వస్తే నాకు ఒకలాంటి దిగులు కలుగుతుంది. వైఎస్ జగన్ మీద పలువురు పలురకాలుగా వాక్ పారుష్యాన్ని ప్రదర్శించారు. తనను దూషించిన వారిని తిరిగి తిట్టడం జగన్‌కి చేతనవుతుంది కదా. కానీ, జగన్ ఒక్కటంటే ఒక్కసారి కూడా ఎవరినైనా తిరిగి పరుషంగా మాట్లాడటం, సంస్కారపు హద్దులు దాటటం నేను చూడలేదు.

అధికారంలోని పార్టీ, ఆయా వ్యక్తులు గతంలో ఏ నాయకుడిపైనా చేయనంత స్థాయిలో జగన్‌పై పెద్ద ఎత్తున మాటల దాడి చేసున్నారు. ఇక్కడ నాకు కొన్ని విషయాలు చాలా స్పష్టంగా కనిపించాయి. మొదటిది అనితర సాధ్యమైన ఆయన నాయకత్వ లక్షణం. తరువాత 'మాటలను అదుపులో పెట్టుకుని ఇతరుల మతాన్ని గౌరవించడం ద్వారా తమ మతాన్ని, మత పలుకుబడిని పెంచుకోవాలి' అని తన ధమ్మం ప్రకటించిన అశోకుని తరహా కార్యాచరణ, పట్టుదల, సత్వర నిర్ణయాలు తీసుకోగల చురుకుదనం, చొరవ, దగ్గరికి వెళ్లాలనిపించే ఆత్మీయత. ఎన్టీఆర్, వైఎస్సార్ తరువాత ''ఎవ్వని చారిత్రమెల్ల లోకములకు నొజ్జయై'' నిలుస్తుందో అని భారతంలో చెప్పినట్లు, ఆంధ్ర దేశ చరిత్రలో గొప్పగా నిలువగల వ్యక్తిత్వం ఉన్న ''ధీరోదాత్త నాయకుడు'' జగన్. తన వ్యక్తిత్వానికి సంబంధించిన ఈ లక్షణాలను పాలక పక్షాలు, వారి కొమ్ముకాస్తున్న పత్రికలూ, చివరికి గమనగమ్య స్పష్టత లేని పవన్ కల్యాణ్ లాంటి చిన్న స్థాయి నాయకులతో సహా, అందరూ గుర్తుపట్టారు. అందుకే జగన్ అనే ఒక్క వ్యక్తిపై వారందరూ గుంపుగా కూడి యుద్ధం చేస్తున్నారు.

''అలుగుటయే యెరుంగని మహామహితాత్ముడు అజాత శత్రువే అలిగిన నాడు సాగరములన్నియు ఏకము కాకపోవు ఈ కర్ణులు పదివేవురైన చత్తురు రాజరాజ నా పలుకులు ఆలకింపుము'' అంటాడు రాయబారం కోసం వెళ్లిన కృష్ణుడు. గట్టిగా ఎవరినీ ఒక మాట అనని శాంతమూర్తి ధర్మరాజుకి కోపం వస్తే సముద్రాలన్నీ పొంగి ఏకమౌతాయట. బహుశా నంద్యాల సభలో ప్రతిపక్ష నేతకు అలాంటి కోపమే వచ్చి ఉంటుంది. ద్రౌపదిని మోసపు జూదంలో గెలిచారనీ, ఆమె 'అన్యాయ విజిత' అన్నాడు వికర్ణుడు. వారిని వీరిని వూతం చేసుకుని అబద్ధపు వాగ్దానాలిచ్చి చావుతప్పి గెలిచిన బాబు గెలుపు కూడా అన్యాయ విజితమే. అది చాలక జగన్ జనాకర్షణను వాడుకుని ఎమ్మెల్యేలుగా గెలిచిన వాళ్లని, డబ్బుల వాసన చూపించి తన పార్టీ గుంజకు కట్టేసుకున్న బాబు అల్ప వ్యక్తిత్వాన్ని చూసి చూసి జగన్‌కు ఆగ్రహం కలిగి ఉంటుంది. భీముడు కురుసభలో ద్రౌపదికి జరిగిన అవమానానికి క్రుద్ధుడై లేచి

ఆలోచనం



దుర్యోధనుడి తొడలు యుద్ధ రంగంలో తన గదతో పగల కొట్టి తీరుతానని, అతని వక్షస్థలాన్ని చీల్చి రక్తాన్ని తాగుతానని అంటాడు. అడ్డూ ఆపూ లేకుండా బాబు చేస్తున్న అన్యాయాల్ని చూశాక జగన్‌కి కూడా భీమ కోపం వచ్చి ఉంటుంది. ఆ ఆగ్రహం వెనుక న్యాయం ఉందని నమ్మి, దానిపేరు ''ధర్మాగ్రహం'' అని గౌరవిస్తున్నది తరతరాలుగా ఈ మానవ సమాజం.

తమిళ సాహిత్యంలో గొప్ప ఇతిహాసం శిలప్పదికారం. ఇతిహాస నాయిక కణ్ణగి. తన భర్తను అన్యాయంగా దొంగ అని నిందవేసి చంపిన రాజు పట్టణాన్ని మంటలు రేపి బూడిద చేస్తుంది కణ్ణగి. మహాభారతంలో ''రక్కెస తాల్మితో, చిచ్చోడినగట్టినట్లు'' అవమానాన్ని మోసుకు తిరుగుతున్నానని చెప్పిన ద్రౌపదితో ''కౌరవుల భార్యల ఏడుపు చూసి నీవు కల కల నవ్వే రోజులు దగ్గరున్నాయ్'' అంటాడు కృష్ణుడు. 'నీవుండే హైద్రాబాదు, దాని పడమట గోలుకొండ, గోలుకొండ ఖిల్లా కింద, నీ ఘోరీ కడతం కొడుకో, నైజాం సర్కరోడా' అని నైజాం సర్కారుని హెచ్చరించారు ప్రజలు, వారి కోపం పేరు కూడా ధర్మాగ్రహమే.

'అన్యాయమే చట్టమైనప్పుడు, తిరుగుబాటే విద్యుక్త ధర్మం అవుతుంది' అన్నాడు థామస్ జెఫర్సన్. యుద్ధం చేయాలా వద్దా అని తర్కించుకుంటున్న ధర్మరాజును వెళ్లి కాషాయం కట్టుకో అంటుంది ద్రౌపది. రావాల్సినపుడు కోపం రావాలి. కవి ఎన్.గోపి అన్నట్లు 'కోపాన్ని ప్రదర్శించలేనివాడు, లోకాన్ని మార్చలేడు'. అలా నంద్యాలలో జగన్‌కి వచ్చిన కోపం రావాల్సిన సమయంలో వచ్చిన ధర్మాగ్రహం. ధర్మాగ్రహం ఎప్పుడూ విజయాన్నే సాధించింది. ఎవరెన్ని మాట్లాడినా, ఎంత అడ్డుపడినా ధర్మాగ్రహం గెలిచే తీరిందని చరిత్ర చెబుతుంది. చరిత్ర, మోసంతో రాజ్యం కోల్పోయి కష్టించి గెలిచిన నల మహారాజుని, ధర్మంకోసం కాటి కాపరి అయిన సత్యహరిశ్చంద్రుడిని, అన్యాయానికి ఓర్చి గెలిచిన పాండవులను, అరణ్యవాసానికోర్చి రామ రాజ్యాన్ని స్థాపించిన రాముడిని దేవుళ్లను చేసింది. ప్రజలు వారు కష్టాలకు ఓర్చిన విధానం చూసి కథలకు నాయకులను చేసి కీర్తించి పూజిస్తున్నారు. వెయ్యి అబద్ధాలతో రాజ్యాలేలిన వాళ్లు కాలగర్భంలో కొట్టుకు పోయారు.


ప్రజాస్వామ్యమైనా ఇది ప్రచ్ఛన్న రణరంగం. ఈ రణస్థలిలో నిలిచి తన పక్షపు ప్రజల ఆకాంక్షలకు నాయకత్వం వహిస్తున్న జగన్, బాబుపై చేసిన వ్యాఖ్య చాలా చిన్నది. బాబు చేస్తున్న అన్యాయాలకు జగన్ అదే స్థాయిలో జవాబులే ఇస్తే ఇంతకంటే పెద్ద పెద్ద మాటలే వినాల్సి వస్తుంది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత్రి | 91635 69966

గురువుకు అవమానం!

స్కూలుకు రావడం ఏడు నిమిషాలు ఆలస్యమైందని ఒడిశాలో ఒక ఉపాధ్యాయురాలికి ఆరేళ్లు వేతనం నిలిపివేశారు. మన వ్యవస్థలోని నేరాల్లోకెల్లా ఘోర నేరమిది. కానీ ఆమె అసాధారణ నిబ్బరంతో ఆరేళ్లూ పనిచేశారు.

విశ్లేషణ



మహేష్ విజాపృకర్

ఉపాధ్యాయులకు తదుపరి దశ అవార్డులను అందించేటప్పుడు భారత ప్రభుత్వం భిటిప్రవ పటేల్‌ను విస్మరించకూడదు. ఆమె ఒడిశా సందేర్గాహ్ జిల్లాలో పనిచేసే ఉపాధ్యాయిని. ఒడిశా ప్రభుత్వం సిగ్గుపడేలా రెండు పనులు చేసిందామె. అవేమిటంటే, ఆరేళ్లు తనకు రావలసిన వేతనం చెల్లించకపోయినా ఆమె ఏమాత్రం లెక్క చేయలేదు. పైగా ఆరేళ్లుగా పాఠశాలకు హాజరుకావడమే కాకుండా విద్యాబోధనను కొనసాగించింది.

మీడియాలో వచ్చిన వార్తల ప్రకారం, స్కూలును విద్యాశాఖ అధికారి తనిఖీ చేసిన రోజున ఆమె ఏడు నిమిషాలు ఆలస్యంగా వచ్చారట. అందుకని గత ఆరేళ్లుగా ఆమెకు జీతం చెల్లించకుండా శిక్షించారు. ఇది నేరాల్లోకెల్లా ఘోరమైన నేరచర్యగా పరిగణించాల్సిన ఘటన. ఎందుకంటే ఆరేళ్లు వేతనం పొందకుండా ఆమె భారీ మూల్యం చెల్లించింది. మరో మాటలో చెప్పాలంటే ఆమె ఆలస్యంగా వచ్చిన ప్రతి నిమిషానికి ఒక సంవత్సరం పూర్తి వేతనాన్ని తనకు చెల్లించడాన్ని నిరాకరించారు. ఒక నిమిషం లేటుకు మూల్యం సంవత్సరం వేతనంతో సమానం.

విషయం వెలుగులోకి వచ్చాక భిటిప్రవ పటేల్ తనకు రావలసిన బకాయిలను పొందవచ్చు కానీ ఇక్కడా చిక్కు ఉంది. ఒక సంవత్సరం వేతనాన్ని ఆమెకు వెంటనే చెల్లించాలని అధికారులు ఆదేశించారు. కానీ మిగిలిన అయిదేళ్ల జీతం చెల్లింపు కోసం ప్రత్యేక బడ్జెటరీ ఏర్పాటు చేయవలసి ఉంది కనుక ఆమె వేచి ఉండాల్సిందేనట. ఎందుకంటే నిబంధనలు, ప్రభుత్వంలోని గుమాస్తా మనస్తత్వం అలా ఉన్నాయి.

ఆ టీచర్ వేతనాన్ని అలా నిలిపి ఉంచినప్పుడు, అలాంటి శిక్షలను నిబంధనలు అనుమతించవని విద్యాశాఖ అధికారులు గుర్తించలేదు. అసాధారణ మనోనిబ్బరంతో ఆమె ఆ శిక్షను భరించింది. ఇంకా విచిత్రమైన విషయం ఏమిటంటే ఈ శిక్షాకాలంలోనే రెండేళ్ల తర్వాత ఆమెకు ప్రధాన ఉపాధ్యాయురాలిగా పదోన్నతి కల్పించారు. వాస్తవానికి ఆమె పాఠశాలకు ఆలస్యంగా వచ్చినందుకు ఒక రోజు వేతనం ఇవ్వకుండా ఉంటే సరిపోయేది.

ఈ ఘటనకు వెనుక మనం తెలుసుకోలేని పూర్తి భిన్నమైన కథ ఉంటే తప్ప, ఆ ఉపాధ్యాయురాలు తాను చేస్తున్న వృత్తి పట్ల అపార గౌరవాన్ని ప్రదర్శించారనే చెప్పాలి. ఆమె సంపన్నురాలే కావచ్చు. కానీ ఆమె పొందవలసిన వేతనాన్ని ఇంత హీనంగా తొక్కిపెట్టకూడదు. ఈ ఘటనలో నిజంగా శిక్షకు పాత్రులు ఎవరంటే, ఆమె వేతనాన్ని చెల్లించకుండా తొక్కిపెట్టిన వాళ్లే. ఈ ఉదంతంపై చాలా



వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. ఆమె వేతనాన్ని చెల్లించడం మాత్రమే కాదు. ఎవరో ఒకరు ఈ అంశంలో శిక్షకు గురవ్వాల్సిందే.

ఉపాధ్యాయులు, బాలల విద్య అంటే అధికారులకు ఎప్పుడూ చిన్నచూపే. తల్లిదండ్రులు, సమాజం విద్యావ్యవస్థలో చేసిన మార్పులను తెలుసుకోవడం గగనమే. ఒక ప్రభుత్వం తర్వాత మరొక ప్రభుత్వం కాంట్రాక్టు ప్రాతిపదికన నామమాత్రపు జీతాలు చెల్లిస్తూ పారా టీచర్లను నియమిస్తున్నాయి. తమనుంచి జరుగుతున్న ఈ లోపాన్ని దాచిపెట్టడానికి సహాయశిక్షక్, శిక్షామిత్ర వంటి పెద్ద పెద్ద పేర్లను ఉపయోగిస్తుంటారు. వీరు పార్ట్ టైమ్ టీచర్లు కాదు. చాలా తక్కువ వేతనాలకు పనిచేసే టీచర్లన్నమాట.

సాధారణ వేతనాలను చెల్లించలేని ప్రభుత్వాలు ఉపాధ్యాయుల ఉపాధి అవసరాన్నే కొల్లగొడుతున్నాయి. విద్యారంగాన్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురి చేస్తే మానవవనరులకు సంబంధించి కలిగే ఫలితాలు పరమ విషాదకరంగా ఉంటాయి. దీని తొలి పర్యవసానం ఏమిటంటే తల్లిదండ్రులు ప్రైవేట్ స్కూళ్లనే ఎంచుకుంటారు.

ప్రైవేట్ పాఠశాలలు రాష్ట్ర పర్యవేక్షణలోనే ఉండవచ్చు కానీ వారికి చెల్లిస్తున్న వేతనాలు సిఫార్సు చేసిన రీతిలో ఉండకపోవచ్చు. ప్రైవేట్ స్కూళ్లు కాబట్టి అవి మెరుగైన స్థితిలో ఉంటాయని అర్థం చేసుకోవలసిన అవసరం లేదు. వీటికి వస్తున్న అధిక ఫీజులు మెరుగైన వేతనాలను అందించకపోవచ్చు. ఎందుకంటే ప్రైవేట్ పాఠశాలలు ఇప్పుడు పూర్తి వ్యాపార దృక్పథంతో నడుస్తున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం లేదా పారా–ప్రభుత్వ సంస్థల ద్వారా నియమితం కాకుండా, మన దేశంలో ఆరవ పే కమిషన్ సిఫార్సుకు సమానంగా ఉపాధ్యాయులందరూ వేతనాలు పొందుతారని భావించడం కూడా తప్పే. కొంతమంది ఎంతో కొంత వేతనం కల్పించి తమను ఉద్యోగాల్లోకి తీసుకున్నందుకే గొప్పగా ఫీలవుతుంటారు. కానీ విద్యా లక్ష్యానికి ఇదేమాత్రం మంచిది కాదు. ప్రత్యేకించి పాఠశాల విద్యలో 12 సంవత్సరాలు గడిపిన తర్వాత కూడా మెడికల్ లేదా ఇంజనీరింగ్ కోర్సులో ప్రవేశాల కోసం మెరుగైన గ్రేడ్ పొందడానికి విద్యార్థులు అత్యధిక ఫీజులు చెల్లించి మళ్లీ ట్యుటోరియల్‌కు వెళ్లవలసి వస్తోంది. వీటన్నింటినీ పక్కన బెట్టి చూస్తే, ఒడిశా టీచర్ భిటిప్రవ పటేల్ ఉదంతం మన వ్యవస్థ సిగ్గుతో తలవంచుకునేలా చేసింది.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు
ఈ–మెయిల్ : mvijapurkar@gmail.com





అమ్మో.. విజయవాడ

సాక్షి, అమరావతి బ్యూరో బృందం


రాజధాని హైదరాబాద్ నుంచి అమరావతికి తరలివచ్చింది. దాంతో చాలామంది ప్రభుత్వోద్యోగుల మాదిరిగానే యూడీసీగా పనిచేసే రమేశ్ కూడా తన భార్య, ఇద్దరు పిల్లలతో విజయవాడకు మకాం మార్చాల్సి వచ్చింది. బెజవాడ అంటే ఎండలే కాదు.. ఇక్కడ ధరలూ సెగలు పుట్టిస్తాయనే వాస్తవం అతనికి తొందరగానే తెలిసింది. నగరంలో డబుల్ బెడ్‌రూమ్ ఇంటి అద్దె నెలకు రూ.16 వేల వరకు ఉందని తెలుసుకుని అవాక్కయ్యాడు. శివారు కాలనీలకు వెళ్లాడు. అక్కడా.. రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఉన్నాయి. ఇలా ఒక్క ఇల్లే కాదు.. స్కూలు ఫీజులు, కూరగాయలు, సినిమా టికెట్ ధరలు, ఆస్పత్రి చార్జీల వరకు అన్నీ సామాన్యుడి నడ్డి విరిచేలానే ఉన్నాయని రమేశ్‌కు బోధపడింది. ఇది ఒక్క అతని పరిస్థితే కాదు. రాజధానిలో సామాన్యుడి దుస్థితి. ఇక్కడ జీవనం అంటేనే తలకుమించిన భారంగా మారుతోంది. రాజధానిగా మారిన తర్వాత విజయవాడ జనాభా 14 లక్షలకు చేరి ఉంటుందని అంచనా. ఇక్కడ దాదాపు 80 శాతం మంది పేద, మధ్యతరగతి వర్గాలే. ధరల పెరుగుదలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో పరిస్థితి క్లిష్టంగా మారుతోంది.

• బెజవాడలో సామాన్యుడి బతుకు భారం • చుక్కలనంటుతున్న ఇంటి అద్దెలు • పాఠశాలల్లో ఫీజుల మోత • కూరగాయలతో సహా అన్నీ తలకుమించిన భారమే • అస్తవ్యస్థ ట్రాఫిక్‌తో నరకప్రాయంగా ప్రయాణం

1 పాఠశాలల 'ఫీ'జులుం'!



విజయవాడ కానూరుకు చెందిన సాయిరాం తన కుమార్తె శ్రీజను 8వ తరగతి, కుమారుడు శ్రీకర్‌ను 7వ తరగతిలో చేర్పించారు. అందుకోసం నగరంలోని ఓ కార్పొరేట్ పాఠశాలలకు వెళ్లారు. 'మాది ఇంటిగ్రేటెడ్ సిలబస్.. మీ పిల్లలిద్దరికీ కలిపి బోధన రుసుము రూ. 1.50 లక్షలు అవుతుంది' అని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ చెప్పడంతో సాయిరాం అవాక్కయ్యాడు. 8వ తరగతికి రూ.80 వేలు, ఏడో తరగతికి రూ.70 వేలు అని లెక్కచెప్పడంతో ఆయనకు నోట మాట రాలేదు. దీంతో సమీపంలోని మరో ప్రముఖ కార్పొరేట్ పాఠశాలకు వెళ్లారు. అక్కడా పుస్తకాలు, ఫీజులన్నీ కలిపి ఇద్దరికీ రూ. 3.40 లక్షలు అవుతుందనడంతో ఆయన హతాశుడయ్యారు. ఫీజుల విషయం ఇలా ఉంటే.. దుస్తులు, పుస్తకాలు, టై, బెల్టు, యూనిఫామ్స్ అన్నీ మా దగ్గరే కొనాలి అంటూ ముక్కు పిండి మరీ కొనిపిస్తున్నారు. బయట మార్కెట్‌లో రూ.వేయికి అందుబాటులో ఉన్న నోటు పుస్తకాలను కార్పొరేట్ పాఠశాలల్లో రూ.3 వేలు వసూలు చేస్తున్నారు. ఇక వర్క్‌షీట్లు, ఇతరత్రా అని చెప్పి రూ.750 కూడా చేయని పుస్తకాలకు మరో రూ.2వేలు గుంజుతున్నారు. ఎన్సీఈఆర్టీ, రాష్ట్ర ప్రభుత్వ పుస్తకాలను మాత్రం కొనుగోలు చేసుకోవాలని చెబుతున్నారు. అలాగే, ఓ ఒలింపియాడ్ పాఠశాలలో గత ఏడాది ఆరో తరగతి విద్యార్థికి రూ. 40 వేలు వసూలు చేశారు. ప్రస్తుతం ఏడో తరగతికి వచ్చేసరికి ఫీజు రూ.45 వేలకు పెరిగిపోయింది. వర్క్‌బుక్స్, దుస్తులు, ఇతర సామగ్రి మరో రూ.7 వేల ఖర్చు అదనం. కళలు, సాంకేతిక అంశాల్లో శిక్షణ అంటూ వసూలు చేసే మొత్తాలు అదనం. నగరంలో ఉన్న దాదాపు 250 కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లోనూ ఇదే తరహాలో దోపిడీ జరుగుతోంది.



2 ఆటో, క్యాబ్ చార్జీల భారం



హైదరాబాద్‌తోపాటు ఇతర నగరాలతో పోల్చిచూస్తే విజయవాడలో ట్యాక్సీ, ఆటో చార్జీలు చాలా ఎక్కువగా ఉన్నాయి. రైల్వేస్టేషన్ నుంచి 10 కి.మీ. దూరంలోని కరెన్సీనగర్‌కు ఆటో చార్జీ రూ.150 తీసుకుంటున్నారు. ఆటో కనీస చార్జీ రూ.50. నగరంలో దాదాపు 13 వేల ఆటోలు, 3 వేల ట్యాక్సీలు, క్యాబ్‌లు ఉన్నాయి. ఇక ప్రధాన రోడ్డు పాయింట్లలో తప్ప అంతర్గత రోడ్లలో ఆటో స్టాండులు తక్కువే. అక్కడ ఆటో డ్రైవర్లు ఎంత చెబితే అంత చెల్లించాల్సిందే. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండుకు ఆటోచార్జీ రూ.125, దుర్గగుడి మెట్ల మార్గం వరకు అయితే రూ.200 తీసుకుంటున్నారు.

హైదరాబాద్‌లో ఇలా...

విజయవాడ కంటే హైదరాబాద్‌లోనే ఆటో, క్యాబ్ చార్జీలు తక్కువగా ఉండటం గమనార్హం.

ఆటో చార్జీలు...


- సికింద్రాబాద్ నుంచి 8 కి.మీ.దూరం ఉన్న మహాత్మగాంధీ బస్ టెర్మినల్ (ఎంజీబీఎస్)కు వెళ్లాలి అంటే ఆటోకు రూ.80.
- సికింద్రాబాద్ నుంచి 9 కి.మీ.దూరంలోని ఉప్పల్‌కు ఆటోలో రూ.110.
- సికింద్రాబాద్ నుంచి 19 కి.మీ.దూరంలోని హైటెక్ సిటీ రూ.190.

క్యాబ్ చార్జీలు ఇలా..


- సికింద్రాబాద్ నుంచి (ఎంజీబీఎస్) రూ.89 (ఒక్కరికీ).. రూ.158 (నలుగురికి)
- సికింద్రాబాద్ నుంచి ఉప్పల్ రూ.69 (ఒక్కరికీ) రూ.129 (నలుగురికి)
- సికింద్రాబాద్ నుంచి హైటెక్ సిటీ రూ.168 (ఒక్కరికీ) రూ.288 (నలుగురికి)

3 అద్దెలు.. సామాన్యుడిపై మద్దెల మోతే

విజయవాడలో గత రెండేళ్లలో ఇళ్ల అద్దెలు 40 శాతానికి పైగా పెరిగాయి. హైదరాబాద్ కంటే విజయవాడలోనే ఇళ్ల కిరాయిలు ఎక్కువగా ఉన్నాయని రాజధాని నుంచి తరలివచ్చిన ఉద్యోగస్తులు చెబుతున్నారు.. హైదరాబాద్‌లో లక్డీకాపూల్, శ్రీనగర్ కాలనీ, ఖైరతాబాద్, ఆనంద్‌నగర్ కాలనీ తదితర ప్రధాన ప్రాంతాల్లో సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ రూ.8000కు, డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ రూ.13,000కు, ట్రిబుల్ బెడ్‌రూమ్ 18,000లకు కిరాయికి ఇస్తున్నారు. విజయవాడలోని గాంధీనగర్, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, వన్‌టౌన్, సత్యనారాయణపురం, పటమట తదితర ప్రధాన ప్రాంతాల్లో సింగిల్ బెడ్‌రూమ్ రూ.10,000లకు, డబుల్ బెడ్‌రూమ్ 16,000కు, ట్రిబుల్ బెడ్‌రూమ్ రూ.20–22వేలకు అద్దెకిస్తున్నారు. ఇక హైదరాబాద్ నగర శివారు ప్రాంతాలైన హయత్‌నగర్, వనస్థలిపురం, చందానగర్, నాగోలు, మల్కాజ్‌గిరి, మౌలాలి వంటి ప్రాంతాల్లో సింగిల్ బెడ్ రూమ్ రూ.5,500లకు, డబుల్ బెడ్‌రూమ్ రూ.7000కు, ట్రిబుల్ బెడ్ రూమ్ 10,000లకు కిరాయికి ఇస్తుంటే... విజయవాడలో నగర శివారు ప్రాంతాలైన గంగూరు, కంకిపాడు, నిడమానూరు, గొల్లపూడి, నున్న తదితర ప్రాంతాల్లో సింగిల్ బెడ్ రూమ్ రూ.7,000, డబుల్ బెడ్‌రూమ్ రూ.10,000లకు, ట్రిబుల్ బెడ్‌రూమ్ రూ.15,000లకు అద్దెలకు ఇస్తున్నారు. ఇక డీలక్స్ ఫ్లాట్స్ విజయవాడలో రూ.పాతిక వేలు నుంచి రూ.30 వేల వరకు పలుకుతున్నాయి.



4 ట్రాఫిక్ అంటేనే బెంబేలు



విశాఖపట్నం, తిరుపతి, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లకు విజయవాడ ప్రధాన కూడలిగా ఉంది. రాజధానిగా రూపాంతరం చెందిన తర్వాత వాహనాల సంఖ్య అమాంతంగా పెరిగింది. 2015 లెక్కల ప్రకారం నగరంలో రోజుకు సగటున 3 లక్షలకుపైగా వాహనాలు ప్రయాణిస్తున్నాయి. ఈ రెండేళ్లలో వాటి సంఖ్య మరో 50 వేలు పెరిగి ఉంటుందని రవాణా శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ రెండేళ్లలో నగరంలో ఒక్క రోడ్డు కూడా విస్తరించనేలేదు. ప్రధాన రోడ్లను అనుసంధానించే లింకు రోడ్లు చాలా ఇరుకుగా ఉన్నాయి. కనకదుర్గ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ఏళ్ల తరబడి సాగుతుండటం పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మార్చింది. వన్‌టౌన్‌లో ప్రయాణమంటేనే హడలిపోవాల్సి వస్తోంది. సర్వీసు రోడ్డు ప్రధాన రోడ్లను అనుసంధానించే జంక్షన్‌లలో ట్రాఫిక్ జామ్ సర్వసాధారణమైపోయింది. ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సంక్లిష్టంగా మారుతోంది. 2015లో నగరంలోని 28 ప్రధాన ప్రాంతాల్లో ట్రాఫిక్‌పై సర్వే నిర్వహించారు. ఆ ప్రాంతాల ద్వారా రోజుకు ప్రయాణించే వాహనాల సంఖ్య, పీక్ అవర్ (సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల)లో ప్రయాణించే వాహనాలపై సర్వే చేశారు. వాటిలో ప్రధానమైన 5 జంక్షన్లలో పరిస్థితి ఇలా ఉంది...

- విజయవాడ శివారులోని పెనమలూరు నుంచి 13 కి.మీ. దూరంలో ఉన్న ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు బస్సు ప్రయాణం గంటన్నర పడుతోంది. ఆదే బైక్ మీద అయితే 45 నిమిషాలు, ఆటోలో అయితే గంటసేపు పడుతోంది.
- కరెన్సీనగర్ నుంచి ఏలూరు రోడ్డు ద్వారా రైల్వేస్టేషన్‌కు 10 కి.మీ. బస్సు ప్రయాణం గంటసేపు పడుతోంది. ఆటోలో అయితే 45 నిమిషాలు పడుతోంది.
- నగర శివారులోని ప్రసాదంపాడు నుంచి బెంజ్ సర్కిల్‌కు రావడానికి గంటన్నర పడుతోంది.
- ఇక విజయవాడ పాతబస్తీలో ప్రయాణమంటేనే హడలిపోవాల్సి వస్తోంది. నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి వన్‌టౌన్‌కు రావడానికి ఆటో డ్రైవర్లు ససేమిరా అంటున్నారు.

హైదరాబాద్‌లో ఇలా...

హైదరాబాద్‌లో దాదాపు 50 లక్షల వాహనాలు ఉన్నాయి. కానీ, విజయవాడ కంటే హైదరాబాద్ రోడ్లపైన కాస్త త్వరగా గమ్యానికి చేరుకోగలుగుతుండటం విశేషం. హైదరాబాద్‌లో 280 కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. 2,600 మంది సిబ్బందితో ట్రాఫిక్ వ్యవస్థను నియంత్రిస్తున్నారు.

ప్రాంతం	రోజులో వాహనాలు	పీక్ అవర్‌లో
రమేశ్ ఆస్పత్రి జంక్షన్	1,59,260	16,847
బెంజ్ సర్కిల్	1,01,087	13,669
ఎన్టీఆర్ జంక్షన్	1,02,712	8,248
మహానాడు జంక్షన్	89,291	7,782
సితార జంక్షన్	89,411	7,554

5 కూర 'గాయాలు'

విజయవాడలో కూరగాయల ధరలూ భగ్గుమంటున్నాయి. నలుగురు సభ్యులున్న కుటుంబానికి వారానికి సరిపడా చేతి సంచి కూరలు కొనాలంటే ఏడాది క్రితం రూ.150 నుంచి రూ.200 అయ్యేది. ఇప్పుడు రూ.300 వెచ్చించాల్సి వస్తోంది. రిటైల్ మార్కెట్‌తో పోల్చితే రైతుబజార్‌లో కూరల ధరలు తక్కువగా ఉన్నా నాణ్యమైన ఆకు, కాయగూరలు లభించడంలేదు. గత్యంతరంలేని పరిస్థితుల్లో రిటైల్ మార్కెట్లను ఆశ్రయిస్తున్నారు.

రాజధాని ఎఫెక్ట్!

ఇదిలా ఉంటే.. గతంలో విజయవాడ, గుంటూరు పరిసర ప్రాంతాల్లో పండే క్యాబేజ్, దొండ, దోస, బీర వంటి కూరగాయల ధరలు కేజీ ఐదారు రూపాయలు మించి ఉండేవి కావు. ఇప్పుడు రాజధాని ప్రాంతంలో పంటలు వేయకుండా ప్రభుత్వం అడ్డుకుంది. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకునే కూరగాయలపైనే ప్రధానంగా ఆధారపడాల్సి వస్తోంది. దాంతో ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి. ఒకప్పుడు విజయవాడ స్వరాజ్య మైదానానికి రోజు ఆరేడు లారీల కూరగాయలు వచ్చేవి. ప్రస్తుతం రెండు మూడు లారీల సరుకు మాత్రమే వస్తోంది.

రెస్టారెంట్లు

రెస్టారెంట్లలో చుక్కలు చూపిస్తున్న ధరలు

	విజయవాడ	హైదరాబాద్
సాధారణ హోటల్		
చికెన్ బిర్యానీ	రూ.150	రూ.130
మటన్ బిర్యానీ	రూ.200	రూ.160
మధ్యశ్రేణి ఏసీ హోటల్		
చికెన్ బిర్యానీ	రూ.250	రూ.150-160
మటన్ బిర్యానీ	రూ.300	రూ.260-280
త్రీ స్టార్ ఏసీ హోటల్		
చికెన్ బిర్యాని	రూ.400	రూ.250
మటన్ బిర్యాని	రూ.550	రూ.300




విజయవాడలో సరదాగా కుటుంబ సభ్యులు వారాంతంలో రెస్టారెంట్‌కు వెళ్లాలంటే జేబుకు చిల్లే. భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలు ఉన్న కుటుంబం ఓ పూట రెస్టారెంట్‌లో భోజనం చేయాలంటే కనీసం రూ.2 వేలు బిల్లు వదిలించుకోవాల్సిందే. మూడేళ్లతో పోలిస్తే ఈ ధరలు 40 శాతం వరకూ పెరిగాయి.



6 ఆస్పత్రులు



ఆస్పత్రుల ఫీజుల విషయంలోనూ హైదరాబాద్‌తో విజయవాడ పోటీపడుతోంది. హైదరాబాద్‌లో పెద్ద పెద్ద కార్పొరేట్ ఆస్పత్రులున్నాయి. అక్కడ చికిత్సలకు ఉపయోగించే పరికరాలు అత్యాధునికమైనవి. నర్సింగ్, కేరింగ్‌తో పాటు ఆస్పత్రుల నిర్వహణ కూడా మెరుగ్గా ఉంటుంది. అక్కడి సౌకర్యాలతో పోలిస్తే విజయవాడ వెనుకబడి ఉన్నా ఫీజుల వసూలులో మాత్రం ఇక్కడి కొన్ని ఆస్పత్రులు హైదరాబాద్ ఆస్పత్రులతో పోటీ పడుతున్నాయి.



కన్సల్టేషన్ ఫీజులు

విజయవాడ	250-400
హైదరాబాద్	400పైనే

వైఎస్సార్‌సీపీలోకి వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్



ఇస్మాయిల్‌కు వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రవీంద్రనాథరెడ్డి, చక్రపాణిరెడ్డి

నంద్యాల: కర్నూలు జిల్లా నంద్యాలకు చెందిన వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ ఇస్మాయిల్ సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, కల్లూరి రామలింగారెడ్డిలు వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించడంతో ఎందరో ముస్లిం యువకులు విద్య, ఉద్యోగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. మహానేతతోపాటు వైఎస్ జగన్‌పై ఉన్న అభిమానంతో తాను వైఎస్సార్‌సీపీలో చేరుతున్నానన్నారు. ఉప ఎన్నికలో నంద్యాల ముస్లింలంతా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డికి అండగా నిలిచి గెలిపిస్తామన్నారు. రవీంద్రనాథరెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డిలు మాట్లాడుతూ శిల్పామోహన్‌రెడ్డి ముస్లిం సోదరులకు రుణాలిచ్చి ఆదుకున్నారని గుర్తు చేశారు. ఏనాడూ ముస్లింలను కించపరచడంగానీ, చిన్నమాట అనడంగానీ చేయలేదన్నారు. అధికారపార్టీ నాయకులు అరాచకాలతో గెలవాలని చూస్తున్నారని, అయితే వారి ఆటలు సాగవన్నారు.

ఉప ఎన్నికలో ఆరుగురి నామినేషన్ల తిరస్కరణ

నూనెపల్లె: కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నికలో భాగంగా సోమవారం నామినేషన్ల పరిశీలన చేపట్టారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో అభ్యర్థుల నామినేషన్లను రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేష్ ఆధ్వర్యంలో పరిశీలించారు. మొత్తం 30 మంది అభ్యర్థులు దాఖలు చేసిన 48 సెట్ల నామినేషన్లను క్షుణ్నంగా పరిశీలించి, ఆరుగురి నామినేషన్లు తిరస్కరించారు. ప్రసుతం 24 మంది పోటీలో ఉన్నారు. ఈ నెల 9 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉందని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

'కాకినాడ' నోటిఫికేషన్‌పై హైకోర్టులో పిటిషన్

సాక్షి, హైదరాబాద్: కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో వార్డుల పునర్విభజన, రిజర్వేషన్లు ఖరారు చేస్తూ పురపాలకశాఖ ఈ నెల 2న జారీ చేసిన జీవో, తదనుగుణంగా 3వ తేదీన ఎన్నికల కమిషన్ జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. కాకినాడకు చెందిన మేడిశెట్టి ఈశ్వరరావు, మరికొందరు దీన్ని దాఖలు చేశారు. దీనిపై అత్యవసరంగా విచారణ జరపాలని పిటిషనర్ల తరపు న్యాయవాది చేసిన అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో టీచర్స్ కాలనీ, స్వామినగర్, ఎస్.అచ్యుతాపురం గ్రామాల్ని కలిపి.. మొత్తం 50 వార్డులుగా పునర్విభజన చేస్తూ మార్చి 4న పురపాలకశాఖ జీవో 83 జారీచేసిందని పిటిషనర్లు తెలిపారు. వాస్తవానికి ఈ మూడు గ్రామాల విలీనంపై హైకోర్టు గతంలో స్టే విధించిందన్నారు. అయితే స్టే అమల్లో ఉండగానే ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టాయన్నారు. దీనిపై కొందరు పిటిషన్ వేయగా.. 42, 48 వార్డులుగా ఉన్న టీచర్స్ కాలనీ, స్వామినగర్, ఎస్.అచ్యుతాపురాలను మినహాయించి కార్పొరేషన్ ఎన్నికల్ని యథావిధిగా కొనసాగించుకోవచ్చని హైకోర్టు చెప్పిందని తెలిపారు. అయితే గ్రామాల విలీనంపై తుది తీర్పు రాకముందే ఎన్నికలు నిర్వహించడం సరికాదన్నారు.

జగన్‌పై డీజీపీకి టీడీపీ నేతల ఫిర్యాదు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబుపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ ఎమ్మెల్సీలు బుద్దా వెంకన్న, బచ్చుల అర్జునుడు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ వర్ల రామయ్య డీజీపీ నండూరి సాంబశివరావుకు ఫిర్యాదు చేశారు

కొనసాగుతున్న ద్రోణి

రెండు రోజులు వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనద్రోణి ఛత్తీస్‌గఢ్ నుంచి దక్షిణ తమిళనాడు వరకు స్థిరంగా కొనసాగుతోంది. మరోవైపు నైరుతి రుతుపవనాలు సాధారణ ప్రభావం చూపుతున్నాయి. వీటి ఫలితంగా రానున్న రెండు రోజులు కోస్తాంధ్రలో పలుచోట్ల, రాయలసీమలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సోమవారం రాత్రి విడుదల చేసిన నివేదికలో తెలిపింది. గడచిన 24 గంటల్లో అద్దంకిలో 7, జంగమహేశ్వరపురంలో 6, వెంకటగిరి, ఇచ్ఛాపురం, తాడేపల్లిగూడెం, చిన్నమండెం, కోడూరుల్లో 5 సెం.మీ.ల చొప్పున వర్షపాతం నమోదైంది.

రూ.1,600 కోట్లతో ఏపీఐఐఏటీపీ

అనుమతి ఇస్తూ జలవనరులశాఖ కార్యదర్శి ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రపంచబ్యాంక్ ఆర్థిక సాయంతో రూ.1,600 కోట్ల అంచనా వ్యయంతో ఆంధ్రప్రదేశ్ సమగ్ర నీటిపారుదల, వ్యవసాయ అభివృద్ధి పథకం(ఏపీఐఐఏటీపీ)ను చేపట్టేందుకు పరిపాలన అనుమతి ఇస్తూ జలవనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 27న విదేశీ ఆర్థిక సాయంతో చేపట్టే ప్రాజెక్టులపై కేంద్ర జలవనరులశాఖ ఢిల్లీలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఏపీఐఐఏటీపీ ప్రతిపాదనలను ఆమోదించింది. ఈ ప్రాజెక్టు వ్యయంలో రాష్ట్రప్రభుత్వం వాటా రూ.400 కోట్లు. మిగతా రూ.1,200 కోట్లను ప్రపంచబ్యాంక్ రుణం రూపంలో సమకూర్చనుంది. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రపంచబ్యాంక్ ఆర్థికసాయంతో 2007లో చేపట్టిన ఆంధ్రప్రదేశ్ సామాజిక చెరువుల అభివృద్ధి పథకానికి కొనసాగింపుగా ఏపీఐఐఏటీపీ పథకాన్ని చేపట్టనున్నారు.

'ఉదయ్'తో ప్రతి ఇంటా వెలుగులు

పవర్ గ్రిడ్ ఎస్‌ఆర్‌టీఎస్–1 సీఎం కేజే ప్రవీణ్ కుమార్

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఉదయ్ (ఉజ్వల్ డిస్కం అభయ యోజన) పథకం.. దేశంలో దశాబ్దాలుగా నెలకొన్న చీకట్లను తొలగించి వెలుగులు నింపుతోందని పవర్ గ్రిడ్ సౌత్ రీజియన్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్–1 సీఎం (హెచ్‌ఆర్) కేజే ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రాల విద్యుత్ పంపిణీ కంపెనీల్లో ప్రభావవంతమైన మార్పులు చేయడం వల్లనే ఇది సాధ్యమైందని వివరించారు. 2015 నవంబర్ 5న ఉదయ్‌ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించినట్లు చెప్పారు. ఇటీవల ఉదయ్ పథకంపై నిర్వహించిన సమీక్షలో డిస్కంల పనితీరు గణనీయంగా మెరుగుపడినట్లు తెలిసిందని పేర్కొన్నారు. 2016 ఆర్థిక సంవత్సరంలో రూ.51,340 కోట్లుగా ఉన్న సరాసరి వార్షిక నష్టాలను.. 40,295 కోట్లకు తగ్గించామని తెలిపారు. పవర్ కట్స్ సమయం ప్రస్తుతం 7.45 గంటలకు తగ్గించినట్లు వివరించారు.

ప్రపంచీకరణ విధానాల అమలుతో ముప్పు

మావోయిస్టు నేత ఆజాద్

చింతూరు(రంపచోడవరం): కేంద్రం, తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రపంచీకరణ విధానాలను అమలు చేయడంలో పోటీ పడుతున్నాయని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, తూర్పు గోదావరి(బీకేకేఈ) జిల్లాల కమిటీ కార్యదర్శి ఆజాద్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పేరుతో తూర్పు గోదావరి జిల్లా చింతూరులోని మీడియాకు లేఖలు అందాయి. ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో అణచివేత దాడులు కొనసాగిస్తూ, కేంద్రం, ఆంధ్రా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు వివిధ రకాల పథకాల పేరిట పెట్టుబడిదారుల విషపు కోరలను ప్రజలపై వెదజల్లుతున్నాయని విమర్శించారు. తెలంగాణ ప్రజలు బాక్సైట్ గనులను వ్యతిరేకిస్తున్నప్పటికీ సింగరేణి ఓపెన్ కాస్ట్, ఏటూరు నాగారం అడవుల్లో డోలమైట్, టైగర్‌జోన్ ప్రాజెక్టులు చేపడుతున్నారన్నారు. తూర్పు గోదావరి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో రైతాంగం గిట్టుబాటు ధరల కోసం పోరాడుతున్నారని పేర్కొన్నారు. నదీతీర ప్రాంతాల్లోని ముంపు గ్రామాల ప్రజలను ఇరు ప్రభుత్వాలు నిర్వాసితులను చేస్తున్నాయని అన్నారు.


తమ్ముడి మృతదేహానికి రాఖీ కట్టిన అక్క



సత్తుపల్లి రూరల్: రాఖీ పౌర్ణమి రోజు తమ్ముడి మృతదేహానికి ఓ అక్క కన్నీరు మున్నీరవుతూ రాఖీ కట్టిన ఉదంతమిది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి వద్ద పెద్దచెరువులోకి ఆదివారం కారు దూసుకెళ్లిన ప్రమాదంలో ఏపీలోని కృష్ణా జిల్లా తిరువూరుకు చెందిన కొక్కొండ వినోద్ చారి(22) మృతి చెందాడు. ఆయన మృత దేహాన్ని సోమవారం గజ ఈతగాళ్లు సోమ వారం ఉదయం బయటకు తీశారు. సోమ వారం రాఖీ పండుగ కావడం.. తమ్ముడిని విగత జీవిగా చూసిన అక్కతో పాటు బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ క్రమంలో మృతుడి అక్క శిరీష విలపిస్తూ.. తమ్ముడి మృతదేహానికి రాఖీ కట్టింది.

వినోద్‌చారి మృతదేహానికి రోదిస్తూ రాఖీ కడుతున్న అక్క శిరీష

కొండలరాయుడికి తేళ్ల నైవేద్యం



కోడుమూరు రూరల్: దేవుళ్లకు ఎక్కడైనా పాలు, పండ్లు, ఫలహారాలను నైవేద్యంగా పెడతారు. కర్నూలు జిల్లా కోడుమూరు కొండపై వెలసిన కొండలరాయుడికి మాత్రం భక్తులు తేళ్లను నైవేద్యంగా సమర్పించారు. ప్రతి ఏటా శ్రావణమాసం మూడో సోమవారం ఈ వింత ఆచారాన్ని ఆనవాయితీగా పాటిస్తున్నారు. ఈ ఏడాదీ భక్తులు కొండపై ఉన్న చిన్న చిన్న రాళ్లను కదిపి.. వాటి కింద ఉండే తేళ్లను పట్టుకొని స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. తేళ్లను పట్టుకునే సమయంలో అవి కుట్టినా స్వామివారి ఆలయం చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణ చేస్తే తగ్గిపోతుందని భక్తుల విశ్వాసం.

కొండలరాయుడి మూల విరాట్(పైన)... నోట్లో తేలును ఉంచుకున్న చిన్నారి

బెడిసిన వ్యూహం



శిల్పా నామినేషన్‌పై ఉత్కంఠ నెలకొనడంతో నంద్యాల ఆర్డీఓ కార్యాలయం వద్ద గుమిగూడిన మీడియా ప్రతినిధులు, ప్రజలు

▶ మొదటి పేజీ తరువాయి

నంద్యాలలో ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సభ జరిగినప్పటి నుంచీ అధికార పార్టీకి ఓటమి భయం వెంటాడుతోంది. ఈ సభకు భారీగా జనం స్వచ్ఛందంగా హాజరు కావడం టీడీపీ నేతలను కలవరపాటుకు గురి చేసింది. నంద్యాలను జిల్లా చేయడంతో పాటు వ్యవసాయ వర్సిటీ, మోడల్ సిటీ, ఆర్య వైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ వంటి హామీలతో జగన్ స్థానికులను ఆకట్టుకున్నారు. ఈ సభ అనంతరం ఎవరిని గెలిపించాలనే విషయంలో నంద్యాల ప్రజలు ఒక క్లారిటీకి వచ్చారు. ఈ నేపథ్యంలో జగన్ ప్రసంగంలోని అసలు అంశాలు చర్చకు రాకుండా అధికార పార్టీ నేతలు చవకబారు విమర్శలకు దిగారు. వైఎస్ జగన్ సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక యాగీ చేయడం మొదలెట్టారు. విషయం పక్కదారి పట్టించడానికి నిరసన ప్రదర్శనలు, దిష్టిబొమ్మల దహనానికీ దిగారు. ఇంతా చేసినా అనుకున్న లక్ష్యం నెరవేరలేదని, నంద్యాల ఓటర్ల మనసు మార్చడం వీలుకాదని భావించి చవకబారు ఎత్తుగడకు తెర తీశారు. ఇందులో భాగంగా శిల్పా మోహన్ రెడ్డి నామినేషన్ చెల్లదనే ప్రచారానికి పూనుకున్నారు. ఇందుకోసం అందరికీ సులభంగా అర్థం కాని సాంకేతిక అంశాలను ఎన్నుకుని.. అనుకూల మీడియా ద్వారా ఆ అంశానికి ప్రచారం కల్పిస్తూ ప్రజల్లో.. ప్రత్యేకించి నంద్యాల ఓటర్లను అయోమయానికి గురిచేసేందుకు బరిలోకి దిగారు. శిల్పా అఫిడవిట్‌పై సంతకం పెట్టిన న్యాయవాదికి నోటరీ అనుమతి లేదంటూ జిల్లా రిజిస్ట్రార్ నుంచి తెచ్చిన లేఖను విడుదల చేశారు. అనుబంధ నామినేషన్‌కు సరైన స్టాంపు పేపర్లు జత చేయలేదంటూ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. మరోవైపు శిల్పా నామినేషన్‌ను తిరస్కరించనున్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం ప్రారంభించారు. తుదకు నిబంధనల మేరకు శిల్పా నామినేషన్ ఉందంటూ రిటర్నింగ్ అధికారి ప్రకటించే వరకు ఈ వ్యతిరేక ప్రచారం కొనసాగింది. నామినేషన్ల పరిశీలన సందర్భంగా టీడీపీ హైడ్రామా వ్యవహారాన్ని చూసి స్థానికులు ముక్కున వేలు వేసుకున్నారు. ఓటమి భయంతోనే ఇలా చేశారంటూ చర్చించుకున్నారు.



ఓటమి భయంతోనే విష ప్రచారం

ప్రతిపక్ష వైఎస్సార్ సీపీకి చెందిన 21 మంది ఎమ్మెల్యేలను టీడీపీలో చేర్చుకోవడంతో పాటు వారిలో నలుగురికి మంత్రి పదవులను కూడా కట్టబెట్టారు. వీరెవరితోనూ వారి పదవులకు రాజీనామా చేయించకుండానే కొనసాగిస్తున్నారు. ఇందుకు కారణం ఉప ఎన్నికలకు వెళ్లే ధైర్యం అధికార పార్టీకి లేకపోవడమే. అయితే వీరిలో నంద్యాల ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి మరణానంతరం ఉప ఎన్నిక అనివార్యమన్న సంగతి అధికార పార్టీకి అర్థమయ్యింది. నంద్యాల ఉప ఎన్నికలో సంప్రదాయమనే మాటను తెరమీదకు తెచ్చి.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ ఉండదని కూడా ప్రచారం మొదలుపెట్టింది. వాస్తవానికి నంద్యాల సీటు వైఎస్సార్ సీపీదేనని, తమ సీటు తాము ఎలా వదులుకుంటామని ప్రతిపక్ష పార్టీ వాదించింది. మరోవైపు తమకు జరుగుతున్న అవమానాలతో పాటు వైఎస్సార్ సీపీ సిద్ధాంతాలు నచ్చడంతో టీడీపీలో ఉన్న శిల్పా మోహన్ రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు. ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్ సభ విజయవంతం కావడం.. రోజురోజుకూ శిల్పాకు ఆదరణ పెరుగుతుండటంతో దిక్కుతోచని సర్కారు పెద్దలు మంత్రులందరినీ నంద్యాలలోనే మకాం వేయించారు. నోటిఫికేషన్‌కు ముందుగా నెల రోజుల్లోనే రెండుసార్లు ముఖ్యమంత్రి నంద్యాలలో పర్యటించారు. ఎప్పటిలాగే అలవిగాని హామీలు గుప్పించారు. పలువురికి పదవులు ఎర వేశారు. స్థానిక ప్రతిపక్ష నేతల ఇళ్లపై పోలీసులతో దాడులు చేయించారు. ఓటర్లను సైతం హెచ్చరిస్తూ బెదిరింపులకు దిగారు. అయినా గెలుపుపై నమ్మకం కుదరక విష ప్రచారాలకు తెర తీశారు. తాజాగా ఇది కాస్తా తిరగబడటంతో దిక్కుతోచక మళ్లీ పాత ఆరోపణలనే వల్లె వేస్తూ ఉనికిపాట్లు పడుతున్నారు.

రాష్ట్రంలో నియంతృత్వ పాలన

వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల: రాష్ట్రంలో నియంతృత్వ, అవినీతి మయ పాలన నడుస్తోందని వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ ఇష్టారీతిన ప్రజల సొమ్ము దోచుకుంటున్నారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు తన అవసరాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను సైతం కేంద్రప్రభుత్వం వద్ద తాకట్టు పెట్టారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందని చెబుతున్న ప్రత్యేక ప్యాకేజీని ఏవిధంగా ఖర్చుపెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ నేతలు వారి అవినీతిలో భాగస్వామ్యం కాని అధికారులపై దాడులకు సైతం వెనుకాడటం లేదని దుయ్యబట్టారు. చివరకు మహిళాధికారులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ మంత్రిపై ఓ మహిళా ఉన్నతాధికారి కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. టీడీపీ నేతలు ప్రజల తరపున పోరాడుతున్న వైఎస్ జగన్‌పై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. అనంతరం ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.

నంద్యాలలో పెద్ద ఎత్తున నియమావళి ఉల్లంఘన

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు ధ్వజం



సాక్షి, అమరావతి: నంద్యాల ఉప ఎన్నికలో పెద్ద ఎత్తున నియమావళి ఉల్లంఘనలు జరుగుతున్నాయని, టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు పథకాలు, డబ్బుల ఎర వేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు ధ్వజమెత్తారు. విజయవాడలో సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇసుక మాఫియాకు సీఎం చంద్రబాబు, మంత్రులు అండదండలు అందిస్తున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ఖర్చుపెట్టేందుకు అవసరమైన డబ్బుకోసం టీడీపీ నేతలు ఇష్టానుసారం అడ్డదారులు తొక్కుతున్నారన్నారు. ఇందులో భాగంగానే చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే టీడీపీ నేతల అక్రమార్జనకోసం ఇసుక మాఫియాను ప్రోత్సహిస్తోందన్నారు. బెల్ట్ షాపులను అరికట్టినట్టు చంద్రబాబు గొప్పలు చెబుతున్నారని, వాస్తవానికి మద్యం షాపులు, బార్లకంటే బెల్ట్ షాపులే అడ్డూఅదుపు లేకుండా సాగుతున్నాయని దుయ్యబట్టారు. వంశధార ప్రాజెక్టు నిర్వాసితులపై ప్రభుత్వం పోలీసులతో ఉక్కుపాదం మోపడం దారుణమని మధు విమర్శించారు. 11 ఏళ్లక్రితం ప్రకటించిన ప్యాకేజీతోనే సరిపెట్టి నిర్వాసితుల్ని దగా చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రాజెక్టు నిర్మాణ వ్యయాన్ని ఎప్పటికప్పుడు పెంచుతూ కాంట్రాక్టర్లకు కోట్లు కట్టబెడుతున్న ప్రభుత్వం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు పరిహారం ఎందుకు పెంచట్లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా వంశధార నిర్వాసితులతో చర్చించి ప్యాకేజీలో న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఓటర్లను మంత్రులు ప్రలోభ పెడుతున్నారు

- వారిపై చర్యలు తీసుకోండి
- డబ్బు, మద్యం ప్రవాహానికి అడ్డుకట్ట వేయండి
- కలెక్టర్‌కు ఎన్నికల సంఘం మాజీ సలహాదారు కేజే రావు విజ్ఞప్తి



ఎన్నికల నిఘా వేదిక పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కర్నూలు జిల్లా కలెక్టర్ సత్యనారాయణ, కేజే రావు, లక్ష్మణరెడ్డి తదితరులు

కర్నూలు(అగ్రికల్చర్): మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు నంద్యాలలో తిష్టవేసి ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సత్యనారాయణకు భారత ఎన్నికల సంఘం మాజీ సలహాదారు కేజే రావు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నిఘా వేదిక ప్రతినిధులు సోమవారం కలెక్టర్ సత్యనారాయణను ఆయన చాంబర్‌లో కలిశారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో నంద్యాల ఉప ఎన్నిక స్వేచ్ఛగా జరిగే అవకాశం లేదని, ఓటర్లను తీవ్రస్థాయిలో ప్రలోభాలకు గురిచేస్తున్నారని కలెక్టర్‌కు కేజే రావు వివరించారు. మరిన్ని టీంలు ఏర్పాటు చేసి నిఘా పెంచాలని కోరారు. ఓటర్లు ప్రలోభాలకు, ఆందోళనకు గురి కాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలన్నారు. డబ్బు, మద్యం ప్రవాహాన్ని అడ్డుకోవాలని కోరారు. కలెక్టర్ సత్యనారాయణ స్పందిస్తూ.. నంద్యాల నియోజకవర్గంలో ప్రత్యేకంగా 14 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘా ముమ్మరం చేసినట్లు తెలిపారు. జిల్లా సరిహద్దుల్లో కూడా ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. అంతేకాకుండా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ టీంలను కూడా రంగంలోకి దించామని వివరించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే వాతావరణం కల్పిస్తామన్నారు. ఎన్నికల నిఘా వేదిక రాష్ట్ర కన్వీనర్ లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. డబ్బు, మద్యం వంటి ప్రలోభాలకు గురికాకుండా.. స్వేచ్ఛగా ఓటు వేయాలని నంద్యాల ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఓటర్లలో చైతన్యం పెంచేందుకు గానూ ఎన్నికల నిఘా వేదిక రూపొందించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను కలెక్టర్ సత్యనారాయణ ఆవిష్కరించారు. సమావేశంలో ఎన్నికల నిఘా వేదిక ప్రతినిధులు ఎం.నాగరాజు, జాన్ బర్నబాస్, జయన్న తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చినట్టే ఇచ్చి.. లాగేసుకున్నారు!

- కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి తిరస్కరణ పత్రాలు

సాక్షి, అమరావతి: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగం వచ్చిందంటే ఎంత ఆనందమో కదా. అందులోనూ ప్రభుత్వ ఉద్యోగమంటే.. ఎగిరి గంతేయరూ.. నేడో రేపో ఉద్యోగంలో చేరుతున్నామన్న ఆనందం.. ఇక తమ కష్టాలన్నీ తీరిపోతాయన్న సంతోషం.. ఇవన్నీ పాపం వారికి ఎంతోకాలం నిలువలేదు. అంతలోనే మీ ఉద్యోగం పోయింది.. అని అధికారులు చావుకబురు చల్లగా చెప్పారు. సర్కారు నిర్వాకం సుమారు వందమంది అభ్యర్థుల జీవితాల్లో చీకట్లు నింపింది. డిసెంబర్–2016లో పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ వచ్చింది. జనవరిలో రాతపరీక్షలు నిర్వహించారు. పాసైన అభ్యర్థులకు సర్టిఫికెట్లు వెరిఫికేషన్ పూర్తిచేశారు. ఆ వెంటనే ఎంపికైన అభ్యర్థులందరికీ వైద్య బృందం పర్యవేక్షణలో వైద్య పరీక్షలూ జరిగాయి. అనంతరం ఎంపికై న అభ్యర్థుల తుదిజాబితా రూపొందించారు. వివిధ జిల్లాల ఎస్పీ కార్యాలయాల్లో మెరిట్ జాబితాను కూడా పెట్టారు. కొంతమంది అభ్యర్థులకు శిక్షణకు హాజరు కావాలని ఎస్పీ కార్యాలయాల నుంచి ఫోన్‌లు కూడా వచ్చాయి. అప్పాయింట్‌మెంట్ తీసుకుందామని ఎస్పీ కార్యాలయాలకు వెళ్లగానే.. అక్కడి అధికారులు మీకు వయసు మీరిపోయిందని, మెరిట్ జాబితా నుంచి తీసేస్తున్నట్లు చెప్పారు. దీంతో అభ్యర్థులు డీజీపీ కార్యాలయానికి వెళ్లినా స్పందనలేదు. తమకు వయసు మీరిందన్న విషయం సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో తెలియలేదా అని అభ్యర్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

లోకేశ్ న్యాయం చేస్తారనని వస్తే.. : ఒక్కో జిల్లా నుంచి ఎంపికయ్యాక తిరస్కరణకు గురైన అభ్యర్థులు ఎనిమిది మంది నుంచి పదిమంది దాకా ఉన్నారు. వీళ్లలో కొంతమంది మంత్రి లోకేశ్‌ను కలవడానికి ఉదయం వెళ్తే సాయంత్రం ఆరు గంటలకు లోపలకు పిలిచారని, తమ గోడు లోకేశ్‌కు చెప్పగా.. ఇది తన పరిధిలో లేదని, ఒకసారి పరిశీలిస్తానని చెప్పారని ఆయా అభ్యర్థులు కన్నీరు మున్నీరయ్యారు.

రాష్ట్రాభివృద్ధిని మరువను...

▶ మొదటి పేజీ తరువాయి

బాధ కలిగిందంటూ ఉద్వేగంతో కంటతడి పెట్టారు. ఉపరాష్ట్రపతి పదవిలో ఉన్నా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని మరువబోనని స్పష్టం చేశారు. విభజన వల్ల ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని భావించడం వల్లే రూ.2.36 లక్షల కోట్ల ప్యాకేజీని కేంద్రం నుంచి మంజూరు చేయించానని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా భారతదేశంలో వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ స్వాతంత్రం వచ్చిన తరువాత ఆశించిన మేర అభివృద్ధి చెందలేదని పేర్కొన్నారు. రాజ్యసభ చైర్మన్‌గా ఎగువ సభ ప్రతిష్టను పెంచేందుకు కృషి చేస్తానని వివరించారు. సభా సంప్రదాయాలు.. విలువలను కాపాడతానని, ప్రజల ఆకాంక్షలు, ఆశలకు అనుగుణంగా పనిచేస్తానని వెల్లడించారు. కేంద్ర మంత్రి పదవి నుంచి తప్పుకునేందుకు తాను జంకుతున్నానని మీడియాలో కొందరు వ్యాఖ్యానించారని, ఉప రాష్ట్రపతి పదవి ఏమీ తక్కువ కాదని, ఎన్నో బాధ్యతలు ఉంటాయని వెంకయ్య వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పి.నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కామినేని శ్రీనివాస్, ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వరప్రసాదరావు, ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, సన్మాన కమిటీ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రత్నం విద్యా సంస్థల అధినేత కేవీ రత్నం, కిషోర్‌రత్నం, టీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యాంశంగా వెంకయ్య జీవిత చరిత్ర: బాలు

వెంకయ్య నాయుడు అందరికీ ఆదర్శప్రాయుడని ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కొనియాడారు. వెంకయ్య జీవితం విద్యార్థులకు త్వరలోనే పాఠ్యాంశంగా వస్తుందన్నారు. ఆయన క్రమశిక్షణ, అంకితభావంతో ఈ స్థాయికి ఎదిగారని తెలిపారు.

దేశానికి కీర్తి ప్రతిష్టలు తెస్తారు: ఎంపీ మేకపాటి

నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి నుంచి రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన వెంకయ్య దేశానికి మరిన్ని కీర్తి ప్రతిష్టలు తెస్తారని నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. వెంకయ్య మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలో మార్పులు తెచ్చేందుకు కృషి చేయాలని వెంకయ్యను కోరారు.



వెంకయ్యనాయుడికి తిరుమల ఆలయంలో శ్రీవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, ఆలయ అర్చకులు తదితరులు

నేనిప్పుడు ఏ పార్టీకీ చెందను

సాక్షి ప్రతినిధి, తిరుపతి/సాక్షి, తిరుమల: 'నేనిప్పుడు ఏ పార్టీకీ చెందను. ఉప రాష్ట్రపతిగా ఎన్నికై న వ్యక్తిని. రాజ్యాంగానికి లోబడి ఆ పదవికున్న ఔన్నత్యాన్ని పెంచేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తా' అని వెంకయ్యనాయుడు అన్నారు. తిరుపతి వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆవరణలో నూతనంగా నిర్మించిన శ్రీ పద్మావతీ వైద్య విద్యార్థినుల హాస్టల్ భవనాన్ని సోమవారం వెంకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన మరుసటి రోజే తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం, మాధవసేవకు నిలయమైన స్విమ్స్ ఆస్పత్రి అభివృద్ధి పనులను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. వెంకయ్యనాయుడిని రాష్ట్ర మంత్రి కామినేని శ్రీనివాస్, స్విమ్స్ డైరెక్టర్ రవికుమార్, కలెక్టర్ ప్రద్యుమ్న తదితరులు సత్కరించారు. పలువురు మెడికల్ విద్యార్థినులు వెంకయ్యకు రాఖీ కట్టారు.

స్విమ్స్‌లో 'కార్డియాక్ ఎలక్ట్రో ఫిజియాలజీ'

తిరుపతి స్విమ్స్‌లో ఎలక్ట్రో ఫిజియోలజీ నిపుణుడు డాక్టర్ కోనేరు జయంత్ నాగేందర్‌ను విజిటింగ్ ప్రొఫెసర్‌గా నియమించారు. వెంకయ్యనాయుడు సోమవారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. అలాగే ఎలక్ట్రో ఫిజియాలజీలో వారంపాటు నిర్వహించనున్న ఇండో–యూఎస్ జాతీయస్థాయి వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు.

శ్రీవారిని దర్శించుకున్న వెంకయ్య

వెంకయ్యనాయుడు సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశ ప్రజల ఆదరాభిమానం, దేవుని ఆశీస్సులతో రాజ్యాంగపరంగా రెండో స్థాయికి ఎదిగానని చెప్పారు. ప్రజలు సంతోషంగా ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్లు చెప్పారు.


త్వరలో అమరావతి డిక్లరేషన్ విడుదల

అందరూ మెచ్చుకుంటారన్న స్పీకర్ కోడెల



సాక్షి, అమరావతి: పలు రంగాలకు చెందిన ప్రముఖులు, మహిళలు, విద్యార్థులు ఇచ్చిన సలహాలు, సూచనలు, అభిప్రాయాలతో అమరావతి ముసాయిదా డిక్లరేషన్‌లో మార్పులు చేశామని, త్వరలో దీనిని సీఎం చంద్రబాబునాయుడు ఆవిష్కరిస్తారని అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు తెలిపారు. సోమవారం ఉదయం వెలగపూడిలోని అసెంబ్లీ ప్రాంగణంలో అమరావతి ముసాయిదా డిక్లరేషన్‌పై సమావేశం నిర్వహించారు. అనంతరం కోడెల మీడియాతో మాట్లాడుతూ.. ఫిబ్రవరిలో జాతీయ మహిళా పార్లమెంట్ జరిగిన అనంతరం సీఎం సూచనల మేరకు ఈ డిక్లరేషన్‌ను రూపొందించినట్టు తెలిపారు. మహిళా సమస్యలపై విస్తృతస్థాయిలో చర్చించి డిక్లరేషన్‌లో మార్పులు చేశామన్నారు. అందరికీ ఉపయోగపడేలా డిక్లరేషన్ ఉంటుందన్నారు. ప్రధానంగా స్త్రీ విద్య, మహిళల న్యాయపరమైన హక్కులు, మహిళల ఆరోగ్యం, సమతుల ఆహారం, పారిశ్రామిక రంగంలో మహిళలు, పరిశోధన–నూతన ఆవిష్కరణల్లో మహిళలు, రాజకీయాల్లో మహిళలు, సామాజిక భద్రత, డిజిటల్ విద్య అనే పదంశాలపై చర్చించినట్టు తెలిపారు. రాఖీ పండుగ సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి మహిళలు వచ్చి దీనిపై చర్చించడం సంతోషం కరమన్నారు. మంత్రి పరిటాల సునీత మాట్లాడుతూ.. మహిళా ప్రముఖులు, విద్యార్థినులు సమావేశంలో పాల్గొని సూచనలివ్వడం శుభపరిణామమన్నారు. సమావేశంలో మాజీ మంత్రి పీతల సుజాత, రోడ్లు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి సుమితా దావ్రా, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి, దేవాదాయశాఖ కమిషనర్ వైవీ అనురాధ పాల్గొన్నారు.

వేదాంత 'రియల్' వ్యాపారం!



రియల్ ఎస్టేట్ వెంచర్లు వేయనున్న భూములివే



మూతపడిన హిందుస్థాన్ జింక్ పరిశ్రమ

- హిందుస్థాన్ జింక్ భూముల్ని ప్లాట్లుగా మార్చేందుకు సన్నాహాలు
- రూ.1,095 కోట్ల ఆదాయార్జనపై కన్ను
- రాష్ట్ర ప్రభుత్వ ఎన్‌వోసీ కోసం చకచకా కదులుతున్న ఫైల్
- రియల్ వెంచర్‌ను అడ్డుకుంటామంటున్న కార్మిక వర్గాలు

సాక్షి, విశాఖపట్నం:

విశాఖపట్నంలో అత్యంత విలువైన హిందుస్థాన్ జింక్ కంపెనీ భూముల్లో రియల్ వెంచర్లు వేసేందుకు వేదాంత సిద్ధమైంది. తద్వారా రూ.1,095 కోట్ల ఆదాయార్జనపై ఆ సంస్థ కన్నేసింది. ఈ పరిశ్రమ ఒకప్పుడు వేలాది మంది ఉద్యోగులు, కార్మికులతో కళకళలాడింది. వేల కోట్ల టర్నోవర్‌తో దేశంలోనే అగ్రగామి ప్రభుత్వరంగ సంస్థల్లో ఒకటిగా పేరుగాంచింది. అలాంటి సంస్థను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటుపరం చేసింది. 'వేదాంత' అనే సంస్థకు షేర్లు కట్టబెట్టింది. అయితే ఆ సంస్థ పరిశ్రమను నడపలేకపోవడంతో 2013లో కంపెనీ మూతపడింది. ఉద్యోగులు, కార్మికులు రోడ్డున పడ్డారు. నాలుగేళ్లైనా ఇంకా 365 మంది కార్మికులకు ఫైనల్ సెటిల్‌మెంట్ చేయలేదు. కానీ ఈ కంపెనీ భూములను ప్లాట్లుగా విభజించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు సంస్థ సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో.. ప్రస్తుతం ఎన్‌వోసీ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసిన కంపెనీ, ఎన్‌వోసీ రాకుండానే ఈ భూముల్లో అపార్టుమెంట్లు, రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసేందుకు ఓ కన్సల్టెంట్‌ను కూడా నియమించింది. రాష్ట్ర ప్రభుత్వం నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) మంజూరు చేసేలా జిల్లాకు చెందిన ఓ మంత్రి చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. వెంచర్ వేస్తే కంపెనీకి ఎకరాకు రూ.3 కోట్ల చొప్పున రూ.1,095 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని అంచనా. అయితే పరిశ్రమ కోసం సేకరించిన భూములను తిరిగి రైతులకే ఇచ్చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది. రియల్ వెంచర్లకు వ్యతిరేకంగా విశాఖ పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగ, కార్మిక వర్గాలు పోరాటానికి సిద్ధమవుతున్నాయి.

గనులిచ్చినప్పుడు భూములెందుకు వెనక్కివ్వరు?

గుంటూరులో ఉన్న బందలమెట్ట మైన్స్‌ని తవ్వి దానిలో ముడిసరుకు లేదని తెలియడంతో తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చేశారు. సర్గేపల్లిలో ముడిసరుకు లేదని ఒడిశా ప్రభుత్వానికి అప్పగించేశారు. అదే విధంగా హిందుస్థాన్ జింక్‌లో ఉత్పత్తి జరగక పోవడంతో.. ఈ పరిశ్రమ కోసం గతంలో నామమాత్రపు ధర చెల్లించి సేకరించిన భూములను తిరిగి రైతులకు ఇచ్చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వ షేర్లు ధారాదత్తంపై ప్రస్తుతం సుప్రీంకోర్టులో కేసు నడుస్తుండగా రియల్ వెంచర్లు వేసేందుకు ఎలా అనుమతి ఇస్తారంటూ ఉద్యోగ, కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. వెంచర్లు వేసే ప్రయత్నాలను అడ్డుకుని తీరతామని స్పష్టం చేస్తున్నాయి.

ఇదీ చరిత్ర

హిందుస్థాన్ జింక్ పరిశ్రమ కోసం 1971–74 మధ్య విశాఖ నగరంలో మింది, చుక్కవానిపాలెం, ములగాడ, నక్కవానిపాలెం, ఎదురువానిపాలెం గ్రామాలకు చెందిన 365 ఎకరాలను ఎకరానికి రూ.840 చొప్పున చెల్లించి సేకరించారు. 1977లో ఉత్పత్తి ప్రారంభించిన ఈ పరిశ్రమలో 400 మంది నిర్వాసితులతో పాటు 1,200 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. 2 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి లభించింది. పరోక్షంగా వందలాది మందికి ఉపాధి లభించేది. అయితే ప్రైవేటుకు ద్వారాలు తెరిచిన కేంద్ర ప్రభుత్వం 2002లో..రూ.10 వేల కోట్లకు పైగా రిజర్వు నిధులు, రూ.10 వేల కోట్ల వ్యాపార లావాదేవీలతో లాభాల్లో నడుస్తున్న విశాఖ జింక్‌తో పాటు మరో మూడు పరిశ్రమలు (ఉదయపూర్, చందేరియా–రాజస్థాన్, తుండు –బిహార్) అలాగే ఐదు మైనింగ్ గనులు (బందలమెట్ట–గుంటూరు, సర్గేపల్లి–ఒడిశా, ఆహుజా, జవహర్, మటూన్ (రాజస్థాన్)ల్లో వాటాలను కారుచౌకగా వేదాంతకు కట్టబెట్టేసింది. ఈ 8 యూనిట్లలో తొలుత 26 శాతం షేర్లను రూ.445కోట్లకు ధారాదత్తం చేయగా, ఆ తర్వాత తన వాటాను నెమ్మదిగా 64.9 శాతానికి వేదాంత పెంచుకుంది. కాలక్రమేణా ఏర్పడిన ముడి సరుకు కొరత నేపథ్యంలో వేదాంత ఈ పరిశ్రమను మూసివేసింది.

పరిశ్రమ నడపండి.. లేదా రైతులకు ఇచ్చేయండి



విశాఖ జింక్ పరిశ్రమను నడపాలి. లేకపోతే ఎవరి భూములు వారికి ఇచ్చేయాలి. అంతే కానీ రియల్ ఎస్టేట్ వెంచర్లు వేయాలని చూస్తే సహించబోం. రూ.20 వేల కోట్ల నగదు నిల్వలు కాజేయడానికి వేదాంత కంపెనీ ఈ ఎత్తుగడ వేసింది. ఈ పరిశ్రమలో కేంద్ర ప్రభుత్వానికి నేటికీ 29 శాతం వాటా ఉంది.

–సీహెచ్ నరసింగరావు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు

ఎన్‌వోసీ ఇస్తే ఊరుకునేది లేదు..



రియల్ ఎస్టేట్ ప్లాట్లుగా వేసేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం నేడో రేపో ఎన్‌వోసీ జారీ చేసేందుకు ఉన్నత స్థాయిలో పైరవీలు జోరుగా సాగుతున్నాయి. ఎట్టిపరిస్థితుల్లోనూ ఇక్కడ రియల్ ఎస్టేట్ వెంచర్లు వేయనీయబోం. అందుకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం.

–పిట్టా నారాయణమూర్తి, కన్వీనర్, విశాఖ పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ

మూడేళ్లుగా బెల్టు షాపులను వదిలేశాం

- ప్రస్తుతం మహిళల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది
- ఇక తొలగించక తప్పదు: మంత్రి జవహర్



సాక్షి, అమరావతి బ్యూరో: 'మూడేళ్లుగా బెల్టు షాపులను చూసీచూడనట్లుగా వదిలేశాం. కానీ మహిళల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నందున తప్పనిసరి పరిస్థితుల్లో వాటిని తొలగించాల్సి వస్తోంది..' అని ఎక్సైజ్ శాఖ మంత్రి జవహర్ చెప్పారు. సోమవారం విజయవాడలో జరిగిన రాష్ట్ర వైన్ డీలర్స్ అసోసియేషన్ సమావేశంలో మంత్రి ప్రసంగించారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా నూతన మద్యం పాలసీ రూపొందించామన్నారు. కానీ రాజకీయ కక్షలు, మహిళల అభ్యంతరాలతో ఇంకా 25 శాతం వరకూ మద్యం దుకాణాలు, బార్లు ఏర్పాటు కాలేదని చెప్పారు. మద్యం షాపులను తొలగించాలంటూ కాల్ సెంటర్‌కు 7 వేల ఫిర్యాదులు అందాయని.. అందులో 188 మద్యం దుకాణాలను వేరే ప్రదేశానికి మార్చామని వివరించారు. కాగా, బార్లు ఏర్పాటుకు విధించిన గడువును పెంచేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

మమ్మల్ని నేరస్తుల్లా చూస్తున్నారు..

'ప్రభుత్వ విధాన లోపం వల్లే బెల్టు షాపులు ఏర్పాటయ్యాయి. బెల్టు షాపులు నడిపేవారు తెలివిగా మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి.. అమ్మకాలు జరుపుతున్నారు. అధికారులు మాత్రం వారికి మేమే ఇస్తున్నామంటూ కేసులు నమోదు చేసి నేరస్తుల్లా చూస్తున్నారు..' అంటూ రాష్ట్ర వైన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాలతో ప్రస్తుతం వ్యాపారులకు లైసెన్స్ ఫీజు మాత్రమే వస్తోందని.. కనీస ఖర్చులు కూడా రావడం లేదన్నారు. ఒక వ్యక్తికి ఆరు మద్యం బాటిళ్లు అమ్ముకోవచ్చని నిబంధనలున్నాయని, కానీ అలా అమ్ముకున్నా కూడా అనధికార విక్రయాల పేరుతో అధికారులు వేధిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధరల స్థిరీకరణ నిధి ఎక్కడ?

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి

సాక్షి, అమరావతి: నిత్యావసర వస్తువుల ధరల కట్టడికి రూ.2వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా దాని ఊసే ఎత్తడం లేదని పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి మండిపడ్డారు. టమోటా, ఉల్లిపాయ ధరలు భారీగా పెరిగిపోవడంతో పేదలు వాటిని కొనుగోలు చేయలేని స్థితిలో ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ మహిళా నేతలు ప్రధాని మోదీకి ట్విట్టర్ ద్వారా నిరసన రాఖీలను పంపించారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, ఉపాధ్యక్షురాలు కుర్షిదా, ఇందిర, గుంటూరు జిల్లా అధ్యక్షురాలు మల్లిక తదితరులు పాల్గొన్నారు. కాగా, నంద్యాల ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం అబ్దుల్ ఖాదర్‌కు మద్దతు ప్రకటించాలని కోరుతూ సీపీఐ, సీపీఎం, జనసేన పార్టీలకు రఘువీరారెడ్డి సోమవారం లేఖ రాశారు. అదేవిధంగా కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అవసరమైతే కలిసి పోటీ చేయడానికి ప్రతిపాదిస్తున్నట్లు పేర్కొన్నారు.

మనూలో యూజీసీ నెట్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం(మనూ)లోని యూజీసీ నెట్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నెట్/జేఆర్ఎఫ్ పరీక్షల కోసం ఉచితంగా ఇచ్చే శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. దరఖాస్తు ఫారాలు ఉర్దూ యూనివర్సిటీ క్యాంపస్‌లోని యూజీసీ నెట్ కోచింగ్ సెంటర్‌లో ఉచితంగా పొందవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తుకు రూ. 200 డీడీని జతచేయాల్సి ఉంటుంది. దరఖాస్తులను ఆగస్టు 28లోగా అందించాలి. మరిన్ని వివరాలకు 040–23008434ను సంప్రదించాలి. నవంబర్ మొదటి వారంలో నిర్వహించే ఈ పరీక్షలకు గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం యూజీసీ కోచింగ్ సెంటర్‌లో సెప్టెంబర్ 4 నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఇస్తారు. పేపర్– 1లోని జనరల్ స్టడీస్, టీచింగ్ ఆప్టిట్యూడ్ సబ్జెక్టులు, పేపర్– 2లోని ఉర్దూ, ఇంగ్లిష్,, అరబిక్, పర్షియన్, హిందీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, మేనేజ్‌మెంట్, సోషల్ వర్క్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్, విమెన్ స్టడీస్, ఎడ్యుకేషన్, మాస్ కమ్యూనికేషన్, జాగ్రఫీ వంటి సబ్జెక్టులలో శిక్షణ ఇస్తారు. ప్రతి సబ్జెక్టులో పది మందికి తగ్గకుండా చేరితేనే ఆయా సబ్జెక్టుపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

ప్రభుత్వం ముస్లింల మనోభావాలను దెబ్బతీస్తోంది

మసీదు కూల్చివేతపై ఎమ్మెల్యే ముస్తఫా ఆగ్రహం



సాక్షి, అమరావతి బ్యూరో: టీడీపీ ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ముస్లింల మనోభావాలను దెబ్బతీస్తోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ముస్తఫా ధ్వజమెత్తారు. కృష్ణా జిల్లాలో మసీదు కూల్చివేతపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విజయవాడ–మచిలీపట్నం రోడ్డు విస్తరణ కోసమంటూ మసీదులు తొలగించడం దారుణమన్నారు. కనీసం మత పెద్దలకు కూడా తెలియజేయకుండా అర్ధరాత్రి సమయంలో మసీదులు కూల్చివేయడమేమిటని ప్రశ్నించారు. మసీదులోని మత గ్రంథాలు, ఇతర సామగ్రి కూడా బయటకు తీసుకునే అవకాశమివ్వకుండా మసీదును కూల్చివేయడంపై మండిపడ్డారు. ముస్లిం, మైనార్టీలపై ప్రభుత్వానికి ఉన్న ప్రేమ ఇదేనా అంటూ ఎద్దేవా చేశారు. నంద్యాల ముస్లిం సోదరులకు ప్రభుత్వ ఘనకార్యాన్ని వివరిస్తామన్నారు. సమావేశంలో నాయకులు అజీబ్ బాషా, మొహమ్మద్ హన్ను, మొయిన్, నూర్ ఖాన్, షరీఫ్, హుస్సేన్, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

మన వాళ్లే.. అనుమతించండి

- స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్‌పై టీడీపీ నేతల ఒత్తిడి
- సమయం దాటిన తర్వాత కొటేషన్లు

సాక్షి, అమరావతి: అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు అధికారులు తల ఊపుతున్నారు. డెస్క్‌టాప్స్, ల్యాప్‌టాప్స్, స్కానర్లు, ప్రింటర్ల సరఫరా కోసం ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఈ నెల 3న సీల్డ్ కొటేషన్ల కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. కంప్యూటర్ తయారీదారులు, డీలర్లు ఈ నెల 7వ తేదీ సాయంత్రం 4లోగా కొటేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. అయితే సమయం దాటిపోయిన తర్వాత వచ్చిన ఇద్దరు వ్యక్తులను కూడా అనుమతించారు. సీల్డ్ కొటేషన్లు దాఖలు చేసేందుకు ఇనుపపెట్టె లేదా చెక్కపెట్టె ఏర్పాటు చేయాల్సి ఉన్నా అందుకు భిన్నంగా అట్టపెట్టె ఏర్పాటు చేయడం అనుమానాలకు తావిస్తోంది. సమయం దాటిపోయిన తర్వాత అట్టపెట్టెను ఓపెన్ చేసి మిగతా వారు వేసిన ధర కంటే కూడా వారు తక్కువ ధరకు కొటేషన్ వేశారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీ నేతల ఒత్తిడి మేరకే వారిని అనుమతించినట్లు సమాచారం.

దేవరపల్లి భూములు తిరిగి దళితులకే..

- మంత్రి నక్కా ఆనందబాబు వెల్లడి
- వైఎస్సార్‌సీపీ, ప్రజా సంఘాల పోరాటాలతో దిగివచ్చిన సర్కార్



పర్చూరు: ప్రకాశం జిల్లా దేవరపల్లిలోని దళితుల భూముల విషయంలో టీడీపీ సర్కార్ వెనక్కి తగ్గింది. వైఎస్సార్‌సీపీతో పాటు ప్రజా సంఘాలు చేసిన పోరాటాలతో దిగివచ్చింది. స్వాధీనం చేసుకున్న భూములను తిరిగి దళితులకే అప్పగిస్తామని ప్రకటించింది. ప్రకాశం జిల్లా పర్చూరు మండలం దేవరపల్లిలో దళితులు సాగు చేసుకుంటున్న భూముల్లో దౌర్జన్యంగా చెరువులు తవ్వడం వివాదమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇటీవల ఆ గ్రామంలో పర్యటించిన మంత్రుల బృందం సీఎం చంద్రబాబుకు నివేదిక అందజేసింది. మంత్రి నక్కా ఆనంద్‌బాబు కూడా సోమవారం దేవరపల్లిలో పర్యటించి దళితులతో మాట్లాడారు. స్వాధీనం చేసుకున్న భూములను తిరిగి దళితులకే ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ భూముల్లో మళ్లీ హాయిగా సాగు చేసుకోవచ్చని మంత్రి చెప్పగా.. ఇష్టారీతిన తవ్వకాలు జరిపితే సాగెలా చేసుకోవాలని బాధితులు ప్రశ్నించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. ఆ భూములను వెంటనే చదును చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే డేవిడ్‌రాజు మాట్లాడుతూ.. చిన్న సమస్యను పెద్దగా చేశారని, గతాన్ని మరిచిపోవాలని కోరారు.

3 నెలల్లో 28 సాగునీటి ప్రాజెక్టులు

▶ మొదటి పేజీ తరువాయి

పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జి డిజైన్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కెఎస్ జవహర్, జలవనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

15న పురుషోత్తపట్నం ప్రారంభం

ఈ నెల 15న పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. సోమవారం తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం పనులు, ఫొటో గ్యాలరీలను ఆయన పరిశీలించారు. అనంతరం అక్కడే విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. 10 మోటార్లతో 3,500 క్యూసెక్కుల నీటిని తోడే సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ నెల 15న రెండు మోటార్లతో నీటిని తోడుతామన్నారు. పోలవరం పూర్తయ్యేలోగా నీరు అందించేందుకే పురుషోత్తపట్నం ఎత్తిపోతల అని చెప్పారు.

6 లక్షల హెక్టార్లలో సాగు తగ్గింది

సాధారణ సాగు విస్తీర్ణంలో ఇప్పటిదాకా 43 శాతం విస్తీర్ణంలో మాత్రమే రైతులు పంటలు వేశారని ముఖ్యమంత్రి తెలిపారు. గతేడాదికన్నా ఈ ఏడాది ఆరులక్షల హెక్టార్లలో సాగు తగ్గిందన్నారు. సోమవారం తన నివాసం నుంచి నీరు–ప్రగతిపై ఆయన అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆల్మట్టి నుంచి నీరురాక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. బీమా పరిహారం ఇంకా రూ. 248 కోట్లు, ఇన్ పుట్ సబ్సిడీ రూ. 350 కోట్లు రైతుల ఖాతాల్లో జమకాలేదని, వెంటనే ఆ నిధులివ్వాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో పంటరుణాల పంపిణీ 60 శాతం మాత్రమే జరగడంపై అధికారులను ప్రశ్నించారు. అవెన్యూ ప్లాంటేషన్ పనులకు ఉపాధి కూలీలను మళ్లించాలని చెప్పారు. టెలీకాన్ఫరెన్స్‌లో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పనులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

సీఎంకు రాఖీ కట్టిన మహిళా ప్రజాప్రతినిధులు..

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబుకు పలువురు మహిళా ప్రజాప్రతినిధులు సోమవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో రాఖీలు కట్టారు. మంత్రి పరిటాల సునీత, మాజీ మంత్రి పీతల సుజాత, టీడీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు శోభా హైమావతి, కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ, బ్రహ్మకుమారీలు, తెలంగాణ టీడీపీ నాయకురాలు సీతక్క, విజయవాడ అర్బన్ టీడీపీ ఉపాధ్యక్షురాలు నిర్మలాదేవి తదితరులు ఆయనకు రాఖీలు కట్టిన వారిలో ఉన్నారు.

పురుషోత్తపట్నంలో రైతుల గృహ నిర్బంధం

సాక్షి, రాజమహేంద్రవరం: సీఎం చంద్రబాబు సోమవారం పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పరిశీలనకు వచ్చిన సమయంలో ఆ ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన రైతులను, ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నేతలను ప్రభుత్వం గృహ నిర్బంధం చేసింది. భూముల పరిహార విషయంలో కొందరు రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కోర్టుకు వెళ్లారు. ప్రాజెక్టు కోసం 254 ఎకరాల భూమి అవసరమని అధికారులు గుర్తించారు. ఇందులో 48 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా 223 మంది రైతులు 134.31 ఎకరాలను భూసేకరణలో ప్రభుత్వానికి ఇచ్చారు. మిగతా 72 ఎకరాలకు సంబంధించిన 90 మంది రైతులు పరిహారం మొత్తం పెంపుపై కోర్టుకు వెళ్లారు. అయితే ఆ రైతులు సీఎం పర్యటనలో ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేస్తారేమోనన్న భయంతో ప్రభుత్వం పోలీసులతో వారిని ఇళ్ల నుంచి కదలకుండా నిర్బంధించింది. ఏలూరు డీఐజీ రామకృష్ణ, రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా ఎస్పీ రాజకుమారి ఆధ్వర్యంలో 850 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సీఎం పురుషోత్తపట్నం నుంచి వెళ్లిన తర్వాతే రైతులను విడిచిపెట్టారు. రైతులకు మద్దతుగా వస్తారని వైఎస్సార్‌సీపీ నేత జక్కంపూడి విజయలక్ష్మిని రాజమహేంద్రవరంలో గృహ నిర్బంధం చేశారు. ఆమెను ఇంటి నుంచి కదలనీయకుండా పోలీసులు కాపలాగా ఉన్నారు. సీతానగరం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ డాక్టర్ బాబును అరెస్ట్ చేసి స్టేషన్‌లో ఉంచారు. అలాగే పురుషోత్తపట్నం వద్ద గోదావరి గట్టుపై 30 ఏళ్లుగా ఉంటున్న వారిని ఖాళీ చేయించారు.



వైఎస్సార్‌సీపీ నేత డాక్టర్ బాబును పోలీస్‌స్టేషన్‌కు తరలించి సంతకం తీసుకుంటున్న దృశ్యం

బాబు నిరంకుశత్వానికి పరాకాష్ట



ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులను గృహనిర్బంధం చేయడం చంద్రబాబు నిరంకుశత్వానికి పరాకాష్ట. వారి భూములు తీసుకుని వారిని కలిసేందుకు కూడా ఇష్టపడటంలేదంటే ఏమనుకోవాలి. ప్రాజెక్టు పరిశీలన అంటే వచ్చి వెళ్లడమా? బరితెగించి దోపిడీ చేస్తున్నారు.

– జక్కంపూడి విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు

ఇదెక్కడి న్యాయం..?



గతంలో పుష్కర ఎత్తిపోతలు, ఇతర ప్రాజెక్టుల కోసం భూములిచ్చాం. ఇప్పుడు ఉన్న కాస్త భూమిని కూడా పురుషోత్తపట్నం కోసం తీసుకున్నారు. మా కుటుంబం ఎలా బతకాలి. మా భూములు తీసుకుని మమ్మల్నే గృహనిర్బంధం చేశారు. ఇదెక్కడి న్యాయం.

– కురుటూరి శ్రీనివాస్, రామచంద్రపురం

మీకు రాఖీ శుభాకాంక్షలు చెప్పే అర్హతుందా?

- సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేత రోజా ధ్వజం
- మహిళా ఐఏఎస్ అధికారిని వేధించిన కంత్రీ మంత్రిని వెనకేసుకు రావడం సిగ్గుచేటు



సదస్సులో మాట్లాడుతున్న రోజా. చిత్రంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, పార్టీ నేతలు

సాక్షి, అమరావతి బ్యూరో/మంగళగిరి: రాష్ట్రంలో మహిళల్ని రక్షించడంలో ఘోరంగా విఫలమై చేతకాని ప్రభుత్వాన్ని నడుపుతున్న చంద్రబాబు ఏ ముఖం పెట్టుకుని మహిళలకు రాఖీ శుభాకాంక్షలు చెబుతారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్యే ఆర్కే రోజా ప్రశ్నించారు. ఆమె సోమవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ సీఎంపై విరుచుకుపడ్డారు. 'రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైంది. టీడీపీ పాలనలో మహిళలు అభద్రతాభావంతో ఉన్నారు. ఒకవైపు రాష్ట్రంలో మహిళల్ని వేధిస్తూ.. మరోవైపు మహిళా సాధికారతంటూ చంద్రబాబు వల్లమాలిన ప్రేమ నటిస్తున్నారు' అని మండిపడ్డారు. తుందుర్రులో ఆక్వాఫుడ్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా నినదించిన మహిళల బ్లౌజు చించి కొట్టడం.. విజయవాడ కాల్‌మనీ సెక్స్‌రాకెట్‌లో అమాయక మహిళల్ని వ్యభిచారంలోకి దించడానికి కారణమైన టీడీపీ నేతలు బొడే ప్రసాద్, బుద్దా వెంకన్న వంటివారిని వెనకేసుకు రావడమేనా మహిళా సాధికారత? అని నిలదీశారు. దేశంలో నలుగురు మంత్రులపై లైంగిక ఆరోపణలున్నాయని ఓ సర్వేలో తేలితే అందులో రాష్ట్రానికి చెందిన ఇద్దరు మంత్రులుండటం సిగ్గుచేటన్నారు. ఉత్తరాంధ్రకు చెందిన ఓ మంత్రి మహిళా ఉద్యోగుల్ని వేధిస్తున్నా సీఎంకు చీమ కుట్టినట్టు లేదని, అతన్ని వెనకేసుకొస్తున్నారని ధ్వజమెత్తారు. మహిళా ఐఏఎస్ అధికారిని వెకిలిచేష్టలతో వేధిస్తున్న కంత్రీ మంత్రిని తక్షణమే బర్తరఫ్ చేయాలన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని దించే దిశగా మహిళలు కాళికలుగా మారాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం మహిళల్ని కాపాడాలంటూ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే రోజా రాఖీ కట్టారు. కాగా,అన్న వైఎస్ జగన్ అధికారంలోకి వస్తేనే చేనేత రంగం పురోభివృద్ధి సాధిస్తుందని రోజా అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో సోమవారం జరిగిన అంతర్జాతీయ చేనేత దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ చేనేత బ్రాండ్ అంబాసిడర్‌నని చెప్పుకున్న పవన్‌కల్యాణ్‌కు జీఎస్టీపై గానీ చేనేతల సమస్యలపై గానీ చంద్రబాబుతో మాట్లాడేందుకు సమయం లేదని, వారి రహస్య సమావేశాలకు మాత్రం సమయముంటుందని విమర్శించారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీనీ నెరవేర్చని బాబుపై నేతన్నలంతా ఏకమై పోరాడే సమయం ఆసన్నమైందన్నారు. సదస్సులో పార్టీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చిల్లపల్లి మోహనరావు, నేతలు దొంతిరెడ్డి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి అగ్రి కౌన్సెలింగ్


సాక్షి, అమరావతి: వ్యవసాయం, వెటర్నరీ, హార్టీకల్చర్ బైపీసీ విభాగం కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 17 నుంచి 23 వరకు కౌన్సెలింగ్ జరుగుతుందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ టీవీ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులను వారి ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్‌కు పిలుస్తారు. ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ విభాగాల సీట్లను నిబంధనల ప్రకారం భర్తీ చేస్తారు. కౌన్సెలింగ్‌కు వచ్చిన వారందరికీ సీట్లు వచ్చినట్టు భావించడానికి వీలు లేదని, ర్యాంకుల ప్రాతిపదికగా మాత్రమే ఇస్తారని రిజిస్ట్రార్ స్పష్టం చేశారు. ప్రైవేటు వ్యవసాయ, హార్టీకల్చర్ కళాశాలల్లోని ఎ–కేటగిరీ సీట్ల భర్తీకి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను చూడాలని విజ్ఞప్తి చేశారు.

దూరవిద్య డిగ్రీ ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ (గుంటూరు): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం ఈ ఏడాది మే, జూన్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో నిర్వహించిన వివిధ డిగ్రీ కోర్సుల ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని ఆ పరీక్షల విభాగం డిప్యూటీ రిజిస్ట్రార్ సత్యవతి తెలిపారు. రీవాల్యుయేషన్‌కు ఈ నెల 22వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.770 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నన్ను పీఏగా రమ్మంటావా..

- ఎన్‌హెచ్‌ఏఐ ఎస్ఈపై కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు ఆగ్రహం
- అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో జాప్యంపై ఎస్ఈని ప్రశ్నించిన మంత్రి
- ప్రతిపాదనలు అందలేదనడంతో అసహనానికి గురైన అశోక్



సాక్షి ప్రతినిధి, విజయనగరం: 'నన్ను పీఏగా రమ్మంటావా..' అంటూ జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) ఎస్ఈపై కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వే వంతెనకు అప్రోచ్ రోడ్డు నిర్మాణం విషయమై ప్రతిపాదనలు అందలేదని ఎస్ఈ ఇచ్చిన సమాధానంతో కేంద్రమంత్రి ఈ విధంగా తన అసహనం వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లాలో చేపట్టిన పలు ప్రాజెక్టులపై అశోక్ గజపతిరాజు సోమవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ.. రైల్వే శాఖ పట్టణంలో నిర్మిస్తున్న వంతెనకు అప్రోచ్ రోడ్డు ఏర్పాటు విషయంలో జాప్యం ఎందుకు జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి కారణమేంటో చెప్పాలని అధికారులను నిలదీశారు. దీంతో ఎన్‌హెచ్‌ఏఐ ఎస్ఈ మనోహర్‌రెడ్డి లేచి.. తమకసలు ప్రతిపాదనలే అందలేదని బదులిచ్చారు. ఈ విషయాన్ని ఇప్పటి వరకు తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని అశోక్ గజపతిరాజు గట్టిగా అడిగే సరికి, మనోహర్‌రెడ్డి కూడా అంతే స్వరంతో.. 'ఈ విషయాన్ని మీ ఓఎస్డీకి అనేకసార్లు చెప్పాం. ఆయన పట్టించుకోవడం లేదు. ఇందులో మా తప్పేమీ లేదు' అంటూ బదులిచ్చారు. ఇంతలో రైల్వే అధికారులు కల్పించుకుని ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. రైల్వే శాఖ ప్రతిపాదనలు పంపించామంటుంటే.. మీరు రాలేదంటున్నారేంటని మంత్రి ఎస్ఈని నిలదీశారు. ఇంతవరకూ అవి తమకు అందలేదని ఎస్ఈ మళ్లీ స్పష్టం చేశారు. లోపం ఎక్కడుందో తెలుసుకోవాలి కదా అని మంత్రి అనడంతో.. అది మీరే తెలుసుకోవాలని ఎస్ఈ బదులిచ్చారు. దీంతో అసహనానికి గురైన అశోక్‌గజపతిరాజు.. 'మీ పనులు చూసేందుకు నన్ను మీ పీఏగా రమ్మంటారా?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ఉద్దేశం అదికాదంటూ ఎస్ఈ వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించారు. ఇంతలో మీడియాను గమనించిన మంత్రి.. వెంటనే విలేకరులను బయటకు పంపించాలన్నారు.

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య నేటి విద్యలో..
- బ్యాంక్ పీవోస్, క్లర్క్స్: రీజనింగ్
- జనరల్ స్టడీస్: బయాలజీ

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన ఈ-మెయిల్
sakshieducation@gmail.com

దరఖాస్తు చేశారా?

- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 21 స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టులకు చివరి తేదీ: ఆగస్టు 10
- యూపీఎస్సీ ద్వారా భర్తీ చేసే 32 మార్కెటింగ్ ఆఫీసర్, స్పెషలిస్ట్ గ్రేడ్ (3), అసిస్టెంట్ కెమిస్ట్ పోస్టులకు చివరి తేదీ: ఆగస్టు 10
- పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్)లో 20 డిప్లొమా ట్రైనీ పోస్టులకు చివరి తేదీ: ఆగస్టు 10



ఓటర్ నినాదం?

గ్రూప్స్ ప్రత్యేకం



ఎన్నికల ప్రక్రియ

ఓటర్ల జాబితా తయారీ

ఎన్నికల ప్రధాన అధికారి పర్యవేక్షణలో ఓటర్ల జాబితా రూపకల్పన, మార్పులు, చేర్పులు చేస్తారు. ఇది ఎన్నికల ప్రక్రియలో మొదటి దశ.

ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్

పార్లమెంటు ఎన్నికలకు రాష్ట్రపతి పేరుతో, రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు గవర్నర్ పేరుతో నోటిఫికేషన్లు జారీ అవుతాయి. వీటిని కేంద్ర ఎన్నికల సంఘమే వారి పేర్లతో జారీ చేస్తుంది. సాధారణంగా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవడానికి కొన్ని వారాల ముందు ఎన్నికల షెడ్యూల్‌ను ఎలక్షన్ కమిషన్ వెలువరిస్తుంది. ఆ వెనువెంటనే ఎన్నికల నియమావళి అమల్లోకొస్తుంది.

నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తమ నామినేషన్లను సంబంధిత నియోజకవర్గ ఎన్నికల అధికారికి సమర్పించాలి. దానికి సంబంధించి ధ్రువీకరణ ప్రమాణం కూడా చేయాలి. సాధారణంగా నామినేషన్ల పరిశీలన పూర్తయిన రెండు రోజుల్లోపు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు.

ఎన్నికల ప్రచారం

రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తమ సిద్ధాంతాలు, విధానాలను తెలియజేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించుకోవచ్చు. పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటించిన రోజు నుంచి రెండు వారాల వరకు ఎన్నికల ప్రచారానికి సమయం ఉంటుంది. పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేయాలి.

బ్యాలెట్ పత్రాలు, గుర్తులు

నామినేషన్ల పర్వం ముగిసిన తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ఇంగ్లిష్ ఆల్ఫాబెట్ ఆర్డర్‌లో ఎన్నికల అధికారి రూపొందిస్తారు. బ్యాలెట్ పత్రం/ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)పై అభ్యర్థికి కేటాయించిన గుర్తుతోపాటు పేరును ఆంగ్లం, సంబంధిత ప్రాంతీయ భాష లేదా హిందీలో ముద్రిస్తారు.

ఎన్నికల విధానం

రహస్య ఓటింగ్ పద్ధతిని పాటిస్తారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో 1,500 మంది ఓటర్లకు మించకుండా చూస్తారు. ఎన్నికల రోజున పోలింగ్ స్టేషన్‌ను కనీసం 8 గంటలకు తక్కువ కాకుండా తెరచి ఉంచాలి.

ఓట్ల లెక్కింపు

ఓటింగ్ పూర్తయ్యాక ఒకటి లేదా రెండు రోజుల తర్వాత రిటర్నింగ్ అధికారి, పరిశీలకుల సమక్షంలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అత్యధిక ఓట్లు సాధించిన అభ్యర్థిని విజేతగా ప్రకటించి రిటర్నింగ్ అధికారి ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. దీంతో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది.

ఎన్నికలు - వివాదాలు - పరిష్కారం

ప్రకరణ 323 (బి) ప్రకారం పార్లమెంటు, రాష్ట్ర శాసన సభల ఎన్నికల వివాదాలను పరిష్కరించడానికి పార్లమెంటు ఒక చట్టం ద్వారా ప్రత్యేక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయొచ్చు. అయితే ఇప్పటివరకు అలాంటి ట్రిబ్యునల్ ఏర్పాటు కాలేదు. ప్రస్తుతం ఇలాంటి వివాదాలను సంబంధిత రాష్ట్ర హైకోర్టులోనే పరిష్కరించుకుంటున్నారు. దీనికి సంబంధించి అభ్యర్థి లేదా ఓటర్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలి.

ప్రత్యేక వివరణ

ఎన్నికలు జరిగే సమయంలో అంటే ఫలితాలను ప్రకటించక ముందు ఎన్నికల్లో జరిగిన అక్రమాలకు సంబంధించిన, ఇతర ఫిర్యాదులను కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలించి తీర్పు వెలువరిస్తుంది. ఈ దశలో న్యాయస్థానాన్ని ఆశ్రయించడానికి వీల్లేదు. ఫలితాలు వెలువడిన తర్వాత సంబంధిత వివాదాలను హైకోర్టులోనే పరిష్కరించుకోవాలి.

ఓటర్ నినాదం


'ఓటర్‌గా ఉన్నందుకు గర్వపడుతున్నాను. ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నాను'.

ఓటర్ దినోత్సవం

ఏటా జనవరి 25న ఓటర్ దినోత్సవం జరుపుకుంటున్నాం. 2011 నుంచి దీన్ని ప్రారంభించారు. 7వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని 2017, జనవరి 25న జరుపుకున్నాం.

ఓటర్ల ప్రతిజ్ఞ

'ప్రజాస్వామ్యంలో విశ్వసనీయతకు కట్టుబడి ఉన్న భారత పౌరులైన మేము మా దేశంలో ప్రజాస్వామ్య సంప్రదాయాలను, స్వేచ్ఛ, న్యాయమైన, శాంతియుత ఎన్నికల గౌరవాన్ని నిలిపి ఉంచుతామని, ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా, మతం, వర్గం, కులం, సంఘం భాష తదితర ప్రలోభాలను పరిగణనలోకి తీసుకోకుండా, వాటికి గురికాకుండా ఓటు వేస్తామని ఇందుమూలంగా ప్రతిజ్ఞ చేస్తున్నాము'.



ఇండియన్ పాలిటీ

ప్రజా ప్రాతినిధ్య చట్టాలు

పార్లమెంటు, రాష్ట్ర శాసన సభలో గరిష్ట సభ్యుల సంఖ్య, సీట్ల కేటాయింపులకు సంబంధించి కొన్ని నియమాలను భారత రాజ్యాంగ ప్రకరణలు 81, 170లో పేర్కొన్నారు. అయితే వాటికి సంబంధించి సమగ్ర వివరాలను పొందుపరచలేదు. సీట్ల కేటాయింపు, నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ, రిజర్వేషన్లు మొదలైన విషయాలను పార్లమెంటు ఒక చట్టం ద్వారా నిర్ణయిస్తుంది. ఇప్పటివరకు దీనికి సంబంధించి పార్లమెంటు రెండు చట్టాలను రూపొందించింది. అవి..

1. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950
2. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951

ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950

ఈ చట్టం ప్రధానంగా పార్లమెంటు, రాష్ట్ర శాసన సభల్లో సీట్ల కేటాయింపు, నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణకు సంబంధించింది. అలాగే ఓటర్ల జాబితా రూపకల్పన, ఓటరుగా నమోదు చేసుకోవడానికి సంబంధించిన అర్హతల గురించి తెలుపుతుంది. ఈ చట్టంలో 32 సెక్షన్లు, 5 భాగాలు, 4 షెడ్యూళ్లు ఉన్నాయి. ఈ చట్టాన్ని పార్లమెంటు చాలాసార్లు సవరించింది. 2008లో ఈ చట్టానికి సమగ్ర సవరణలు చేశారు.

ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951

- పార్లమెంటు సభ్యులు, రాష్ట్ర శాసనసభ సభ్యుల అనర్హతల గురించి ఈ చట్టంలో పేర్కొన్నారు. కింది సందర్భాల్లో వారు సభ్యత్వం కోల్పోతారు, లేదా పోటీకి అనర్హులవుతారు.
- రెండేళ్లకు తక్కువ కాకుండా శిక్ష పడినవారు శిక్షా కాలంలో, శిక్ష ముగిసిన తర్వాత ఆరేళ్ల వరకు పోటీకి అనర్హులు.
- వరకట్న నిషేధ చట్టం, ఆహార కల్తీ మొదలైన నేరాల్లో ఆరేళ్ల కంటే తక్కువ కాకుండా శిక్ష పడినవారిని అనర్హులుగా ప్రకటిస్తారు.
- అవినీతి నిరోధక చట్టం, ప్రజా శాంతి చట్టం, ఇండియన్ పీనల్ కోడ్‌లలో పేర్కొన్న కొన్ని నేరాలకు పాల్పడి, నేరం రుజువైతే కూడా అనర్హులవుతారు.
- అవినీతి నేరం కింద తొలగింపునకు గురైన ప్రభుత్వ ఉద్యోగులు ఐదేళ్ల వరకు ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులు.
- మతం, కులం, జాతి, భాష ప్రాతిపదికన ఓట్లు అడిగినప్పుడు, వాటి పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టినప్పుడు అనర్హులుగా ప్రకటిస్తారు.

ఎన్నికల నిర్వహణ - ప్రవర్తన నియమావళి (Model code of conduct)

- ఎన్నికలను సజావుగా, అవినీతి రహితంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కొన్ని మార్గదర్శక సూత్రాలను రాజకీయ పార్టీలు, పౌరులకు జారీ చేస్తుంది.
- 1971లో 5వ సార్వత్రిక ఎన్నికల్లో మొట్టమొదటిసారి వీటిని ప్రకటించారు. వీటికి రాజ్యాంగ బద్ధత, చట్టబద్ధత లేదు.
- ఎన్నికలను సక్రమంగా నిర్వహించడమే ఈ ప్రవర్తన నియమావళి ముఖ్య ఉద్దేశం.
- డబ్బు, మద్యం తదితర బలహీనతల ఆధారంగా ఓటర్లను ప్రభావితం చేయకూడదు.
- కులం, మతం, ఇతర సెంటిమెంట్ల ఆధారంగా ఓట్లు అడగకూడదు.
- అధికారంలో ఉన్న ప్రభుత్వం ఓటర్లను ప్రభావితం చేసేలా కొత్త పథకాలను ప్రకటించకూడదు.
- నిరాధార ఆరోపణలు, గౌరవాన్ని కించపరిచే విమర్శలు చేయకూడదు.
- ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ వాహనాలు, సిబ్బందిని వినియోగించకూడదు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (E.V.M)

- తొలుత వీటిని ప్రయోగాత్మకంగా మధ్యప్రదేశ్ (5), రాజస్థాన్ (5), ఢిల్లీ (6), శాసనసభ ఎన్నికల్లో పలు నియోజకవర్గాల్లో 1989-90లో ఉపయోగించారు. ఇందుకు అనుగుణంగా ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951కి సవరణలు చేశారు. 1999లో గోవా శాసనసభ ఎన్నికల్లో E.V.Mలను పూర్తిస్థాయిలో వినియోగించారు. ఒక E.V.Mలో 3,840 మంది ఓటర్లను మాత్రమే రికార్డు చేసేందుకు వీలుంటుంది. ఒక E.V.Mలో 64 మంది అభ్యర్థుల వివరాలను మాత్రమే పొందుపర్చొచ్చు. E.V.Mలను భారత ప్రభుత్వరంగ సంస్థ అయిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ECIL) తయారు చేస్తాయి. E.V.Mలలో నిక్షిప్తమైన సమాచారం 10 ఏళ్ల వరకు ఉంటుంది.

ఎన్నికల్లో పోటీకి అర్హతలు

- లోక్‌సభకు పోటీ చేసే అభ్యర్థులు దేశంలో ఏదో ఒక నియోజకవర్గంలో ఓటరుగా నమోదై ఉండాలి.
- లోక్‌సభకు పోటీ చేసే వ్యక్తి ఇండిపెండెంట్ అభ్యర్థి అయితే సంబంధిత నియోజకవర్గం లోని పది మంది ఓటర్ల మద్దతు తెలపాలి.
- గుర్తింపు పొందిన రాజకీయ పార్టీకి చెందిన అభ్యర్థికి ఒక ఓటరు మద్దతు సరిపోతుంది.
- పై షరతులు రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు కూడా వర్తిస్తాయి.
- లోక్‌సభ, రాజ్యసభకు పోటీ చేసే జనరల్, ఓబీసీ అభ్యర్థులు నామినేషన్ సమయంలో రూ.25,000 ధరావతు(డిపాజిట్) చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12,500 ధరావతు చెల్లించాలి.
- రాష్ట్ర శాసనసభ, శాసన మండలికి పోటీచేసే అభ్యర్థి ఆ రాష్ట్రంలో ఏదో ఒక నియోజకవర్గంలో ఓటరుగా నమోదై ఉండాలి.
- రాష్ట్ర అసెంబ్లీ, శాసన మండలికి పోటీ చేసే జనరల్, బీసీ అభ్యర్థులు రూ.10,000 ధరావతు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5,000 ధరావతు చెల్లించాలి.
- లోక్‌సభ లేదా రాష్ట్ర విధాన సభకు సంబంధించి ఒక అభ్యర్థి రెండు స్థానాలకు మించి పోటీ చేయడానికి అవకాశం లేదు.
- ఫలితాలు వెలువడిన 30 రోజుల్లోపు ఎన్నికలకు సంబంధించిన వ్యయాల వివరాలను ఎన్నికల సంఘానికి తెలియజేయాలి.

NOTA (None of the above) తిరస్కరించే ఓటు



- ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు ఓటర్లకు నచ్చకపోతే పై ఎవరూ కాదు అనే ఐచ్ఛికాన్ని ఎంపిక చేసుకోవడాన్ని మొదటిసారిగా ఢిల్లీ, మిజోరాం, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో (2013, డిసెంబర్) ప్రవేశపెట్టారు. 2013లో పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ఆధారంగా దీన్ని ప్రవేశపెట్టారు. భావవ్యక్తీకరణలో అంతర్భాగంగానే దీన్ని పరిగణించాలి. ప్రపంచంలో 13 దేశాలు ఈ పద్ధతిని పాటిస్తున్నాయని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఫ్రాన్స్, అమెరికా, బెల్జియం, స్పెయిన్, స్వీడన్, బ్రెజిల్ తదితర దేశాల్లో ఈ విధానం అమల్లో ఉంది.

డిపాజిట్ దక్కించుకోవడం (లేదా) కోల్పోవడం

దేశంలో జరిగే ఏ ఎన్నికల్లో అయినా పోటీ చేసిన అభ్యర్థికి పోలై చెల్లుబాటైన ఓట్లలో 1/6 వంతు వస్తే డిపాజిట్ దక్కినట్లుగా ప్రకటిస్తారు. అంతకంటే తక్కువ ఓట్లు వస్తే డిపాజిట్ కోల్పోయినట్లు.

వ్యయ పరిమితులు

- 2014 ఎన్నికల్లో ఎలక్షన్ కమిషన్ జారీచేసిన మార్గదర్శక సూత్రాల ప్రకారం అభ్యర్థుల ఎన్నికల వ్యయానికి సంబంధించి పరిమితులు విధించింది.
- పెద్ద రాష్ట్రాల్లో లోక్‌సభ నియోజకవర్గంలో రూ.70 లక్షలకు మించి ఖర్చు చేయకూడదు.
- చిన్న రాష్ట్రాల్లో (అరుణాచల్‌ప్రదేశ్, గోవా, సిక్కిం) లోక్‌సభ నియోజకవర్గంలో, అలాగే కేంద్రపాలిత ప్రాంతాల్లో రూ.54 లక్షలకు మించి ఖర్చు చేయకూడదు.
- రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో పెద్ద రాష్ట్రాలైతే రూ.28 లక్షల వరకు ఖర్చు చేయొచ్చు.
- చిన్న రాష్ట్రాల్లో, కేంద్రపాలిత ప్రాంతాల్లో (ఢిల్లీ మినహా) అభ్యర్థులు రూ.20 లక్షల వరకు ఖర్చు చేయొచ్చు.

బి. కృష్ణారెడ్డి,
డైరెక్టర్,
క్లాస్-వన్ స్టడీ సర్కిల్



ఏ రాష్ట్రంలో అత్యధికంగా వరదలు సంభవిస్తాయి?

పోటీపరీక్షల ప్రత్యేకం



ఇండియన్ జాగ్రఫీ

- **వాతావరణం అంటే?**
- జ. నిర్దిష్ట కాలంలో ఒక ప్రాంతంలోని సూర్యరశ్మి, ఉష్ణోగ్రత, వాతావరణ పీడనం, పవనాలు, ఆర్ద్రత, మేఘాలు, అవపాతం వంటి అంశాల స్థితిని వాతావరణం అంటారు.
- **శీతోష్ణస్థితి అనగా?**
- జ. సాధారణంగా ఒక విశాల ప్రాంతంలో 30 లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాలపాటు ఒకేలా ఉన్న వాతావరణ పరిస్థితులను శీతోష్ణస్థితిగా పేర్కొంటారు.
- **శీతోష్ణస్థితిని ప్రభావితం చేసే అంశాలేవి?**
- జ. ● అక్షాంశం/భూమధ్యరేఖ నుంచి దూరం ● భూమికి, నీటికి మధ్య గల సంబంధం ● భౌగోళిక స్వరూపం ● ఉపరితల గాలి ప్రసరణ
- **తూర్పు జెట్ ప్రవాహం ఎక్కడ ఏర్పడుతుంది?**
- జ. 25° ఉత్తర అక్షాంశం వద్ద.
- **జెట్ ప్రవాహాలు ఎంత వేగంతో వీస్తాయి?**
- జ. ఇవి వేసవిలో గంటకు 110 కి.మీ.; శీతాకాలంలో 184 కి.మీ. వేగంతో వీస్తాయి.
- **భారత్‌లో శీతాకాలంలో వీచే పశ్చిమ విక్షోభాలు లేదా పశ్చిమ అలజడులు ఏ సముద్రం నుంచి వీస్తాయి?**
- జ. మధ్యధరా సముద్రం నుంచి వీస్తాయి. వీటి వల్ల ఉత్తర భారతదేశంలో మోస్తరు వర్షం కురుస్తుంది. ఇది రబీలో సాగు చేసే గోధుమ పంటకు ఉపయోగపడుతుంది.



- **అంతర ఆయనరేఖా అభిసరణ మండలం అంటే?**
- జ. ఉత్తరార్ధ గోళంలోని ఈశాన్య వ్యాపార పవనాలు, దక్షిణార్ధ గోళంలోని ఆగ్నేయ వ్యాపార పవనాలు భూమధ్యరేఖ వద్ద కలిసే ప్రాంతాన్ని అంతర ఆయనరేఖా అభిసరణ మండలం అంటారు.
- **వేసవిలో ఉత్తరాది మైదానాల్లో పొడిగా, వేడిగా వీచే స్థానిక పవనాలను ఏమని పిలుస్తారు?**
- జ. 'లూ'పవనాలు.
- **ప్రపంచ వాతావరణ పరిశోధన సంస్థ ఎక్కడ ఉంది?**
- జ. జెనీవా (స్విట్జర్లాండ్)
- **వాతావరణ శాఖ సంవత్సరాన్ని ఎన్ని కాలాలుగా విభజించింది? అవి ఏవి?**
- జ. 4 కాలాలు. అవి..
  1. వేసవి కాలం
  2. నైరుతి రుతుపవన కాలం
  3. ఈశాన్య రుతుపవన/తిరోగమన రుతుపవన కాలం
  4. శీతాకాలం
- **భారత్‌లో వేసవిలో కురిసే వర్షపాతం?**
- జ. సంవహన వర్షపాతం.
- **వేసవిలో కురిసే రుతుపవన ఆరంభపు జల్లుల్ని కర్ణాటకలో ఏమని పిలుస్తారు?**
- జ. చెర్రీ బ్లాసమ్స్(తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మామిడి జల్లులు) అని పిలుస్తారు.
- **భారత్‌లో ఏ రుతుపవనాల వల్ల ఎక్కువ వర్షపాతం నమోదవుతోంది?**
- జ. నైరుతి రుతుపవనాలు.
- **నైరుతి రుతుపవనాల బంగాళాఖాత శాఖ, అరేబియా శాఖ ఏ ప్రాంతంలో కలుస్తాయి?**
- జ. లుధియానా (పంజాబ్).
- **భారత్‌లో నైరుతి రుతుపవనాల వల్ల వర్షపాతం పొందని ప్రాంతాలు?**
- జ. తమిళనాడు, దక్షిణ కోస్తా ప్రాంతం, వాయవ్య రాజస్థాన్, లడఖ్.
- **దేశంలో అత్యధిక వర్షపాతం పొందే ప్రాంతాలు?**
- జ. మాసిన్‌రామ్, చిరపుంజి.
- **ఈశాన్య రుతుపవనాల వల్ల అధిక వర్షపాతం పొందే ప్రాంతం?**
- జ. తమిళనాడు.షెవరాయ్ పర్వతాల కారణంగా ఇక్కడ అధిక వర్షపాతం నమోదవుతుంది.
- **భారతదేశ తీరప్రాంతాల్లోకెల్లా అత్యధికంగా తుపాన్లకు గురయ్యే తీర ప్రాంతం?**
- జ. ఒడిశా తీరం.
- **'మాన్‌సూన్' అనే ఆంగ్ల పదం ఏ భాషా పదం నుంచి ఆవిర్భవించింది?**
- జ. అరబిక్ పదమైన మౌసమ్ నుంచి 'మాన్‌సూన్' పదం ఆవిర్భవించింది. 'మౌసమ్' అంటే తెలుగులో 'రుతువు' అని అర్థం.
- **ఏ రాష్ట్రంలో అత్యధికంగా వరదలు సంభవిస్తాయి?**
- జ. అసోం.
- **ఇటీవల కాలంలో ఉత్తర అక్షాంశాల వద్ద ఉన్న గడ్డకట్టిన టండ్రాల కింద పెద్ద మొత్తంలో ఏ వాయువు ఉందని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు?**
- జ. మీథేన్.
- **కొరియాలిస్ బలం ఏ విధంగా ఏర్పడుతుంది?**
- జ. భూ భ్రమణం వల్ల ఏర్పడుతుంది. ఈ కొరియాలిస్ ప్రభావం వల్ల పవనాలు ఉత్తరార్ధ గోళంలో కుడి వైపునకు, దక్షిణార్ధ గోళంలో ఎడమ వైపునకు పయనిస్తాయి.
- **కొప్పెన్ వేటి ఆధారంగా శీతోష్ణస్థితి వర్గీకరణ చేశాడు?**
- జ. నెలసరి ఉష్ణోగ్రత, వర్షపాత విలువల ఆధారంగా.
- **భారతదేశంలో అత్యధికంగా ఏ రకమైన వర్షపాతం నమోదవుతుంది?**
- జ. పర్వతీయ వర్షపాతం
- **జెట్ ప్రవాహాలు ఏ దిశ నుంచి వీస్తాయి?**
- జ. ఊర్ధ్వ వాతావరణంలో పశ్చిమ దిశ నుంచి తూర్పు దిశకు వేగంగా వీస్తాయి.
- **భారతదేశంలో దుమ్ము తుపాన్లు ఏ నెలలో ఎక్కువ?**
- జ. మే నెలలో.
- **'థార్న్‌త్వైట్' దేని ఆధారంగా శీతోష్ణస్థితిని వర్గీకరించాడు?**
- జ. జల సంతులన భావన ఆధారంగా; ఇతడు భారతదేశాన్ని 6 శీతోష్ణమండలాలుగా వర్గీకరించాడు.
- **పశ్చిమ బెంగాల్ ప్రాంతంలో రుతుపవన ఆరంభ జల్లులను ఏమని పిలుస్తారు?**
- జ. కాలబైశాఖీలు. ఇవి వరి, జనుము పంటలకు ఉపయోగపడతాయి.
- **భారత్‌లో అత్యధిక వర్షపాతం (200 సెం.మీ. కంటే ఎక్కువ) నమోదయ్యే ప్రాంతాలు?**
- జ. ● పశ్చిమ తీరం (కొంకణ్ తీరం, కెనరా తీరం, మలబార్ తీరం). ● ఈశాన్య రాష్ట్రాలు. ● మధ్యతూర్పు హిమాలయ ప్రాంతాలు, అండమాన్ నికోబార్ దీవులు.
- **భారతదేశంలోని శీతోష్ణస్థితిని ఏమని పిలుస్తారు?**
- జ. ఉష్ణమండల రుతుపవన శీతోష్ణస్థితి
- **నైరుతి రుతుపవనాలు సాధారణంగా కేరళ తీరాన్ని ఎప్పుడు తాకుతాయి?**
- జ. జూన్ మొదటివారంలో.
- **నైరుతి రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవుల్లోకి ఎప్పుడు ప్రవేశిస్తాయి?**
- జ. మే 25 నాటికి.

ముల్కల రమేష్
సీనియర్ ఫ్యాకల్టీ,
జీవీఎస్ స్టడీ సర్కిల్



కాంపిటీటివ్ కౌన్సెలింగ్

గ్రూప్స్ పరీక్షలకు సంబంధించి ఇండియన్ ఎకానమీ సబ్జెక్టుకు ఎలా ప్రిపేర్‌కావాలి?

– ఎన్.అవినాశ్, చిట్యాల.

- భారత ఆర్థిక రంగంలోని అంశాలపై పట్టు చిక్కాలంటే తొలుత గణాంకాలు, ప్రాథమిక భావనలపై అవగాహన పెంపొందించుకోవాలి. తర్వాత సిలబస్‌లోని అంశాలను విశ్లేషించుకుంటూ అధ్యయనం చేయాలి. పూర్తిగా గణాంకాలకే సమయం కేటాయించి వాటి నుంచే ప్రశ్నలు వస్తాయని భావించకూడదు. ఆబ్జెక్టివ్ పరీక్షలో సైతం ఫ్యాక్ట్స్‌ను ఆధారం చేసుకుంటూ విశ్లేషణాత్మకంగా సమాధానం ఇవ్వాల్సిన ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఎకానమీలో మౌలిక భావనల నుంచి తాజా పరిస్థితుల వరకు అధ్యయనం చేయాలి. జాతీయాదాయం, ప్రణాళికలు, జనాభా, బ్యాంకింగ్, ద్రవ్య విధానం, కోశ విధానం, పేదరికం-నిర్మూలన, నీతి ఆయోగ్‌లకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. సమ్మిళిత వృద్ధి, తాజా ఆర్థిక విధానాలపై ప్రత్యేక దృష్టి సారించాలి.
- సమస్యలు- కారణాలు- ప్రభావాలు- పర్యవసానాలు-నివారణోపాయాలు అనే దృక్పథంతో చదవాలి. ఆయా ప్రణాళికలు-లక్ష్యాలు- విజయాలు- వైఫల్యాలు- కారణాలపై అవగాహన పెంచుకోవాలి. పథకాలు, లక్ష్యాలను చదివేటప్పుడు వాటికి కేటాయించిన నిధులు, లక్షిత వర్గాలకు సంబంధించిన గణాంకాలకే పరిమితం కాకుండా.. కార్యాచరణ పరంగా అవి ఏ స్థాయిలో ఉన్నాయో విశ్లేషణాత్మకంగా చదవాలి. గ్రామీణాభివృద్ధి పథకాల గురించి మరింత లోతుగా అధ్యయనం చేయాలి. ప్రాంతీయ స్థాయిలో అమలు చేస్తున్న పథకాలు, వ్యవసాయం, ఉపాధి వంటివాటిని అధ్యయనం చేయాలి. గ్రామీణ, కుటీర పరిశ్రమలు వంటి అంశాల్లో నిర్దిష్టంగా ఒక ఉత్పత్తి కేంద్రీకృతమైన ప్రాంతాలపై దృష్టి పెట్టాలి. ఆ ఉత్పత్తులు ఆ ప్రాంతంలోనే లభ్యం కావడానికి కారణాలను విశ్లేషించాలి.

ప్రతి వారం మీ భవిత మెయిన్ పేజీల్లో...

సోమవారం	మంగళవారం	బుధవారం	గురువారం	శుక్రవారం	శనివారం	ఆదివారం
10+2/గ్రాడ్యుయేట్స్ స్పెషల్	ఇంజనీరింగ్/ ఎంబీఏ స్పెషల్	జాబ్ పాయింట్	కెరీర్ గైడెన్స్/ టెక్నాలజీ స్పెషల్	ఫారెన్ ఎడ్యుకేషన్ స్పెషల్	యూత్ స్టోరీ/ కరెంట్ అఫైర్స్ (ఇంగ్లిష్)	జాబ్ స్కిల్స్/ గెస్ట్ కాలమ్
గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం



ఎంబీఏ స్పెషల్

క్యాట్ 2017

మేనేజ్‌మెంట్ విద్య.. ప్రస్తుతం డిమాండ్ ఉన్న కోర్సుల్లో ఒకటి. పేరొందిన బహుళజాతి సంస్థల్లో ఉద్యోగం.. దానికి తగినట్లే అధిక వార్షిక వేతనాలు..! అందుకే ఏటా ఈ కోర్సుల్లో చేరే వారి సంఖ్య పెరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా పలు ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు మేనేజ్‌మెంట్ విద్యను అందిస్తున్నాయి. మన దేశంలోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)'లకు మేనేజ్‌మెంట్ పీజీ కోర్సులను అందించడంలో మంచి పేరుంది. ఐఐఎంలలో చేరాలనుకునే ఔత్సాహికుల కోసం ఏటా కామన్ అడ్మిషన్ టెస్ట్ (సీఏటీ-క్యాట్) నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఐఐఎం, లక్నో.. 'క్యాట్-2017' నోటిఫికేషన్ విడుదల చేసింది. దాని వివరాలు, దరఖాస్తు విధానం, పరీక్ష ప్యాట్రన్ గురించి తెలుసుకుందాం..

ప్రత్యేకతలివి..

క్యాట్‌లో ప్రతిభ ద్వారా దేశంలోని 20 ఐఐఎంలతో పాటు, ఐఐటీ, ఎన్ఐటీ, బి-స్కూల్స్‌లోనూ ప్రవేశాలు పొందే వీలుంది. వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో మేనేజ్‌మెంట్ ట్రైనీలుగా చేరేందుకూ క్యాట్ ఉత్తీర్ణత ఉపకరిస్తుంది. క్యాట్ సిలబస్ సివిల్స్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, బ్యాంకులు, రైల్వేలు తదితర పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికీ ఉపయోగపడుతుంది. ఐఐఎంలైతే క్యాట్‌తో పాటు గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలు, పని అనుభవం, అకడమిక్ రికార్డు తదితర ప్రమాణాల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తాయి.

అర్హతలు

గుర్తింపు పొందిన యూనివర్సిటీ లేదా ఇన్‌స్టిట్యూట్ నుంచి 50 శాతం మార్కులతో ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన సీజీపీఏతో ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 45 శాతం మార్కులు/తత్సమాన సీజీపీఏ చాలు. డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశాల సమయానికి గ్రాడ్యుయేషన్ పూర్తయినట్లు ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

ఫీజుల వివరాలు

దివ్యాంగ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.900. మిగిలిన అన్ని కేటగిరీల అభ్యర్థులకు రూ.1,800. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులు రిజిస్ట్రేషన్ సమయంలోనే తమ కుల ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయాలి.

క్యాట్-2017 పరీక్ష విధానం

ఇది కంప్యూటర్ ఆధారిత పరీక్ష. నోటిఫికేషన్ ప్రకారం- నవంబరు 26న రెండు స్లాట్స్‌లో నిర్వహిస్తారు. దరఖాస్తు ప్రక్రియ ఆగస్ట్ 9, 2017న ప్రారంభమై సెప్టెంబర్ 20, 2017న ముగుస్తుంది. ఎగ్జామ్ ప్యాటర్న్ గతేడాదిలాగే ఉండనుంది. ప్రశ్నపత్రం మొత్తం 100 మార్కులకు మూడు విభాగాల్లో ఉంటుంది. అవి.. వెర్బల్ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ (వీఏఆర్సీ), డాటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ (డీఐ అండ్ ఎల్ఆర్), క్వాంటిటేటివ్ ఎబిలిటీ (క్యూఏ). ఒక్కో సెక్షన్‌కు 60 నిమిషాల (గంట) చొప్పున మొత్తం పరీక్ష వ్యవధి 3 గంటలు. ప్రశ్నలు మల్టిపుల్ (ఎంసీక్యూ), నాన్ మల్టిపుల్ చాయిస్ (నాన్-ఎంసీక్యూ) విధానంలో ఉంటాయి. సరైన సమాధానానికి మూడు మార్కులు. మల్టిపుల్ చాయిస్ విధానంలో ఒక్కో తప్పు సమాధానానికి 1 నెగిటివ్ మార్కు ఉంటుంది. సమాధానాలు గుర్తించని ప్రశ్నకు నెగిటివ్ మార్కులు ఉండవు. ఆన్‌స్క్రీన్ బేసిక్ కాలిక్యులేటర్‌ను అనుమతిస్తారు.

అవసరమైన ధ్రువపత్రాలు/జాగ్రత్తలు

1. **ఈ మెయిల్, మొబైల్ నెంబర్:** క్యాట్‌కు దరఖాస్తు చేసుకునే ప్రతి అభ్యర్థికీ కచ్చితంగా సొంత ఈమెయిల్ ఐడీ, ఫోన్ నెంబర్ ఉండాలి. దరఖాస్తు సమయంలో రిజిస్ట్రేషన్ లింక్‌ను సంబంధిత మెయిల్ ఐడీకి, పాస్‌వర్డ్‌ను సంబంధిత మొబైల్ నెంబరుకు పంపుతారు. ఐఐఎంల నుంచి ఏదైనా అదనపు సమాచారం వచ్చిందేమో తెలుసుకోవడానికి మెయిల్స్‌ను తనిఖీ చేసుకుంటూ ఉండాలి.
2. **పదో తరగతి అడ్మిట్ కార్డ్/ఐడీ:** పదో తరగతి అడ్మిట్ కార్డు లేదా ఐడీ ప్రూఫ్స్ (ఓటర్ ఐడీ, పాన్, ఆధార్)పై ఉండే పేరు, పుట్టిన తేదీని మాత్రమే ఐఐఎంలు పరిగణనలోకి తీసుకుంటాయి. నమోదు చేసే సమయంలో సంబంధిత కార్డులపై ఉన్న డేట్ ఆఫ్ బర్త్, పేర్లను పొందుపరచాలి.
3. **మార్క్ షీట్స్:** అభ్యర్థి విద్యార్హతల (పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, ఇతర ప్రొఫెషనల్స్ కోర్సు)కు సంబంధించిన మార్క్‌షీట్స్ దగ్గర ఉంచుకోవాలి.
4. **రిజర్వేషన్ ధ్రువపత్రాలు:** రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలను ఐఐఎం లక్నో వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నింపాలి. వాటిమీద కావల్సిన సంతకాలతో పాటు సెల్ఫ్ అటెస్టేషన్ చేయించి పీడీఎఫ్ డాక్యుమెంట్ల రూపంలో స్కాన్ చేయించాలి.
5. **ఉద్యోగ అనుభవ ధ్రువపత్రాలు:** అభ్యర్థికి ఉద్యోగ అనుభవం ఉంటే సంబంధిత సమాచారాన్ని దరఖాస్తులో పేర్కొనాలి. జూలై 31, 2017 వరకు ఎన్నేళ్ల ఉద్యోగానుభవం ఉందో తెలియజేయాలి. సంబంధించిన ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవాలి.
6. **ఫొటోగ్రాఫ్, సంతకం:** అభ్యర్థులు 35 x 45 మి.మీ. డైమెన్షన్‌లోని తాజా పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫొటో, 80 x 35 మి.మీ. డైమెన్షన్‌లో సంతకం స్కాన్ చేయించి అప్‌లోడ్ చేయాలి. ఫొటో కనీసం బ్యాక్‌గ్రౌండ్ వైట్‌గా ఉండాలి. ఫైల్ సైజు 80 కె.బి. మించకూడదు. ఫొటోగ్రాఫ్, సంతకం జేపీజీ/జేపీఈజీ ఫార్మాట్‌లో మాత్రమే ఉండాలి.
7. **ఫీజు చెల్లింపు విధానం:** దరఖాస్తు ఫీజు ఆన్‌లైన్ పద్ధతి (నెట్ బ్యాంకింగ్/ క్రెడిట్ కార్డ్/ డెబిట్ కార్డ్)లో మాత్రమే చెల్లించాలి.

దరఖాస్తు విధానం



ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దీనికోసం సంబంధిత వెబ్‌సైట్‌లో ఆగస్ట్ 9, 2017 నుంచి సెప్టెంబర్ 20, 2017 వరకు అవకాశం కల్పిస్తారు. దేశవ్యాప్తంగా 140 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు. దరఖాస్తు సమయంలోనే నాలుగు కేంద్రాలను అభ్యర్థి ఎంపిక చేసుకోవాలి. వీటిలో దేనిని కేటాయించినదీ అడ్మిట్ కార్డ్‌లో పొందుపరుస్తారు. అడ్మిట్ కార్డులు అక్టోబర్ 18 నుంచి నవంబర్ 26 వరకు ఎప్పుడైనా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ప్రవేశ విధానం

మేనేజ్‌మెంట్ విద్యా సంస్థలు.. కోర్సుల్లో ప్రవేశానికి ప్రధాన కొలమానంగా క్యాట్‌ను తీసుకున్నా.. ప్రతి ఐఐఎం.. కటాఫ్ మార్కులు, గత అకడమిక్ రికార్డు, ఉద్యోగ అనుభవం తదితరాలతో పాటు గ్రూప్ డిస్కషన్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, ఇంటర్వ్యూలు వంటి వేర్వేరు పద్ధతులు అనుసరించవచ్చు. వీటి గురించి సంబంధిత ఐఐఎంల వెబ్‌సైట్స్‌లో తెలుసుకోవచ్చు.

దేశంలోని 20 ఐఐఎంలు, అందించే ప్రోగ్రామ్స్, సంస్థ వెబ్‌సైట్స్


ఐఐఎం	పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్	ఫెలో ప్రోగ్రామ్స్	వెబ్‌సైట్
ఐఐఎం అహ్మదాబాద్	పీజీపీ, ఈపీజీపీ పీజీపీ-ఎఫ్ఏబీఎం	ఎఫ్‌పీఎం	www.iima.ac.in
ఐఐఎం అమృత్‌సర్	పీజీపీ	–	www.iimamritsar.ac.in
ఐఐఎం బెంగళూరు	పీజీపీ, పీజీపీఈఎం, పీజీపీపీఎం	ఎఫ్‌పీఎం	www.iimb.ac.in
ఐఐఎం బోధ్‌గయ	పీజీపీ	–	www.iimbg.ac.in
ఐఐఎం కోల్‌కత	పీజీపీ-పీజీడీఎం	ఎఫ్‌పీఎం	www.iimcal.ac.in
ఐఐఎం ఇండోర్	పీజీపీ, ఈపీజీపీ, పీజీపీ-హెచ్ఆర్ఎం	ఎఫ్‌పీఎం	www.iimidr.ac.in
ఐఐఎం జమ్ము	పీజీపీ	–	www.iiml.ac.in/jammu
ఐఐఎం కాశిపూర్	పీజీపీ, ఈపీజీపీ	ఎఫ్‌పీఎం, ఈఎఫ్‌పీఎం	www.iimkashipur.ac.in
ఐఐఎం కోజికోడ్	పీజీపీ	ఎఫ్‌పీఎం	www.iimk.ac.in
ఐఐఎం లక్నో	పీజీపీ, పీజీపీ-ఏబీఎం, పీజీపీ-ఎస్ఎం	ఎఫ్‌పీఎం	www.iiml.ac.in
ఐఐఎం నాగ్‌పూర్	పీజీపీ	–	www.iimnagpur.ac.in
ఐఐఎం రాయ్‌పూర్	పీజీపీ, పీజీపీడబ్ల్యూఈ	ఎఫ్‌పీఎం	www.iimraipur.ac.in
ఐఐఎం రాంచీ	పీజీడీఎం, పీజీడీహెచ్ఆర్ఎం	ఎఫ్‌పీఎం	www.iimranchi.ac.in
ఐఐఎం రోహ్‌తక్	పీజీపీ, ఈపీజీపీ, ఈపీజీపీఎక్స్	ఎఫ్‌పీఎం	www.iimrohtak.ac.in
ఐఐఎం సంబల్‌పూర్	పీజీపీ	–	www.iimsambalpur.ac.in
ఆర్‌జీఐఐఎం షిల్లాంగ్	పీజీపీ, పీజీపీఈఎక్స్	ఎఫ్‌పీఎం	www.iimshillong.in
ఐఐఎం సిర్మౌర్	పీజీపీ	–	www.iimsirmaur.ac.in
ఐఐఎం తిరుచిరాపల్లి	పీజీపీ, పీజీపీబీఎం	ఎఫ్‌పీఎం	www.iimtrichy.ac.in
ఐఐఎం ఉదయ్‌పూర్	పీజీపీ	ఎఫ్‌పీఎం	www.iimu.ac.in
ఐఐఎం విశాఖపట్నం	పీజీపీ	–	www.iimv.ac.in

ముఖ్య గమనికలు

- క్యాట్ ఉత్తీర్ణతతోపాటు అవసరాన్ని బట్టి ఇతర పరీక్షలు, గ్రూప్ డిస్కషన్స్ నిర్వహించవచ్చు. అకడమిక్ రికార్డులనూ పరిగణనలోకి తీసుకోవచ్చు.
- ఐఐఎంలు, నాన్-ఐఐఎంల్లో ప్రవేశాల గురించి కచ్చితంగా తెలుసుకోవాలి. అభ్యర్థి ప్రొఫైల్‌కు సరిపోయే ఐఐఎం/నాన్-ఐఐఎం ఎంచుకొని అందులో ప్రవేశానికి కావల్సిన అర్హతలు తెలుసుకోవాలి.
- క్యాట్ మార్కులకు ఒక్కో ఐఐఎం ఒక్కో విధంగా వెయిటేజీ ఇస్తుంది. కొన్ని వంద శాతం ఇస్తే, మరికొన్ని 80 లేదా 70 లేదా 60 శాతం అంతకంటే తక్కువ కూడా వెయిటేజీ ఇవ్వొచ్చు. వాటి గురించి సంబంధిత విద్యాసంస్థల వెబ్‌సైట్స్‌లో తెలుసుకోవచ్చు.
- ప్రభుత్వ నిబంధనల ప్రకారం- ఎస్సీలకు 15 శాతం, ఎస్టీ-7.5 శాతం, ఓబీసీ (ఎన్‌సీఎల్)-27 శాతం, దివ్యాంగ కేటగిరీకి 5 శాతం సీట్లు రిజర్వేషన్ చేస్తారు.

ముఖ్య తేదీలు

- **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** ఆగస్ట్ 9, 2017
- **ఆన్‌లైన్ దరఖాస్తులు ముగింపు:** సెప్టెంబర్ 20, 2017 (సాయంత్రం 5 గంటల వరకు)
- **అడ్మిట్ కార్డ్ జారీ :** అక్టోబర్ 18, 2017(మధ్యాహ్నం 1 గంట నుంచి)
- **ఎంట్రన్స్ ఎగ్జామ్ తేదీ:** నవంబర్ 26, 2017 (ఉదయం, మధ్యాహ్నం).
- **ఫలితాల ప్రకటన:** జనవరి రెండో వారం, 2018
- క్యాట్-2017పై మరింత సమాచారం **www.iimcat.ac.in** వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చు.



ఇంజనీరింగ్ స్పెషల్

రోబోటిక్స్.. ఫ్యూచర్ బెస్ట్

అకడమిక్ స్థాయి నుంచి జాబ్ మార్కెట్ వరకు.. ఓవైపు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్.. మరోవైపు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్.. పరిశ్రమల కోణంలోనూ రోజురోజుకీ పెరుగుతున్న ప్రాధాన్యం.. అదే రోబోటిక్స్..! అన్ని రంగాల్లో రోబోటిక్స్ పాత్ర గణనీయంగా పెరుగుతోంది. దాంతో కెరీర్ పరంగా ఆయా స్కిల్స్ సొంతం చేసుకోవడం విద్యార్థులకు తప్పనిసరిగా మారింది. ఈ నేపథ్యంలో రోబోటిక్స్‌తో భవిష్యత్ అవకాశాలు , కోర్సులు, నైపుణ్యాలు.. అందుకునేందుకు మార్గాల గురించి తెలుసుకుందాం...

రోబోటిక్స్

మనిషి తన మేధస్సుతో రూపొందించిన మెషిన్ (రోబో)ని.. అవసరమైన రీతిలో పనిచేసేలా సాఫ్ట్‌వేర్ ఆధారంగా ప్రోగ్రామింగ్ చేయడమే రోబోటిక్స్. తనకు అందిన ఆదేశాల ప్రకారం.. మనిషి చేయడానికి పట్టే సమయంలో నాలుగో వంతులోపే రోబో ఒక పనిని నిర్దిష్టంగా పూర్తి చేస్తుంది. ఇప్పుడిదే అంశం సంస్థలు రోబోటిక్స్ వైపు మొగ్గుచూపేలా చేస్తోంది. ఉత్పత్తులు, సర్వీసుల డిజైన్, డెవలప్‌మెంట్, డెలివరీకి సంబంధించి రోబోలకు ప్రాధాన్యమిస్తున్నాయి. ఈ క్రమంలో రోబోటిక్ ఇంజనీరింగ్ నైపుణ్యాలున్న వారికి పెద్దపీట వేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పలు సర్వేలు, నివేదికల ప్రకారం రానున్న అయిదేళ్లలో అన్ని రంగాల్లోనూ రోబోల ప్రమేయం 20 నుంచి 30 శాతం మేర ఉంటుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

రానున్న కాలం వాటిదే

ప్రస్తుతం వివిధ రంగాల సంస్థలు తమ కార్యకలాపాల్లో రోబోలకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే ముందు కాలం అంతా రోబోటిక్ ఇంజనీరింగ్ స్పెషలైజ్డ్ అభ్యర్థులదే అని అన్ని వర్గాలు ఘంటాపథంగా చెబుతున్నాయి. ముఖ్యంగా మెకానికల్, ప్రొడక్షన్, లాజిస్టిక్స్ విభాగాల్లో రోబోల ప్రమేయం పెరుగుతోంది. ఫలితంగా ఈ రంగాల్లో రోబోటిక్స్ నైపుణ్యాలున్న అభ్యర్థుల కోసం కంపెనీలు అన్వేషిస్తున్నాయి.

ఇంటర్ డిసిప్లినరీ నైపుణ్యాలు

ఒక రోబోను రూపొందించేందుకు సాఫ్ట్‌వేర్, కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇలా పలు విభాగాల అంశాలను సమ్మిళితం చేయాల్సి ఉంటుంది. ఇవన్నీ ఇంటర్ డిసిప్లినరీ నైపుణ్యాలు..! రోబోటిక్స్ ఇంజనీరింగ్‌లో రాణించాలనుకునే అభ్యర్థులకు తప్పనిసరిగా ఉండాల్సిన లక్షణాలు. ఉదాహరణకు.. రోబో కార్లనే పరిగణనలోకి తీసుకుంటే దానిని నడిపే ప్రోగ్రామ్ రూపకల్పనకు సాఫ్ట్‌వేర్ పరిజ్ఞానం, కోర్ ఏరియా పరంగా మెకానికల్, సక్రమంగా కదిలేందుకు ఎలక్ట్రానిక్స్ నైపుణ్యాలు అవసరం.

బీటెక్ నుంచే

ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు రోబోటిక్స్ నైపుణ్యాలు పెంచుకోవాలనేది నిపుణుల సూచన. బీటెక్ స్థాయిలోనే రోబోటిక్స్ సంబంధిత అంశాలపై దృష్టిసారించి అధ్యయనం చేయాలి. రోబోటిక్స్ సంబంధిత సర్టిఫికెట్ కోర్సులను అభ్యసిస్తూ.. బ్రాంచ్‌తో సంబంధం లేకుండా అడుగులు వేయాలని కూడా సూచిస్తున్నారు.

ఎంటెక్ స్థాయిలో స్పెషలైజేషన్స్

బీటెక్ స్థాయిలో పూర్తిగా రోబోటిక్స్ అభ్యసించే అవకాశం తక్కువ. ఎంటెక్ /ఎంఈలలో మాత్రం పలు స్పెషలైజేషన్స్ అందుబాటులో ఉన్నాయి. వీటిలో మార్కెట్ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని ఉత్తమంగా నిలుస్తున్నవాటి వివరాలు..

- మెడికల్ రోబోటిక్స్
- సిగ్నల్ ప్రాసెసింగ్
- రోబోట్ మోషన్ ప్లానింగ్
- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ రోబోటిక్స్
- ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్

లభించే హోదాలు..

- రోబోటిక్స్ టెక్నీషియన్స్
- రోబోట్ డిజైన్ ఇంజనీర్



- రోబోటిక్స్ టెస్ట్ ఇంజనీర్స్
- సీనియర్ రోబోటిక్స్ ఇంజనీర్స్
- ఆటోమేటెడ్ ప్రొడక్ట్ డిజైన్ ఇంజనీర్
- అగ్రికల్చర్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీర్
- రోబోటిక్ సిస్టమ్ ఇంజనీర్

వేతనాలు ఆకర్షణీయం..

- పూర్తిగా రోబోలను రూపొందించే పరిశ్రమల్లో ఉద్యోగాలు సొంతం చేసుకున్నవారికి.. వారి జాబ్ ప్రొఫైల్ ఆధారంగా వేలల్లోనే వేతనం లభిస్తోంది.
- అప్పటికే సంస్థలో విభాగంగా ఉన్న రోబోటిక్స్ డివిజన్‌లో చేరినవారికి స్కిల్స్‌ను బట్టి నెలకు రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు వేతనం లభిస్తోంది.

ముఖ్యమైన ఉపాధి వేదికలు..

రోబోటిక్స్ ఇంజనీరింగ్ పూర్తి చేసినవారికి సాఫ్ట్‌వేర్, ప్రొడక్షన్, మెకానికల్, హెల్త్‌కేర్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థలు ప్రధాన ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి.

రోబోటిక్స్ కెరీర్ ఫ్యాక్ట్స్..

- 2022 నాటికి రోబోటిక్ ఇంజనీరింగ్ విభాగంలో పది శాతం మేర పెరగనున్న నియామకాలు.
- గార్ట్‌నర్ నివేదిక ప్రకారం.. అన్ని రంగాల్లోనూ 13 శాతానికి చేరనున్న రోబోల వినియోగం.

సర్టిఫికేషన్ కోర్సులు కూడా

రోబోటిక్స్‌లో పూర్తిస్థాయి కోర్సులు అభ్యసించలేనివారికి.. పలు సర్టిఫికేషన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వాటి వివరాలు..

- సీమెన్స్ – రోబోటిక్స్ ఆన్‌లైన్
  వెబ్‌సైట్: www. robotics.org
- సర్టిఫైడ్ ఆటోమేషన్ ప్రొఫెషనల్
  వెబ్‌సైట్: www.isa.org
- రోబోటిక్స్ టెక్నీషియన్ అండ్ ఆటోమేషన్ ట్రెనింగ్
  వెబ్‌సైట్: www.onlinerobotics.com
- రోబో జీనియస్ అకాడమీ
  వెబ్‌సైట్: www.robogenious.in

ఎంటెక్ స్థాయిలో కోర్సులు

- ఐఐటీ – ముంబై, చెన్నై, ఢిల్లీ, కాన్పూర్, ఖరగ్‌పూర్, రూర్కీ, గువహటి
- ఐఐఎస్సీ– బెంగళూరు
- యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్
- బిట్స్ – పిలానీ
- సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ – హైదరాబాద్
- వీటితోపాటు పలు ఎన్ఐటీ క్యాంపస్‌లలోనూ రోబోటిక్స్ ఎలక్టివ్‌గా ఎంటెక్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

బులెటిన్ బోర్డ్

ఆర్‌యూహెచ్ఎస్‌లో ఎంఎస్సీ(మెడికల్) కోర్సులు

రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఉన్న రాజస్థాన్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌లో ఎంఎస్సీ(మెడికల్) కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన వెలువడింది.

కోర్సు పేరు: ఎంఎస్సీ(మెడికల్)

విభాగాలు: అనాటమీ, బయోటెక్నాలజీ, ఫిజియోలజీ, ఫార్మకాలజీ, మైక్రోబయాలజీ.

అర్హతలు: సంబంధిత విభాగాలను అనుసరించి 60శాతం మార్కులతో ఎంబీబీఎస్/బీడీఎస్/బీవీఎస్సీ అండ్ ఏహెచ్/బీఎస్సీ మొదటి ప్రయత్నంలోనే ఉత్తీర్ణత.

దరఖాస్తు ఫీజు: రూ.5,000; ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రూ.2,500.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

Rajasthan University of Health Science
Jaipur, Rajasthan

ఎంపిక విధానం: ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్.

దరఖాస్తులకు చివరి తేదీ: ఆగస్ట్ 24, 2017.

వెబ్‌సైట్: www.ruhsraj.org

వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాలో 24 ఖాళీలు

డెహ్రాడూన్‌లో ఉన్న వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(డబ్ల్యుఐఐ).. వేర్వేరు విభాగాల్లోని 24 ఖాళీలను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన వెలువరించింది.

పోస్టు పేరు-ఖాళీలు: కన్జర్వేషన్ బయాలజిస్ట్-1; ఆక్వాటిక్ వైల్డ్‌లైఫ్ మానిటరింగ్ స్పెషలిస్ట్-1; ఆక్వాటిక్ బొటానిస్ట్-1; వైల్డ్‌లైఫ్ బయాలజిస్ట్(ఫిష్)-1; వైల్డ్‌లైఫ్ బయాలజిస్ట్(బర్డ్స్ అండ్ మమ్మల్స్)-1; స్పటియల్ అనలిస్ట్-1; ప్రాజెక్ట్ అసిస్టెంట్ గ్రేడ్(2)-4; అసిస్టెంట్ ట్రెనింగ్ కోఆర్డినేటర్-1; వెటర్నరీ ఆఫీసర్-1; ఎకోడెవలప్‌మెంట్ ఆఫీసర్-1; కమ్యూనిటీ ఆఫీసర్-2; కన్జర్వేషన్ ఎడ్యుకేషన్ ఆఫీసర్-1; ఎక్స్‌టెన్సెన్ ఆఫీసర్(విజువల్ డిజైనర్)-1; ఎక్స్‌టెన్సెన్ ఆఫీసర్(కన్జర్వేషన్ ఎడ్యుకేషన్)-1; ఎక్స్‌టెన్సెన్ ఆఫీసర్-1; ప్రాజెక్ట్ ఫెలో-1; జూనియర్ కన్జర్వేషన్ ఆఫీసర్-2; అసిస్టెంట్ కన్జర్వేషన్ ఆఫీసర్(ఎనిమల్ జెనెటిక్స్)-1; ఆఫీస్ మేనేజర్-1.

వేతనం: ఆక్వాటిక్ మానిటరింగ్ స్పెషలిస్ట్, ఎకోడెవలప్‌మెంట్ ఆఫీసర్, కన్జర్వేషన్ ఆఫీసర్ పోస్టులకు రూ.54,100; వెటర్నరీ ఆఫీసర్‌కు-రూ.43,700; ఎక్స్‌టెన్సెన్ ఆఫీసర్ (విజువల్ డిజైనర్)కు-రూ.42,000; ఆఫీస్ మేనేజర్‌కు-రూ.40,000; ప్రాజెక్ట్ అసిస్టెంట్ గ్రేడ్(2)కు రూ.20,000; మిగిలిన పోస్టులకు రూ.32,000.

అర్హతలు: సంబంధిత పోస్టులను అనుసరించి బ్యాచిలర్స్ డిగ్రీ/ మాస్టర్స్ డిగ్రీ/పీహెచ్‌డీ/ఎంఎస్సీ నిర్ణీత మార్కుల శాతంతో ఉత్తీర్ణత. దీంతోపాటు నిబంధనల మేర ఉద్యోగానుభవం.

వయోపరిమితి: ఎకోడెవలప్‌మెంట్ ఆఫీసర్, కన్జర్వేషన్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌కు 50 ఏళ్లు, ఆక్వాటిక్ వైల్డ్‌లైఫ్ మానిటరింగ్ స్పెషలిస్ట్, వెటర్నరీ ఆఫీసర్, కమ్యూనిటీ ఆఫీసర్, ఆఫీస్ మేనేజర్, 'ఎక్స్‌టెన్సెన్ ఆఫీసర్' పోస్టులకు 45 ఏళ్లు, మిగిలిన పోస్టులకు 35 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ నిబంధనలు వర్తిస్తాయి.

ఎంపిక విధానం: ఆన్‌లైన్ రాతపరీక్ష.

దరఖాస్తు ఫీజు: రూ.500; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు రూ.100.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తులకు చివరి తేదీ: సెప్టెంబర్ 3, 2017.

వెబ్‌సైట్: www.wii.gov.in

సాక్షి బిజినెస్
మంగళవారం 8-8-2017
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
52 ▼	9 ▼
32,274	10,057

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు పై రెండూ సూచీలు రాత్రి 11.30

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	6,382	▲	30
డోజోన్స్	22,115	▲	22
ఎఫ్‌టీఎస్ఈ 100	7,532	▲	20
డాక్స్	12,257	▼	41
షాంఘై	3,280	▲	17
నికాయ్	20,056	▲	104

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			• కొనుగోలు	• అమ్మకం
$	యూఎస్ డాలర్	థామస్‌కుక్	62.95	64.45
£	బ్రిటన్ పౌండ్	థామస్‌కుక్	81.84	84.43
€	యూరో	థామస్‌కుక్	73.97	76.37
¥	జపాన్ ఎన్ (100)	థామస్‌కుక్	56.64	58.46
AUS	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	49.73	51.40
SS	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	46.12	47.56
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.41	18.27
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.77	18.44
¥	చైనా యువాన్	థామస్‌కుక్	6.71	10.88

పెద్ద కార్ల రేట్లకు రెక్కలు

25 శాతానికి పెరగనున్న సెస్సు ◆ పెంపు ప్రతిపాదనకు జీఎస్‌టీ కౌన్సిల్ ఆమోదం ◆ ఆందోళనలో కార్ల కంపెనీలు



న్యూఢిల్లీ: గత నెల 1న వస్తు, సేవల పన్నుల (జీఎస్‌టీ) విధానం అమల్లోకి వచ్చినప్పట్నుంచీ ఖరీదైన లగ్జరీ కార్ల రేట్లు తాత్కాలికంగా కాస్త తగ్గినా.. తాజాగా మళ్లీ పెరగనున్నాయి. ఈ దిశగా పెద్ద కార్లపై సెస్సును 25 శాతానికి పెంచాలన్న ప్రతిపాదనకు జీఎస్‌టీ కౌన్సిల్ ఆమోదముద్ర వేసింది. జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన తర్వాత ప్రస్తుతం కార్లు అత్యధిక శ్లాబ్ రేటు 28 శాతం పరిధిలోకి రాగా, అదనంగా 1–15 శాతం దాకా సెస్సు ఉంటోంది. వస్తు, సేవల పన్నుల విధానం అమల్లోకి వచ్చాక గత విధానంలో కన్నా వాహనాలపై మొత్తం పన్ను భారం తగ్గడంతో .. ఆగస్టు 5న జరిగిన 20వ సమావేశంలో ఈ అంశాన్ని జీఎస్‌టీ కౌన్సిల్ పరిశీలించినట్లు కేంద్ర ఆర్థిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 8702, 8703 విభాగాల కిందకి వచ్చే వాహనాలపై గరిష్ట సెస్సును ప్రస్తుతమున్న 15 శాతం నుంచి 25 శాతానికి పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం తగు చట్ట సవరణలు చేయొచ్చంటూ కౌన్సిల్ సిఫార్సు చేసినట్లు ఆర్థిక శాఖ వివరించింది. అయితే పెంపు ఎప్పట్నుంచి విధించేదీ జీఎస్‌టీ కౌన్సిల్ నిర్ణయిస్తుందని పేర్కొంది. కార్లు, పొగాకు, బొగ్గు మొదలైన వాటిపై వసూలు చేసే సెస్సును .. జీఎస్‌టీ వల్ల రాష్ట్రాలకు వాటిల్లే ఆదాయనష్టాన్ని భర్తీ చేసేందుకు కేంద్రం ప్రభుత్వం వినియోగిస్తోంది. ఇందుకోసం గరిష్ట సెస్సు రేటును నిర్దేశించే ప్రత్యేక చట్టాన్నీ రూపొందించింది. తాజాగా సెస్సు రేటును సవరించాలంటే.. సదరు చట్టానికి సవరణలు చేయాల్సి ఉంటుంది.

పెద్ద కార్లు, ఎస్‌యూవీలు..

8702, 8703 హెడింగ్స్ కింద వర్గీకరించిన వాహనాల్లో మధ్య స్థాయి, పెద్ద కార్లు, స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాలు (ఎస్‌యూవీ), సంఖ్యాపరంగా పది మంది కన్నా ఎక్కువ.. 13 కన్నా తక్కువ మంది ప్రయాణించగలిగే వాహనాలు ఉన్నాయి. అలాగే 1500 సీసీ పైబడిన హైబ్రీడ్ కార్లు కూడా ఈ విభాగం పరిధిలోకి వస్తాయి. చాలా మటుకు కార్లకు 28 శాతం గరిష్ట పన్ను పరిధిలో ఉన్నప్పటికీ, పెద్ద వాహనాలు, ఎస్‌యూవీలు, హైబ్రీడ్ కార్లు మొదలైన వాటికి అదనంగా మరో 15 శాతం సెస్సు ఉంటోంది. 4 మీటర్ల కన్నా తక్కువ పొడవు, 1200 సీసీ సామర్థ్యం గల చిన్న పెట్రోల్ కార్లపై సెస్సు 1 శాతంగా ఉండగా, అదే పొడవుతో 1500 సీసీ సామర్థ్యమున్న చిన్న డీజిల్ కార్లపై సెస్సు 3 శాతంగా ఉంటోంది.

జీఎస్‌టీ అమల్లోకి రావడానికి ముందు... మోటారు వాహనాలపై గరిష్ట పన్ను 52–54.72 శాతం స్థాయిలో ఉండేది. సీఎస్‌టీ, ఆక్ట్రాయ్ మొదలైన వాటికి సంబంధించి మరో 2.5 శాతం దీనికి తోడయ్యేది. అయితే, జీఎస్‌టీ వచ్చిన తర్వాత మొత్తం పన్ను పరిమితి 43 శాతానికి తగ్గింది. దీంతో చాలా మటుకు కంపెనీలు తమ ఎస్‌యూవీల రేట్లను రూ. 1.1 లక్షల నుంచి రూ. 3 లక్షల దాకా తగ్గించాయి. అయితే, గత విధానం తరహాలోనే ఈ పరిమితిని కొనసాగించేందుకు ప్రస్తుతం గరిష్టంగా ఉన్న 28 శాతం జీఎస్‌టీకి మరో 25 శాతం సెస్సును జోడించాల్సిన అవసరం ఉందని జీఎస్‌టీ కౌన్సిల్ భావించి తాజా నిర్ణయం తీసుకుంది.

ఇలాగైతే విస్తరణ ప్రణాళికలకు విఘాతం..

పెద్ద కార్లు, ఎస్‌యూవీలపై సెస్సు పెంపు ప్రతిపాదనపై వాహన తయారీ సంస్థలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. జీఎస్‌టీ తర్వాత చౌకగా మారిన పెద్ద కార్ల రేట్లు మళ్లీ పెరిగేలా సెస్సు విధించే ప్రతిపాదన పరిశ్రమ సెంటిమెంటును దెబ్బతీస్తుందని టయోటా కిర్లోస్కర్ మోటార్, మెర్సిడెస్ బెంజ్, ఆడి, బీఎండబ్ల్యూ తదితర సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. స్పందనలు ఇలా...

- ‘దీన్ని బట్టి చూస్తుంటే ఆర్థిక వృద్ధికి ఆటోమొబైల్ రంగం తోడ్పాటుపై ప్రభుత్వం అంత ఆసక్తిగా లేదన్నట్లుగా సంకేతాలు కనిపిస్తున్నాయి‘ అని టయోటా కిర్లోస్కర్ మోటార్ వైస్ చైర్మన్ శేఖర్ విశ్వనాథన్ చెప్పారు.
- ‘లగ్జరీ కార్ల తయారీ దిగ్గజమైన మా కంపెనీ.. మేకిన్ ఇండియా కార్యక్రమం కింద తలపెట్టిన భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై ఇలాంటివి ప్రతికూల ప్రభావం చూపుతాయి‘ అని మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ రోలాండ్ ఫోల్గర్ పేర్కొన్నారు.
- తప్పనిసరిగా తమ వ్యాపార ప్రణాళికలను పునఃసమీక్షించుకోవాల్సి ఉందని ఆడి ఇండియా హెడ్ రాహిల్ అన్సారీ చెప్పారు. సెస్సు పెంపు నిర్ణయం కంపెనీలు, డీలర్లు, కస్టమర్లతో పాటు ఆటోమొబైల్ పరిశ్రమలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులపైనా ప్రతికూల ప్రభావం తప్పదన్నారు.
- తక్షణమే ఇలా సెస్సులను మార్చేస్తుండటం.. భారత్‌లో ఆటోమోటివ్ పరిశ్రమ వృద్ధికి విఘాతం కలిగిస్తుందని బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్ విక్రమ్ అభిప్రాయపడ్డారు.

ఐటీ రిటర్నుల్లో 25% వృద్ధి



న్యూఢిల్లీ: పెద్ద నోట్ల రద్దు (డీమోనిటైజేషన్) పరిణామాల అనంతరం ఆదాయ పన్ను రిటర్నులు (ఐటీఆర్) దాఖలు చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. 2016–17 సంవత్సరానికి గాను 2.82 కోట్ల రిటర్నులు వచ్చినట్లు ఆదాయ పన్ను విభాగం తెలిపింది. ఇది అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో దాఖలైన 2.22 కోట్ల ఐటీఆర్‌లతో పోలిస్తే 25.3 శాతం అధికమని వివరించింది. ఆగస్టు 5 దాకా మొత్తం 2.82 కోట్ల రిటర్నులు దాఖలైనట్లు ఆదాయ పన్ను విభాగం పేర్కొంది. వాస్తవానికి ఐటీఆర్‌ల దాఖలుకు జూలై 31 ఆఖరు తేదీ అయినప్పటికీ.. కొన్ని వర్గాల కోసం ఆగస్టు 5 దాకా ప్రభుత్వం పొడిగించిన సంగతి తెలిసిందే. కొత్తగా మరింత మందిని పన్ను పరిధిలోకి తేగలిగినట్లు తాజా గణాంకాలు సూచిస్తున్నాయని ఆదాయ పన్ను విభాగం పేర్కొంది. వ్యక్తిగత ఆదాయ పన్నును సంబంధించి (కార్పొరేట్ ట్యాక్స్ కాకుండా) అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు ఆగస్టు 5 నాటికి 41.79 శాతం వృద్ధి నమోదు చేశాయి.

ఎయిర్ ఇండియా విక్రయం.. నిపుణుల కోసం కసరత్తు



ముంబై: ఎయిర్ ఇండియాలో వాటాలను విక్రయించాలనుకుంటున్న కేంద్ర సర్కారు ఇందుకు సంబంధించి లావాదేవీ సలహాదారులు, న్యాయ సలహాదారులు, ఆస్తుల విలువ మదింపు దారులను ఎంపిక చేసే పనిలో పడింది. ఈ దిశగా ఆసక్తి వ్యక్తీకరణ కోరుతూ త్వరలోనే ఆహ్వానం పలకనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఎయిర్ ఇండియా, దాని అనుబంధ సంస్థల్లో వ్యూహాత్మక వాటాల విక్రయానికి ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ జూన్ 28న ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఎటువంటి గడువును పేర్కొనకపోయినప్పటికీ, రానున్న 12–18 నెలల్లో విక్రయాన్ని పూర్తి చేయాలనుకుంటోంది.

రూ. 799కే విమానయానం

విస్తార ‘ఫ్రీడం టు ఫ్లై’ ఆఫర్



ముంబై: విమానయాన సంస్థ విస్తార తాజాగా ‘ఫ్రీడం టు ఫ్లై‘ ఆఫర్ కింద రూ. 799కే విమాన ప్రయాణ టికెట్లను అందిస్తున్నట్లు ప్రకటించింది. ఎకానమీ తరగతి టికెట్ చార్జీ రూ. 799 కాగా ప్రీమియం ఎకానమీ టికెట్ రేటు రూ. 2,099గా (ఇతరత్రా అన్ని చార్జీలూ కలిపి) ఉంటుందని పేర్కొంది. 48 గంటల పాటు వర్తించే ఈ ఆఫర్ బుధవారం అర్ధరాత్రితో ముగియనుంది. ఈ ఏడాది ఆగస్టు 23 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 19 మధ్య కాలంలో చేసే ప్రయాణాలకు ఈ స్కీమ్ టికెట్లు వర్తిస్తాయి. సెలవుల్లో గోవా, పోర్ట్ బ్లెయిర్, జమ్మూ, శ్రీనగర్, కొచ్చి, అమృత్‌సర్, భువనేశ్వర్ తదితర ప్రాంతాలు సందర్శించాలనుకునే వారు ముందస్తుగా ప్రణాళిక వేసుకునేందుకు ఈ ఆఫర్ ఉపయోగపడగలదని కంపెనీ తెలిపింది. హైదరాబాద్, ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, బెంగళూరు వంటి మెట్రో నగరాలకు కూడా ఈ టికెట్లు వర్తిస్తాయని విస్తార పేర్కొంది. శ్రీనగర్–జమ్మూ రూట్‌లో టికెట్ చార్జీ అత్యంత తక్కువగా ఉంటుందని వివరించింది.

23 శాతం తగ్గిన అమరరాజా లాభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జూన్ త్రైమాసికంలో అమరరాజా బ్యాటరీస్ నికరలాభం క్రితం ఏడాదితో పోలిస్తే 23 శాతం తగ్గి రూ.100 కోట్లకు చేరింది. టర్నోవరు 15 శాతం అధికమై రూ.1,685 కోట్లు నమోదు చేసింది. ఈ త్రైమాసికంలో ఆటోమోటివ్ బ్యాటరీ వ్యాపారం కంపెనీకి కలిసొచ్చింది. ఆటోమోటివ్ ఎగుమతులు, ఇన్వర్టర్ బ్యాటరీ విక్రయాలు పెరగడంతో ప్లాంట్ల వినియోగం అదే స్థాయిలో అధికమైందని తెలిపింది. ఇండస్ట్రియల్ బ్యాటరీలకు మార్కెట్లో డిమాండ్ మందకొడిగా ఉన్నట్టు వివరించింది. బీఎస్ఈలో సోమవారం కంపెనీ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే 2.10 శాతం పెరిగి రూ.822.55 వద్ద క్లోజయ్యింది.

పండుగ సీజన్‌కు స్మార్ట్‌ఫోన్ల జోష్

- మెరుగుపడనున్న సెంటిమెంటు
- జేపీ మోర్గాన్ నివేదికలో వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్మార్ట్‌ఫోన్ల విపణి మూడో త్రైమాసికంలో మంచి జోష్‌మీద ఉంటుందని జేపీ మోర్గాన్ తన ‘ఇండియా స్మార్ట్‌ఫోన్ మార్కెట్‘ నివేదికలో వెల్లడించింది. మెరుగైన సెంటిమెంటుతోపాటు పండుగల సీజన్ కోసం విక్రేతల వద్ద సరుకు నిల్వలు పెరగడం ఇందుకు కారణమని తెలిపింది. నివేదిక ప్రకారం.. జీఎస్‌టీ అమలుతీరుపై స్పష్టత లేక సరుకు నిల్వ చేసుకోవడాన్ని విక్రేతలు వాయిదా వేయడంతో ఏప్రిల్–జూన్‌లో డిమాండ్ సాధారణంగా ఉంది. అలాగే ఫీచర్ ఫోన్ల నుంచి స్మార్ట్‌ఫోన్లకు మళ్లే ప్రక్రియ నెమ్మదించడం కూడా స్మార్ట్‌ఫోన్ల డిమాండ్ తగ్గడానికి కారణమైంది. జూలై ప్రారంభం నుంచే సెంటిమెంటు మెరుగుపడింది. జూలై–సెప్టెంబరులో విక్రయాలు గణనీయంగా ఉంటాయి. ఈ కాలంలో అమ్మకాలు క్రితం త్రైమాసికంతో పోలిస్తే 25–30 శాతం, 2016 జూలై–సెప్టెంబరుతో పోలిస్తే 7 శాతం వృద్ధి నమోదు చేస్తాయి. నాల్గవ త్రైమాసికం ప్రారంభం వరకు అమ్మకాల జోష్ ఉంటుంది.

స్మార్ట్‌ఫోన్ల వాటా 45 శాతం..

ఈ ఏడాది ఏప్రిల్–జూన్ కాలంలో అమ్ముడైన మొత్తం మొబైల్స్‌లో స్మార్ట్‌ఫోన్ల వాటా 45 శాతం ఉంటుందని జేపీ మోర్గాన్ నివేదిక వెల్లడించింది. ‘స్మార్ట్‌ఫోన్ల విభాగం జూలై–సెప్టెంబరులో ఇదే స్థాయిలో కొనసాగుతుంది. ఈ త్రైమాసికంలో అందుబాటులోకి రానున్న రూ.1,500 విలువగల జియో ఫీచర్‌ఫోన్ ఇందుకు కారణం. ఫీచర్ ఫోన్ల నుంచి స్మార్ట్‌ఫోన్లకు మళ్లే ప్రక్రియ మందగించే అవకాశం ఉంది. అయితే ఈ ఫోన్ ప్రభావం స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌పై తాత్కాలికమే.‘ అని వివరించింది.

టాటా స్టీల్ టర్న్ అరౌండ్

నికర లాభం రూ.921 కోట్లు

- గతంతో పోలిస్తే 4 రెట్ల పెరుగుదల



న్యూఢిల్లీ: టాటా గ్రూప్ ఉక్కు దిగ్గజం టాటా స్టీల్ టర్న్ అరౌండ్ అయ్యింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన గతేడాది జూన్ క్వార్టర్లో రూ. 3,183 కోట్ల భారీ నష్టాన్ని ప్రకటించిన టాటా స్టీల్, తాజా త్రైమాసికంలో రూ. 921.09 కోట్ల నికరలాభాన్ని కనపర్చింది. కంపెనీ మొత్తం ఆదాయం 19 శాతం వృద్ధిచెంది రూ. 25,970 కోట్ల నుంచి రూ. 30,973 కోట్లకు చేరింది. అయితే గతేడాది ఏప్రిల్–జూన్ మధ్యకాలంలో కంపెనీ యూరప్‌లో కొన్ని ప్లాంట్లలో ఉత్పత్తి నిలిపివేసిన పనితీరును పరిగణనలోకి తీసుకుని భారీ నష్టాన్ని వెల్లడించగా, కొనసాగించిన కార్యకలాపాల ప్రకారం మాత్రం అప్పట్లో రూ. 209 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఈ లాభాన్ని పరిగణనలోకి తీసుకుని చూస్తే (కొనసాగిన కార్యకలాపాల ప్రకారం) 2017 జూన్ క్వార్టర్లో కంపెనీ నికరలాభం రూ. 209 కోట్ల నుంచి నాలుగింతలై రూ. 933 కోట్లకు చేరింది. ఇండియాలోనూ, యూరప్‌లోనూ తమ ఉక్కు వ్యాపారం పటిష్టమైన పనితీరును కనపర్చిందని, ఆగ్నేయాసియాలో మాత్రం కార్యకలాపాలు దెబ్బతిన్నట్లు కంపెనీ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. ఆగ్నేయాసియాలో మైనింగ్ లిటిగేషన్ల కోసం రూ. 617 కోట్లు కేటాయింపులు జరిపామని, దీనిని మినహాయిస్తే తమ నికరలాభం రూ. 1,550 కోట్లకు చేరినట్లవుతుందని కంపెనీ వివరించింది.

ఇండియాలో....

ఇండియాలో కళింగనగర్ ప్లాంటు విస్తరణతో తమ ప్లాంట్ల నుంచి 27.5 లక్షల టన్నుల ఉక్కు సరఫరా జరిగిందని, ఇది గతేడాది జూన్ క్వార్టర్‌తో పోలిస్తే 28 శాతం అధికమని కంపెనీ తెలిపింది. అయితే ఈ ఏడాది జనవరి–మార్చి క్వార్టర్‌తో పోలిస్తే సరఫరాలు 14 శాతం తగ్గాయని, ఇందుకు సీజన్, జీఎస్‌టీ కారణమని కంపెనీ తెలిపింది. ఇండియా కార్యకలాపాల ద్వారా ఆపరేటింగ్ లాభం 2016 జూన్ క్వార్టర్‌కంటే 31 శాతం పెరుగుదలతో రూ. 2,922 కోట్లకు చేరింది. కానీ నికరలాభం 12 శాతం క్షీణించి రూ. 506 కోట్లకు తగ్గింది.

యూరప్‌లో....

యూరప్‌లో మార్కెట్ పరిస్థితులు మెరుగుపడుతున్నందున, అక్కడి కార్యకలాపాల ఆదాయం 28 శాతం వృద్ధితో 170.3 కోట్ల పౌండ్లకు పెరిగినట్లు టాటా స్టీల్ వెల్లడించింది. మార్కెట్ ముగిశాక ఫలితాలు వెలువడగా... సోమవారం టాటా స్టీల్ షేరు ధర బీఎస్ఈలో 4.26 శాతం పెరుగుదలతో రూ. 600 వద్ద ముగిసింది.

ఫ్లిప్‌కార్ట్‌తో సాఫ్ట్‌బ్యాంకు చర్చలు

2 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు ఆసక్తి



న్యూఢిల్లీ: జపాన్‌కు చెందిన అతిపెద్ద ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ సాఫ్ట్‌బ్యాంకు ఫ్లిప్‌కార్ట్‌తో అనుబంధానికి ప్రయత్నిస్తోంది. స్నాప్‌డీల్‌లో అతిపెద్ద వాటాదారైన సాఫ్ట్‌బ్యాంకు (35% వాటా) దాన్ని ఫ్లిప్‌కార్ట్‌లో విలీనం చేయడం ద్వారా దిగ్గజ ఈ కామర్స్ సంస్థలో వాటా పొందాలని చూసింది. కానీ, ఫ్లిప్‌కార్ట్‌తో విలీనం విషయమై చర్చల నుంచి స్నాప్‌డీల్ వైదొలగడంతో, సాఫ్ట్ బ్యాంకు నేరుగా ఫ్లిప్‌కార్టులో ఇన్వెస్ట్ చేసేందుకు ఆసక్తి చూపిస్తోంది. ఈ విషయాన్ని సాఫ్ట్ బ్యాంకు చైర్మన్ మసయోషిసన్ తాజాగా వెల్లడించారు. సాఫ్ట్ బ్యాంకు జూన్ క్వార్టర్ త్రైమాసిక ఫలితాల సందర్భంగా ఆయన ఈ విషయమై మాట్లాడారు. ఫ్లిప్‌కార్ట్‌లో సాఫ్ట్‌బ్యాంకు విజన్ ఫండ్ ద్వారా 2 బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నట్టు విశ్వసనీయ సమాచారం.

నేటి నుంచి జూలై గోల్డ్ బాండ్ల ట్రేడింగ్



ముంబై: జూలై నెలలో జారీ చేసిన సావరిన్ గోల్డ్ బాండ్లకు సంబంధించి ట్రేడింగ్ మంగళవారం నుంచీ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ప్రారంభమవుతుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పేర్కొంది. ఆర్‌బీఐ సోమవారం నాడు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. జూలై 6వ తేదీన ప్రభుత్వం 2017–18 సిరిస్ 2 సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్‌ను ప్రకటించింది. జూలై 10 నుంచి 14 వరకూ అమల్లో ఉన్న స్కీమ్‌కు సంబంధించి బాండ్లు జూలై 28న జారీ అయ్యాయి. 2015 నవంబర్ 5న తొలిసారిగా కేంద్రం గోల్డ్ బాండ్ స్కీమ్‌ను ఆవిష్కరించింది. ఫిజికల్ గోల్డ్‌కు డిమాండ్‌ను తగ్గించడం, ఈ మొత్తాలను పొదుపులుగా మళ్లించి ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా చేయడం ఈ విధాన లక్ష్యం. జూలై సిరిస్‌కు ముందు, ప్రభుత్వం ఎనిమిది దఫాలుగా ఈ స్కీమ్‌ను ఆవిష్కరించింది. తద్వారా రూ.5,400 కోట్లు సమీకరించగలిగింది. బంగారం బాండ్లలోకి భారీగా పెట్టుబడులను ఆకర్షించేలా కేంద్రం ఇటీవలే ఒక కీలక నిర్ణయమూ తీసుకుంది. సావరిన్ గోల్డ్ బాండ్లలో (ఎస్‌జీబీ) వార్షిక పెట్టుబడుల పరిమితిని భారీగా పెంచింది. ప్రస్తుతం 500 గ్రాముల మేరకు మాత్రమే పెట్టుబడి పెట్టే వీలుండగా... దీన్ని ఏకంగా 4 కిలోలకు పెంచింది. ఈ పథకం ద్వారా 2015–16, 2016–17లో రూ. 25,000 కోట్లు సమీకరించాలన్నది లక్ష్యమైనా, రూ.4,769 కోట్లే ప్రభుత్వ ఖాతాలోకి వచ్చాయి.

రూ.2.49 లక్షల కోట్ల రుణాల రద్దు

ఇదీ... ఐదేళ్లలో పీఎస్‌యూ బ్యాంకులు చేసిన పని ● అగ్ర స్థానంలో ఎస్‌బీఐ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులు గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో ఏకంగా రూ.2.5 లక్షల కోట్ల విలువైన రుణాలను ఖాతాల్లోంచి రద్దు చేసి పడేశాయి. ఆర్‌బీఐ గణాంకాల ఆధారంగా ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఎస్‌బీఐ, దాని అనుబంధ బ్యాంకులు సహా మొత్తం 27 ప్రభుత్వరంగ బ్యాంకులు కలిపి రూ.81,683 కోట్ల విలువైన మొండి బకాయిలను రద్దు చేశాయి. గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో ఇదే అత్యధికం. అంతకుముందు ఆర్థిక సంవత్సరం కంటే 41 శాతం ఎక్కువ. 2016–17లో ఒక్క ఎస్‌బీఐ, దానిలో విలీనమైన అనుబంధ బ్యాంకులు రద్దు చేసినవి రూ.రూ.27,574 కోట్లుగా ఉన్నట్టు ఆర్‌బీఐ గణాంకాలు తెలియజేస్తున్నాయి. పీఎస్‌యూ బ్యాంకులు ఇలా రద్దు చేసిన రుణాలు 2012–13లో రూ.27,231 కోట్లు కాగా, అవి 2015–16లో రూ.57,586 కోట్లకు, 2016–17లో రూ.81,683 కోట్లకు పెరిగిపోయాయి. 2016–17 ఆర్థిక సంవత్సరంలో రద్దు చేసిన రుణాల్లో పీఎన్‌బీ రూ.9,205 కోట్లు, బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.7,346 కోట్లు, కెనరా బ్యాంకు రూ.5,545 కోట్లు, బ్యాంకు ఆఫ్ బరోడా రూ.4,348 కోట్లు, కార్పొరేషన్ బ్యాంకు రూ.3,574 కోట్లు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు రూ.3,066 కోట్లు, ఐడీబీఐ బ్యాంకు నుంచి రూ.2,868 కోట్లు ఉన్నాయి. వసూలు కాని మొండి బకాయిలకు ఏటా ఇంత చొప్పున నిధులు కేటాయిస్తూ చివరికి బ్యాంకులు వాటిని రద్దు చేస్తుంటాయి. ఈ ఏడాది మార్చి నాటికి పీఎస్‌యూ బ్యాంకుల మొత్తం జారీ రుణాల్లో స్థూల నిరర్థక ఆస్తులు 12.47 శాతానికి చేరాయి.



డర్టీ డజన్‌పై చర్యలను సమీక్షించిన బ్యాంకర్లు

ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంకరప్టీ కోడ్ (ఐబీసీ) కింద చర్యలకు ఆర్‌బీఐ నిర్ధారించిన 12 డర్టీ కంపెనీ అకౌంట్లపై చర్యలు ఎంతవరకూ వచ్చాయన్న అంశాన్ని ప్రముఖ బ్యాంకర్లు సోమవారం సమీక్షించారు. తగిన లిక్విడేషన్ ప్రక్రియకు ఉద్దేశించి ఈ 12 మొండిబకాయి అకౌంట్లను నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌కు రిఫర్ చేయాలని ఆయా బ్యాంకర్లకు జూన్ 13వ తేదీన ఆర్‌బీఐ అంతర్గత సలహా కమిటీ సూచించిన సంగతి తెలిసిందే. ‘‘పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్న నిర్ణయంలో భాగంగానే నేటి సమావేశం జరిగింది. అన్ని బ్యాంకుల మధ్య సన్నిహిత సహకారానికి దీనిని ఉద్దేశించడం జరిగింది’’ అని ఒక బ్యాంకర్ తెలిపారు.

12 అకౌంట్లు ఇవీ...

ఎస్సార్ స్టీల్, భూషన్ స్టీల్, ఎలక్ట్రోస్టీల్ స్టీల్స్, ఆమ్‌టెక్ ఆటో, భూషన్ పవర్ అండ్ స్టీల్, అలోక్ ఇండస్ట్రీస్, మన్నెత్ ఇస్పాత్, ల్యాంకో ఇన్‌ఫ్రా, ఎరా ఇన్‌ఫ్రా, జేపీ ఇన్‌ఫ్రాటెక్, ఏబీజీ షిప్‌యార్డ్, జ్యోతి స్ట్రక్చర్స్ ఇందులో ఉన్నాయి. మొత్తం రూ. 8 లక్షల కోట్ల మొండిబకాయిల్లో ఈ 12 కంపెనీల వాటా దాదాపు పావుశాతం ఉంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ 12 సంస్థల్లో తొమ్మిదింటిని ఇప్పటికే ఎన్‌సీఎల్‌టీకి రిఫర్ చేయడం జరిగింది. ల్యాంక్ ఇన్‌ఫ్రా, జేపీ ఇన్‌ఫాటెక్, ఎరా ఇన్‌ఫ్రా అకౌంటు మాత్రం ఇంకా పెండింగులో ఉన్నాయి.

22న బ్యాంకింగ్ సమ్మె!

ప్రైవేటీకరణ, విలీనాలపై నిరసన

ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణ, విలీనాలకు నిరసనగా ఈ నెల 22వ తేదీన సమ్మె నిర్వహించాలని బ్యాంక్ ఉద్యోగ సంఘాలు సిబ్బందికి పిలుపు నిచ్చాయి. విలీనాలు, ప్రైవేటీకరణ సహా బ్యాంక్ ఉద్యోగులు పలు బ్యాంకింగ్ వ్యతిరేక విధానాలపై పోరాడుతున్నట్లు ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) ఒక ప్రకటనలో పేర్కొంది. 9 బ్యాంక్ యూనియన్లకు, ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకు ఉద్యోగులకు ఏఐబీఈఏ నేతృత్వం వహిస్తోంది. దాదాపు 10 లక్షల మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొననున్నట్లు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సీహెచ్ వెంకటాచలం పేర్కొన్నారు. మొండిబకాయిలు రద్దు చేయకుండా ఈ బకాయిదారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నది తమ డిమాండ్లలో ఒకటని తెలిపారు.



లోకల్ ఫైండ్స్‌ను ప్రారంభించిన అమెజాన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మీ వద్ద ఉన్న పాత లేదా కొత్త ఉత్పత్తులను విక్రయించాలనుకుంటున్నారా? అయితే అమెజాన్ లోకల్ ఫైండ్స్ మీకో వేదికను కల్పిస్తోంది. ఈ వేదికగా వద్ద ఉన్న పుస్తకాలు, వీడియో గేమ్స్, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్స్, హోమ్ డెకర్ వంటి అన్ని విభాగాల్లో ఉత్పత్తులను విక్రయించుకోవచ్చు. ఉత్పత్తుల డెలివరీ, పేమెంట్స్ సేవలను మాత్రం అమెజాన్ అందిస్తుంది. ఈ ఏడాది ప్రారంభంలో ప్రయోగాత్మకంగా బెంగళూరులో ప్రారంభమైన ఈ సేవలను ఇప్పటికే 600 మంది విక్రయదారులు, 30 వేల మంది వినియోగదారులు వినియోగించుకున్నారని కంపెనీ తెలిపింది. ఇప్పుడీ సేవలను ముంబై, హైదరాబాద్, చెన్నై నగరాలకు విస్తరించింది.

నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

వస్తువు	ధర
పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	రూ.4,600 (కనిష్టం), రూ.4,950 (గరిష్టం)
మిర్చి (వరంగల్, తేజ)	రూ.1,600(కనిష్టం), రూ.5,000(గరిష్టం)
పసుపు (నిజామాబాద్, కొమ్ము)	రూ.3,527(కనిష్టం), రూ.8,284(గరిష్టం)
ఉల్లి (కర్నూలు)	రూ.260 (కనిష్టం), రూ.840 (గరిష్టం)
చక్కెర(చెన్నై)	రూ.4,050
బియ్యం(కరీంనగర్)	రూ.3,600 (హెచ్ఎంటీ)
కందిపప్పు(చెన్నై)	రూ.6,000
సుబాబులు(కృష్ణా)	రూ.4,400 (టన్నుకు)
ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)	రూ.6,781

ఐటీ షేర్లలో అమ్మకాలు

స్వల్పంగా తగ్గిన సూచీలు

ముంబై: సోమవారం ఉదయం గరిష్టస్థాయిలో మొదలైన స్టాక్ మార్కెట్ ముగింపులో అమ్మకాల ఒత్తిడికి లోనై క్షీణించింది. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ పెరుగుతున్న నేపథ్యంలో ప్రధానంగా ఐటీ షేర్లలో అమ్మకాలు జరగడంతో స్టాక్ సూచీలు తొలి లాభాల్ని కోల్పోయి, నష్టాల్లో ముగిసాయి. ట్రేడింగ్ తొలిదశలో 75 పాయింట్ల వరకూ పెరిగిన బీఎస్ఈ సెన్సెక్స్ 32,396 పాయింట్ల గరిష్టస్థాయిని చేరింది. చివరకు ముగింపులో 52 పాయింట్ల నష్టంతో 32,274 పాయింట్ల వద్ద క్లోజయ్యింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా ఇదేబాటలో 10,088 పాయింట్ల గరిష్టస్థాయివరకూ పెరిగిన తర్వాత 9 పాయింట్ల నష్టంతో 10,057 పాయింట్ల వద్ద ముగిసింది. మార్కెట్ పెరగడానికి తగిన చోదకాలేవీ లేకపోవడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడ్డారని, దాంతో మార్కెట్ కన్సాలిడేషన్‌లో పడిపోయిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. బ్రిటానియా, ఎవరెడీ, మరికొన్ని కార్పొరేట్ల ఫలితలు సైతం ఇన్వెస్టర్లను నిరుత్సాహపర్చినట్లు విశ్లేషకులు చెప్పారు.



ఇన్ఫోసిస్ 1.75 శాతం డౌన్...

రూపాయి బలపడుతున్న నేపథ్యంలో ప్రధాన ఐటీ షేర్లు ఇన్ఫోసిస్, టీసీఎస్, విప్రోలు క్షీణించాయి. వీటిలో ఇన్ఫోసిస్ అన్నింటికంటే అధికంగా 1.75 శాతం తగ్గుదలతో రూ. 968 వద్ద ముగిసింది. ఫార్మా షేర్లు డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, లుపిన్, సన్‌ఫార్మా, సిప్లాలు కూడా నష్టపోయాయి. ఇంకా తగ్గిన షేర్లలో ఎన్‌టీపీసీ, టాటా మోటార్స్, మహింద్రా, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌యూఎల్‌లు వున్నాయి.

టాటా స్టీల్ 4.2 శాతం అప్...

ఆర్థిక ఫలితాలు వెల్లడికానున్న నేపథ్యంలో టాటా స్టీల్ 4.26 శాతం పెరిగి 6 సంవత్సరాల గరిష్టస్థాయి రూ. 600 వద్ద క్లోజయ్యింది. మార్కెట్ ట్రేడింగ్ ముగిసిన తర్వాత టాటా స్టీల్ ఫలితాల్ని వెల్లడించింది. జూన్ క్వార్టర్లో నికరలాభం మూడింతలయ్యింది. సెన్సెక్స్–30 షేర్లలో అధికంగా పెరిగిన షేరు ఇదే. ఎస్‌బీఐ, అదాని పోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, కోల్ ఇండియా, మారుతి సుజుకి, బజాజ్ ఆటోలు పెరిగిన షేర్లలో వున్నాయి. ప్రధాన సూచీల్లో వున్న బ్లూచిప్ షేర్లలో అధిక భాగం క్షీణించగా, మిడ్‌క్యాప్ షేర్లు జోరును ప్రదర్శించడంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1 శాతంపైగా పెరిగి ఆల్‌టైమ్ రికార్డుస్థాయి 15,600 పాయింట్ల వద్ద క్లోజయ్యింది.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	3,895
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	24,375
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	2,98,101
ఎఫ్ఐఐ	-199
డీఐఐ	308

నాగార్జున అగ్రికెమ్ లాభం డౌన్

2017–18 క్యూ1లో ఆదాయం రూ.186.56 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) నాగార్జున అగ్రికెమ్ లిమిటెడ్ (ఎన్ఏసీఎల్) లాభాలపై ప్రభావం చూపించింది. 2017–18 తొలి త్రైమాసికం (క్యూ1)లో ఎన్ఏసీఎల్ మొత్తం ఆదాయం రూ.186.56 కోట్లు. ఇందులో పన్ను తర్వాత లాభం (పీఏటీ) రూ.1.97 కోట్లు. ఇదే పీఏటీ గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.2.29 కోట్లను నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే దేశమంతటా వర్షాలు, వాతావరణ పరిస్థితులు బాగానే కలిసొస్తున్నా.. జీఎస్‌టీ కారణంగా క్యూ1లో అమ్మకాలపై ప్రభావం చూపించిందని సోమవారం కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. రైతులకు అవసరమైన ఉత్పత్తులను తీసుకురావడంలో భాగంగా ఈ ఏడాది జూలై–సెప్టెంబర్ మధ్య కాలంలో రెండు కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఎగుమతుల మార్కెట్ ఈసారి మెరుగ్గానే ఉందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. క్యూ1లో శిలీంద్ర సంహారక మందుల ఆర్డర్‌ను పొందినట్లు పేర్కొంది. నాగార్జున అగ్రికెమ్ లిమిటెడ్ పేరు కాస్త ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ మారినట్లు తెలిపింది.

ఎస్‌బీఐ.. 'ఫ్యూచర్స్' సిగ్నల్స్!



ఈ రోజు ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌లో (ఎఫ్అండ్ ఓ) ఏ షేర్లయితే బెటర్? ఆ 'ఫ్యూచర్ సిగ్నల్స్' 'సాక్షి' పాఠకులకు ప్రత్యేకం...

ఎస్‌బీఐ...

గతవారంలో క్షీణించిన ఎస్‌బీఐ షేరు ఈ నెల 11న ఆర్థిక ఫలితాల్ని ప్రకటించనున్న నేపథ్యంలో సోమవారం చిన్న ర్యాలీ జరిపి తిరిగి రూ. 310 స్థాయిని అందుకుంది. ఈ సందర్భంగా ఎస్‌బీఐ ఫ్యూచర్ కాంట్రాక్టులో తాజాగా 20.16 లక్షల షేర్లు (3.26 శాతం) యాడ్ అయ్యాయి. దాంతో ఫ్యూచర్ మొత్తం ఓపెన్ ఇంట్రస్ట్ (ఓఐ) 6.38 కోట్ల షేర్లకు పెరిగింది. స్పాట్ ధరతో పోలిస్తే ప్రీమియం స్వల్పంగా రూ. 1.75 నుంచి రూ. 1.50కి తగ్గింది. ఓఐ పెరగడం, ప్రీమియం తగ్గడాన్ని పరిశీలిస్తే పోర్ట్‌ఫోలియో షార్టింగ్ జరిగినట్లు భావించవచ్చు. షేరు పెరిగినా, రూ. 310, 315, 320 స్ట్రయిక్స్ వద్ద కాల్ రైటింగ్ అంతంతమాత్రంగానే జరిగింది. ఈ మూడు స్ట్రయిక్స్ వద్ద 1.41 లక్షలు, 1.23 లక్షలు, 9 వేల చొప్పున కాల్స్ యాడ్‌కాగా, 33.48 లక్షలు, 23,79 లక్షలు, 64.74 లక్షల షేర్ల చొప్పున కాల్ బిల్డప్ వుంది. ఇదే సమయంలో రూ. 310, రూ. 300 స్ట్రయిక్స్ వద్ద కూడా పుట్ రైటింగ్ తక్కువగానే జరిగింది. 93 వేలు, 2.70 లక్షల చొప్పున షేర్లు యాడ్‌కాగా, ఈ స్ట్రయిక్స్ వద్ద 20.97 లక్షలు, 45.18 లక్షల షేర్ల చొప్పున పుట్ బిల్డప్ వుంది. షేరు దిశ పట్ల ఆప్షన్ రైటర్లలో స్పష్టమైన అంచనాలు లేవని ఈ రైటింగ్ తీరు సూచిస్తోంది. సమీప భవిష్యత్తులో ఈ షేరు రూ. 310 కేంద్రంగా రూ. 300–320 శ్రేణి మధ్య హెచ్చుతగ్గులకు లోనుకావొచ్చని, ఈ శ్రేణిని ఎటువైపు ఛేదిస్తే..అటు వేగంగా కదలవచ్చని ప్రస్తుత బిల్డప్ వెల్లడిస్తున్నది.

→ టాటా మోటార్స్ ఎఫ్ అండ్ ఓ డేటా ఏం చెబుతోంది?

ఈ వివరాలు www.sakshibusiness.comలో

రెండింతలైన నాట్కో లాభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ కంపెనీ నాట్కో ఫార్మా జూన్ త్రైమాసికంలో ఉత్తమ ఫలితాలను నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే కన్సాలిడేటెడ్ నికరలాభం రెండింతలై రూ.93.7 కోట్లకు చేరింది. ఆదాయం 30 శాతం వృద్ధి చెంది రూ.448.7 కోట్లకు ఎగసింది. 2017–18 సంవత్సరానికిగాను రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.1.25 మధ్యంతర డివిడెండు చెల్లించాలని బోర్డు ప్రతిపాదించింది. ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్స్ కింద అర్హులైన ఉద్యోగులకు 6 లక్షల షేర్లను కేటాయించాలన్న ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది. క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్ఈలో కంపెనీ షేరు ధర సోమవారం 1.22 శాతం పెరిగి రూ.960.80 వద్ద క్లోజయ్యింది.

ఆ షెల్ కంపెనీల్లో ట్రేడింగ్ కష్టమే!

- అనుమానిత 331 కంపెనీల ట్రేడింగ్‌పై ఆంక్షలు
- నెలలో మొదటి సోమవారం మాత్రమే అవకాశం
- సెబి తాజా ఆదేశాలు... నేటి నుంచే అమల్లోకి
- ఆడిట్ వివరాల ఆధారంగా అవసరమైతే డీ లిస్టింగ్



న్యూఢిల్లీ: షెల్ కంపెనీలుగా (నల్లధనం ప్రవాహం, పన్నుల ఎగవేతకు వీలుగా ఏర్పాటు చేసేవి) అనుమానిస్తున్న 331 లిస్టెడ్ కంపెనీలపై తాజా చర్యలకు సెబీ ఆదేశించింది. కార్పొరేట్ వ్యవహారాల శాఖ ఆయా లిస్టెడ్ కంపెనీల వివరాలు అందజేయడంతో... వీటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్ఈ, బీఎస్ఈ, మెట్రోపాలిటన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లను సెబీ ఆదేశించింది. ఈ కంపెనీలను నాల్గవ గ్రేడ్ నిఘా నియంత్రణలోకి తీసుకురావాలని కోరింది. ఈ గ్రేడ్‌లోకి తీసుకొస్తే ఆయా స్టాక్స్‌లో నెలలో ఒక్కసారే ట్రేడింగ్‌కు వీలుంటుంది. సెబీ ఆదేశాల నేపథ్యంలో 331 లిస్టెడ్ కంపెనీలను మంగళవారం నుంచే నాల్గవ గ్రేడ్‌లోకి మార్చనున్నారు. దీంతో ఇక ఈ నెలలో ఈ స్టాక్స్‌లో లావాదేవీలకు అవకాశం ఉండదు. నెలలో ఒక్కసారే అది కూడా మొదటి సోమవారమే వీటిలో ట్రేడింగ్‌కు అనుమతించనున్నట్టు సంబంధిత ప్రకటనలో సెబీ పేర్కొంది. అలాగే, చివరిగా క్లోజ్ అయిన ధరకు మించి పెరిగేందుకు కూడా అవకాశం ఇవ్వరు. ఈ స్టాక్స్‌ను కొనుగోలు చేస్తున్న వారి నుంచి లావాదేవీ విలువ మొత్తానికి అదనంగా 200 శాతాన్ని నిఘా డిపాజిట్ కింద వసూలు చేస్తారు. ఈ మొత్తాన్ని ఎక్స్ఛేంజ్‌లు ఐదు నెలల పాటు తమ వద్దే ఉంచుకుంటాయి. ఇక ఈ కంపెనీల ఆర్థిక వివరాలు, ఇతర అంశాలను ఎక్స్ఛేంజ్‌లు తనిఖీ చేయాల్సి ఉంటుంది. అలాగే, స్వతంత్ర ఆడిటర్‌తో ఆడిటింగ్ జరపాలని, అవసరమైతే ఫోరెన్సిక్ ఆడిట్‌ను నిర్వహించాలని సెబీ కోరింది. ఈ ఆడిటింగ్‌లో ఆయా కంపెనీలు కార్యకలాపాలు నిర్వహించడానికి వీలుగా ఎటువంటి ఆర్థిక వ్యవహారాలు, ఫండమెంటల్స్ ఏవీ లేవని తేలితే వాటిని తప్పనిసరిగా డీలిస్ట్ కూడా చేస్తారు. ఈ కంపెనీల ప్రమోటర్లు, డైరెక్టర్ల వాటాలను డిపాజిటరీలు ఎక్స్ఛేంజ్‌ల ధ్రువీకరణ తర్వాతే బదిలీకి అనుమతిస్తారు. ఈ కంపెనీలు మరే ఇతర లిస్టెడ్ కంపెనీల్లో లావాదేవీలు నిర్వహించేందుకు వీలుండదు. ఒకవేళ ఈ 331 కంపెనీల్లో ఏవైనా ఇప్పటికే ట్రేడింగ్ సస్పెన్షన్‌కు గురై ఉంటే, సస్పెన్షన్ ఎత్తివేసిన మరుక్షణమే వాటిని నాల్గవ గ్రేడ్ నిఘాలోకి తీసుకొస్తారు. నల్లధనంపై పోరులో భాగంగా కార్పొరేట్ వ్యవహారాల శాఖ ఎటువంటి వ్యాపారాలు నిర్వహించని 1.62 లక్షల కంపెనీల రిజిస్ట్రేషన్‌ను ఇటీవలే రద్దు చేసిన విషయం తెలిసిందే.

త్వరలో పబ్లిక్ ఇష్యూకి జీఐసీ

ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ రీఇన్సూరెన్స్ సంస్థ.. జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా (జీఐసీ) ప్రతిపాదిత ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్‌కి (ఐపీవో) సంబంధించిన ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీవోలో 12.4 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. పబ్లిక్ ఇష్యూ అనంతరం కంపెనీలో కేంద్రం వాటా 14.22 శాతం తగ్గనుంది. డీఆర్‌హెచ్‌పీ ప్రకారం రూ. 5 ముఖ విలువ గల 12.4 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. ఇందులో 10.7 కోట్ల షేర్లు ప్రభుత్వం విక్రయించనుంది. మిగతా 1.7 కోట్ల షేర్లను తాజాగా జారీ చేయనున్నారు. ఐపీవో ద్వారా వచ్చిన నిధులను భవిష్యత్ వృద్ధి ప్రణాళికల కోసం కంపెనీ వినియోగించుకోనుంది. జీఐసీ దేశీయంగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగానికి చెందిన 54 సాధారణ, జీవిత బీమా కంపెనీలకు రీఇన్సూరెన్స్ సేవలు అందిస్తోంది. సార్క్ సభ్య దేశాల్లోను, ఆఫ్రికా.. మధ్య ప్రాచ్య దేశాల్లోని బీమా కంపెనీలకూ సర్వీసులు అందిస్తోంది. లండన్, దుబాయ్, మలేసియాలో శాఖలు ఉన్నాయి. ప్రభుత్వ రంగ బీమా సంస్థలన్నింటినీ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేయాలన్న ప్రణాళికలో భాగంగానే జీఐసీ ఐపీవో తెరపైకి వచ్చింది. జీఐసీతో పాటు న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్, ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీల లిస్టింగ్ ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఒక్కో సంస్థలో 25 % దాకా వాటాలు విక్రయించాలన్నది ప్రతిపాదన.

నేటి బోర్డు మీటింగ్స్

- ఎన్‌సీసీ
- టాటా కెమి.
- జిందాల్ స్టీల్
- ముత్తూట్ ఫైనాన్స్
- బీఓఐ
- ఐఎల్అండ్ఎఫ్ఎస్ ట్రాన్స్‌పోర్టేషన్
- చంబల్ ఫెర్టిలైజర్స్
- జేకే అగ్రి
- పీవీపీ వెంచర్స్
- గ్లాక్సోస్మిత్‌క్లైన్
- మెక్‌లియోడ్ రసెల్
- స్పైస్ మొబిలిటీ

బులియన్ రూ.లలో

ముంబై (మార్పు శుక్రవారం ధరతో పోల్చి...)		
బంగారం (99.9, 10గ్రా)	28,520 ▼	170
బంగారం (99.5, 10గ్రా)	28,370 ▼	170
వెండి (కిలో)	37,060 ▼	890
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	– –	
బంగారం (22 క్యారెట్లు)	27,100	
వెండి (కిలో)	– –	
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	29,000	
బంగారం (22 క్యారెట్లు)	27,100	
వెండి(కిలో)	37,295	
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	29,450	
బంగారం (22 క్యారెట్లు)	27,230	
వెండి(కిలో)	38,500	
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	29,460	
బంగారం (22 క్యారెట్లు)	27,100	
వెండి(కిలో)	39,500	
విజయవాడ		
బంగారం (24 క్యారెట్లు)	29,400	
బంగారం (22 క్యారెట్లు)	27,350	
వెండి(కిలో)	38,500	
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	29,350	
బంగారం (22 క్యారెట్లు)	27,150	
వెండి(కిలో)	38,300	

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు	శుక్రవారం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	49.17	$49.58
బ్రెంట్	52.09	$52.42

వడ్డీ రేట్లు

బేస్‌రేట్ రేంజ్	9.00 – 9.55
డిపాజిట్ రేట్ రేంజ్ (ఏడాది)	6.25 – 6.90
డాలర్ లిబార్ (6 నెలలు)	1.45

అంకెలు శాతాల్లో

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 8-8-2017

విశాఖ	335-00
చిత్తూరు	365-00
వరంగల్	323-00
ముంబై	368-00
చెన్నై	372-00
విజయవాడ	328-00
గోదావరి	328-00
నమక్కల్	365-00
7-8-2017 ఫామ్ ధర...	
హైదరాబాద్	321-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	3.90
బెంగళూరు	360-00
ఢిల్లీ	330-00
కోల్‌కతా	357-00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ACC LIMITED	1817.35	1813.35
ADANI PORT	414.25	406.65
AMBUJA CEME	279.5	277.45
ASIAN PAINT	1149.65	1157.3
AXIS BANK L	505.8	508.1
BAJAJ AUTO	2889.25	2874.65
BANK OF BAR	160.05	158.95
[illegible]		

A B C D

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
3M INDIA LI	13826.4	13277.1
63 MOONS TE	61.15	60.65
8K MILES SO	529.9	526.05
AARTI DRUGS	558.7	554
AARTI INDUS	936.4	919.75
AARVEE DEN.	57.3	61.1
ABAN OFFSHO	178.15	176.95
ABBOTT INDI	4453.05	4367.65
ACCELYA KAL	1387.9	1401.9
BANSWARA SY	155.6	158.55
BASF INDIA	1462.35	1432.85
BATA INDIA	641.3	631.35
BAYER CROPS	4485.4	4567.45
BEARDSELL L	54.95	52.85
BEML LIMITE	1718.05	1727.65
BERGER PAIN	248.95	241.35
BF INVESTME	173.8	170.8
BF UTILITIE	370.2	368.15
BGR ENERGY	142.95	142.85
BHAGERIA IN	263.45	255.35
BHANSALI EN	79.45	74.4
DHUNSERI IN	399.4	395.35
DHUNSERI PE	81.15	77.2
DHUNSERI TE	291.25	293.5
DIC INDIA L	527.45	521.35
DILIP BUILD	539.05	526.3
DISH TV IND	76.8	79.3
DOLLAR INDU	2177.2	2119.3
DOLPHIN OFF	89.35	88.35
DONEAR IND.	63.7	64
DR. LAL PAT	831.65	814.25
DWARIKESH S	749.6	665.1
DYNAMATIC T	2377.05	2364.8
[illegible]		

E F G H

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
GUJARAT ALK	399.7	399.75
GUJARAT AMB	107.15	110.2
GUJARAT FLU	813.35	786.55
GUJARAT GAS	758.2	755
GUJARAT MIN	139.85	137.5
GUJARAT PIP	142.1	139.9
GUJARAT STA	187.35	183.9
GULF OIL LU	810.55	807
GULSHAN POL	97.4	95.75
HARITA SEAT	788.15	797.75
HARRISON MA	81.9	81.85
HATSUN AGRO	640.15	620
[illegible]		

I J K L

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
JET FREIGHT	99.4	94.7
JHS SVEND.	70.8	68.6
JIND POL IN	63.85	65
JINDAL DRIL	163.95	163.35
JINDAL PHOT	71.3	69.85
JINDAL POLY	411.4	400.7
JINDAL SAW	96.2	93.4
JINDAL STAI	89	90.1
JINDAL STAI	164.5	170.2
JINDAL STEE	143.55	138.35
JINDAL WORL	835.5	804.8
JK CEMENT L	1026.45	1012.2
[illegible]		

M N O P

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
MAN INFRA L	66.9	65
MANAKSIA LT	78.65	78.4
MANAPPURAM	106.3	102.8
MANG.CHEM.F	68.7	67.75
MANGALAM CE	377.7	369.1
MANGALAM DR	155.55	158.75
MANPASAND B	779.55	778.25
MARATHON NX	312.1	314.7
MASTEK LTD	271.45	276.75
MAWANA SUGA	95.9	79.95
MAX FINANCI	609.8	608.15
MAX INDIA L	147.95	146.9
[illegible]		
PDS MULTINA	247	247.65
PEARL GLOBA	160.5	157.25
PENNAR ENG	121.55	118
PENNAR INDU	54.4	54.75
PERSISTENT	621.6	637.9
PFIZER LTD	1798.35	1800.75
PG ELECTROP	335.35	333.45
PHILIPS CAR	663	647.35
PHOENIX LAM	212.85	214.05
PI INDUSTRI	748.65	735.5
PINCON SPIR	71.85	72.35
PLASTIBLEND	263.15	265.55
[illegible]		

R S T U

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
SCHAEFFLER	4344.2	4294.85
SCHNEIDER E	128.8	128.5
SEAMEC LIMI	182.4	179.15
SELAN EXPLO	159.25	158.4
SEQUENT SCI	121.75	123.85
SESHASAYEE	710.55	702.75
SHAKTI PUMP	497.25	505.3
SHANKARA BL	1075.9	1009.45
SHANTHI GEA	136.9	134.65
SHARDA CROP	450.55	450.05
SHARDA MOTO	2770.85	2690.45
SHEELA FOAM	1273.2	1261.45
THE HI-TECH	359.6	360.95
THE INDIA C	200.05	198.5
THE INDIAN	129.05	128
THE MANDHAN	164	152.5
THE P K TEA	145.95	146.5
THE PHOENIX	498.85	481.35
THE RAMCO C	692	688.55
THE RUBY MI	345.55	348.35
THE STATE T	167.65	167.1
THE TINPLAT	142.3	134.05
THEJO ENGIN	350	349
THEMIS MEDI	513.75	507.05
[illegible]		

V W X Z

[illegible]

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

[illegible]

బీఎస్ఈలో ఎ, బీఎస్ఈ గ్రూప్ షేర్లు

[illegible]





రాఖీ పండగను పురస్కరించుకుని సోమవారం ఢిల్లీలో రాష్ట్రపతిభవన్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు రాఖీ కట్టి తిలకం దిద్దుతున్న బ్రహ్మకుమారీ సమాజం ప్రతినిధులు • ప్రధాని నివాసంలో మోదీకి రాఖీ కడుతున్న 103 ఏళ్ల షర్బతీ దేవి. 50ఏళ్ల క్రితం తన సోదరుడిని కోల్పోయిన ఈమె ప్రధానికి రాఖీ కట్టారని ప్రధాని కార్యాలయం తెలిపింది. • అట్టారీలో భారత్-పాక్ సరిహద్దు వద్ద బీఎస్‌ఎఫ్ జవాన్లకు రాఖీ కడుతున్న స్థానిక మహిళలు. కాగా, 23 ఏళ్లుగా మోదీకి రాఖీకడుతున్న పాకిస్తానీ మహిళ ఖమర్ మోహ్సిన్ ఈసారి కూడా రాఖీకట్టారు.

కశ్మీర్‌లో ఐదుగురు ఉగ్రవాదుల ఎన్‌కౌంటర్

శ్రీనగర్: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) నుంచి భారత్‌లోని మచ్చిల్ సెక్టార్‌లోకి చొరబడడానికి ఉగ్రవాదులు చేసిన యత్నాన్ని ఆర్మీ తిప్పికొట్టింది. ఈ సెక్టార్‌లో ఐదుగురు ఉగ్రవాదులను సోమవారం మట్టుబెట్టినట్లు రక్షణశాఖ తెలిపింది. మరింత మంది చొరబాటుదారులు ఉండొచ్చన్న అనుమానంతో జవాన్లు గాలిస్తున్నారు.

లష్కరే ఉగ్రవాది హతం: పాకిస్తాన్‌కు చెందిన ఓ లష్కరే తోయిబా ఉగ్రవాదిని జవాన్లు జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో మట్టుబెట్టారు ఆదివారం భద్రతాబలగాలు సంబూరా గ్రామాన్ని చుట్టుముట్టగా అక్కడున్న ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఎదురుకాల్పుల్లో ఉమర్ హతమయ్యాడు. గత నెలఅమర్‌నాథ్ యాత్రికులపై దాడిచేసిన ఇస్మాయిల్ గ్రూప్‌లో అతడు సభ్యుడని భావిస్తున్నారు.

'అయోధ్య' పిటిషన్ల విచారణకు బెంచ్

న్యూఢిల్లీ: అయోధ్య–బాబ్రీ మసీదు వివాదంలో 2010లో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలుచేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించడానికి ముగ్గురు న్యాయమూర్తుల బెంచ్‌ను సుప్రీం కోర్టు నియమించింది. జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలో జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ అబ్దుల్ నజీర్‌ల బెంచ్ ఈ నెల 11 నుంచి పిటిషన్ల విచారణ ప్రారంభిస్తుందని తెలిపింది. అయోధ్యలోని వివాదాస్పద 2.77 ఎకరాల భూమిని గతంలో సున్నీ వక్ఫ్ బోర్డు, నిర్మోహీ అఖరా, రామ్‌లల్లాలకు సమానంగా పంచాలని గతంలో అలహాబాద్ హైకోర్టు 2:1 మెజారిటీతో తీర్పునిచ్చింది.

రజనీకాంత్‌తో పూనమ్ మహాజన్ భేటీ



సాక్షి ప్రతినిధి, చెన్నై: బీజేపీ ఎంపీ పూనమ్ మహాజన్ ఆదివారం తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్‌ను చెన్నైలోని ఆయన నివాసంలో కలుసుకున్నారు. బీజేపీ యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన చలో సెక్రటేరియట్ ఆందోళన కార్యక్రమంలో జాతీయ అధ్యక్షురాలి హోదాలో పాల్గొనేందుకు ఆదివారం ఆమె చెన్నైకి చేరుకున్నారు. అరగంటసేపు ఆమె రజనీతో భేటీ అయ్యారు. రజనీ రాజకీయ ప్రవేశంపై ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. రజనీని బీజేపీలోకి ఆహ్వానించే ప్రయత్నాల్లో భాగంగానే పూనమ్ ఆయనను కలుసుకున్నారని తెలుస్తోంది.

'సంకల్ప్ పర్వం'గా ఆగస్టు 15

న్యూఢిల్లీ: దేశప్రజలు స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15న 'సంకల్ప్ పర్వం' జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది. సమాజంలోని రుగ్మతల నిర్మూలనకు కృషిచేస్తామని పౌరులు ఆరోజున సంకల్పించుకోవాలని సూచించింది. 70వ స్వాతంత్ర్య దినోత్సవమైన ఈ నెల 15న 'సంకల్ప్ పర్వం' నిర్వహించుకోవాలని సిబ్బంది శిక్షణ శాఖ తన తాజా ఉత్తర్వులో పేర్కొంది. '2022నాటికి క్విట్ఇండియా ఉద్యమం 75ఏళ్లు పూర్తిచేసుకుంటుంది. పౌరులంతా సమష్టిగా సమస్యలపై పోరాడి కొత్త భారతావనిని ఆవిష్కరిస్తే మన స్వాతంత్ర్యయోధులు గర్విస్తారు' అని పేర్కొంది.

పేదలకు ఎల్పీజీ సబ్సిడీ కొనసాగుతుంది

అగర్తలా: పేదలకు అందిస్తున్న ఎల్పీజీ సబ్సిడీ ఇకమీదటా కొనసాగుతుందని కేంద్ర చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సోమవారం స్పష్టం చేశారు. 'సాధారణ ప్రజలు, పేదలకు ఎల్పీజీ, కిరోసిన్‌పై ఇస్తున్న సబ్సిడీ ఎత్తేసే ప్రణాళికలేవీ లేవు' అని ప్రధాన్ మీడియాకు చెప్పారు. ఈశాన్యరాష్ట్రాల్లో ఎల్పీజీ కొరతను అధిగమించేందుకు బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్ నుంచి త్రిపురకు సహజవాయువు తెచ్చేందుకు పైపులైను వేసే ప్రాజెక్టును చేపట్టామని ప్రధాన్ తెలిపారు.

ఉప్మా హాట్‌బాక్సుల్లో రూ.1.29 కోట్లు

న్యూఢిల్లీ: ఉప్మా ముసుగులో దుబాయ్‌కు రూ.1.29 కోట్ల విలువైన విదేశీ మారకద్రవ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు ప్రయాణికులను పుణే విమానాశ్రయంలో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పుణే నుంచి దుబాయ్ వెళ్తున్న నిశాంత్ అనే వ్యక్తి డాక్యుమెంట్లు అనుమానాస్పదంగా కనిపించడంతో అధికారులు అతని లగేజ్‌ను తనిఖీ చేశారు. లగేజ్‌లో హాట్‌బాక్సు ఉండాల్సిన బరువుకంటే అధికంగా ఉండడంతో పరిశీలించగా..ఉప్మా కింద 86,600 అమెరికా డాలర్లు, 15,000 యూరోలు బయటపడ్డాయి. దుబాయ్‌కి అదే విమానంలో వెళ్తున్న ఓ మహిళ లగేజ్ నుంచి ఉప్మా హాట్ బాక్సులో దాచిన 86,200 డాలర్లు, 15,000 యూరోలను స్వాధీనం చేసుకున్నారు.



మోడ్రన్ ఆర్ట్‌లా కనిపిస్తున్న పై ఫొటో సూర్యుడి ఉపరితలంపై ఉన్న ఒక క్రియాశీల అయస్కాంత క్షేత్రం. నాసాకు చెందిన సోలార్ డైనమిక్ అబ్జర్వేటరీ ఈ సోలార్‌స్పాట్(ఏఆర్ 12665)ను గుర్తించి, ఫొటోలను భూమికి పంపింది.

తాలిబన్, ఐసిస్ కలసి మారణకాండ!

అఫ్గాన్‌లో 50 మంది పౌరుల ఊచకోత

కాబూల్: వైరి వర్గాలైన తాలిబాన్, ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థలు రెండూ కలసి అఫ్గనిస్తాన్‌లో మారణకాండకు పాల్పడ్డాయి. సర్–ఈ పౌల్ రాష్ట్రంలోని సయద్ జిల్లాలో మహిళలు, చిన్నారులు సహా 50 మందికిపైగా పౌరులను సామూహికంగా హత్య చేశాయి. అఫ్గాన్ లోకల్ పోలీస్ (ఏఎల్పీ) దళాలకు.. తాలిబాన్, ఐసిస్‌లకు మధ్య గత గురువారం నుంచి 48 గంటలపాటు పోరు కొనసాగిందని, శనివారం రాత్రి పౌరులను దొరికిన వారిని దొరికినట్లు ఉగ్రవాదులు చంపివేశారని అధికారులు తెలిపారు. 'ఐసిస్, తాలిబన్ ఉగ్రవాదులు.. దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి ఉగ్రవాదులను రిక్రూట్ చేసుకుని.. మిర్జావలంట్ గ్రామంపై దాడికి తెగబడ్డారు' అని చెప్పారు. కొందరిని కాల్చి చంపగా.. మరికొందరి తలలు నరికివేశారని తెలిపారు. కాగా తామే సొంతంగా దాడి చేశామని, ఐసిస్ సహకారం తీసుకోలేదని తాలిబాన్ చెప్పింది. సాధారణ పౌరులను చంపలేదని పేర్కొంది.

కాంగ్రెస్‌లో 'గుజరాత్' టెన్షన్!

నేడు రాజ్యసభ ఎన్నికలు..

- అహ్మద్ పటేల్ గెలుపుపై ఉత్కంఠ
- చివరిక్షణంలో కాంగ్రెస్‌కు షాకిచ్చిన ఎన్సీపీ.. బీజేపీకి మద్దతు
- విజయానికి ఒక్క ఓటు దూరంలో పటేల్..
- జేడీయూ, గుజరాత్ పరివర్తన్ పార్టీపై కాంగ్రెస్ ఆశలు



అహ్మదాబాద్: గుజరాత్‌లో రాజ్యసభ ఎన్నికలు తీవ్ర ఉత్కంఠ రేపుతున్నాయి. సోనియా రాజకీయ కార్యదర్శి, కాంగ్రెస్ నేత అహ్మద్ పటేల్‌ను ఓడించి గట్టి షాక్ ఇవ్వాలని బీజేపీ, ఎలాగైనా గెలిచి దీటుగా సమాధానమివ్వాలని కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. గుజరాత్‌లో మొత్తం 3 రాజ్యసభ స్థానాలకు మంగళవారం ఎన్నికలు జరుగుతుండగా.. బీజేపీ నుంచి ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ, బల్వంత్‌సిన్హ్ రాజ్‌పుత్‌లు, కాంగ్రెస్ నుంచి అహ్మద్ పటేల్‌లు బరిలో ఉన్నారు. పటేల్ విజయానికి 45 మంది ఎమ్మెల్యేలు అవసరం కాగా.. ప్రస్తుతం 44 మందే ఉన్నారు. మిత్రపక్షం ఎన్సీపీకి చెందిన రెండు ఓట్లపై కాంగ్రెస్ ఆశలు పెట్టుకోగా చివరి నిమిషంలో ఆ పార్టీ షాకిచ్చింది. బీజేపీకి ఓటేయాలని ఎన్సీపీ ఎమ్మెల్యేలకు ఆ పార్టీ నేత ప్రఫుల్ పటేల్ సూచించారు. దీంతో కాంగ్రెస్ ఇప్పుడు జేడీయూ, గుజరాత్ పరివర్తన్ పార్టీ ఓట్లపై ఆశలు పెట్టుకుంది. అలాగే కాంగ్రెస్ మాజీ నేత శంకర్‌సిన్హ్ వాఘేలా వర్గం ఎమ్మెల్యేలూ మద్దతిస్తారనే నమ్మకంతో ఉంది. అయితే ఈ ఎన్నికల్లో కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేయడంతో పాటు నోటా ఆప్షన్‌ను ఎంచుకుంటే పటేల్ ఓటమి ఖాయమని బీజేపీ అంచనా.

వాఘేలా తిరుగుబాటుతో తప్పిన లెక్కలు

కాంగ్రెస్ నాయకత్వంపై అసంతృప్తితో గత నెల్లో వాఘేలా ఆ పార్టీకి గుడ్‌బై చెప్పడం తెలిసిందే. గుజరాత్ అసెంబ్లీలో మొత్తం 182 స్థానాలు ఉండగా.. ప్రస్తుతం 176 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. బీజేపీకి 121, కాంగ్రెస్‌కు 57 మంది ఎమ్మెల్యేల బలం ఉండగా.. ఇటీవలే ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరారు. దీంతో కాంగ్రెస్ బలం 51కి పడిపోయింది. వాఘేలా వర్గానికి చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలూ కాంగ్రెస్‌కు దూరంగా ఉన్నారు. దీంతో మిగిలిన 44 మంది ఎమ్మెల్యేల్ని రక్షించుకునేందుకు వారిని బెంగళూరు రిసార్టుకు తరలించారు. వీరితో పాటు జేడీయూ, గుజరాత్ పరివర్తన్ పార్టీలకు ఒక్కో ఎమ్మెల్యే ఉండగా ఆ ఓట్లపైనే పటేల్ గెలుపు ఆధారపడింది. నిజానికి పటేల్ నామినేషన్ సమయంలో ఎన్సీపీ, జేడీయూ ఎమ్మెల్యేలు ఆయన వెంట ఉండడం గమనార్హం. వాఘేలా వర్గంలోని ఏడుగురు ఎమ్మెల్యేల్లో కొందరు తమకే ఓటేస్తారని కాంగ్రెస్ ఆశతో ఉంది. బీజేపీకి ఉన్న బలంతో రెండు స్థానాల్లో సులువుగా విజయం సాధిస్తుండగా.. మూడో అభ్యర్థికి ఆ పార్టీ వద్ద 31 మంది ఎమ్మెల్యేలే ఉన్నారు.

నా గెలుపు ఖాయం: అహ్మద్ పటేల్

తన గెలుపుపై అహ్మద్ పటేల్ ధీమా వ్యక్తం చేశారు. '44 ఓట్లు కాదు ఇంకా ఎక్కువే వస్తాయి. గెలవడానికి కావాల్సిన బలం మాకుంది. మా ఎమ్మెల్యేలపై నేను పూర్తి నమ్మకంతో ఉన్నాను' అని చెప్పారు. ఎన్సీపీ, జేడీయూ ఎమ్మెల్యేలు కూడా తనకు మద్దతు ఇస్తారని పటేల్ ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా కాంగ్రెస్ మాజీ నేత వాఘేలా మాత్రం తన వర్గం ఎమ్మెల్యేల మద్దతుపై దాటవేత ధోరణిలో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకత్వంతో తానసలు టచ్‌లో లేనని, బీజేపీకి మద్దతుపై చర్చల్లో నిజం లేదని ఆయన పేర్కొన్నారు. 'నేను ఎవరికి ఓటు వేస్తాననే విషయాన్ని చెప్పను. రాజ్యసభ ఎన్నికల్లో ఓటు అనేది ఎమ్మెల్యేకి వ్యక్తిగత ఆస్తిలాంటిది' అని చెప్పారు. 1977 నుంచి అహ్మద్ పటేల్ తాను మంచి స్నేహితులమని.. ఇప్పుడు కూడా ఆ బంధం అలాగే కొనసాగుతుందని, అది రాజకీయాలకు అతీతమని అన్నారు. మరోవైపు గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ మాట్లాడుతూ.. రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు ముగ్గురూ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

ఈగల్‌టన్ టు నిజానంద

కొద్ది రోజులుగా బెంగళూరులోని ఈగల్‌టన్ రిసార్టులో మకాం వేసిన 44 మంది గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సోమవారం తెల్లవారుజామున అహ్మదాబాద్ చేరుకున్నారు. అనంతరం వారిని పొరుగునే ఉన్న ఆనంద్ జిల్లాలోని నిజానంద రిసార్ట్‌కు తరలించారు. రక్షాబంధన్ కోసం వారి కుటుంబసభ్యులూ రిసార్ట్‌కు వచ్చారని, మంగళవారం ఓటింగ్ కోసం ఎమ్మెల్యేల్ని గాంధీనగర్‌కు తీసుకెళ్తామని కాంగ్రెస్ ప్రతినిధి మనీశ్ దోషి చెప్పారు. కాగా రిసార్టు లోపల పోలీసు రక్షణను ఎమ్మెల్యేలు తిరస్కరించడంతో వెలుపల బలగాల్ని మోహరించారు. ఎమ్మెల్యేలకు రక్షణగా రిసార్టులో ఎన్‌ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ కార్యకర్తల్ని ఏర్పాటు చేశామని, పోలీసులపై తమకు నమ్మకం లేదని కాంగ్రెస్ నేత గోహిల్ అన్నారు. రిసార్టు పరిసరాల్లో పోలీసు పహారా కొనసాగుతుందని ఆనంద్ జిల్లా ఎస్పీ చెప్పారు.



బెంగళూరు ఎయిర్‌పోర్టులో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

డోక్లాంలో స్వల్ప సైనిక చర్య!

చైనా పరిశీలిస్తోందన్న గ్లోబల్‌టైమ్స్



హుయాయిరౌ(చైనా): సిక్కిం సెక్టార్‌లోని డోక్లాం నుంచి భారత సైనికులను వెనక్కి పంపేందుకు చైనా చిన్నపాటి సైనికచర్య చేపట్టవచ్చని ఆ దేశ అధికారిక వార్తాపత్రిక గ్లోబల్‌టైమ్స్ ఓ వ్యాసం ప్రచురించింది. చైనాలోని కొన్ని మేధోసంస్థల అభిప్రాయాలను ఉటంకిస్తూ ఈ కథనం వెలువడింది. దీనిపై బీజింగ్‌లోని భారతీయ విలేకరుల బృందం వివరణ కోరగా, అవి పత్రికల అభిప్రాయాలేననీ, అధికారిక సమాచారం కోసం రక్షణ శాఖ ఇచ్చే ప్రకటనలను పరిశీలించాలని ఓ అధికారి వ్యాఖ్యానించారు. డోక్లాంలో ప్రతిష్టంభన తొలగాలంటే భారత సైన్యం వెనక్కి వెళ్లాలని చైనా పునరుద్ఘాటించింది. చైనా ప్రభుత్వం సోమవారం భారత జర్నలిస్టుల బృందాన్ని బీజింగ్ శివార్లలోని తమ సైనిక స్థావరానికి తీసుకువెళ్లింది. గత కొద్ది కాలంగా డోక్లాంలో ఇరు దేశాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభన నేపథ్యంలో ఈ పర్యటనను చైనా ఆర్మీ తమ దర్పాన్ని ప్రదర్శించే కార్యక్రమంలా మార్చేసింది. 'భారత బలగాలు చైనా భూభాగాన్ని ఆక్రమించాయి. ఒక సైనికుడిగా మా భూభాగాన్ని కాపాడుకోవడానికి నా శక్తిమేర కృషి చేస్తాను. మా వద్ద తగిన పరిష్కారం, సంకల్పం ఉన్నాయి' అని పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్‌ఏ) సీనియర్ కల్నల్ లీలీ విలేకర్లతో అన్నారు. పీఎల్‌ఏ బలగాలు.. యుద్ధ నైపుణ్యాలను భారత బృందం ముందు ప్రదర్శించాయి. అరుదైన ఈ ప్రదర్శనలో చిన్న ఆయుధాలతో షార్ప్ షూటింగ్, సమీపంలోని ప్రత్యర్థి బలగాలను అదుపుచేయడం, ఉగ్రవాద వ్యతిరేక పోరాటం, పదాతి దళాల అధునాతన యుద్ధ నైపుణ్యాలు ఉన్నాయి.

అస్తిత్వ సంక్షోభంలో కాంగ్రెస్

పార్టీ నాయకుడు జైరాం రమేశ్ వ్యాఖ్య

- మోదీ, అమిత్‌షాలను కలసికట్టుగా ఎదుర్కోవాలి
- వీరిని ఎదుర్కొనేందుకు సాధారణ వ్యూహాలు సరిపోవు
- దేశం మారుతోంది.. కాంగ్రెస్ పార్టీ కూడా మారాలి



కొచ్చి: కాంగ్రెస్ ప్రస్తుతం తీవ్రమైన అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. ప్రధానిమోదీ, బీజేపీ చీఫ్ అమిత్‌షా నుంచి ఎదురవుతున్న సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవాలంటే పార్టీ సీనియర్లంతా కలసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మోదీ, షాలను ఎదుర్కొనేందుకు సాధారణమైన వ్యూహాలు సరిపోవని, కాంగ్రెస్ సరైన విధానాలను అవలంబించాలని పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. 1996 నుంచి 2004 వరకూ కాంగ్రెస్ అధికారంలో లేనికాలంలో కాంగ్రెస్ ఎన్నికల సంక్షోభాన్ని ఎదుర్కొందని, ఎమర్జెన్సీ తర్వాత జరిగిన 1977 ఎన్నికల్లో కూడా పార్టీ ఎన్నికల సంక్షోభాన్ని ఎదుర్కొందని చెప్పారు. అయితే ప్రస్తుతం పార్టీ అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ఇది ఎన్నికల సంక్షోభం కాదని, ఇప్పుడు పార్టీ తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయిందని స్పష్టం చేశారు. గుజరాత్ రాజ్యసభ ఎన్నికలో అహ్మద్ పటేల్‌ను గెలిపించేందుకు, బీజేపీ బెదిరింపులు, ఫిరాయింపులను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కర్ణాటకకు తరలించడంపై ప్రశ్నించగా ఆయన పైవిధంగా స్పందించారు. ఈ నిర్ణయం సరైనదేనన్నారు. గతంలో బీజేపీ కూడా ఇలా ఎమ్మెల్యేలను తరలించిందని గుర్తుచేశారు.

మార్పును గుర్తించాలి..

ప్రస్తుతం భారత్ మారిందనే విషయాన్ని కాంగ్రెస్ గుర్తించాలని, పాత నినాదాలు, ఫార్ములాలు పనిచేయవని, మారిన భారత్‌లాగే పార్టీ కూడా మారాలని సూచించారు. కొందరు పార్టీ నేతలు తామింకా అధికారంలో ఉన్నట్టు వ్యవహరిస్తున్నారని, ఇది మారాలని అన్నారు. 2018లో జరిగే కీలక అసెంబ్లీ ఎన్నికలు, 2019లో జరిగే లోక్‌సభ ఎన్నికల కంటే ముందే పార్టీ అధ్యక్ష బాధ్యతలను స్వీకరించే విషయంపై అస్పష్టతను తొలగించాల్సిన బాధ్యత రాహుల్‌పై ఉందని, ఈ ఏడాది చివరి నాటికి ఆయన బాధ్యతలు స్వీకరిస్తారని భావిస్తున్నానని స్పష్టం చేశారు. ఇది తన అంచనా మాత్రమే అని పేర్కొన్నారు.

20 వస్తువులపై తగ్గనున్న జీఎస్టీ రేటు!

సెప్టెంబరు 9న తుది నిర్ణయం తీసుకోనున్న మండలి

న్యూఢిల్లీ: నిత్యం వాడే వివిధ రకాల ఉత్పత్తులపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) తగ్గే అవకాశం ఉంది. 20కి పైగా వస్తువులకు పన్ను రేటును నిర్ణయించడంలో గతంలో కొన్ని అవకతవకలు జరిగినందున వాటిని సరిదిద్దాలని జీఎస్టీ ఫిట్‌మెంట్ కమిటీ జీఎస్టీ మండలికి సూచించింది. ప్రస్తుతం బ్రాండెడ్ కాని ఆహార పదార్థాలపై పన్ను లేకపోగా, బ్రాండెడ్ ఆహార ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ విధిస్తున్నారు. దీంతో పన్ను భారాన్ని తప్పించుకునేందుకు కంపెనీలు తమ ఉత్పత్తులను బ్రాండెడ్ జాబితా నుంచి ఉపసంహరించుకుంటున్నాయి. కాబట్టి మే 15నాటికి ఏ ఆహార ఉత్పత్తులు బ్రాండెడ్ జాబితాలో ఉండేవో వాటన్నింటిపై (తర్వాతి కాలంలో బ్రాండెడ్ నుంచి తప్పించినా) పన్ను విధించాలని ఫిట్‌మెంట్ కమిటీ జీఎస్టీ మండలికి సిఫారసు చేసింది. సెప్టెంబరు 9న హైదరాబాద్‌లో జరిగే తదుపరి సమావేశంలో మండలి తుదినిర్ణయం తీసుకోనుంది.

వస్తువు	ప్రస్తుత రేటు	సిఫార్సు రేటు
చింతపండు, ముతక వస్త్రాలు శనగపప్పు, శారీ ఫాల్స్	12	5
కస్టర్డ్ పౌడర్, మట్టిబొమ్మలు	28	18
ఇడ్లీ/దోశెపిండి, వస్త్రంతో తయారైన టోపీలు	18	12
పరిమళఅగరొత్తులు, సాంబ్రాణి	12	5
జపమాలలు	18	5
ప్లాస్టిక్‌రెయిన్‌కోట్లు, రబ్బర్‌బ్యాండ్లు కంప్యూటర్ మానిటర్లు	28	18
చీపురు కట్టలు, బ్రష్‌లు	5	పన్నులేదు

ఐఏఎస్ కుమార్తెపై వేధింపులు!

చండీగఢ్: హరియాణా బీజేపీ చీఫ్ సుభాష్ బరాలా కుమారుడు వికాస్(23), అతని స్నేహితుడు ఆశిష్ కుమార్(27) తనను వెంటాడి వేధించారని ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు తనను కిడ్నాప్ చేసేందుకు యత్నించారని వెల్లడించారు. నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు మోటారు వాహనాల చట్టం కింద కేసు పెట్టి, బెయిల్‌పై విడుదల చేశారు. శుక్రవారం రాత్రి చండీగఢ్‌లో ఈ ఉదంతం చోటుచేసుకుంది. నిందితులు న్యాయశాస్త్ర విద్యార్థులు. రేడియో వ్యాఖ్యాతగా పనిచేస్తున్న బాధితురాలు(28) తెలిపిన వివరాల ప్రకారం.. కారులో వెళ్తున్న ఆమెను మద్యం సేవించిన నిందితులు టాటా సఫారీ వాహనంలో 5 కిలోమీటర్లు వెంటాడారు. ఆమె కారుకు తమ వాహనాన్ని అడ్డంగా నిలిపి వేధించారు. దీంతో ఆమె పోలీసులకు ఫోన్ చేసి సాయం కోరింది. తర్వాత పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కాగా, కోర్టు పర్యవేక్షణలో సీబీఐ దర్యాప్తు జరపాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ వేస్తానని బీజేపీ రాజ్యసభ ఎంపీ సుబ్రమణ్యం స్వామి సోమవారం చెప్పారు. కేంద్రం, బీజేపీ దర్యాప్తును నీరుగారుస్తున్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. మరోపక్క.. తాను ఐఏఎస్ కుమార్తెను కాకుండా గ్రామీణ యువతినై ఉంటే దుండగులతో పోరాడలేకపోయి ఉండేదాన్నని బాధితురాలు పేర్కొన్నారు.

అమెరికా వర్సిటీల్లో రిజర్వేషన్ల రగడ



హార్వర్డ్ యూనివర్సిటీ తాజా అడ్మిషన్లలో శ్వేతజాతేతరులకు సగానికి పైగా సీట్లు కేటాయించడం అమెరికా వర్సిటీల్లో రిజర్వేషన్లపై చర్చకు తెరలేపింది. అమెరికా వర్సిటీల్లో మైనార్టీలకు అనధికారికంగా అమలవుతున్న రిజర్వేషన్ విధానం రద్దుకు ట్రంప్ సర్కారు సన్నద్ధమవుతోందన్న వార్తల నేపథ్యంలో ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. అదే సమయంలో వర్సిటీల్లో సీట్ల కేటాయింపులో తమకు అన్యాయం జరుగుతోందని రెండేళ్ల క్రితం ఆసియన్ అమెరికన్లు చేసిన ఫిర్యాదులపై అమెరికా న్యాయశాఖ దర్యాప్తునకు ఆదేశించడంతో.. ట్రంప్ సర్కారు, మైనార్టీలకు మధ్య ఘర్షణకు తెరలేచింది. నిజానికి భారత్‌లోమాదిరి అమెరికాలో చట్టబద్ధ రిజర్వేషన్లు లేవు. జనాభాలో 12.2 శాతం ఉన్న ఆఫ్రికన్ అమెరికన్లు, 16.3 శాతమున్న లాటిన్ లేదా హిస్పానిక్ ప్రజలు.. శ్వేతజాతి అమెరికన్ల కన్నా వెనుకంజలో ఉండేవారు. దీంతో వారికి కొన్ని ప్రత్యేక కేటాయింపులతో సామాజిక న్యాయం అందేలా ఏర్పాట్లు చేశారు. విద్యాసంస్థలు, ఆఫీసులు, ఫ్యాక్టరీలు వంటి చోట్ల అన్ని జాతుల, రంగుల ప్రజలు కనిపించాలనే దేశ సామాజిక న్యాయానికి అనుగుణంగా.. రిజర్వేషన్లకు బదులు అఫర్మేటివ్ యాక్షన్ (నిశ్చయాత్మక చర్య), పాజిటివ్ డిస్‌క్రిమినేషన్(సానుకూల వివక్ష) పేర్లతో వర్సిటీల్లో కొన్ని సీట్లను మైనార్టీలకు కేటాయిస్తున్నారు. మిగతావారి కన్నా కొన్ని మార్కులు తక్కువ వచ్చినా.. ఆ వర్గాలకు సీట్లు కేటాయించడం ఆనవాయితీగా వస్తోంది. హార్వర్డ్ వర్సిటీలో ఈ ఏడాది మొత్తం 2,056 మంది విద్యార్థులకు ప్రవేశం లభించగా, వారిలో 50.8 శాతం శ్వేతజాతేతరులు. గతేడాది ఈ సంఖ్య 47.3 శాతమే. ఇప్పుడది సగానికి మించడం తెల్లజాతివారికి గుబులు పుట్టిస్తోంది. అడ్మిషన్లలో ఆఫ్రికన్ అమెరికన్లకు 22.2, ఆసియన్ అమెరికన్లకు 14.6, లాటినోలకు 11.6 శాతం సీట్లు దక్కాయి. దీంతో వర్సిటీల్లో కోటా ఎత్తివేతపై ట్రంప్ సర్కారు దృష్టిపెట్టినట్లు సమాచారం.

ఒబామా హయాంలో.. హార్వర్డ్ వర్సిటీలో దక్షిణాసియా విద్యార్థులకు మంచి మార్కులు వచ్చినా తక్కువ ప్రతిభ ఉన్న ఇతర మైనార్టీలకు సీట్లు ఇచ్చారంటూ 2015లో దక్షిణాసియా, భారత సంఘాల సమాఖ్య నాటి ఒబామా ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసింది. ఒబామా సర్కారు వీటిపై స్పందించలేదు. ప్రపంచీకరణ, ఉదారవాద విధానాలతో శ్వేతజాతీయులు నష్టపోయారన్న ప్రచారంతో అధికారంలోకి వచ్చిన ట్రంప్ ఇప్పుడు ఆ ఫిర్యాదులపై స్పందించారు. అందుకే దక్షిణాసియా సంఘాల రెండేళ్లనాటి ఫిర్యాదులను పరిశీలించాలని లాయర్లను కోరామని అమెరికా న్యాయశాఖ తెలిపింది. నల్లజాతివారికి, లాటినోలకు కల్పిస్తున్న సౌకర్యాలను తెల్లజాతివారు నేరుగా సవాలు చేయకుండా భారతీయులు కీలకంగా వ్యవహరించే దక్షిణాసియా లాబీని ఈ పనికి వాడుకుంటున్నట్లు భావిస్తున్నారు.

– సాక్షి నాలెడ్జ్ సెంటర్

సాక్షి స్పోర్ట్స్
మంగళవారం 8-8-2017



ఆనంద్‌కు తొలి విజయం

సెయింట్ లూయిస్ (అమెరికా): సింక్విఫీల్డ్ కప్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ తొలి విజయాన్ని నమోదు చేశాడు. ప్రపంచ ఐదో ర్యాంకర్ ఫాబియానో కరువానా (అమెరికా)తో జరిగిన ఐదో రౌండ్ గేమ్‌లో తెల్లపావులతో ఆడిన ఆనంద్ 29 ఎత్తుల్లో గెలుపొందాడు. తొలి నాలుగు గేమ్‌లను 'డ్రా'గా ముగించుకున్న ఆనంద్ ఈ విజయంతో పాయింట్ల పట్టికలో సంయుక్తంగా రెండో స్థానానికి చేరుకున్నాడు. ప్రస్తుత ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే), ఆనంద్ ఖాతాలో మూడేసి పాయింట్లున్నాయి.

ఎన్నాళ్లీ మందగమనం!

ప్రపంచ అథ్లెటిక్స్‌లో భారత్ దయనీయ స్థితి

ప్రాతినిధ్యమే తప్ప పతకాలు గగనం

పురోగతికి ప్రణాళికలు అంతంత మాత్రం



ఆసియా క్రీడలు... ఆసియా చాంపియన్‌షిప్... కామన్వెల్త్ గేమ్స్... గ్రాండ్‌ప్రి సిరీస్‌లు... ఇలా ఏ అంతర్జాతీయ అథ్లెటిక్స్ మీట్ జరిగినా భారత క్రీడాకారులు పతకాలతో తిరిగొస్తారు. తమ అత్యుత్తమ సమయాలను నమోదు చేస్తారు. జాతీయ రికార్డులనూ తిరగరాస్తారు. అయితే ప్రపంచ చాంపియన్‌షిప్, ఒలింపిక్స్ క్రీడలు వచ్చేసరికి మాత్రం మనోళ్ల ప్రదర్శన తీసికట్టుగా మారిపోతోంది. ఈ వేదికలపై మన అథ్లెట్స్ గతంలో తాము సాధించిన అత్యుత్తమ ప్రదర్శనలను కూడా పునరావృతం చేయలేకపోతున్నారు. ఈ మెగా ఈవెంట్‌కు ముందు సన్నాహక టోర్నీల్లో రాణిస్తూ ఆశలు రేకెత్తించి... తీరా అసలు పోటీల్లో మాత్రం చేతులెత్తేస్తారు. ప్రస్తుతం లండన్‌లో జరుగుతున్న ప్రపంచ చాంపియన్‌షిప్‌లో చిన్నదేశాలూ పతకాలు కొల్లగొడుతుంటే మనం మాత్రం ఎక్కడో నిలిచిపోతున్నాం.

సాక్షి క్రీడావిభాగం

మూడున్నర దశాబ్దాల చరిత్ర ఉన్న ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ చరిత్రలో ఇప్పటివరకు భారత్‌కు ఒకే ఒక్క పతకం వచ్చింది. 2003లో పారిస్‌లో జరిగిన ఈ మెగా ఈవెంట్‌లో మహిళల లాంగ్‌జంప్‌లో అంజూ బాబీ జార్జి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించింది. ఆ తర్వాత ఆరుసార్లు ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లు జరిగినా భారత క్రీడాకారులు పతకం సమీపానికి కూడా వెళ్లలేకపోయారు. అర్హత టోర్నీల్లో రాణించడం... ప్రపంచ పోటీలకు బెర్త్‌లు సంపాదించడం... ఆ తర్వాత బరిలోకి దిగి, రిక్తహస్తాలతో తిరిగి రావడం పరిపాటైంది. 2015 బీజింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో వికాస్ గౌడ (డిస్కస్ త్రో), ఇందర్జీత్ సింగ్ (షాట్‌పుట్), లలితా బబర్ (మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్) ఫైనల్లోకి ప్రవేశించినా పతకం మాత్రం నెగ్గలేకపోయారు. ఈసారి భారత్ నుంచి అత్యధిక 25 మంది ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొంటున్నారు. అయితే ఈ జాబితాలో కేవలం నీరజ్ చోప్రా (జావెలిన్ త్రో)పైనే కాస్త ఆశలు ఉన్నాయి. గత ఏడాది అండర్–20 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నీరజ్ జావెలిన్‌ను 86.48 మీటర్ల దూరం విసిరి ప్రపంచ రికార్డు నెలకొల్పడంతోపాటు స్వర్ణ పతకం సాధించడమే దీనికి కారణం. అయితే అండర్–20 చాంపియన్‌షిప్ ప్రమాణాలను సీనియర్ స్థాయితో పోల్చలేము. కానీ గత ప్రదర్శనను పక్కన బెట్టి క్వాలిఫయింగ్, ఫైనల్ ఈవెంట్ రోజున రాణించివారినే పతకం వరిస్తుందనే విషయం గమనార్హం. దాంతో నీరజ్ తన అత్యుత్తమ ప్రదర్శన పునరావృతం చేస్తే ఫైనల్‌కు చేరవచ్చు.

ఆ ఇద్దరికి మొండిచేయి...

జులై తొలి వారంలో భువనేశ్వర్‌లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణాలు సాధించినవారు ప్రపంచ చాంపియన్‌షిప్‌కు నేరుగా అర్హత సాధిస్తారని భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) ప్రకటించింది. మహిళల 1500 మీటర్లలో పీయూ చిత్రా (కేరళ), 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో సుధా సింగ్ విజేతలుగా నిలిచి 'లండన్' బెర్త్ ఖాయం చేసుకున్నారు. అయితే ఈ ప్రదర్శనతో లండన్ ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరడం కూడా కష్టమేనని ఏఎఫ్ఐ అధికారులు వ్యాఖ్యానిస్తూ చిత్రా, సుధా సింగ్‌లను ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలకు పంపించకపోవడం గమనార్హం. ఇక మహిళల 100 మీటర్ల విభాగంలో ద్యుతీచంద్ అర్హత ప్రమాణ సమయాన్ని అందుకోకపోయినా... కనీస సంఖ్యలో ఎంట్రీలు ఉండాలనే ఉద్దేశంతో అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య ద్యుతీ చంద్‌ను ఈ పోటీలకు ఆహ్వానించింది. కానీ ద్యుతీచంద్ తన అత్యుత్తమ సమయాన్ని నమోదు చేయడంలో విఫలమై హీట్స్‌లోనే వెనుదిరిగింది.

ప్రణాళిక లోపం...

ప్రపంచ చాంపియన్‌షిప్‌లో చిన్న దేశాలూ పతకాలు గెలుస్తున్న చోట భారత క్రీడాకారులు ఎందుకు విఫలం అవుతున్నారనే విషయంపై భారత అథ్లెటిక్స్ సమాఖ్య, కోచ్‌లు, క్రీడాధికారులు చెప్పే కారణాలు ఎన్నో ఉన్నాయి. అయితే అథ్లెటిక్స్‌లో ఒకప్పుడు ఎంతో వెనుకంజలో ఉన్న ఆసియా దేశాలు నేడు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకాలు గెలిచే స్థాయికి వచ్చాయి. స్ప్రింట్ ఈవెంట్స్‌లోనూ ఆసియా క్రీడాకారులు జమైకా, అమెరికా, బ్రిటన్, దక్షిణాఫ్రికాలాంటి మేటి దేశాలకు పోటీనిచ్చే స్థాయికి చేరుకున్నారు. ఆయా దేశాలు ఒక పక్కా వ్యవస్థను ఏర్పరచుకొని, సుదీర్ఘ ప్రణాళికలు రూపొందించి వాటిని పకడ్బందీ అమలు చేస్తూ ఇప్పుడు వాటి ఫలితాలను అందుకుంటున్నారు. అయితే భారత్‌లో మాత్రం అలాంటి పరిస్థితి కనిపించడంలేదు. ప్రపంచ చాంపియన్‌షిప్, ఒలింపిక్స్ సమయంలో క్రీడాకారుల వైఫల్యంపై హడావిడి చేయడం, ఆ తర్వాత మర్చిపోవడం సాధారణమైపోయింది. ఇకనైనా అథ్లెటిక్స్ సమాఖ్య పారదర్శకంగా, ప్రణాళికయుతంగా వ్యవహరించి... ప్రతిభాశీలురను గుర్తించి... వారికి అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా నిరంతరం శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టాలి. స్కూల్, కాలేజీ, యూనివర్సిటీలలో అథ్లెటిక్స్ ట్రాక్‌లను నిర్మించేందుకు ప్రభుత్వాలు కూడా చొరవ చూపాలి. ఇలా చేస్తే ఇప్పటికిప్పుడు కాకపోయినా రాబోయే దశాబ్దకాలంలో భారత్ నుంచీ ప్రపంచ, ఒలింపిక్ విజేతలు అవతరించే అవకాశముంది.

మహిళల 400 మీటర్లు: నిర్మలా షెరోన్ (తన హీట్స్‌లో 52.01 సెకన్లతో నాలుగో స్థానంలో నిలిచి చివరిదైన 21వ బెర్త్‌గా సెమీఫైనల్‌కు అర్హత; సెమీఫైనల్లో టాప్-8లో నిలిస్తే ఫైనల్‌కు చేరుతుంది)

'లండన్' ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత ప్రదర్శన

మహిళల 100 మీటర్లు: ద్యుతీచంద్ (తన హీట్స్‌లో 12.07 సెకన్లతో ఆరో స్థానం; ఓవరాల్‌గా 47 మందిలో 38వ ర్యాంక్).

పురుషుల 110 మీటర్ల హర్డిల్స్: సిద్ధాంత్ తింగలాయ (తన హీట్స్‌లో 13.64 సెకన్లతో ఏడో స్థానం; ఓవరాల్‌గా 41 మందిలో 31వ ర్యాంక్).

మహిళల జావెలిన్ త్రో: అన్ను రాణి (తన క్వాలిఫయింగ్ గ్రూప్‌లో 59.93 మీటర్లతో 10వ స్థానం; ఓవరాల్‌గా 31 మందిలో 20వ ర్యాంక్).

మహిళల హెప్టాథ్లాన్: స్వప్న బర్మన్ (5,431 పాయింట్లతో 31 మందిలో 26వ స్థానం)

పురుషుల మారథాన్: గోపీ థోనకల్ (2గం:17ని:13 సెకన్లతో 28వ స్థానం)

మహిళల మారథాన్: మోనిక అథారె (2గం:49ని:54 సెకన్లతో 92 మందిలో 64వ స్థానం)

పురుషుల 400 మీటర్లు: మొహమ్మద్ అనస్ (తన హీట్స్‌లో 45.98 సెకన్లతో నాలుగో స్థానం; ఓవరాల్‌గా 52 మందిలో 33వ ర్యాంక్).



బోల్ట్... బిజీ బిజీ!

రిటైర్మెంట్ తర్వాత వ్యాపారం వైపు

లండన్: 'నా కంపెనీ ఎనర్టర్‌లో ఇప్పుడు మీరు షేర్‌లు కొనుగోలు చేయవచ్చు'... ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల రేసు ముగిసిన మరుసటి రోజే ఉసేన్ బోల్ట్ అభిమానులకు చేసిన విజ్ఞప్తి ఇది. ట్రాక్‌ను వీడిన తర్వాత తన ఆలోచనలేమిటో బోల్ట్ స్పష్టంగా చెప్పేశాడు. ఇప్పటికే తాను భాగస్వామిగా ఉన్న, కొత్త వ్యాపారాలపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టేందుకు అతను సిద్ధమవుతున్నాడు. షూస్ లోపలి భాగంలో ఉపయోగించే ప్రత్యేకమైన అంతర్జాతీయ స్థాయి ఇన్‌సోల్‌లను ఈ కంపెనీ తయారు చేస్తుంది. బోల్ట్‌కు ఈ సంస్థలో వాటా ఉంది. మరోవైపు తన సొంత షూ బ్రాండ్‌ను 'టు ద వరల్డ్' లోగోతో తీసుకొచ్చే ఆలోచన కూడా అతనికి ఉంది. అయితే 15 ఏళ్ల వయసు నుంచి అతనితో అనుబంధం కొనసాగిస్తున్న టాప్ స్పోర్ట్స్ బ్రాండ్ 'పూమా' మాత్రం బోల్ట్‌ను వదిలిపెట్టాలని భావించడం లేదు. ఇప్పటి వరకు ప్రచారకర్తగా మాత్రమే ఉన్న బోల్ట్‌ను తమ ఉద్యోగిగా మార్చుకొని కరీబియన్ దీవుల్లో వ్యాపార బాధ్యతలు అప్పజెప్పాలనుకుంటున్నట్లు ఆ సంస్థ సీఈఓ జోర్న్ గిల్డెన్ చూచాయగా చెప్పారు. 'ఫోర్బ్స్' లెక్కల ప్రకారం గత ఏడాది కాలంలో బోల్ట్ సంపాదన 34.2 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 218 కోట్లు). ఇందులో 10 మిలియన్ డాలర్ల వరకు 'పుమా'నే అతనికి చెల్లిస్తోంది. జమైకాలోని కింగ్‌స్టన్‌లో బోల్ట్‌కు 'ట్రాక్స్ అండ్ రికార్డ్స్' పేరుతో సొంత రెస్టారెంట్ కూడా ఉంది.



ప్రేక్షకుల తీరు మారలేదు!

బహుమతి ప్రదానోత్సవ సమయంలో గాట్లిన్‌కు మళ్లీ వెక్కిరింతలు

లండన్: ఒకవైపు అభిమాన ఆటగాడు బోల్ట్ ఓడిన అసంతృప్తి... మరోవైపు విజేతగా నిలిచిన వ్యక్తి గతంలో రెండుసార్లు డోపింగ్‌లో పట్టుబడి తిరిగొచ్చిన వాడు... దాంతో రేసు ముగిసిన తర్వాత కూడా ప్రేక్షకులు తమ అసహనాన్ని దాచుకోలేకపోయారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో కూడా దానిని ప్రదర్శించారు. బోల్ట్ కాంస్య పతకం అందుకునే సమయంలో మైదానం మారుమోగేలా చప్పట్లతో అభినందించిన వారు గాట్లిన్ పేరు రాగానే 'డోపీ... డోపీ...డోపీ' అంటూ మళ్లీ వెక్కిరించారు. స్టేడియంలో ఒక మూలన కొంత మంది గాట్లిన్‌కు మద్దతు తెలిపినా... ఎక్కువ సంఖ్యలో ప్రేక్షకులు గేలి చేయడాన్ని కొనసాగించారు. అయితే ఆ సమయంలో గాట్లిన్ మాత్రం ఎలాంటి భావోద్వేగాలు కనబర్చలేదు. అమెరికా జాతీయ గీతం వినిపించే సమయంలో గుండెల మీద చేయి వేసుకొని ప్రశాంతంగా నిలబడ్డాడు.



టోరీ బోవీ

ఒలింపిక్ విజేతకు షాక్

- ఎలైన్ థామ్సన్ ఘోర వైఫల్యం
- మహిళల 100 మీటర్ల విజేత టోరీ బోవీ

లండన్: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ స్ప్రింట్స్‌లో మరో సంచలనం... ఈసారి మహిళల విభాగంలో! 100 మీటర్ల పరుగులో రియో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత ఎలైన్ థామ్సన్‌కు పరాభవం ఎదురైంది. కనీసం ఆమె పతకం కూడా గెలవలేకపోయింది. 10.98 సెకన్లతో ఐదో స్థానంతో సరి పెట్టుకుంది. ఈ పోటీల్లో అమెరికాకు చెందిన టోరీ బోవీ 10.85 సెకన్లలో గమ్యానికి చేరి విజేతగా నిలిచింది. మారీ జోసీ లా (ఐవరీకోస్ట్–10.86సె) రజతం గెలుచుకోగా, షిఫర్స్ (నెదర్లాండ్స్–10.96సె) కాంస్యం నెగ్గింది. 2015 బీజింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 4X100 రిలేలో స్వర్ణం, 200 మీ. పరుగులో రజతం సాధించిన థామ్సన్... గత ఏడాది రియోలో 100మీ., 200 మీ. రెండింటిలోనూ స్వర్ణాలు సొంతం చేసుకుంది. తాజా ఫలితంతో రియోలో పరాజయానికి బోవీ ప్రతీకారం తీర్చుకున్నట్లయింది. ఈ ఒలింపిక్స్‌లో ఆమె 100 మీ.లో రజతం, 200 మీ.లో కాంస్యం గెలుచుకుంది.

శ్రీశాంత్‌పై నిషేధం ఎత్తివేత

బీసీసీఐ నిర్ణయంపై కేరళ హైకోర్టు తీర్పు



రాఖీ వేడుకలో శ్రీశాంత్ కుటుంబం

కొచ్చి: స్పాట్ ఫిక్సింగ్ ఆరోపణలపై బీసీసీఐ జీవిత కాల నిషేధం ఎదుర్కొంటున్న పేసర్ శ్రీశాంత్‌కు భారీ ఊరట లభించింది. అతడిపై ఉన్న నిషేధాన్ని కేరళ హైకోర్టు ఎత్తివేసింది. అలాగే శ్రీశాంత్‌కి వ్యతిరేకంగా బీసీసీఐ తీసుకున్న చర్యలన్నీ జస్టిస్ మొహమ్మద్ ముష్తాక్ రద్దు చేశారు. 2013 ఐపీఎల్ ఆరో సీజన్‌లో ఉద్దేశపూర్వకంగా ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడనే కారణంతో క్రికెట్ బోర్డు శ్రీశాంత్‌పై జీవితకాల నిషేధం విధించింది. అయితే ఈ విషయంలో తనను ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు నిర్దోషిగా పేర్కొన్నప్పటికీ బోర్డు మాత్రం తన వైఖరి మార్చుకోలేదని గతేడాది శ్రీశాంత్ కేరళ కోర్టులో కేసు వేశాడు. దీంతో బీసీసీఐ కూడా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పు... తమ అంతర్గత క్రమశిక్షణ కమిటీ నిర్ణయాన్ని ప్రభావితం చేయలేదని పేర్కొంది. తమ విచారణలో అతడు దోషిగానే తేలాడని స్పష్టం చేసింది. ఇదిలావుండగా కోర్టు తీర్పును బీసీసీఐ గౌరవించాల్సి ఉంటుందని బీసీసీఐ ఉపాధ్యక్షుడు మాథ్యూ అన్నారు. ఈ తీర్పు వెలువడిన సమయంలో కోర్టులోనే ఉన్న శ్రీశాంత్ సంతోషాన్ని వ్యక్తం చేశాడు. మళ్లీ క్రికెట్‌పై దృష్టి సారించి కేరళ రంజీ జట్టులో స్థానం కోసం ప్రయత్నిస్తానని 34 ఏళ్ల శ్రీశాంత్ అన్నాడు.

ఇంగ్లండ్‌దే టెస్ట్ సిరీస్

మాంచెస్టర్: సొంతగడ్డపై అదరగొట్టిన ఇంగ్లండ్... దక్షిణాఫ్రికాతో జరిగిన నాలుగు టెస్టుల సిరీస్‌ను 3–1తో సొంతం చేసుకుంది. సోమవారం ముగిసిన చివరిదైన నాలుగో టెస్టులో ఇంగ్లండ్ 177 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. నాలుగో రోజు 380 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సఫారీ జట్టు తమ రెండో ఇన్నింగ్స్‌లో 202 పరుగులకు ఆలౌటైంది. ఆమ్లా (83), కెప్టెన్ డు ప్లెసిస్ (61) పోరాడినా లాభం లేకపోయింది. 39 పరుగుల వ్యవధిలోనే దక్షిణాఫ్రికా చివరి 7 వికెట్లు కోల్పోయింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' మొయిన్ అలీ (5/69), అండర్సన్ (3/16) ప్రత్యర్థి పతనాన్ని శాసించారు. ఇంగ్లండ్ గడ్డపై 1998 తర్వాత మొదటిసారి ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాపై సిరీస్ విజయం సాధించడం విశేషం. 252 పరుగులు చేయడంతో పాటు 25 వికెట్లు పడగొట్టిన మొయిన్ అలీ, 19 వికెట్లు తీసిన మోర్నీ మోర్కెల్ 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'లుగా నిలిచారు.

యూకీ ర్యాంక్ మెరుగు



న్యూఢిల్లీ: భారత యువ టెన్నిస్ స్టార్ యూకీ బాంబ్రీ సోమవారం విడుదల చేసిన ఏటీపీ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో 159వ స్థానానికి ఎగబాకాడు. వాషింగ్టన్‌లో జరిగిన సిటీ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో అతను క్వార్టర్ ఫైనల్లో పోరాడి ఓడిన సంగతి తెలిసిందే. దీంతో యూకీ 41 స్థానాల్ని మెరుగుపర్చుకున్నాడు. భారత్ తరఫున అతనిదే అత్యుత్తమ ర్యాంకు కాగా... రామ్‌కుమార్ 179వ స్థానంలో కొనసాగుతున్నాడు. డబుల్స్ ర్యాంకుల్లో రోహన్ బోపన్న (21వ) ర్యాంకులో ఏ మార్పు లేదు. లియాండర్ పేస్ రెండు స్థానాలు కోల్పోయి 62వ ర్యాంకుకు పడిపోయాడు.

జులన్‌కు రూ. 50 వేలేనా?

భారత మహిళా స్టార్ క్రికెటర్‌కు ఎయిరిండియా 'చౌక'బారు ప్రోత్సాహం

కోల్‌కతా: గత కొన్నాళ్లుగా ఎయిర్‌లైన్స్ సంస్థలు చౌక టికెట్లతో ప్రయాణికుల్ని ఆకర్షిస్తున్న సంగతి తెలిసిందే. బహుశా ఎయిరిండియా కూడా ఇదే ఫార్ములాను ప్రోత్సాహక సందర్భానికి వాడుకున్నట్లుంది. ఇటీవల జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్‌లో విశేషంగా రాణించిన భారత స్టార్ క్రికెటర్ జులన్ గోస్వామికి రూ. 50 వేల ప్రోత్సాహం, ప్రశంస పత్రంతో సరిపెట్టి చేతులు దులిపేసుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఈ సంస్థ నా కుటుంబంలాంటిది. నా కెరీర్ ఎదుగుదలకు వెన్నుతట్టి ప్రోత్సహించింది. ఈ రోజు నన్ను ఇలా గౌరవించడం చాలా ఆనందంగా ఉంది. నాలాగే వివిధ క్రీడల్లో రాణిస్తున్న వారందరిని ఈ సంస్థ ఇలాగే ప్రోత్సహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా'నని తెలిపి సంస్థ పరువు నిలిపే ప్రయత్నం చేసింది. ఇచ్చిన డబ్బు కన్నా సంస్థ గౌరవానికే ప్రాధాన్యమిచ్చిన జులన్ నిజంగా గ్రేట్! 2006 నుంచి ఈ సంస్థలో పనిచేస్తున్న జులన్‌కు డిప్యూటీ మేనేజర్ నుంచి మేనేజర్‌గా పదోన్నతి కల్పించారు. మరోవైపు ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన భారత జట్టులో సభ్యులుగా ఉన్న రైల్వే క్రీడాకారిణులకు ఆ సంస్థ రూ. 13 లక్షల చొప్పున నగదు ఇవ్వడమే కాకుండా ప్రమోషన్‌లు ఇచ్చిన సంగతి తెలిసిందే.





సోదరీమణులతో రవీంద్ర జడేజా

నేను బుద్ధిమంతుడిగా మారగానే...

రవీంద్ర జడేజా అసహనం

జామ్‌నగర్: ఐసీసీ తనపై ఒక మ్యాచ్ నిషేధం విధించడం భారత క్రికెటర్ రవీంద్ర జడేజాను తీవ్రంగా కలచివేసినట్లుంది. రెండో టెస్టు గెలిచాక 'కలలంటే నిద్రలో వచ్చేవి కాదు. మీకు నిద్ర లేకుండా చేసేవి. కష్టానికి తగిన ప్రతిఫలం' అంటూ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ట్రోఫీతో సహా ట్వీట్ చేసి అతను తన ఆనందాన్ని పంచుకున్నాడు. అయితే ఆ తర్వాత కొద్ది సేపటికే అతనిపై నిషేధం పడింది. దాంతో ఘాటైన వ్యాఖ్యతో తన బాధను కూడా జడేజా ట్విట్టర్ ద్వారానే వ్యక్తపరిచాడు. 'నేను బుద్ధిమంతుడిలా మారడమే ఆలస్యం. లోకం మొత్తం దుర్మార్గంగా మారిపోయింది' అని అతను ట్వీట్ చేశాడు. జట్టుకు దూరం కావడంతో జడేజా బోర్డు అనుమతితో వెంటనే భారత్‌కు వచ్చేశాడు. తన ఇంట్లో సోదరీమణులతో అతను రాఖీ పండుగ జరుపుకున్నాడు.

ఐసీసీ అతి...

జడేజా నిషేధంపై మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ విరుచుకుపడ్డారు. ఈ విషయంలో ఐసీసీని ఆయన తీవ్రంగా విమర్శించారు. 'జడేజాపై నిషేధం విధించే అంశంలో అంపైర్లు, రిఫరీలు అతిగా వ్యవహరించారు. మైదానంలో ఘటనలపై ఐసీసీ కఠినంగా వ్యవహరించడం మంచిదే కానీ ప్రత్యేకంగా జడేజా విషయంలో వారు చాలా ఎక్కువ చేసినట్లు అనిపిస్తోంది' అని గావస్కర్ అన్నారు.

శ్రీవారికి సరికొత్త స్వర్ణ సర్వభూపాల వాహనం



సాక్షి, తిరుమల: తిరుమలేశుని సేవకు సరికొత్త స్వర్ణ సర్వభూపాల వాహనం సిద్ధమైంది. 9 కిలోల బంగారం, 380 కిలోల మేలిమి రాగితో సిద్ధం చేసిన ఈ వాహనం తయారీకి రూ.2.5 కోట్లు ఖర్చయింది. సెప్టెంబరు 23 నుండి అక్టోబరు 1 వరకు జరగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఈ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామివారిని ఊరేగించనున్నారు. ఇప్పటికే రూ.1.59 కోట్లతో కొత్త స్వర్ణ ముత్యపు పందిరి వాహనం సిద్ధం చేశారు. సోమవారం సర్వభూపాల వాహనాన్ని టీటీడీ ఈవో అనిల్‌కుమార్‌సింఘాల్, జేఈవో శ్రీనివాసరాజు పరిశీలించారు.

వెంకన్నకు సుదీర్ఘ విరామం

- గ్రహణం కారణంగా సాయంత్రం 4.30 గంటలకు ఆలయం మూత
- నేటి ఉదయం 7 గంటల నుంచి సర్వదర్శనం

సాక్షి, తిరుమల/అన్నవరం(ప్రత్తిపాడు)/ఇంద్రకీలాద్రి (విజయవాడ): చంద్రగ్రహణం పురస్కరించుకుని సోమవారం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని మూసివేశారు. వాస్తవంగా సోమవారం రాత్రి 10.52 నుండి మంగళవారం వేకువజాము 12.48 గంటల మధ్య చంద్రగ్రహణం సంభవించనుంది. ఆలయ నిబంధనల ప్రకారం గ్రహణ సమయానికి సుమారు 6 గంటల ముందే ఆలయాన్ని, నిత్యాన్నప్రసాద కేంద్రాన్ని మూసివేయాల్సి ఉంది. ఇందులో భాగంగా సోమవారం మధ్యాహ్నం 3.30 నుండి 4 గంటల మధ్య గర్భాలయ మూలమూర్తికి ఏకాంత సేవ వైదికంగా నిర్వహించారు. ఆ తర్వాత సాయంత్రం 4.10 గంటల నుండి వరుసగా బంగారువాకిళ్లు, వెండివాకిలి ద్వారాలు మూసివేశారు. అనంతరం 4.30 గంటలకు ఆలయ మహద్వారాన్ని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో కేఎస్ శ్రీనివాసరాజు ఆలయ మహద్వారం మూసివేశారు. అన్నప్రసాదం కేంద్రం కూడా మూసివేశారు. తిరిగి మంగళవారం వేకుజవాము 2 గంటకు తెరిచి శుద్ధి, సంప్రోక్షణ, పుణ్యాహవచనం, ఇతర వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం సుప్రభాతం, ఇతర నిత్యసేవలు నిర్వహిస్తారు. ఉదయం 7 గంటల నుండి సర్వదర్శనం అమలు చేయనున్నారు.



మూసివేసిన అన్నవరంలోని సత్యదేవుని తూర్పు రాజగోపురం

అన్నవరం సత్యదేవుని ఆలయం మూసివేత..

శ్రావణ పౌర్ణమి, సోమవారం రాత్రి 10.50 గంటలకు ఏర్పడిన చంద్ర గ్రహణం కారణంగా తూర్పు గోదావరి జిల్లా అన్నవరంలోని శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయాన్ని మధ్యాహ్నం 12 గంటలకు మూసివేశారు. తూర్పు, పశ్చిమ రాజగోపురాల ద్వారాలను, భక్తులు ఆలయం లోపలకు వెళ్లే క్యూ మార్గాలను, పరివార దేవతల ఆలయాలను కూడా మూసివేశారు.



నిర్మానుష్యంగా ఉన్న తిరుమల శ్రీవారి ఆలయ ప్రాంగణం

విజయవాడ దుర్గగుడి కూడా...

చంద్రగ్రహణం కారణంగా ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంతో పాటు కొండపై ఉన్న ఉపాలయాలను మూసివేశారు. సోమవారం సాయంత్రం 3 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం 3:30 గంటలకు దుర్గగుడి స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, అర్చకులు ఆలయ ప్రధాన ద్వారాలను మూసివేసి తాళాలు వేశారు. అమ్మవారి దర్శనం నిలిపివేయడంతో ఆలయ ప్రాంగణం వెలవెలబోయింది.



విజయవాడలో కనకదుర్గమ్మ ఆలయ ద్వారాలను మూసివేస్తున్న అర్చకులు

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి హైకోర్టు నోటీసులు

- కేసు ఉపసంహరణ జీవోపై వివరణ ఇవ్వాలని ఆదేశం
- కౌంటర్ దాఖలు చేసేందుకు ప్రభుత్వానికి గడువు

సాక్షి, హైదరాబాద్: ప్రకాశం జిల్లా గిద్దలూరు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు ఉపసంహరణ నిమిత్తం జారీ చేసిన జీవో విషయంలో ఉమ్మడి హైకోర్టు సోమవారం గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆయనను ఆదేశించింది. అలాగే కేసు ఉపసంహరణకు సంబంధించి గిద్దలూరు స్థానిక కోర్టులో విచారణ వచ్చే నెల 4కి వాయిదా పడిన నేపథ్యంలో.. ఈ మొత్తం వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసేందుకు ప్రభుత్వానికి మూడు వారాల గడువునిచ్చింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. పోలీసు జీపు దహనం, విధి నిర్వహణకు ఆటంకం కలిగించినందుకు అశోక్‌రెడ్డిపై 2014లో గిద్దలూరు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసును ఉపసంహరించుకునే నిమిత్తం ఈ ఏడాది మేలో ప్రభుత్వం జారీ చేసిన జీవో 379ని కొట్టేయాలని కోరుతూ మాజీ సైనికోద్యోగి షేక్ మస్తాన్ వలీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) కృష్ణప్రకాశ్ వాదనలు వినిపించారు. అశోక్‌రెడ్డిపై కేసు ఉపసంహరణ నిమిత్తం పబ్లిక్ ప్రాసిక్యూటర్ దాఖలు చేసిన పిటిషన్‌పై స్థానిక కోర్టులో విచారణ వచ్చే నెలకు వాయిదా పడిందని వివరించారు. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

రాష్ట్రంలో రైల్ నెట్‌వర్క్ విస్తరణకు కార్పొరేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రైల్ నెట్‌వర్క్ విస్తరణకు, నిధుల సమీకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ. వంద కోట్లతో రైల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా ఈ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సుమితా దావ్రా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కార్పొరేషన్ ఎండీని రైల్వే, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఎంపిక చేయాల్సి ఉంటుంది. రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలుగా రైల్వే శాఖ అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో జాయింట్ వెంచర్ కంపెనీ (జేవీ) ఏర్పాటుకు ఒప్పందాలు కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపట్టే రైల్వే ప్రాజెక్టులకు రైల్వే మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే జాయింట్ వెంచర్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రణాళికలు, సమగ్ర ప్రాజెక్టు నివేదికలు అందజేస్తారు.

తొలి దశలో ఏడు ప్రాజెక్టులు

జాయింట్ వెంచర్ కంపెనీ కింద రాష్ట్రంలో ఏడు రైల్వే ప్రాజెక్టులను గుర్తించారు. ఈ మేరకు మినిస్ట్రీ ఆఫ్ రైల్వేస్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఆ ప్రాజెక్టులు..

1)	కోటిపల్లి	నర్సాపురం
2)	కాకినాడ	పిఠాపురం
3)	నడికుడి	శ్రీకాళహస్తి
4)	గుంటూరు	గుంతకల్ డబ్లింగ్
5)	కడప	బెంగుళూరు
6)	మంగళగిరి	అమరావతి కొత్త లైన్
7)	గూడూరు	విజయవాడ (మూడో లైన్)

తెలంగాణలో ఐదుగురు ఎంవీఐల సస్పెన్షన్

విజయవాడలో వాహనాల అక్రమ రిజిస్ట్రేషన్‌లపై సర్కార్ కొరడా

సాక్షి, హైదరాబాద్: వాహనాల అక్రమ రిజిస్ట్రేషన్‌లకు పాల్పడిన ఐదురుగు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల(ఎంవీఐ)పై సోమవారం ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. మోటారు వాహన చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించి విజయవాడ ఆటోనగర్‌లో నిర్మాణ దశలో ఉన్న ఆయిల్ ట్యాంకర్‌లకు నగరంలోని ఖైరతాబాద్, ఉప్పల్, బండ్లగూడతో పాటు వికారాబాద్, ఖమ్మం రవాణా కార్యాలయాల్లో అక్రమంగా రిజిస్ట్రేషన్‌లు జరిగాయి. ఇందుకు బాధ్యులైన ఐదుగురు ఎంవీఐలపైన ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నగరానికి చెందిన సుమారు 50కి పైగా ఆయిల్ ట్యాంకర్లను పరిశీలించకుండా విజయవాడలో ఉన్న వాటికి కేవలం డాక్యుమెంట్‌ల ఆధారంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టడం సంచలనమైంది. ఏప్రిల్, మే నెలల్లో చోటుచేసుకున్న ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌లపై పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా ఉపరవాణా కమిషనర్ ప్రవీణ్‌రావు నేతృత్వంలో విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. అన్ని కోణాల్లో కమిటీ సమగ్ర దర్యాప్తు చేపట్టింది. విజయవాడలో నిర్మాణ దశలో ఉన్న వాహనాల ఫొటోలతో సహా ప్రభుత్వానికి నివేదికను అందజేసింది. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా వాహనాల ఇంజిన్, చాసీస్ నంబర్లను స్కానింగ్ చేయాలని సూచించింది.

ఎన్నికల ధ్యాసేగానీ.. రైతన్న ఊసేది?

- సర్కారు తీరుపై వైఎస్సార్‌సీపీ నేత నాగిరెడ్డి ధ్వజం
- రాష్ట్రంలో పంటలు ఎండుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు
- నంద్యాలలో కరువు మంత్రికి పట్టదా?



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత నాగిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పంటలన్నీ ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి మండిపడ్డారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాటాడారు. వ్యవసాయం గురించే తెలియని వ్యక్తిని ఆ శాఖకు మంత్రిగా పెట్టారని మండిపడ్డారు. వ్యవసాయ మంత్రి సహా పది మంది మంత్రులు ఎన్నికల కోసం కర్నూలులోనే మకాం వేశారని, అదే జిల్లాలో 75 వేల హెక్టార్లలో పంటలు ఎండిపోతే మంత్రులు కనీసం చూడ్డానికి కూడా వెళ్లలేదని విమర్శించారు. నంద్యాల నియోజకవర్గంలోని గోస్పాడు మండలంలో మినుము, పెసర, కంది పంటలు ఎండిపోయి రైతులు గగ్గోలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రెయిన్‌గన్లతో కరువును జయించామన్న బాబు ఇన్ని లక్షల హెక్టార్లలో పంటలు ఎండిపోతున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.

కరువున్నా వృద్ధి రేటా?

2016-17లో 301 మండలాలు కరువు ప్రాంతాలుగా ప్రకటించారని, 12 లక్షల హెక్టార్లలో ఖరీఫ్, రబీలో సాగు విస్తీర్ణం తగ్గిపోయిందని, సాగు జరిగిన ప్రాంతాల్లో 10 లక్షల హెక్టార్లలో పంటలన్నీ ఎండిపోయినట్టు అధికారిక లెక్కలే చెబుతున్నా.. వ్యవసాయ అనుబంధ రంగాల వృద్ధి రేటు 14 శాతం పెరిగిందనడం విడ్డూరంగా ఉందన్నారు. 2017-18లో ఇప్పటికే 241 కరువు మండలాలు ఉన్నట్లు తేలిందన్నారు. ఈ ఏడాది కూడా వ్యవసాయ అనుబంధ రంగాల వృద్ధిరేటు 16 శాతం ప్రకటిస్తారేమోనని అనుమానం వ్యక్తంచేశారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా సాగు విస్తీర్ణం పెరుగుతున్నా, వేసిన పైర్లన్నీ ఎండిపోయి, ఉపాధి లభించని దారుణమైన పరిస్థితులు గతంలో, ఇప్పుడూ బాబు పాలనలోనే చూస్తున్నామన్నారు.

- 2016 ఆగస్టు 2 నాటికి 23,81,210 హెక్టార్లలో సాగు జరిగిందని, ఈ ఏడాది ఆగస్టు 2 నాటికి సాగు విస్తీర్ణం 17,54,123 హెక్టార్లకు పడిపోయిందన్నారు.
- రాయలసీమలో గతేడాది 8.13 లక్షల హెక్టార్లలో వేరుశనగ సాగుచేస్తే..ఈ ఏడాది కేవలం 3.50 హెక్టార్లకే పరిమితమైందన్నారు. రాయలసీమలోని 234 మండలాల్లో 2014-15లో 155 కరువు మండలాలుగా ప్రకటించారని, 2015-16లో 212 మండలాలు, 2016-17లో 197 కరువు మండలాలుగా ప్రభుత్వమే ప్రకటించిందన్నారు. ఈ ఏడాది 152 కరువు మండలాలు ఉన్నాయని వివరించారు.
- వ్యవసాయానికి 9 గంటల నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. రుణమాఫీ పేరుతో రైతులను దారుణంగా మోసంచేశారని, నాలుగో ఖరీఫ్ సీజన్ జరుగుతున్నా ఇంతవరకూ మూడో ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లించలేదన్నారు. సీఎం పుణ్యమా అని 14 శాతం అపరాధ వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి రైతులకు వచ్చిందని ఆందోళన వ్యక్తంచేశారు.

వీడియోస్కోపితో థైమస్ గ్రంథిలో కణితి తొలగింపు

- కర్నూలు జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స
- థైమస్ గ్రంథిలో కణితి తొలగింపు
- దక్షిణాదిలో ఇదే ప్రథమం



ఆపరేషన్ గురించి వివరిస్తున్న డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): బాలీవుడ్ నటుడు అమితాబ్‌బచ్చన్ 30 ఏళ్ల కిందట 'హమ్' సినిమా షూటింగ్ సందర్భంగా ఉన్నట్లుండి కుప్పకూలి అనారోగ్యానికి గురైన విషయం చాలా మందికి తెలిసిందే. ఆయన కండరాలు, నరాల జబ్బుతో బాధపడుతున్నట్లు అప్పట్లో వైద్యులు నిర్ధారించి శస్త్రచికిత్సచేశారు. సరిగ్గా ఇప్పుడు అలాంటి వ్యాధి గల ఓ వ్యక్తికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల వైద్యులు చికిత్సచేసి ప్రాణంపోశారు. అమితాబ్‌కు అప్పట్లో సంప్రదాయ పద్ధతి (కోత)లో ఆపరేషన్ చేయగా, కర్నూలు వైద్యులు మాత్రం వీడియోస్కోపి ద్వారా చికిత్సచేశారు. ఇలాంటి ఆపరేషన్ దక్షిణ భారతదేశంలోనే మొదటి సారి చేశామని కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఆపరేషన్ వివరాలను సోమవారం ఆయన విలేకరులకు వెల్లడించారు. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన మహబూబ్‌బాషా(47) కార్డియో మయస్తీనియా గ్రావిస్ అనే రుగ్మతతో బాధపడుతూ చికిత్స నిమిత్తం కర్నూలు సర్వజనాస్పత్రిలోని న్యూరాలజీ విభాగానికి వచ్చారు. ఆయనకు న్యూరాలజీ విభాగం వైద్యులు చికిత్సచేసినా మార్పు రాకపోవడంతో కార్డియోథొరాసిక్ విభాగానికి రిఫర్ చేశారు. గుండె పైభాగాన ఉండే థైమస్ గ్రంథిలో కణితి ఏర్పడినట్లు గుర్తించారు. ఈ నెల 4న వీడియో అసిస్టెడ్ థొరాకోస్కోపిక్ సర్జరీ చేశారు. ఇలాంటి వ్యాధులకు గుండె ఆపరేషన్ చేసినట్లు నిలువుగా కోస్తారు. కానీ ఇక్కడ వీడియోస్కోపి పరికరం ద్వారా మానిటర్‌లో గమనిస్తూ కణితిని పూర్తిగా తొలగించారు.

'ఏర్పేడు' కేసు మూసివేత?

- ➡ 16 మంది మరణించినా టీడీపీ నేతలపై కేసు లేదు
- ➡ బాధిత కుటుంబాలకు అందని బీమా
- ➡ తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యుల వేడుకోలు

సాక్షి, తిరుపతి: పదహారు మంది మృతి చెందిన ఘటనకు సంబంధించిన కేసును మూసివేసే దిశగా అధికార పార్టీ నేతలు అడుగులు వేస్తున్నారు. ఏర్పేడు ఘటనకు, టీడీపీ నేతలకు ఎలాంటి సంబంధం లేదని పోలీసులు తేల్చి చెబుతున్నారు. అందులో భాగంగానే 16 మంది మృతికి సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో ఇసుక మాఫియా నేతల పేర్లు చేర్చలేదని తెలిసింది. ఎఫ్ఐఆర్ కాపీలో మృతి చెందిన వారి పేర్లు, తీవ్రంగా గాయాలపాలైన వారి వివరాలను కూడా నమోదు చేయలేదని బాధిత కుటుంబాలు వెల్లడించాయి. బాధిత కుటుంబాలకు చెందిన 17 మంది సోమవారం తిరుపతి అర్బన్ ఏఎస్పీకి వినతపత్రం ఇచ్చి న్యాయం చేయాలని వేడుకున్నారు.

బాధితుల తరపున పోరాడుతామని జగన్ హెచ్చరిక

చిత్తూరు జిల్లా ఏర్పేడులో ఏప్రిల్ 21న లారీ బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. ఇసుక మాఫియా ఆగడాలపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మునగలపాలెం గ్రామస్థులపైకి లారీ దూసుకెళ్లింది. ఈ ఘటనలో 16 మంది మరణించారు. మరో 21 మంది గాయాల పాలయ్యారు. ఈ ఘటనపై కలత చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మునగలపాలెంలో పర్యటించారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే బాధితుల తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. దీంతో తప్పని పరిస్థితుల్లో సీఎం చంద్రబాబు, మంత్రులు స్పందించారు. 16 మంది మృతికి కారకులైన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టబోమని చంద్రబాబు ప్రకటించారు. నిందితులను టీడీపీ నుంచి బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. అయితే, సీఎం ప్రకటనలేవీ అమలుకు నోచుకోలేదు.

ఎఫ్ఐఆర్‌లో కనిపించని మృతులు, కారణాలు

ఏర్పేడు ఘటనపై పోలీసు అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నాలుగు నెలలవుతున్నా ఎఫ్ఐఆర్‌లో మృతులు, క్షతగాత్రుల వివరాలను పొందుపర్చలేదు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఇన్సూరెన్స్ పొందే అవకాశం కోల్పోయారు. ప్రమాదానికి ఇసుక మాఫియానే కారణమనే విషయాన్ని కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చలేదు. అదే జరిగితే టీడీపీ నేతలకు బెయిల్ వచ్చే అవకాశం ఉండదనే ఉద్దేశంతోనే పోలీసులు ఎఫ్ఐఆర్‌లో వివరాలు నమోదు చేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న టీడీపీ నేతలు ధనుంజయ నాయుడు, నాగరాజులు నాయుడు, చిరంజీవులు నాయుడులను కాపాడేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని బాధిత కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. టీడీపీ నేతలు అరెస్టు కాకుండానే బెయిల్‌పై బయటకు వచ్చి, దర్జాగా తిరుగున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 and Printed at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 EDITOR: V. Murali, Phone No. 08562-200076, 77 RNI Regn No. APTEL/2008/23796.

సాక్షి
ఫ్యామిలీ
వైఎస్ఆర్ జిల్లా
మంగళవారం, 8-8-2017


ప్రతీకాత్మక చిత్రం

అమ్మాయిలు ఇప్పుడిప్పుడే కొంచెం స్వేచ్ఛను పీల్చుకుంటున్నారు
వాళ్లకు ఆ శ్వాస చాలా అవసరం!
తమ పరిపూర్ణవ్యక్తిత్వానికి ఆ స్వేచ్ఛా ఊపిరి చాలా అవసరం!!
రోడ్డు మీద నడవనివ్వడంలేదు.. ఆఫీసుల్లో కూర్చోనివ్వడంలేదు..
స్కూళ్లల్లో తలెత్తనివ్వడంలేదు.. ఇంట్లో నోరెత్తనివ్వడంలేదు!
ఇప్పుడు ఇంటర్నెట్‌లో కూడా అమ్మాయిల
భావవ్యక్తీకరణను అడ్డుకుంటున్నారు..
వాళ్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారు.. ఆత్మాభిమానాన్ని చంపేస్తున్నారు!!
అలా కామెంట్లు కూయడం ఐటీ యాక్ట్ కింద నేరం.
అరెస్ట్ వరకూ వెళుతుంది. సో మన పిల్లలకు ఇప్పటినుంచే మంచి చెడ్డలు చెప్పాలి.

కామెంట్లు కూశావో..!

క్రైమ్ & పేరెంటింగ్

ఎడమచేత్తో ఓ నల్లటి పప్పీని, కుడిచేతిలో కోక్ గ్లాస్‌ను చీర్స్‌లా పెట్టి... చిలిపిగా కన్నుగీటుతూ ఉన్న ఒక ఫొటోగ్రాఫ్‌ను .. 'విత్ మై బ్లాక్ డాగ్' అనే కామెంట్‌తో ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసింది ఒక టీనేజర్.. దాన్ని షేర్ చేసింది పదిహేడేళ్ల కావ్య.

''ఆడోళ్లకు స్వేచ్ఛ లేదని ఎవడు అన్నది?'' అని ఒకరు...

''పాపా... నీదేం బ్రాండ్?'' అని ఇంకొకరు..

''నేను కూడా బ్లాగ్ డాగే.. రావాలా?'' అని మరొకరు..

''బేబీ.. నేను ఓల్డ్‌మంక్.. పర్లేదు కదా..'' అని ఎవరో..

ఇలా రకరకాల కామెంట్స్ టైప్ అయ్యాయి ఆమె షేర్ చేసిన పోస్టింగ్ కింద. వాళ్లంతా మగపిల్లలే.. ఎఫ్‌బీ ఫ్రెండ్స్.. కొందరైతే కావ్య క్లాస్‌మేట్స్ కూడా!

నవ్వుకొని లైట్ తీసుకుంది ఆమె.

ఇంకోరోజు..

''రుతుచక్రం స్త్రీలకు అవమానం కాదు.. ప్రైడ్'' అన్న ఒక కాప్షన్‌ను పోస్ట్ చేసింది కావ్య.

దానికీ అంతే ..

''ఏ ప్యాడ్ వాడుతావు నువ్వు?''

''విస్పరా?''..

''కాదేమో.. కావ్య ఫ్రీగా ఉంటుంది కదా.. కేర్ ఫ్రీ అనుకుంటా''

'' షీ?''

''బేబీ కాంప్లెక్షన్ పింక్... అందుకే విస్పర్ పింకేమో..''

ఇలా ఎన్నో వ్యాఖ్యానాలు ట్రోలింగ్ స్థాయి దాటాయి..

అవన్నీ కావ్యకు చిరాకు తెప్పించినా ఓపిగ్గా ఉంది.

మరోరోజు...

''స్లీవ్‌లెస్.. జీన్స్.. స్కర్ట్.. శారీ... నచ్చిన, నప్పిన డ్రెస్ వేసుకునే రైట్ ఆడవాళ్లకు ఉంది''అని వాల్ మీద తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచింది కావ్య.

''టాప్‌లెస్‌గా కూడా తిరగొచ్చు''

''బికినీ అయితే పాపలకు చాలా బాగా సూట్ అవుతుంది''

''చెడ్డీలు కూడా వేసుకోండి''

''సిగ్గులేదా... పిచ్చిపిచ్చి పోస్టింగ్స్ పెట్టడానికి?''

''దీన్నే బరితెగింపు'' అంటారు..

ఇంకా ఇలాంటి వ్యాఖ్యలు ఒక యాభై వచ్చాయి. బెదిరిపోయింది కావ్య. రెండు రోజులు బాధపడింది. ఆ పోస్ట్‌ను డిలీట్ చేసేసింది. దాంతో ఆమె ఇన్‌బాక్స్‌కి మెస్సేజెస్ రావడం మొదలయ్యాయి. ''ఇంట్లో ఒక్కదానివే ఉంటావా?'', ''ఈ నైట్‌కి రానా?'', ''కలుస్తావా?'', ''నువ్వు నాకు నచ్చావ్?'' లాంటివి ఏవేవో పెట్టారు కుర్రాళ్లు. ఇంకొంతమందైతే ఏకంగా బూతు బొమ్మలు పంపారు. వాళ్లందరూ ఎఫ్‌బీలో మ్యూచువల్ ఫ్రెండ్స్. షాక్ అయింది కావ్య. మర్నాడు కాలేజ్‌కి వెళ్లడానిక్కూడా భయపడింది. క్లోజ్ ఫ్రెండ్స్‌తో విషయాన్ని చెప్పింది. ఇలాంటివి తమకూ అనుభవమేనని, అందుకే ఎఫ్‌బీకి దూరంగా ఉంటున్నామని చెప్పారు వాళ్లు. ఆ మాటలతో దిగులు పెరిగింది కావ్యకు. వారమైనా తన ఎఫ్‌బీ ఇన్‌బాక్స్‌కు అలాంటి కామెంట్లు వస్తూనే ఉన్నాయి. దాంతో ఎఫ్‌బీ అకౌంట్ ఓపెన్ చేయాలంటే వణుకొస్తోంది. ''మన ఫోటోస్‌ను మార్ఫింగ్ చేసి వేరేవాళ్లకు పోస్ట్ చేస్తారే.. బ్లాక్‌మెయిల్ కూడా చేస్తారు'' ఒక ఫ్రెండ్ చెప్పిన మాట గుర్తొచ్చి ఎఫ్‌బీలో ఉన్న తన ఫోటోలన్నీ డిలీట్ చేసింది కావ్య. దానికి సంబంధించి.. టైమ్‌లైన్ మీదే కామెంట్స్ చేశారు.. ''... ఫోటోస్ ఎందుకు తీసేశావ్?'' అని, ''హేయ్.. కావ్యా.. వాట్ హ్యాపెండ్.. ఫోటోస్ ఎందుకు డిలీట్ చేశావ్.. నీలాంటి క్యూట్ గర్ల్ మాకు కనపడకపోతే.. ఎట్లా.. నిద్ర రావట్లేదు డియర్'' అంటూ.. నోటికొచ్చినట్టు నానా చెత్త రాయసాగారు. ఇంట్లో వాళ్లకు తెలిస్తే.. తననే తప్పుబట్టి.. 'చదువుకొమ్మంటే ఇట్లా ఎఫ్‌బీలో ఎంటర్‌టైన్ చేస్తోంద'ని ఇంటర్‌నెట్ కనెక్షనే తీసేస్తారేమోనని అమ్మానాన్నకూ చెప్పలేదు. తనే ఎఫ్‌బీ చూసుకోవడం తగ్గించింది. కాలేజ్‌లో మేల్ క్లాస్‌మేట్స్ డైరెక్ట్‌గానే కామెంట్ చేయడం స్టార్ట్ చేశారు. ''కావ్యా నువ్వు చాలా ఫాస్ట్.. మెన్‌స్ట్రువల్ ప్యాడ్స్ దగ్గర్నుంచి గర్ల్స్ రైట్స్ దాకా దేన్నయినా డిస్కస్ చేయగలవ్ ఎఫ్‌బీలో. గుడ్ యార్'' అంటూ వెకిలిగా నవ్వడం, ''నీలాంటి ఫ్రెండ్ ఉండడం లక్కీ డియర్'' అంటూ బొటనవేలు పైకెత్తి చూపడం.. ''మీట్ మిస్ కావ్యా.. ఫెమినిస్ట్..'' అంటూ ఆటపట్టించడం మొదలుపెట్టారు. కొందరికి ధైర్యంగానే రిటార్ట్ ఇచ్చింది. ఇంకొందరినీ ఇగ్నోర్ చేసింది.. ఇందరితో వాదన పెట్టుకోలేక ప్రిన్సిపల్‌కి కంప్లయింట్ చేసింది.

నీదే తప్పు

జరిగిందంతా విని.. ''నీకు ఫేస్‌బుక్ అకౌంట్ ఉన్నట్లు మీ పేరెంట్స్‌కి తెలుసా?'' అడిగాడు ప్రిన్సిపల్ కావ్యను. ''తేలీదు'' అన్నట్లు తల అడ్డంగా ఊపింది. ''సరే నువ్వు క్లాస్‌కి వెళ్లు'' అని ఆమెను పంపించేసి, కావ్య తల్లిదండ్రులను పిలిపించాడు. కావ్య ఎఫ్‌బీలో ట్రోలింగ్, అది అబ్యూజ్ స్థాయికి వెళ్లడం గురించి చెప్పి.. ''అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలి. ఆ పోస్టింగ్స్ ఏంటండి? మగపిల్లలు పోకిరీలు అని తెలిసీ, అలాంటి పోస్టింగ్స్ పెట్టడం తప్పు కదా.. పైగా తనే వచ్చి కంప్లయింట్ చేస్తోంది. ముందు అమ్మాయిని ఎఫ్‌బీ అకౌంట్ క్లోజ్ చేయమని చెప్పండి'' అని సలహా ఇచ్చాడు ప్రిన్సిపల్.

కావ్య వాళ్లమ్మ భయపడి.. ''మాతో చెప్పలేదండీ మా అమ్మాయి ఈ ప్రాబ్లం గురించి?'' అన్నది.

''మరి అలా ట్రోల్‌చేసిన, అబ్యూజ్ కూడా చేసిన పిల్లల మీద మాత్రం యాక్షన్ తీసుకోరా? నాకు తెలిసి అందులో చాలామంది కావ్య క్లాస్‌మేట్సే ఉండి ఉంటారు'' అన్నాడు కావ్య తండ్రి కాస్త సీరియస్‌గానే.

''ఆడపిల్లలు రెచ్చగొడితే మగపిల్లల బిహేవియర్ అలాగే ఉంటుంది. నేను వాళ్లను క్వశ్చన్ చేసినా అదే మాట అంటారు కూడా'' నింపాదిగా జవాబిచ్చాడు ప్రిన్సిపల్.

''అయితే తప్పు మా అమ్మాయిదే కాని అలా అవాకులు చవాకులు పేలిన వాళ్లది మాత్రం కాదంటారు'' అన్నాడు కావ్య తండ్రి. అవాక్కయిన వాడల్లే అతని మొహం చూశాడు ప్రిన్సిపల్.

''మీకు తెలుసో లేదో..ట్రోలింగ్, ఆన్‌లైన్ అబ్యూజ్ కూడా హెరాస్‌మెంట్ కిందకే వస్తాయి.. ఇవన్నీ నేరాలే సర్..'' అన్నాడు కావ్య తండ్రి కఠినంగానే.

''చూడండీ.. ఇది ఆ అమ్మాయి ప్రైవేట్ వ్యవహారం. మాకు సంబంధం లేదు. మీరు ఒకవేళ దీన్ని సీరియస్‌గా తీసుకుంటే ముందు టీసీ తీసుకొని, తర్వాత విషయం తేల్చుకోండి'' అని లేచి నిలబడ్డాడు ప్రిన్సిపల్ వాళ్లను ఇక వెళ్లమన్నట్టుగా. ''థాంక్స్'' చెప్పి భార్యను తీసుకొని బయటకు వచ్చాడు కావ్య తండ్రి.

కంప్లయింట్...

తెల్లవారి కూతురి ఫేస్‌బుక్ అకౌంట్‌లోని ఆమె పోస్టింగ్స్, వాటికి వచ్చిన కామెంట్స్ ప్రింటవుట్స్‌తో సహా కావ్యనూ తీసుకొని పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు ఆమె తండ్రి వినయ్. జరిగిందంతా పోలీసులకు కంప్లైంట్‌గా రాసిచ్చింది కావ్య సాక్ష్యాలుగా ఆ ప్రింట్ అవుట్స్‌ను జతచేస్తూ. క్లాస్‌మేట్స్‌ని ముందుగా పిలిపించారు.. మిగిలిన వాళ్లనూ పిలిపించారు. అందరూ 18 ఏళ్లలోపు మగపిల్లలే. కావ్యకు 'సారీ' చెప్పించి, రెండు గంటలు స్టేషన్‌లోనే ఉంచి తల్లిదండ్రుల ముందే వాళ్లకు కౌన్సెలింగ్ చేశారు పోలీసులు. మళ్లీ ఎవరి విషయంలోనైనా ఇలాంటిది రిపీట్ అయితే పనిష్మెంట్ సీరియస్‌గా ఉంటుందని వార్నింగ్ ఇచ్చి మరీ పంపించేశారు.

ఇంట్లో పెద్దవాళ్లు ఇంట్లో ఆడవాళ్లను, గౌరవంగా చూడాలి. వాళ్ల పట్ల మర్యాదగా ప్రవర్తించాలి. అప్పుడు మగపిల్లలూ అలాగే వ్యవహరిస్తారు. పిల్లలు తప్పుగా ఆలోచించినప్పుడు, తప్పు చేసినప్పుడు బాల్యం నుంచే సరిదిద్దుతూ ఉండాలి. దాంతో చిన్నప్పటినుంచే ఎదుటివాళ్లపట్ల మర్యాదగా మెలగడం, గౌరవంగా వ్యవహరించడం అలవడుతుంది.

కాని..

ట్రోలింగ్ అనేది ఐటి యాక్ట్, 2000 కింద నేరమే. ఐపీసీలోని స్టాకింగ్, డిఫమేషన్, ఆడపిల్ల ఆత్మాభిమానాన్ని కించపరిచారనే నేరాల కింద కేస్ పెట్టచ్చు. ఆన్‌లైన్‌లో మహిళలు హెరాస్‌మెంట్ ముఖ్యంగా రేప్ థ్రెట్ ఎదుర్కొంటుంటే ఐపీసీ సెక్షన్ 507 కింద కేస్ వేయొచ్చు. అలాగే అనుమతి లేకుండా అమ్మాయిల (స్నేహితులైనా, సన్నిహితులైనా సరే) ఫోటోలు పోస్ట్ చేయడం, వాళ్ల ప్రైవసీ భంగం చేయడం లాంటి వాటికి పాల్పడితే ఐటీ యాక్ట్, సెక్షన్ 66 ఈ, పనిష్మెంట్ ఫర్ వయోలేషన్ ఆఫ్ ప్రైవసీ కింద నేరంగా పరిగణిస్తారు. అసభ్యకర పదజాలం, చిహ్నాలు, ప్రతీకాత్మక చిత్రాలు, బొమ్మలు, దృశ్యాలు వంటివి పోస్ట్ చేసి సదరు వ్యక్తి పేరు, ప్రతిష్టలు, గౌరవానికి భంగం కలిగించేలా చేసినా శిక్షార్హులే. అంతేకాదు, మహిళ ఆత్మాభిమానాన్ని కించపరిచేలా పదాలు, చిహ్నాలు వంటివి పెట్టినా ఐపీసీ సెక్షన్ 509 కింద నేరం. నిర్భయ చట్టంలోని సెక్షన్ 354ఏ, 354డి సెక్షన్లు హెరాస్‌మెంట్ వయా ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ నేరాలను సూచిస్తున్నాయి.

- శరాది

మనం ఆచరిస్తే... వాళ్లు అనుసరిస్తారు!




పిల్లలు టీన్స్‌లోకి వచ్చాకే అన్నీ చెప్తాం అంటే ఈ రోజుల్లో కుదరదు. అందుకే వాళ్లకు పది, పన్నెండేళ్ల వయసు వచ్చాక ఇంటర్నెట్, దాని ప్రభావాలు, అందులో చర్చకు వచ్చే విషయాలు మొదలైన వాటి గురించి నెమ్మది నెమ్మదిగా– వాళ్ల మనసుకు తగ్గట్టుగా చెబుతూ పోవాలి. టీన్స్‌లో పిల్లలు కుదురుగా కూర్చొని వినరు. అందుకే కాస్త ముందుగానే పిల్లలతో మాట్లాడటం, సమకాలీన విషయాలు, మంచిచెడ్డల గురించి చర్చించడం మొదలుపెట్టాలి. అమ్మాయిలకు గౌరవం ఇవ్వడం, వాళ్లకూ భావాలను ఎక్స్‌ప్రెస్ చేసే హక్కు ఉందని, వాళ్ల భావాలనూ మనం గౌరవించాలని చెప్పడమే కాదు, మన చేతల ద్వారా చూపించాలి. అంటే.. ఇంట్లో పెద్దవాళ్లు ఇంట్లో ఆడవాళ్లను, అమ్మాయిలను గౌరవంగా చూడ్డం, వాళ్ల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తే మగపిల్లలూ అలాగే వ్యవహరిస్తారు. బయటి ఆడపిల్లలకూ అంతే మర్యాద ఇస్తారు. అంతేకాదు, ఫేస్‌బుక్, ట్విట్టర్ లాంటి సోషల్ నెట్‌వర్క్ సిస్టమ్‌లో ఎవరైనా ఏదైనా పోస్ట్ చేస్తే దానికి కామెంట్ పెట్టేముందు మన కళ్లెదుటే ఆ వ్యక్తి ఉంటే కఠినంగా, అమర్యాదగా మాట్లాడలేం కదా, కాబట్టి కామెంట్ కూడా అంతే మర్యాదగా ఉండాలి. పిల్లలు తప్పుగా ఆలోచించినప్పుడు, తప్పు చేసినప్పుడు బాల్యం నుంచే సరిదిద్దుతూ ఉండాలి. దాంతో చిన్నప్పటినుంచే ఎదుటివాళ్లపట్ల మర్యాదగా మెలగడం, గౌరవంగా వ్యవహరించడం అలవడుతుంది.

- డాక్టర్ పద్మ పాల్వాయి, చైల్డ్ సైకియాట్రిస్ట్, రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్

గుడ్‌ఫుడ్

అనేక అనారోగ్యాలను పారదోలే సొరకాయ



ఆరోగ్యానికి సొరకాయతో ఒనగూరే మేలు అంతా ఇంతా కాదు. ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలనుంచి ఇది కాపాడుతుంది. సొరకాయ ఉపయోగాల్లో కొన్ని...

- 100 గ్రాముల సొరకాయ తింటే దాని ద్వారా సమకూరేది కేవలం 15 క్యాలరీలు మాత్రమే. అందుకే డయాబెటిస్ ఉన్నవారు సొరకాయను ఏ రకంగా తీసుకున్నా మంచిదే.
- సొరకాయలో 96 శాతం నీరే. ఇక అందులో విటమిన్–సి, రైబోఫ్లేవిన్, జింక్, థయామిన్, ఐరన్, మెగ్నీషియమ్, మాంగనీస్ వంటి విటమిన్లు, ఖనిజాలు పుష్కలం. కాబట్టి చెమట రూపంలో నీరు, ఖనిజ లవణాలను కోల్పోయే వృత్తుల్లో ఉండేవారు సొరకాయ తినడం చాలా మంచిది. తరచూ అలసటగా ఉండేవారు సొరకాయ తింటే త్వరగా శక్తి సమకూరుతుంది.
- 100 గ్రాముల సొరకాయలో కొవ్వుల పాళ్లు కేవలం 1 గ్రాము మాత్రమే. కొలెస్ట్రాల్ పాళ్లు చాలా చాలా తక్కువ. అందుకే ఇది గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది.
- సొరకాయలో పీచు పాళ్లు చాలా ఎక్కువ. అందుకే ఇది మలబద్ధకాన్ని నివారించడంతో పాటు జీర్ణ వ్యవస్థకు మేలు చేస్తుంది. కిందినుంచి గ్యాస్ ఎక్కువగా పోయే వారు, పైల్స్‌తో బాధపడేవారు సొరకాయ తినడం మంచిది.
- బరువు తగ్గాలనుకునేవారికి సొరకాయ మంచి కూర. ఇందులో డయటరీ ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల త్వరగా కడుపు నిండిపోయిన భావన కలుగుతుంది.
- సొరకాయలో సోడియం, పొటాషియంతో పాటు అన్ని రకాల సూక్ష్మపోషకాలు ఎక్కువ. పొటాషియమ్ బీపీని నియంత్రిస్తుంది. కాబట్టి హైబీపీతో బాధపడేవారు సొరకాయ తింటే మేలు.
- సొరకాయ కాలేయానికి మేలు చేస్తుంది. దాని పనితీరును మెరుగుపరుస్తుంది.

లవ్లీకుమార్





'జై' వచ్చి మూడు నెలలైంది. జోరుగా హల్‌చల్ చేశాడు. స్టైలిష్‌గా, రఫ్‌గా కనిపించి ఆకట్టుకున్నాడు. సోమవారం 'లవ' వచ్చాడు. స్టైలిష్‌గా ఉన్నాడు. అయితే కూల్‌గా కనిపించాడు. ఇక, 'కుశ' ఎలా ఉంటాడో రానున్న రోజుల్లో చూస్తాం. ఎన్టీఆర్ హీరోగా కేయస్ రవీంద్ర (బాబీ) దర్శకత్వంలో నందమూరి కల్యాణ్‌రామ్ నిర్మిస్తున్న చిత్రం 'జై లవ కుశ'. 'జై' గెటప్‌ని ఎన్టీఆర్ బర్త్‌డే సందర్భంగా మేలో విడుదల చేశారు. ఇప్పుడు లవకుమార్‌ని చూపించారు. వాస్తవానికి ఈ గెటప్‌కి సంబంధించి ఒక్క పోస్టర్‌ని మాత్రమే విడుదల చేయాలనుకున్నారు. అయితే, అన్నదమ్ములు కల్యాణ్‌రామ్, ఎన్టీఆర్‌లకు రెండు పోస్టర్లు నచ్చాయి. ఏది రిలీజ్ చేస్తే బాగుంటుందా? అని ఆలోచించి.. చివరకు ఎటూ తేల్చుకోలేక అభిమానులకు డబుల్ ధమాకా ఇచ్చేశారు. రెండు ఫొటోలు విడుదల చేశారు. లవ అలియాస్ లవకుమార్ చాలా లవ్లీగా ఉన్నాడు కదూ! ఈ లుక్స్ చూసి అభిమానులు ఆనందపడిపోయారు. దసరాకి ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు.

● 'జై లవ కుశ'లో లవకుమార్ లుక్‌లో ఎన్టీఆర్



● వరుణ్ రాశీఖన్నా వెంకీ

మళ్లీ ఎప్పుడు?

'ఫిదా' సక్సెస్‌తో జోష్‌గా ఉన్న వరుణ్ తేజ్ జోరుగా తన నెక్ట్స్ మూవీ షూటింగులో పాల్గొంటున్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో బీవీయస్‌యన్ ప్రసాద్ నిర్మిస్తున్న చిత్రంలో ఆయన హీరోగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం ఫస్ట్ షెడ్యూల్ ముగిసింది. బహుశా ఈ షెడ్యూల్ మంచి అనుభూతిని మిగిల్చి ఉంటుందేమో... నెక్ట్స్ షెడ్యూల్ ఎప్పుడు వెంకీ? అని అడుగుతున్నారు వరుణ్ తేజ్. ఫస్ట్ షెడ్యూల్ కంప్లీట్ అయిన సందర్భంగా వరుణ్, వెంకీ, చిత్రకథానాయిక రాశీ ఖన్నా ఓ సెల్ఫీ దిగారు. ఆ ఫొటోను పోస్ట్ చేసి, ట్విట్టర్ సాక్షిగా 'నెక్ట్స్ షెడ్యూల్ ఎప్పుడు వెంకీ' అనడిగారు వరుణ్. సెకండ్ షెడ్యూల్‌ను విదేశాల్లో ప్లాన్ చేశారట.

ఆయన సినిమాల్లోని ఒక్క సీన్ అయినా వాడుకుంటా!

"'అ ఆ' హిట్ తర్వాత ఏ సినిమా చెయ్యాలి? అనే డైలమాలో త్రివిక్రమ్‌గారికి ఫోన్ చేశా. రెగ్యులర్ సినిమా కాకుండా కొంచెం వైవిధ్యమైన సినిమా చేయమన్నారు. చాలా కథలు విన్నా.. నచ్చలేదు. హను రాఘవపూడి చెప్పిన కథ నచ్చడంతో ఫస్ట్ సిట్టింగ్‌లోనే ఓకే చేశా'' అని నితిన్ అన్నారు. నితిన్, మేఘా ఆకాష్ జంటగా హను రాఘవపూడి దర్శకత్వంలో వెంకట్ బోయనపల్లి సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట, అనీల్ సుంకర నిర్మించిన 'లై' ఈ నెల 11న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నితిన్ చెప్పిన విశేషాలు...



● నితిన్

- ఆవారాగా తిరిగే ఓ కుర్రాడు అమెరికా వెళ్లి బాగా డబ్బున్న అందమైన అమ్మాయిని పెళ్లాడి డాలర్స్ సంపాదించుకోవాలనుకుంటాడు. అలా యూఎస్ వెళ్లి ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడు? అన్నదే ఈ చిత్రకథ. సినిమా ప్రారంభం నుంచి ఇంట్రెస్టింగ్‌గా, థ్రిల్లింగ్‌గా ఉంటుంది.
- ఒక ఎమోషన్‌తో, మంచి స్టైలిష్ సినిమా చూశామనే ఫీలింగ్‌తో ఆడియన్స్ థియేటర్స్ నుంచి బయటికి వస్తారు. నా మార్కెట్‌ని దృష్టిలో పెట్టుకొని కథకు అవసరమైనంత ఖర్చుపెట్టి హాలీవుడ్ స్థాయిలో ఈ సినిమా నిర్మించినందుకు నిర్మాతలకి థ్యాంక్స్. ఈ సినిమా చిత్రీకరణను ఎక్కువ శాతం అమెరికాలోని కాస్ట్లీ ప్రదేశాల్లో జరిపాం.
- యాక్షన్ సీన్స్ కోసం బ్యాంకాక్‌లో ట్రైనింగ్ తీసుకున్నా. కిచ్చ మాస్టర్ ఫెంటాస్టిక్ యాక్షన్ కంపోజ్ చేశారు. 'లై' సినిమా నాకొక కొత్త ఇమేజ్‌తోపాటు నా కెరీర్‌లో మరచిపోలేని చిత్రంగా నిలుస్తుంది.
- 'శ్రీ ఆంజనేయం' తర్వాత అర్జున్‌గారితో వర్క్ చేయడం హ్యాపీ. ఆయన్నుంచి చాలా విషయాలు నేర్చుకున్నా. సినిమాలో మా ఇద్దరి మధ్య గేమ్ థ్రిల్లింగ్‌గా ఉంటుంది. క్లైమాక్స్ ఫైట్‌లో అర్జున్‌గారు రియలిస్టిక్‌గా చేశారు.
- మణిశర్మగారు ఈ సినిమాకి ప్రాణం పెట్టి సంగీతం ఇచ్చారు. ఆయన రీ–రికార్డింగ్ ఎక్స్‌ట్రార్డినరీ. హను, నేను వన్ ఇయర్ నుంచి ట్రావెల్ అవుతున్నాం. ఫస్ట్ సార్.. అని పిలుచుకునేవాళ్లం. ఆ తర్వాత పేర్లు పెట్టి.. ఇప్పుడు ఏరా.. పోరా అనుకుంటున్నాం. అంత క్లోజ్ అయ్యాం.
- 'తమ్ముడు'లో పవన్ కల్యాణ్‌గారు లుంగీ కట్టుకుని, బీడీ కాల్చే డ్యాన్స్ సీన్‌ని 'లై'లో వాడాం. నేను పవన్‌కి వీరాభిమాని. ఆయన సినిమాలు చూస్తూ పెరిగాను. లైఫ్‌లాంగ్ నా సినిమాల్లో ఆయన చిత్రంలోని ఏదొక సీన్ ఉపయోగిస్తాను. ఆయనంటే నాకంత ఇష్టం.
- ప్రస్తుతం కృష్ణచైతన్య దర్శకత్వంలో పవన్‌కల్యాణ్–త్రివిక్రమ్‌గార్లు నిర్మిస్తున్న సినిమా చేస్తున్నాను. ఇందులో మేఘా ఆకాష్ హీరోయిన్. కొన్ని కథలు వింటున్నా. ఏదీ ఫైనలైజ్ కాలేదు. చర్చల దశలోనే ఉన్నాయి.

పెళ్లి కళ!



● నిఖిల్

నిఖిల్ హ్యాండ్‌సమ్‌గా ఉంటారు. ఇప్పుడింకా హ్యాండ్‌సమ్‌గా తయారయ్యారు. అదంతా పెళ్లి కళ అన్నమాట. ఈ యంగ్ హీరో పెళ్లి కుదిరింది. హైదరాబాద్‌కి చెందిన తేజస్వినీతో ఈ నెల 24న నిశ్చితార్థం జరగనుంది. అక్టోబర్ 1న ఈ ఇద్దరూ పెళ్లి పీటల మీద కూర్చోనున్నారు. ఇది పెద్దలు కుదిర్చిన వివాహం.

భయానికి నవ్వంటే భయం

తాప్సీ, శ్రీనివాసరెడ్డి, 'వెన్నెల' కిషోర్, 'షకలక' శంకర్ ముఖ్య పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'ఆనందో బ్రహ్మ'. 'భయానికి నవ్వంటే భయం' అన్నది ఉపశీర్షిక. మహి.వి రాఘవ్ దర్శకత్వంలో విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ''హారర్ నేపథ్యంలో ఇప్పటి వరకూ వచ్చిన సినిమాలకు భిన్నంగా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు మహి వి.రాఘవ్. ''మనుషులను చూసి దెయ్యాలు భయపడితే ఎలా ఉంటుందన్నదే కథ. సినిమా చూస్తున్నంత సేపు ప్రేక్షకులు నవ్వుతుంటారు. ఇప్పటి వరకూ ఏ హారర్ మూవీనీ అమెరికాలో విడుదల చేయలేదు. తొలిసారి అక్కడ మేము 85 స్క్రీన్స్‌లో రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు విజయ్ చిల్లా. ''గీతాంజలి' తర్వాత పలు హారర్ కథలు విన్నా. అయితే ఒకే టైప్‌లో ఉండటంతో ఒప్పుకోలేదు. 'ఆనందో బ్రహ్మ' కథ విన్న తర్వాత ఈ సినిమా వదులుకోకూడదనిపించింది'' అని శ్రీనివాసరెడ్డి అన్నారు.



● షకలక శంకర్, శ్రీనివాసరెడ్డి, విజయ్ చిల్లా, మహి

లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్

హాయ్ అన్నయ్యా!! నేను ఒక అమ్మాయిని ప్రేమించా. తను, నేను వన్ ఇయర్ చాలా ప్రేమించుకున్నాం. బట్ చిన్న గొడవతో నాకు దూరమైపోయింది. నాతో మాట్లాడం లేదు. ఇప్పుడు మళ్లీ తను వేరే అబ్బాయిని లవ్ చేస్తోందని మా ఫ్రెండ్స్ చెబుతున్నారు. వాడి కోసం తను చెయ్యి కూడా కోసుకుందని తెలిసింది. కానీ తను లేకుండా నేను ఉండలేకపోతున్నా. తను మనసులో నేను లేనని తెలిసి కూడా తనపైన ప్రేమ తగ్గడం లేదు. బనానా జోక్స్ వద్దు అన్నా ప్లీజ్. ఏదైనా మంచి సలహా ఇవ్వండి ప్లీజ్.. ప్లీజ్!!

– నాని

నానీ...
నువ్వు చాలా గ్రేట్!
అమ్మాయి నో అన్నాక కూడా...
అదే రేంజ్‌లో లవ్ చేస్తున్నావు!
కీప్ ఇట్ అప్!!

'ఏంటి సార్.. అక్కడ అమ్మాయితో వర్కౌట్ కాలేదని గిలగిల కొట్టుకుంటుంటే.. యు ఆర్ గ్రేట్.. యు ఆర్ గ్రేటర్.. యు ఆర్ గ్రేటెస్ట్ అని డప్పు కొడుతున్నారేంటి సార్!'

మెచ్చుకుంటే కూడా ఏంటి నీలాంబరి ఫీల్ అవుతున్నావు?

'ఇలా మెచ్చుకునే బదులు మీరు తిడితేనే బెటర్ సార్!!'

నానీ.. నీవు చాలా గ్రేట్! ఎందుకంటే నీ ప్రేమ చాలా గ్రేట్.. నీ పవర్ నీ ప్రేమే!! ప్రేమిస్తూనే ఉండు!!

'ఈ అమ్మాయి కాకపోతే ఇంకో అమ్మాయిని అంటారా సార్!?'

ప్రేమించడానికి అమ్మాయి అవసరమా నీలూ..?

'గాడిదలను, కోతులను, కుక్కలను ప్రేమించమంటారా సార్?'

నిన్ను నీవు ప్రేమించుకో నిన్ను నువ్వు గౌరవించుకో.. అప్పుడు ప్రపంచం నిన్ను ప్రేమిస్తుంది నానీ.. లైఫ్‌లో ఏదయినా అవ్వాలన్నా.. ఎవరైనా ప్రేమించాలన్నా.. ముందు యు మస్ట్ లవ్ యువర్ సెల్ఫ్ అండ్ ప్రూవ్ యువర్ సెల్ఫ్!!



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి. లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

			7			4	6	2
9	6	7		4				
	4	2		6	1	9		3
	7			3		2		9
2		4		7			5	
7		1	4	8		3	9	
				1		7	8	5
8	9	3			7			

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరంలోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

2	4	9	3	6	1	5	8	7
1	3	8	7	5	2	6	4	9
5	6	7	4	8	9	3	1	2
4	9	2	8	3	5	1	7	6
7	5	3	1	9	6	8	2	4
8	1	6	2	4	7	9	3	5
9	2	4	5	1	3	7	6	8
3	7	5	6	2	8	4	9	1
6	8	1	9	7	4	2	5	3







15 కాలేజీ క్యాంపస్‌లో సైకిల్ చైన్ తెంపి హీరోయిజం చూపించి ట్రెండ్ సెట్ చేసిన కథానాయకుడు?
ఎ) నాగార్జున బి) వెంకటేశ్ సి) చిరంజీవి డి) బాలకృష్ణ

2 కార్పొరేట్ హాస్పిటల్స్ దోపిడీని కళ్లకు కట్టినట్లు చూపించిన చిరంజీవి సినిమా ఏది?
ఎ) స్టాలిన్ బి) శంకర్‌దాదా ఎంబీబీఎస్
సి) ఠాగూర్ డి) శంకర్‌దాదా జిందాబాద్

10 బాలీవుడ్ బ్యూటీ కత్రినా కైఫ్‌ను తెలుగులో యువరాణిగా చూపించిన దర్శకుడు
ఎ) జయంత్ సి.పరాన్జీ
బి) కె.విజయ భాస్కర్
సి) రామ్‌గోపాల్ వర్మ
డి) త్రివిక్రమ్



4 తండ్రుల తర్వాత కొడుకు పక్కన నటించిన హీరోయిన్లున్నారు. కానీ, కొడుకుతో మూడు సినిమాల్లో నటించిన తర్వాత తండ్రితో జోడీ కట్టిన ఈ తరం హీరోయిన్?
ఎ) అనుష్క బి) కాజల్ అగర్వాల్
సి) లావణ్యా త్రిపాఠి డి) సమంత

19 ఈ స్టిల్ ఏ సినిమాలోది?
ఎ) దానవీరశూరకర్ణ
బి) శ్రీకృష్ణపాండవీయం
సి) మాయాబజార్ డి) నర్తనశాల

13 'ఎవడు కొడితే దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అయిపోద్దో ఆడే పండుగాడు'... ఈ డైలాగ్ రాసిన రచయిత?
ఎ) చిన్నికృష్ణ బి) కోన వెంకట్
సి) పూరి జగన్నాథ్
డి) పరుచూరి బ్రదర్స్

3 'మీరు గుడుంబా సత్తిగారు కావొచ్చు.. తొక్కలో సత్తిగారు కావొచ్చు.. ఐ డోంట్ కేర్.. బట్ ఐ యామ్ సిద్ధు.. సిద్ధార్థ రాయ్'.. పవన్ కల్యాణ్ చెప్పిన ఈ డైలాగ్ ఏ సినిమాలోది?
ఎ) తొలిప్రేమ బి) ఖుషి
సి) సుస్వాగతం డి) అన్నవరం

20 తెరపై ఫ్రేమ్ కలర్‌ఫుల్‌గా కనిపించాలంటే ఈ టెక్నాలజీ వాడతారు.. అదేంటో తెలుసా?
ఎ) వీఎఫ్‌ఎక్స్ బి) డీఐ
సి) గ్రీన్ మాట్ డి) సీజీ



9 తండ్రి చిరంజీవి సూపర్‌హిట్ పాటల్లో ఒకటైన 'వాన.. వాన.. వెల్లువాయె..' రీమిక్స్ సాంగ్‌లో కొడుకు రామ్‌చరణ్‌తో ఆడిపాడిన హీరోయిన్?
ఎ) సమంత బి) కాజల్ అగర్వాల్
సి) తమన్నా డి) రకుల్ ప్రీత్‌సింగ్

సమాధానాలు
1) డి 2) సి 3) బి 4) బి
5) సి 6) బి 7) డి 8) బి 9) సి
10) బి 11) డి 12) ఎ 13) సి
14) బి 15) ఎ 16) సి 17) డి
18) బి 19) ఎ 20) బి



మనకు పోషకాహారాన్నిస్తున్నది నేలతల్లే..
ప్రకృతికి దండం పెట్టి ధన్యవాదాలు చెబుదాం!
– మసనబు ఫుకుఓక, జపాన్‌ ప్రకృతి వ్యవసాయోద్యమ పితామహుడు



'సాక్షి' అందిస్తున్న 'సాగుబడి' కథనాలపై స్పందించదలచారా? అయితే, ఫేస్‌బుక్‌లో sakshi saagubadi గ్రూప్‌ను చూడండి.

ఆశ్లేష కార్తె : ఆగస్టు 14 వరకు


కాలిఫోర్నియాలో భూగర్భ డ్రిప్‌తో వరి సాగు చేస్తున్న దృశ్యం


మొక్కజొన్న వేర్ల కింద భూగర్భంలో డ్రిప్‌ లైన్‌


భూగర్భ డ్రిప్‌తో మొక్కజొన్న సాగు చేస్తున్న మిన్నొసోట (అమెరికా) రైతు బ్రియాన్‌ వెల్‌డె

- వాతావరణ మార్పుల నేపథ్యంలో బిందు సేద్యంలో కొత్తపోకడ.. భూగర్భ డ్రిప్‌కు ఆదరణ
- తీవ్ర కరువు పరిస్థితుల్లోనూ పంటకు రక్షణ
- సాధారణ డ్రిప్‌తో కన్నా.. భూగర్భ డ్రిప్‌తో అదనపు ప్రయోజనాలు
- ఉద్యాన తోటలతోపాటు మొక్కజొన్న, వరి, గోధుమ తదితర పంటలకూ భూగర్భ డ్రిప్‌ అనుకూలమే..
- ఇజ్రాయెల్‌ సాంకేతికతతో భూగర్భ డ్రిప్‌తో వరిని సాగు చేస్తున్న కాలిఫోర్నియా రైతులు
- వరి, గోధుమ సాగులో భూగర్భ డ్రిప్‌ వాడకంపై అధ్యయనానికి సిద్ధమవుతున్న పంజాబ్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం


భూగర్భ డ్రిప్‌ వ్యవస్థను ఇలా ఏర్పాటు చేస్తారు..

● కొత్త పోకడ

భూగర్భ డ్రిప్‌తో కరువుకు పాతర!

వర్షాకాలంలోనూ తిష్టవేస్తున్న కరువు రైతుల ఆశలను నిలువునా కాటేస్తున్నది. ప్రకృతిపై ఆధారపడి బతికే అన్నదాతల జీవనాధారాన్ని నిర్దాక్షిణ్యంగా చిదిమేస్తున్నది. భూతాపం పెరుగుతున్నకొద్దీ ప్రపంచవ్యాప్తంగా కరువు రక్కసి విస్తరిస్తూ ఉంది. కరువు పీడిత ప్రాంతాల జాబితా ఏటేటా తామరతంపరవుతూ ఉంది. మన దేశంలో 1960వ దశకంలో 5 రాష్ట్రాల్లో 66 జిల్లాలు కరువు కాటకాల పాలవ్వగా, 2010వ దశకంలో (2017 జూన్‌ నాటికి) 23 రాష్ట్రాల్లో 405 జిల్లాలకు కరువు రక్కసి విస్తరించిందని గణాంకాలు చెబుతున్నాయి. అమెరికాలో వ్యవసాయ కేంద్రాలైన కాలిఫోర్నియా తదితర రాష్ట్రాలను సైతం కరువు వణికిస్తోంది. ఈ పూర్వరంగంలో మరింత సమర్థవంతంగా నీటి వినియోగంపై లోతైన అధ్యయనాలు సాగుతున్నాయి.

రసాయనిక ఎరువులతో సాగయ్యే ఏక పంటల కన్నా... ప్రకృతి / సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో సాగయ్యే మిశ్రమ పంటలకు కరువును తట్టుకునే సామర్థ్యం ఎక్కువగా ఉండడం మన రైతులకూ అనుభవంలో ఉన్న సంగతే.

పంట మొక్కలు, పండ్ల చెట్ల మొదళ్ల దగ్గర్లో భూమిపైన డ్రిప్‌లు, స్ప్రింక్లర్లతోపాటు.. రెయిన్‌గన్‌లు ఏర్పాటు చేసుకొని కొందరు రైతులు సాగు నీటిని పొదుపుగా వాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

అయితే, తరచూ కరువు పరిస్థితులు ఎదురవుతున్న నేపథ్యంలో.. మరింత తక్కువ నీటితో పంటలు పండించ వీలయ్యే 'భూగర్భ డ్రిప్‌' పద్ధతి ముందుకు వస్తోంది. ఎడారిలోనూ సమర్థవంతంగా నీటి వినియోగంపై పరిశోధనలో ముందంజలో ఉన్న ఇజ్రాయెల్‌ భూగర్భ డ్రిప్‌ వాడకంలోనూ పైచేయి సాధించింది. ఏళ్ల తరబడి నిరవధికంగా సాగులో ఉండే ఉద్యాన తోటల్లో వినియోగించడం అమెరికాలోనూ అతికొద్ది మంది రైతుల అనుభవంలో ఉన్నదే.

కరువు సమస్య తరచూ ఎదురుకాటంతో డెల్టా ప్రాంతాల్లోనూ పంటలకు సాగు నీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారుతున్నది. ఇటువంటి గడ్డు పరిస్థితుల్లో.. కొద్ది నెలల్లో కోతకొచ్చే మొక్కజొన్న, సోయా చిక్కుళ్లను ఇప్పటికే భూగర్భ డ్రిప్‌తో సాగు చేసి.. కరువును సమర్థవంతంగా తట్టుకోవడంతోపాటు దిగుబడులనూ గణనీయంగా పెంచుకోగలిగినట్లు సమాచారం.

భూగర్భ డ్రిప్‌తో వరి, గోధుమ సాగుపై పంజాబ్‌ వర్సిటీ అధ్యయనం!

పంజాబ్‌లోని 138 నీటి బ్లాక్‌లకు గాను 110 బ్లాక్‌లలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దీంతో పంజాబ్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం గోధుమ సాగులో డ్రిప్‌ వాడకంపై పరిశోధనలు చేపట్టింది. రెండేళ్ల క్షేత్రస్థాయి పరిశోధన అనంతరం.. రబీలో డ్రిప్‌తో గోధుమ పంటను సగం నీటితోనే సాగు చేయవచ్చని డాక్టర్‌ ఎ. ఎస్‌. బ్రార్‌ నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం తేల్చింది. మొదట 4 అంగుళాల నీటితో పొలంలో నీటిని పారగట్టారు. గోధుమ విత్తనాలు మొలకెత్తిన తర్వాత.. భూగర్భ డ్రిప్‌ ద్వారా 5 విడతలుగా (కేవలం 20% నీటితోనే) నీటి తడులు ఇచ్చారు. డ్రిప్‌ను వాడటం ద్వారా 15 రోజులు ముందుగా గోధుమ విత్తుకోవడం వీలవుతుంది. తద్వారా 10% దిగుబడిని పెంచే అవకాశం ఉందని ఆయన ఇటీవల ప్రకటించారు. రెండేళ్లుగా డ్రిప్‌పై అధ్యయనం చేసిన డా. బ్రార్‌ బృందం ఇప్పుడు భూగర్భ డ్రిప్‌పై దృష్టిపెట్టింది. దీనిపై క్షేత్రస్థాయి అధ్యయనం చేపట్టడానికి ఇటీవలే నిధులు విడుదలయ్యాయని డా. బ్రార్‌ తెలిపారు. రబీలో గోధుమతోపాటు, ఖరీఫ్‌లో వరి పంటను కూడా భూగర్భ డ్రిప్‌ ద్వారా పండించడానికి అవకాశాలున్నాయన్నారు. వరి, గోధుమ సాగుకు భూగర్భ డ్రిప్‌ను వాడే పద్ధతిని రైతులకు పంజాబ్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరో రెండేళ్లలో సిఫారసు చేసే అవకాశాలున్నాయి.

భూగర్భ డ్రిప్‌ సంగతులు..

- భూగర్భ డ్రిప్‌ అంటే.. పంట మొక్కలు, పండ్ల చెట్లకు నేలపైన కాకుండా.. వేర్ల దగ్గరలో నీటి తేమను అవసరం మేరకు తగుమాత్రంగా అందించే వ్యవస్థ. ముఖ్యంగా వరి సాగులో ఎకరానికి లక్షల లీటర్ల నీటిని ఆదా చేయడానికి ఈ పద్ధతి దోహదం చేస్తుంది.
- భూమి లోపల పంటను బట్టి 4 నుంచి 30 అంగుళాల లోతులో శాశ్వత డ్రిప్‌ను ఏర్పాటు చేస్తారు. నీటి తేమ వేర్లకు క్రమం తప్పకుండా అందుతుంది. మట్టిలో తేమ పరిస్థితిని సెన్సార్ల ద్వారా గమనిస్తూ.. పంటకు అవసరమైనప్పుడు తగుమాత్రంగా నీటిని అందిస్తారు.
- ఏ రకం పంట వేర్లు ఎంత లోతుకు వెళ్తాయన్నదాన్ని బట్టి.. ఆ పొలంలో మట్టి గట్టిపడే లక్షణాన్ని బట్టి.. భూమికి ఎన్ని అంగుళాల లోతున డ్రిప్‌ పైపులు, లైన్లు వేయాలన్నది నిపుణులు నిర్ణయిస్తారు.
- దీన్ని ప్రతి ఏటా మార్చుకోవాల్సిన పని ఉండదు. ఒకసారి వేసుకుంటే పదేళ్లపాటు కదిలించాల్సిన అవసరం ఉండదట. కరువొచ్చినా ఉన్న నీటితోనే మంచి దిగుబడులు తీయగలుగుతారు కాబట్టి.. దీర్ఘకాలంలో రైతులకు లాభదాయకమేనని చెబుతున్నారు.
- ట్రాక్టర్లు, ఇతర యంత్రాలు పొలంలో తిరగడం వల్ల భూగర్భ డ్రిప్‌కు ఎటువంటి నష్టమూ ఉండదు.
- రెయిన్‌ గన్‌ల ద్వారా ఖర్చయ్యే నీటిలో సగంతోనే భూగర్భ డ్రిప్‌ ద్వారా పంటలు పండించవచ్చు.
- వరి తదితర పంట విత్తనాలు మొలకెత్తడానికి మొదట ఒక తడి పెడతారు. మొలకెత్తిన తర్వాత.. భూగర్భ డ్రిప్‌ ద్వారా నీటిని అందిస్తారు. పొలంలో భూమి పై భాగం పొడిగానే ఉంటుంది. ఫలితంగా కలుపు సమస్య ఉండదు. చీడపీడల బెడద కూడా తగ్గుతుందని భావిస్తున్నారు.
- మట్టిలో నీటి తేమ ఎంత లోతులో ఎంత ఉంది? అనేది ఎప్పటికప్పుడు గమనించి రైతు మొబైల్‌ లేదా కంప్యూటర్‌కు సెన్సార్లు సమాచారం ఇస్తాయి. నీరు పంటలకు అవసరం లేనంత కిందికి వెళ్తున్నదో లేదో తెలుసుకోవడానికి భూగర్భంలో అక్కడక్కడా సెన్సార్లు పెడతారు.
- భూగర్భ డ్రిప్‌తో అతి తక్కువ నీటితో, కరువు కాలంలోనూ పంట తీయవచ్చు. అయితే, దీన్ని ఏర్పాటు చేసుకోవడం అధిక ఖర్చుతో కూడిన పనే. ఎకరానికి రూ. 35 వేల నుంచి 50 వేల వరకు ఖర్చవుతుందని ఒక అంచనా.
- అమెరికాలోని మిన్నొసోట రాష్ట్రానికి చెందిన మొక్కజొన్న రైతు బ్రియాన్‌ వెల్‌డె తన 58 ఎకరాల పొలంలో భూగర్భ డ్రిప్‌ను గత ఏడాదిగా వాడుతున్నారు.



మొక్కజొన్న రైతుల సంఘం ఆర్థిక సాయంతో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నారు. 5 అడుగుల దూరంలో 14 అంగుళాల లోతులో.. 8 అంగుళాల వ్యాసార్థం గల భూగర్భ డ్రిప్‌ పైపులను అమర్చారు. వీటి నుంచి డ్రిప్‌ టేపుల ద్వారా నీటిని మొక్కజొన్న మొక్కల వేర్లకు నేరుగా నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ జూలైలో నీటి ఎద్దడి కాలంలోనూ తేలికపాటి ఇసుక నేలలో మొక్కజొన్న పంటను భూగర్భ డ్రిప్‌ వల్లనే కాపాడుకోగలిగానని, ఇదొక ఆశావహమైన ప్రత్యామ్నాయమని బ్రియాన్‌ వెల్‌డె అంటున్నారు. తొలుత ఎక్కువ పెట్టుబడి అవసరమైనప్పటికీ ఇది రైతుకు లాభదాయకమేనన్నారు.

- రసాయనిక వ్యవసాయంలోనైనా, సేంద్రియ / ప్రకృతి వ్యవసాయంలోనైనా భూగర్భ డ్రిప్‌ లైన్ల ద్వారా ద్రవ రూప ఎరువులను అందిస్తూ.. మంచి దిగుబడులు పొందడం అసాధ్యం కాదని నిపుణులు చెబుతున్నారు.
- అంతర పంటలు సాగు చేసుకోవాలనుకుంటే అందుకు అనుగుణంగా అదనపు భూగర్భ డ్రిప్‌ లైన్లను ముందుగానే ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. పంటల వ్యర్థాలు, గడ్డీ గాదంతో ఆచ్ఛాదనతో ప్రకృతి సేద్యం చేసే రైతులకు భూగర్భ డ్రిప్‌తో అధిక ప్రయోజనం చేకూరవచ్చు.
- మట్టి ఉష్ణోగ్రతలు, నేల స్వభావం, పంటల స్వభావం తదితర అంశాలను బట్టి భూగర్భ డ్రిప్‌ ప్రభావశీలత ఆధారపడి ఉంటుంది. బిందు సేద్యంలో ముందుకొస్తున్న ఈ కొత్తపోకడపై పంజాబ్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం దృష్టి సారిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోని వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాలు కూడా ఈ దిశగా దీక్షగా కదిలితే కరువు పీడిత రైతుల్లో కొందరికైనా మేలు కలుగుతుంది.

– పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్‌

కాలిఫోర్నియాలో భూగర్భ డ్రిప్‌తో వరి సాగు!

అత్యధిక పరిమాణంలో సాగు నీరు అవసరమయ్యే వరి పొలాల్లో సైతం భూగర్భ డ్రిప్‌ వాడకానికి అమెరికాలోని కాలిఫోర్నియా రైతులు ఇజ్రాయెల్‌ సాంకేతిక సహకారంతో శ్రీకారం చుట్టారు. వరి పంటను భూగర్భ డ్రిప్‌తో పండించే సాంకేతికతపై విశేష పరిశోధనలకు ఇజ్రాయెల్‌లోని బెన్‌–గురియన్‌ విశ్వవిద్యాలయం పెట్టింది పేరు. వరి సాగుకు పేరొందిన మూడు అమెరికన్‌ రాష్ట్రాల్లో కాలిఫోర్నియా ఒకటి. సేంద్రియ వరి సాగులో పేరుగాంచిన 'లుండ్‌బెర్గ్‌ ఫామిలీ ఫామ్స్‌' సంస్థ బెన్‌–గురియన్‌ విశ్వవిద్యాలయంతో గత ఏడాది ఒప్పందం చేసుకొని, తొట్టతొలిగా వంద ఎకరాల్లో భూగర్భ డ్రిప్‌తో వరి సాగుకు ఉపక్రమించింది.

పెరుగులోని సూక్ష్మజీవులు పోషకాలను స్థిరీకరించగలవా?

- 'వారెవా.. పులిసిన పెరుగు ద్రావణం' కథనానికి విశేష స్పందన
- నాన్‌బీటీ పత్తిలో ప్రయోగాత్మకంగా వాడుతున్న సుస్థిర వ్యవసాయ కేంద్రం



'వారెవా.. పులిసిన పెరుగు ద్రావణం' శీర్షికన ఆగస్టు 1న 'సాక్షి సాగుబడి'లో అచ్చయిన కథనం రైతుల్లో అమితాసక్తిని రేకెత్తించింది. ఈ అంశంపై రైతు లోకంలో విస్తృత చర్చ జరుగుతోంది. బిహార్‌లో కొందరు రైతులు 10–15 రోజులు పులియబెట్టిన పెరుగు ద్రావణాన్ని నీటిలో కలిపి పంటలకు ఎరువుగా, తెగుళ్లు, పురుగుల మందుగా సమర్థవంతంగా అనేక ఏళ్లుగా వాడుతున్నారని ఈ కథనం ద్వారా తెలుసుకొని ఆశ్చర్యచకితులయ్యారు. సోషల్‌ మీడియాలో ఈ కథనం హల్‌చల్‌ చేసింది.

పంటలపై శిలీంధ్రమచ్చలు, తెగుళ్ల నివారణకు 3 రోజులు పులిసిన మజ్జిగను 100 లీటర్ల నీటికి 5 లీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయడం తెలుగు రాష్ట్రాల్లో ప్రకృతి / సేంద్రియ రైతులకు అలవాటున్న సంగతే. అయితే, పెరుగును 10–15 రోజులు పులియబెట్టి పంటలకు పోషకాహారంగానూ, చీడపీడల నివారణకు వినియోగిస్తుండటం ఆశ్చర్యకరం. ఇలాఉండగా, కొందరు రైతులు పులిసిన పెరుగు ద్రావణం వినియోగంపై పలు సందేహాలు వెలిబుచ్చారు. పులియబెట్టిన పెరుగు ద్రావణాన్ని ఎంత మోతాదులో, ఎన్నాళ్లకోసారి పంటలకు వాడాలని.. రైతులు అడుగుతున్నారు. కొందరు రైతులు తమకు తెలిసిన పద్ధతుల్లో పెరుగు ద్రావణాన్ని బిహార్‌ రైతుల మాదిరిగా ప్రయోగాత్మకంగా వాడి చూస్తామని చెబుతున్నారు. అయితే, ఈ కథనాన్ని ఆంగ్లంలో తొలుత ప్రచురించిన 'విలేజ్‌ స్క్వేర్‌' సంస్థను సంప్రదించినప్పటికీ వివరాలు తెలియరాలేదు.

పులిసిన పెరుగు ద్రావణంపై అధ్యయనం: డా. రామాంజనేయులు

పెరుగులో లాక్టో బాసిల్లస్‌ రకం సూక్ష్మజీవులు పుష్కలంగా ఉంటాయని, పులియబెట్టిన పెరుగును నీటిలో కలిపి పంటలపై పిచికారీ చేస్తే తెగుళ్ల బెడద పోతుందని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, సుస్థిర వ్యవసాయ కేంద్రం డైరెక్టర్‌ జనరల్‌ డా. జీ వీ రామాంజనేయులు 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. పెరుగులోని బాక్టీరియా, శిలీంధ్రాలతోపాటు ఫాస్ఫరస్‌ ఉంటాయన్నారు. అయితే, పెరుగులో చురుగ్గా పెరిగే సూక్ష్మజీవరాశి.. పంటలపై పిచికారీ చేసిన తర్వాత, నీటిలో కలిపి భూమిని తడిపిన తర్వాత ఎంతకాలం బతికి ఉండి ప్రభావం చూపుతుందో స్పష్టత లేదన్నారు. హానికారక సూక్ష్మక్రిములను చంపగలిగే లాక్టో బాసిల్లస్‌ సూక్ష్మజీవులు.. పోషకాలను భూమిలో స్థిరీకరించగలవా? అన్నదానిపై కచ్చితమైన సమాచారం కోసం అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. అయితే, తెగుళ్ల నివారణకు ఇంగువ / పులిసిన మజ్జిగ చల్లిన తర్వాత పంటలు చక్కగా కళకళలాడుతూ ఉంటాయన్నారు. దీనికి పుల్ల మజ్జిగలోని సూక్ష్మజీవుల వల్ల విడుదలయ్యే ఎంజైములే కారణమై ఉండవచ్చని డా. రామాంజనేయులు తెలిపారు. పులిసిన పెరుగు ద్రావణం వాడకంపై బిహార్‌ రైతుల అనుభవాలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సూరజ్‌ నాన్‌ బీటీ పత్తి సేంద్రియ సాగులో పులిసిన పెరుగు ద్రావణాన్ని సుస్థిర వ్యవసాయ కేంద్రం ప్రయోగాత్మకంగా వివిధ మోతాదుల్లో పిచికారీ చేస్తున్నది. త్వరలో ఫలితాలను వెల్లడికానున్నాయి. (ప్రకృతి / సేంద్రియ వ్యవసాయంపై రైతులు తమ సందేహాల నివృత్తి కోసం సుస్థిర వ్యవసాయ కేంద్రం శాస్త్రవేత్తలను 040–27017735 నంబరులో సంప్రదించవచ్చు).

వేరుకుళ్లు నివారణకు పెరుగు+పసుపు ద్రావణం!

బత్తాయి తదితర పండ్ల తోటలు తీవ్రనీటి ఎద్దడికి గురైనప్పుడు, కాపు నిలబెట్టడానికి ముందు ఎక్కువ రోజులు బెట్టకు ఉంచినప్పుడు ఆశించే వేరుకుళ్ల సమస్యను అధిగమించడానికి పుల్లమజ్జిగ, పసుపు ద్రావణం సమర్థవంతంగా పనిచేస్తున్నదని కడప జిల్లా పులివెందులకు చెందిన ప్రకృతి వ్యవసాయదారుడు రమణారెడ్డి 'సాక్షి సాగుబడి'కి తెలిపారు. 4 లీటర్ల పెరుగును 3 రోజులు పులియబెట్టి అర కిలో పసుపు కలిపి.. 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరంలో చెట్లకు పాదుల్లో పోయడం లేదా డ్రిప్‌ ద్వారా అందిస్తే వేరుకుళ్ల పోతుందన్నారు.

అదేమాదిరిగా, బెట్ట పరిస్థితుల్లో ఈ ద్రావణాన్ని చీనీ తదితర ఉద్యాన తోటలపై పిచికారీ చేస్తే.. ఆకులపై తెల్లటి పొర ఏర్పడి.. సూర్యకిరణాలను పరావర్తనం చెందిస్తాయని, ఫలితంగా నీటి ఎద్దడిని తోటలు సమర్థవంతంగా తట్టుకోగలుగుతాయని చెప్పారు. గత ఐదేళ్లుగా తమ ప్రాంతంలో ఉద్యాన తోటల రైతులు పుల్లమజ్జిగ, పసుపు ద్రావణంతో లబ్ధిపొందుతున్నారని రమణారెడ్డి వివరించారు.

బంకకు విరుగుడు.. పెరుగు+ పసుపు లేపనం!

పండ్ల తోటల మొదళ్లకు బంక కారే సమస్యను కూడా పెరుగులో పసుపు కలిపి పూస్తే చాలు.. బంక మాయమవుతుందని రమణారెడ్డి తెలిపారు. ఎకరానికి 4 లీటర్ల పెరుగులో అర కిలో పసుపును వేసి, బాగా కలిపి చెట్ల మొదళ్లకు పూయాలన్నారు. రసాయనాల లేపనంతో అదుపులోకి రాని బంక సమస్య పెరుగు, పసుపు కలిపి ఒక్కసారి పూస్తే చాలు మళ్లీ కనపడకుండా పోవడం తమ అనుభవమని ఆయన వివరించారు. రమణారెడ్డిని 94409 72504 నంబరులో సంప్రదించవచ్చు.



కొబ్బరి చెట్లెక్కి గెలలు దింపే పని సాధారణంగా మగ వాళ్లే చేస్తుంటారు. అయితే, కేరళకు చెందిన ఒక మహిళ ఉపాధి కోసం కొత్త దారి తొక్కారు. చరిత్రను తిరగరాశారు. ఒక పరికరాన్ని ఉపయోగించి సులువుగా కొబ్బరి చెట్లెక్కడంలో ఆరేళ్ల క్రితం శిక్షణ పొంది.. రోజుకు 30 చెట్ల నుంచి కొబ్బరి గెలలను దింపుతున్నారు. ఎత్తయిన చెట్లు ఎక్కుతూ ఆర్థిక స్వాతంత్య్రాన్ని సాధించారు. తన కాళ్ల మీద తాను చెట్టంత ఎత్తున నిలబడ్డారు...

కొబ్బరి చెట్లెక్కడం... ఆమెకు ఇష్టమైన పని!

తిరువనంతపురం జిల్లా వర్కాలా పట్టణం 'సునీ' స్వస్థలం. కొబ్బరి చెట్లు ఎక్కి కాయలు కోయడంలో కేరళలోనే ఆమె తొలి మహిళా కార్మికురాలు. ఆమెను అందరూ 'మారామ్‌ కేరీ' అని పిలుస్తున్నారు. ఈ మాటకు 'చెట్లెక్కే మనిషి' అని, 'అందరిదీ ఒకదారైతే ఈమెది మరొకదారి' అన్న రెండర్థాలున్నాయి. రెండో అర్థంలోనే అక్కడి వారు సునీని పిలుస్తున్నారు. ఇంట్లో వాళ్లు, బయటి వాళ్లు నిరుత్సాహపరుస్తున్నప్పటికీ.. 45 ఏళ్ల వయసులో ఆమె ధైర్యసాహసాలతో ముందడుగు వేశారు. ఆరేళ్ల క్రితం 45 రోజుల పాటు శిక్షణ పొంది మరీ ప్రత్యేకంగా రూపొందించిన పరికరాన్ని ఉపయోగించి కొబ్బరి చెట్లెక్కడం నేర్చుకున్నారు. అంతే కాకుండా.. ఈ పనిని తన వృత్తిగా ఎంపిక చేసుకున్నారు. అందరికన్నా ముందు నడచినందు వల్లే అందరూ ఆమెను 'మారామ్‌ కేరీ' అని పిలుస్తున్నారు.

కోకోనట్‌ డెవలప్‌మెంట్‌ బోర్డు 'ఫ్రెండ్స్‌ ఆఫ్‌ కోకోనట్‌' కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పరికరం సహాయంతో కొబ్బరి చెట్లెక్కి గెలలు కోయడంలో 2011 నుంచి శిక్షణ ఇస్తోంది. అప్పటి వరకు మగవాళ్లు మాత్రమే కొబ్బరి చెట్లెక్కేవారు. అయితే, ఆ పురుషాధిక్య సంప్రదాయాన్ని తిరగరాస్తూ.. తొలి బ్యాచ్‌లోనే శిక్షణ పొందడానికి సునీ ధరఖాస్తు పెట్టారు. 30 మంది అభ్యర్థుల్లో ఆమె తప్ప మిగతా వారంతా మగవారే. శిక్షణ పొందడానికి ఆమె కుటుంబ సభ్యులు సహజంగానే ఒప్పుకోలేదు. అయినా, తాను చేస్తున్న పని తప్పు కానప్పుడు మనసు మార్చుకోవాల్సిన అవసరం లేదని ఆమె దృఢంగా నిలబడ్డారు. ఆయుర్వేద చికిత్స కోసం వెళుతున్నానని ఇంట్లో వాళ్లకు అబద్ధం చెప్పి శిక్షణ పొందారు. ఆమెకు ఉన్న ఆసక్తికి సాధన తోడవటంతో ఆమె చెట్లు ఎక్కే పనిలో కొద్ది రోజుల్లోనే నైపుణ్యం సాధించారు. 40–60 అడుగుల ఎత్తయిన చెట్లను సైతం నిమిషంలో ఎగబాకి అలవోకగా కొబ్బరి గెలలను దింపేయడం ఆమెకు అలవాటైపోయింది. తన ద్విచక్రవాహనం వెనుక వైపున పరికరాన్ని కట్టుకొని బయలుదేరి.. రోజుకు కనీసం 30 చెట్లు ఎక్కి కొబ్బరి కాయల గెలలను దింపుతూ.. జీవనోపాధిని పొందుతున్నారు. ఈ ఐదేళ్లలో ఆమె స్వయంగా 400 మంది మహిళలకు పరికరం సాయంతో కొబ్బరి చెట్లు ఎక్కటంలో శిక్షణ ఇచ్చి, వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు తోడ్పడ్డారామె. 'ఇది మగవాళ్లు మాత్రమే చేయగలిగిన పని అని మొదట్లో నాక్కూడా అనిపించేది. మాకు చిన్నప్పటి నుంచి ఇంట్లో వాళ్లు చెప్పిన మాటలు అవే కదా.. అయితే, ఇప్పుడు నా భర్త కూడా చాలా మందికి ఈ పనిలో శిక్షణ ఇస్తున్నారు. దాంతో నా పని నిరాటంకంగా సాగిపోతున్నది..' అని నవ్వుతూ అంటారు సునీ. నేర్చుకున్న మహిళల్లో చాలా మంది చెట్లెక్కి కొబ్బరి గెలలు కోయడాన్ని వృత్తిగా స్వీకరించడం విశేషం. వారిలో పద్మకుమారి(35) ఒకరు. ఇరుగు పొరుగు ఇళ్లలో పనులు చేస్తూ నెలకు రూ. 3 వేలు సంపాయించే పద్మకుమారి.. చెట్లెక్కడంలో శిక్షణ పొందిన తర్వాత ఇప్పుడు కేవలం 3 రోజుల్లోనే ఆ మొత్తాన్ని సంపాయిస్తోంది!

– దండేల కృష్ణ, సాగుబడి డెస్క్‌

10,11 తేదీల్లో బెంగళూరులో ఇండియన్‌ టెక్నాలజీ కాంగ్రెస్‌

Indian Technology Congress

వ్యవసాయ ఇంజనీరింగ్‌లో సరికొత్త పోకడలను, ఆవిష్కరణలను వెలుగులోకి తేవడమే లక్ష్యంగా బెంగళూరులోని నిమ్‌హాన్స్‌ ప్రాంగణంలో ఈ నెల 10, 11 తేదీల్లో 'ఇండియన్‌ టెక్నాలజీ కాంగ్రెస్‌ 4.0' జరగబోతోంది. ఈ కాంగ్రెస్‌లో వ్యవసాయ ఇంజనీరింగ్‌కు పెద్ద పీట వేస్తున్నారు. పండ్ల తోటలు, సీజనల్‌ పంటల సాగులో విత్తనం వేయడం దగ్గర నుంచి, వనరులను అవసరం మేరకు పొదుపుగా తగిన సమయంలో వినియోగించడం, మట్టిలో తేమను తెలిపే సెన్సార్లు, వివిధ పనులను చక్కబెట్టే రోబోట్‌లు, డ్రోన్ల వినియోగం, ఇంటర్నెట్‌ ఆధారిత అప్లికేషన్ల ద్వారా దిగుబడులు పెంపొందించడంతో పాటు.. వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధరలను రాబట్టే మెరుగైన మార్కెట్లను చేరుకోవడం.. వంటి ప్రతి దశలోనూ ఇంజనీరింగ్‌ ఆవిష్కరణల పాత్ర నానాటికీ పెరుగుతోంది. వ్యవసాయ ఇంజనీరింగ్‌ వృత్తినిపుణుల ఆవిష్కరణలను అందుబాటులోకి తేవడం ద్వారా వ్యవసాయంలో సమస్యలను అధిగమించడం, ఉత్పాదకతను పెంపొందించడంపై ఇండియన్‌ టెక్నాలజీ కాంగ్రెస్‌ దృష్టిని కేంద్రీకరిస్తోంది. ఐసీఏఆర్‌, ఇక్రిశాట్‌, నాబార్డ్‌ తదితర సంస్థల భాగస్వామ్యంతో జరుగుతున్న ఈ అంతర్జాతీయ సమావేశం గురించి మరిన్ని వివరాలకు.. www.techcongress.net/ agri-tech వెబ్‌సైట్‌ చూడండి.

సెప్టెంబర్‌ 14-16 తేదీల్లో టింబక్టు సందర్శన

కరువు సీమ అనంతపురం జిల్లా చెన్నెకొత్తపల్లి మండలంలో బంజరు భూములను సస్యశ్యామలంగా మార్చడం.. 20 వేల మంది చిన్న, సన్న కారు రైతు కుటుంబాలను కూడగట్టి.. చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలను వర్షాధారంగా సేంద్రియ సేద్యం చేయించటం, సహకార సంఘం ద్వారా మార్కెటింగ్‌ చేయడం, పిల్లలకు ప్రకృతి విద్యనందించడంలో టింబక్టు కలెక్టివ్‌ సంస్థ కీలకపాత్ర పోషిస్తోంది. టింబక్టు కలెక్టివ్‌ చేస్తున్నదేమిటో స్వయంగా తెలుసుకోవాలనుకునే వారికోసం సెప్టెంబర్‌ 14–16 తేదీల్లో సందర్శకులను అనుమతిస్తారు. ఆంగ్లం (కొంత వరకు తెలుగు)లో సాగే ఈ సందర్శన శిబిరంలో పాల్గొనదలచిన వారు 099893 00332 నంబరులో లేదా timbaktu.info@gmail.com ద్వారా సంప్రదించవచ్చు.

13న కషాయాలు, ద్రావణాలపై శిక్షణ

రైతునేస్తం ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా కొర్నెపాడులో ఈనెల 13న ప్రకృతి వ్యవసాయ విధానంలో తెగుళ్లు, చీడపీడల నివారణకు ఉపయోగించే కషాయాలు, ద్రావణాల తయారీ, ఉపయోగించే విధానంపై రైతు శాస్త్రవేత్తలు విజయ్‌కుమార్‌ (కడప జిల్లా), ధర్మారం బాజి (గుంటూరు జిల్లా) రైతులకు శిక్షణ ఇస్తారు. పాల్గొనదలచిన రైతులు ముందుగా పేర్ల నమోదుకు 97053 83666, 0863 – 2286255 నంబర్లలో సంప్రదించవచ్చు.

లవ్లీకుమార్



[illegible]



మళ్లీ ఎప్పుడు?

[illegible]

ఆయన సినిమాల్లోని ఒక్క సీన్ అయినా వాడుకుంటా!



• నితిన్

[illegible]

పెళ్లి కళ!



• నిఖిల్

[illegible]

భయానికి నవ్వంటే భయం



• షకలక శంకర్, శ్రీనివాసరెడ్డి, విజయ్ చిల్లా, మహి

[illegible] ...మహి వి.రాఘవ్. ''మనుషులను చూసి దెయ్యాలు భయ... సినిమా చూస్తున్నంత సేపు ప్రేక్షకులు నవ్వుతుంటారు. ...వీనీ అమెరికాలో విడుదల చేయలేదు. తొలిసారి అక్కడ ...న్నాం'' అన్నారు విజయ్ చిల్లా. ''గీతాంజలి' తర్వాత పలు ...కే టైప్‌లో ఉండటంతో ఒప్పుకోలేదు. 'ఆనందో బ్రహ్మ' కథ ...లుకోకూడదనిపించింది'' అని శ్రీనివాసరెడ్డి అన్నారు.

లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్, లవ్ డాక్టర్

[illegible]

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాలలోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి. లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

			7			4	6	2
9	6	7		4				
	4	2		6	1	9		3
	7			3		2		9
2		4		7			5	
7		1	4	8		3	9	
				1		7	8	5
8	9	3			7			

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరంలోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

[illegible]	[illegible]	[illegible]	3	6	1	5	8	7
1	3	8	7	5	2	[illegible]	4	9
[illegible]	[illegible]	[illegible]	4	[illegible]	[illegible]	[illegible]	1	[illegible]
4	9	[illegible]	[illegible]	3	[illegible]	1	7	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	9	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	1	6	[illegible]	4	[illegible]	[illegible]	3	5
[illegible]	2	[illegible]	[illegible]	[illegible]	3	[illegible]	[illegible]	[illegible]
3	7	[illegible]	6	2	8	4	9	1
6	8	1	9	7	4	[illegible]	[illegible]	[illegible]

స్క్రీన్ టెస్ట్



1 'తెలుగు జాతి మనది.. నిండుగ వెలుగు జాతి మనది..' పాట రచయిత ఎవరు?
ఎ) వేటూరి బి) భువనచంద్ర
సి) 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి డి) సి.నారాయణరెడ్డి

2 కార్పొరేట్ హాస్పిటల్స్ దోపిడీని కళ్లకు కట్టినట్లు చూపించిన చిరంజీవి సినిమా ఏది?
ఎ) స్టాలిన్ బి) శంకర్‌దాదా ఎంబీబీఎస్
సి) ఠాగూర్ డి) శంకర్‌దాదా జిందాబాద్

3 'మీరు గుడుంబా సత్తిగారు కావొచ్చు.. తొక్కలో సత్తిగారు కావొచ్చు.. ఐ డోంట్ కేర్.. బట్ ఐ యామ్ సిద్ధు.. సిద్ధార్థ రాయ్'.. పవన్ కల్యాణ్ చెప్పిన ఈ డైలాగ్ ఏ సినిమాలోది?
ఎ) తొలిప్రేమ బి) ఖుషి
సి) సుస్వాగతం డి) అన్నవరం

4 తండ్రుల తర్వాత కొడుకు పక్కన నటించిన హీరోయిన్లున్నారు. కానీ, కొడుకుతో మూడు సినిమాల్లో నటించిన తర్వాత తండ్రితో జోడీ కట్టిన ఈ తరం హీరోయిన్?
ఎ) అనుష్క బి) కాజల్ అగర్వాల్
సి) లావణ్యా త్రిపాఠి డి) సమంత

5 జూనియర్ ఎన్టీఆర్‌ను రెండు పాత్రల్లో చూపించిన తొలి దర్శకుడు ఎవరు?
ఎ) ఎస్.ఎస్. రాజమౌళి బి) వీవీ వినాయక్ సి) పూరి జగన్నాథ్ డి) బి.గోపాల్

6 అంధురాలిగా నటించి, నంది అవార్డు అందుకున్న కథానాయిక ఎవరు?
ఎ) మధుశాలిని
బి) లయ
సి) వేద
డి) శ్రీదివ్య

7 చేతిలో ఫోనుతో ఓర చూపు చూస్తున్న ఈ అమ్మాయి హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగారు. ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రాణిస్తున్నారు. ఇంతకీ ఎవరామె?
ఎ) రంభ బి) రమ్యకృష్ణ
సి) సుహాసిని డి) మీనా

8 హీరోగా ఎంట్రీ ఇచ్చి, విలన్‌గా యూ టర్న్ తీసుకుని, తిరిగి హీరోగా సెటిల్ అయిన నటుడు
ఎ) శ్రీకాంత్ బి) గోపీచంద్ సి) రవితేజ డి) నవదీప్

9 తండ్రి చిరంజీవి సూపర్‌హిట్ పాటల్లో ఒకటైన 'వాన.. వాన.. వెల్లువాయె..' రీమిక్స్ సాంగ్‌లో కొడుకు రామ్‌చరణ్‌తో ఆడిపాడిన హీరోయిన్?
ఎ) సమంత బి) కాజల్ అగర్వాల్
సి) తమన్నా డి) రకుల్ ప్రీత్‌సింగ్

10 బాలీవుడ్ బ్యూటీ కత్రినా కైఫ్‌ను తెలుగులో యువరాణిగా చూపించిన దర్శకుడు
ఎ) జయంత్ సి.పరాన్జీ
బి) కె.విజయ భాస్కర్
సి) రామ్‌గోపాల్ వర్మ
డి) త్రివిక్రమ్

11 బాలకృష్ణ తొడకొడితే రైలు వెనక్కి వెళ్లే సీన్ ఏ సినిమాలోనిది?
ఎ) నరసింహనాయుడు
బి) సమర సింహారెడ్డి
సి) సీమ సింహం
డి) పలనాటి బ్రహ్మనాయుడు

12 ప్రభాస్ సినిమాకి టైటిల్‌గా పెట్టిన నందమూరి తారక రామారావు సినిమా ఏది?
ఎ) అడవి రాముడు బి) బొబ్బిలిపులి
సి) యమగోల డి) ఏదీ లేదు

13 'ఎవడు కొడితే దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అయిపోద్దో ఆడే పండుగాడు'... ఈ డైలాగ్ రాసిన రచయిత?
ఎ) చిన్నికృష్ణ బి) కోన వెంకట్
సి) పూరి జగన్నాథ్
డి) పరుచూరి బ్రదర్స్

14 అనుష్క తొలిసారి వేశ్య పాత్రలో నటించిన తెలుగు సినిమా?
ఎ) అరుంధతి
బి) వేదం
డి) పంచాక్షరి
డి) నాగవల్లి

15 ఇంజినీ క్యాంపస్‌లో సైకిల్ చైన్ తెంపి హీరోయిజం చూపించి ట్రెండ్ సెట్ చేసిన కథానాయకుడు?
ఎ) నాగార్జున బి) వెంకటేశ్ సి) చిరంజీవి డి) బాలకృష్ణ

16 హీరోయిన్ చార్మి ఇప్పటి వరకూ తన కెరీర్‌లో ఏ సినిమాకి నంది అవార్డు అందుకున్నారు?
ఎ) సుందరకాండ బి) రాఖీ
సి) మంత్ర డి) చిన్నోడు

17 రవితేజ లేటు వయసులో యూనిఫామ్‌తో స్కూల్‌కి వెళ్లి పదో తరగతి చదివే సినిమాలో టీచర్‌గా పని చేసే హీరోయిన్?
ఎ) దీక్షాసేథ్ బి) నయనతార సి) త్రిష డి) ఇలియానా

18 అక్కినేని నాగేశ్వరరావు, నాగార్జున, నాగచైతన్య, అఖిల్ కలసి నటించిన 'మనం' చిత్రంలోని 'కని పెంచిన మా అమ్మకే అమ్మయ్యానుగా..' సింగర్?
ఎ) అనూప్ రూబెన్స్ బి) మాస్టర్ భరత్ కోరస్
సి) హేమచంద్ర డి) కారుణ్య

19 ఈ స్టిల్ ఏ సినిమాలోది?
ఎ) దానవీరశూరకర్ణ
బి) శ్రీకృష్ణపాండవీయం
సి) మాయాబజార్ డి) నర్తనశాల

20 తెరపై ఫ్రేమ్ కలర్‌ఫుల్‌గా కనిపించాలంటే ఈ టెక్నాలజీ వాడతారు.. అదేంటో తెలుసా?
ఎ) వీఎఫ్ఎక్స్ బి) డీఐ
సి) గ్రీన్ మాట్ డి) సీజీ

సమాధానాలు: 1) డి 2) సి 3) బి 4) బి 5) సి 6) బి 7) డి 8) బి 9) సి 10) బి 11) డి 12) ఎ 13) సి 14) బి 15) ఎ 16) సి 17) డి 18) బి 19) ఎ 20) బి

మీరు 6 సమాధానాల కంటే తక్కువ చెబితే... మీకు సినిమా అంటే ఇష్టం
10 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే ఇంట్రెస్ట్
15 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే పిచ్చి
20 సమాధానాలూ చెప్పగలిగితే... ఇంకోసారి ఈ క్విజ్ చదవకండి!